సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 127

సోమవారం 22-1-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'




సాత్విక్-చిరాగ్ జోడీకి నిరాశ

ఇండియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత స్టార్ ప్లేయర్లు - 12లో



పెట్టుబడులకు దారేది?

ఈక్విటీ, బంగారంలో పెట్టుబడులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు - 13లో



ఆధ్యాత్మిక పర్యటన పూర్తి

వరుసగా ఏపీ, కేరళ, తమిళనాడులోని దేవాలయాలను సందర్శించిన ప్రధాని మోదీ ఆదివారం తన పర్యటనను పూర్తి చేసుకున్నారు.

వివరాలు 6లో ▸



రష్యా ఆక్రమిత ఉక్రెయిన్‌లో దాడి

రష్యా ఆక్రమిత ఉక్రెయిన్ భూభాగంలోని మార్కెట్‌పై జరిగిన దాడిలో 25 మంది ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸



అది భారత విమానం కాదు

థాయ్‌లాండ్ నుంచి మాస్కోకు వెళ్తూ అఫ్గానిస్తాన్‌లో కూలిన విమానం భారత్‌కు చెందినది కాదని కేంద్రం స్పష్టం చేసింది.

వివరాలు 6లో ▸



వెనక్కి తగ్గిన ఢిల్లీ ఎయిమ్స్

'అయోధ్య'లో ప్రాణప్రతిష్ట సందర్భంగా ఓపీ విభాగానికి సెలవు ఇస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఢిల్లీ ఎయిమ్స్ వెనక్కి తీసుకుంది.

వివరాలు 6లో ▸



అంతా రామమయం

అయోధ్యలో నేడే రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట

చరిత్రాత్మక ఘట్టంలో భిన్న మతాలు, సంప్రదాయాలు, వర్గాలకు భాగస్వామ్యం

ఉత్సవానికి ప్రధాన యజమానిగా ప్రధాని మోదీ

ప్రాణప్రతిష్ట తర్వాత ప్రముఖులకు దర్శనం

ఆధ్యాత్మిక శోభతో వెలిగిపోతున్న అయోధ్యాపురి

దేశమంతటా శ్రీరాముడి నామస్మరణ..

నేడు 60కిపైగా దేశాల్లో వేడుకలు

నేడు గర్భాలయం లోపల..

ఉదయం 10:00 మంగళ ధ్వనితో శ్రీకారం

మధ్యాహ్నం 12.20 ప్రధాన వేడుక ప్రారంభం

12:29:08 - 12:30:32 84 సెకన్లలో గర్భగుడిలో బాలరాముడి ప్రాణప్రతిష్ట

6లో

7,000 హాజరుకానున్న అతిథులు

10,00,000 ఏకకాలంలో వెలిగించనున్న ప్రమిదలు

ఫ్యాక్ట్‌చెక్

అప్పులపై అబద్ధాల డప్పు

- పదే పదే అనధికార అప్పులు అంటూ తప్పుడు ప్రచారం
- ప్రభుత్వాలకు అనధికార అప్పులుండవని తెలిసినా పచ్చి అబద్ధాలతో రామోజీ కథనం
- గతంలో బాబు చేసిన అప్పులు కూడా ఇప్పుడు ప్రభుత్వం తీరుస్తోంది.. గత ఎన్నికల ముందు ఏప్రిల్‌లోనే బాబు రూ.5,500 కోట్లు అప్పు
- నెలలో ఆయా తేదీల్లో సెక్యూరిటీల విక్రయాలకు ఎప్పట్నుంచో ఆర్బీఐ అనుమతి
- దాని ప్రకారమే అన్ని రాష్ట్రాలు ఆయా తేదీల్లో అప్పులు
- ఇందులో భాగమే ఏపీ సహా 13 రాష్ట్రాలు రూ.24,280 కోట్లు అప్పు చేస్తున్నాయి

- వివరాలు 10లో



దెబ్బ కాదు.. విషపు రాతల దిబ్బ

- అసాధ్యమైన అంకెలతో రామోజీ మార్కు పిచ్చి రాతలు
- దేశంలోని పోర్టులన్నీ కలిపినా ఆ స్థాయి సరకు రవాణా అసాధ్యం.. 6 లక్షల కోట్ల టన్నుల నుంచి లక్ష కోట్లకు తగ్గిందంటూ మతిలేని రాతలు
- నిజానికి కృష్ణపట్నం పోర్టులో గతేడాది 4.82 కోట్ల టన్నుల సరకు రవాణా.. అది ఈ ఏడాది ఏకంగా కోటి టన్నులు పెరిగి 5.78 కోట్లకు...
- కానీ రవాణా తగ్గి ఆదాయం అడుగంటిందంటూ రామోజీ కూతలు

- వివరాలు 3లో

బాబు కోసం బలి!

చంద్రబాబు చివరి అస్త్రంగా షర్మిల: సజ్జల



- వైఎస్సార్ బతికి ఉంటే కాంగ్రెస్‌పై ఉమ్మేసేవారని విమర్శించి ఆ పార్టీకి మీరే సారథ్యం వహించడం ఏమిటి?
- తెలంగాణలోనే నా బతుకు, చావు అని వ్యాఖ్యానించి హఠాత్తుగా ఏపీకి డిప్యుటేషన్‌పై ఎందుకొచ్చినట్లు?
- చంద్రబాబు ప్రయోజనాలను కాపాడటానికే రాష్ట్రానికి వచ్చారని ప్రజలందరికీ అర్థమవుతోంది
- అడ్డగోలు విభజన, హోదాను చట్టంలో చేర్చకుండా ఏపీకి కాంగ్రెస్ తీరని ద్రోహం
- అందుకే నోటాకు 1.28% ఓట్లు.. కాంగ్రెస్‌కు 1.17% ఓట్లు
- కనుమరుగైన కాంగ్రెస్‌ను బతికించడమంటే శవానికి జీవం పోయడం లాంటిదే

- వివరాలు 5లో

అంతా అప్పులే.. అభివృద్ధి ఎక్కడ?



- ఏపీ కాంగ్రెస్ నూతన చీఫ్ షర్మిల విమర్శలు
- ఒక్కరికైనా ఉద్యోగం వచ్చిందా?
- కొత్త పరిశ్రమలైనా వచ్చాయా?
- హోదా కోసం దీక్షలు చేసిన జగన్ నేడు నిజమైన ఉద్యమాలు చేయరేం?
- మనుషులు చనిపోతున్నా బీజేపీకి మద్దతిస్తారా?

3లో

ఏపీ అభివృద్ధిపై చాలెంజ్‌కు సిద్ధమా?



- పక్క రాష్ట్రం నుంచి వచ్చి ఇక్కడ అభివృద్ధి జరగలేదంటే ఎలా?
- తెలంగాణలో రాజకీయాలు చేసి ఇప్పుడు ఏపీకి వచ్చి ఇలా మాట్లాడితే ఎలా?
- వైఎస్సార్ పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్పించిందే కాంగ్రెస్.. షర్మిల కాదు.. ఎవరొచ్చినా మా ప్రభుత్వాన్ని ఏమీ చేయలేరు
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

3లో

తిరుపతి జిల్లా నాయుడుపేటలో జరిగిన సామాజిక సాధికార సభకు హాజరైన భారీ జన సందోహంలో ఓ భాగం



'ప్రభంజన'పేట

తిరుపతి జిల్లా నాయుడుపేటలో మార్మోగిన సామాజిక సాధికార నినాదం

2లో

తండోపతండాలుగా తరలివచ్చిన జనంతో కిక్కిరిసిన పట్టణం

పాదయాత్రలో అడుగు కలిపిన బడుగు, బలహీనవర్గాల ప్రజలు, యువత, మహిళలు

సీఎం జగన్ పాలనలో చేకూరిన సామాజిక సాధికారతను వివరించిన నాయకులు..

జనం నుంచి విశేష స్పందన.. జై జగన్ నినాదాలతో దద్దరిల్లిన సభా ప్రాంగణం

'ప్రభుత్వ డిగ్రీ'తో ఉద్యోగాల వెల్లువ



- గతేడాది 539 జాబ్ డ్రైవ్‌లలో 18 వేల మందికిపైగా ఇంటర్వ్యూల్లో ఎంపిక
- జవహర్ నాలెడ్జ్ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా జాబ్ డ్రైవ్‌లు
- చివరి సంవత్సరంలోనే విద్యార్థులు ఉద్యోగాలు సాధించేలా కళాశాల విద్యాశాఖ చర్యలు
- నైపుణ్యాలను పెంచేలా పలు సంస్థలతో ఒప్పందం

14లో

'బ్రో'.. బాబెప్పుడూ ఇంతే!

సీట్లపై ఆఖరి నిమిషం దాకా నాన్చే ధోరణిలో చంద్రబాబు

చివర్లో అతి కొద్ది సీట్లతో పవన్‌కు చెక్ పెట్టే యోచన

పోటీ చేసే స్థానాలపై జనసేనలో పూర్తి గందరగోళం

పవన్ కళ్యాణ్, నాదెండ్ల పోటీ చేసే స్థానాలపైనా అస్పష్టతే

జనసేనకు సీట్లు తేల్చకుండానే అభ్యర్థులను ప్రకటించేస్తున్న చంద్రబాబు

పవన్ లేకుండానే అతని ఫొటోతో సొంతంగా బాబు ప్రచారం

జనసేన కేడర్‌లో అయోమయం.. చివర్లో ముంచేస్తారని భయం

14లో





రూ.3 కోట్ల నగదు పట్టివేత

అనకాపల్లి జిల్లాలోని జాతీయ రహదారిపై వేంపాడు టోల్ ప్లాజా వద్ద తుని నుంచి విశాఖ వెళ్తున్న కారును పోలీసులు తనిఖీ చేసి.. రూ.2,07,50,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే కర్నూలు జిల్లా ఆదోని రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి బ్యాగ్‌లో రూ.కోటి నగదు బయటపడింది. డబ్బులకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ఆ మొత్తాన్ని సీజ్ చేశారు.

- వివరాలు 5లో

అచ్చెన్నా అసలున్నావా?

- పేరుకే రాష్ట్ర అధ్యక్ష పదవి.. బీసీ నేతకు ఘోర అవమానాలు.. ప్రాధాన్యత లేకుండా చేసిన చంద్రబాబు, లోకేశ్
- అధ్యక్షుడి పనులన్నీ వర్ల రామయ్య, ఇతర నేతలతో చేయిస్తున్న వైనం
- లోలోన రగిలిపోతున్న అచ్చెన్నాయుడు

- వివరాలు 10లో

ఇదండీ సంగతి



నోటా ఎవర్సార్! అతన్ని కూడా పార్టీలో చేర్చుకుంటే పోలా!!

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

మా బతుకులు మారాయి



మాది వ్యవసాయ కుటుంబం. కర్నూలు జిల్లా ఆలూరులో మాకున్న మూడెకరాల భూమిలో మా ఆయన జ్ఞాన చంద్రబాబు రాజ్ వ్యవసాయం చేస్తుంటారు. వర్షాధారం కావడంతో కరువు వస్తే ఆదాయం రాకపోగా పెట్టుబడులు కూడా కోల్పోవాల్సి వచ్చేది. దానివల్ల చేసిన అప్పులు తీర్చలేక అవస్థలు పడేవాళ్లం. మా అబ్బాయి హర్షవర్ధన్ 8వ తరగతి, సాయిసుప్రజ ఇంటర్ చదువుతోంది. మేం పడే బాధలు పిల్లల పడకూడదని చాలీచాలని ఆదాయంతోనైనా ఇద్దరినీ కష్టపడి చదివిస్తున్నాం. నేను గృహిణిగా ఉంటూ, తీరిక సమయాల్లో ఇంట్లోనే టైలరింగ్ చేస్తుంటాను. తద్వారా కుటుంబానికి ఆసరాగా నిలిచాను. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత నాకు వైఎస్సార్ ఆసరా పథకం కింద ఇప్పటివరకూ రూ. 12,500లు వచ్చింది. అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ. 15వేలు వంతున నా ఖాతాలో జమయ్యాయి. వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ. 13,500 వస్తోంది. వీటిద్వారా మా ఆర్థిక సమస్యలన్నీ తొలగిపోయాయి. టైలరింగ్‌లో మరో మెట్టు ఎదిగేందుకు రూ. 1.50లక్షల డ్వాక్రా రుణం, రూ. 6.50లక్షల బ్యాంకు రుణం తీసుకుని మగ్గం, ఎంబ్రాయిడర్ మెషిన్ కొనుగోలు చేశాను. సరికొత్త డిజైన్లతో గౌన్లు, డ్రస్సులు, జాకెట్లు, చీరలకు ఫాల్స్ వంటివి చేస్తున్నా. బంధువులు, స్నేహితులు నా పనికి మెచ్చుకుని, ప్రోత్సహిస్తున్నారు. మా అత్తగారు రామలక్ష్మి సహకారం అందిస్తున్నారు. నా ఆదాయం నెలకు 6 నుంచి 7 వేల రూపాయలకు పెరిగింది. నెల నెలా వస్తున్న ఆదాయంతో బ్యాంకు రుణం కూడా తీరుస్తున్నారు. ఇప్పుడు మేము హాయిగా జీవిస్తున్నాం.

– కుమ్మర రమాదేవి, ఆలూరు, కర్నూలు జిల్లా
(ఉలువ చంద్రబాబు, విలేకరి, ఆలూరు)

నిరుపేదకు ప్రాణభిక్ష పెట్టారు



నేను పేద రైతును. బాపట్ల జిల్లా బల్లికురవ మండలంలోని కొప్పెరపాలెం గ్రామంలో ఉన్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేసుకుని బతుకు బండి లాగుతున్నాను. నాలుగు నెలల క్రితం నాకు గుండె బరువుగా ఉండడం, తిమ్మిర్లు, నొప్పిగా అనిపించింది. కుటుంబ సభ్యులు ఆందోళన చెంది స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీని సంప్రదించగా ఆయన గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లమని సూచించారు. అక్కడ వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించి బైపాస్ సర్జరీ చేయాలన్నారు. రెండు లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. అసలే పేద కుటుంబం కావడంతో అంత మొత్తం భరించలేమని చెప్పాం. అప్పుడు ఆరోగ్యశ్రీ కార్డు మాకు శ్రీరామరక్షగా నిలిచింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద సర్జరీ చేసి వైద్యులు నాకు పునర్జన్మ ప్రసాదించారు. ఆరోగ్యశ్రీ నన్ను బతికించింది. ఆపరేషన్ అనంతరం ఆరోగ్య ఆసరాగా రూ. 5 వేలు నా ఖాతాలో వేశారు. వృద్ధాప్య పింఛను కూడా మా వలంటీర్ క్రమం తప్పకుండా ప్రతి నెలా ఒకటోతేదీ వేకువజామునే ఇంటి వద్దకు వచ్చి ఇస్తున్నారు. రైతు భరోసా సొమ్ము కూడా అందుతుండడంతో సాగుకు అప్పు చేయాల్సిన దుస్థితి తప్పింది. నా మనవరాలికి కూడా మూడేళ్లుగా అమ్మ ఒడి వస్తుండడంతో వారి చదువులకు కూడా ఎటువంటి ఆటంకం లేకుండా సాగిపోతోంది. నాలాంటి పేదవారికి ప్రభుత్వ పథకాలు ఎంతగానో ఉపకరిస్తున్నాయి.

– కంచర్ల హరిబాబు, కొప్పరపాలెం, బల్లికురవ
(గుంటుపల్లి ఆంజనేయులు, విలేకరి, బల్లికురవ)

కాళ్లు కదపకుండా ఇంటివద్దే వ్యాపారం



మా కుటుంబమంతా పూర్వకాలం నుంచి సైకిల్‌పై బట్టల మూటలు పెట్టుకుని గ్రామాల్లో విక్రయిస్తూ జీవనం సాగించేది. మా ఆయన కూడా ఆ వృత్తినే కొనసాగించారు. నాలుగేళ్లుగా మా ఆయన వయసు రీత్యా గ్రామాల్లో తిరిగేందుకు ఆరోగ్యం సహకరించక పోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. మాకు బట్టల వ్యాపారం తప్ప మరే పనీ చేత కాకపోవడంతో ఎలా బతకాలా అని మదనపడ్డాం. ఇంతలో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నాక వైఎస్సార్ ఆసరా (డ్వాక్రా రుణమాఫీ) కింద రూ. 13వేల వంతున మూడేళ్లకు రూ. 39వేలు, వైఎస్సార్ చేయూత కింద ఏడాదికి రూ. 18,750లు వంతున మూడేళ్లకు రూ. 56,250లు అందింది. ఆ మొత్తంతో ఇంటివద్దే రెండేళ్లక్రితం బట్టల దుకాణం పెట్టుకున్నాం. జగనన్నతోడు పథకంలో ఏడాదికి పదివేల చొప్పున రూ.30 వేలు వచ్చింది. దానిని కూడా వ్యాపారానికి పెట్టుబడిగా వాడుకున్నాం. ఇప్పుడు మా వ్యాపారం బాగుంది. నా ఇద్దరు కుమార్తెలకు వివాహం చేసి పంపించాను. మేము నిలదొక్కుకునేందుకు సాయపడిన ఈ ప్రభుత్వానికి మేము రుణపడి ఉంటాం.

– పొన్నగంటి నాగమణి, వరహాపురం, చీడికాడ మండలం, అనకాపల్లి జిల్లా
(బోదాల శ్రీనివాసరావు, విలేకరి, చీడికాడ)

మత్స్యరంగం కొత్త పుంతలు



అందుబాటులోకి ఆంధ్రప్రదేశ్ మత్స్య యూనివర్సిటీ

దేశంలోనే ఇది మూడోది

- బీఎఫ్ఎస్సీ కోర్సుతో కొత్తగా నర్సాపురం ఫిషరీస్ కళాశాల
- తొలి ఏడాదిలోనే కళాశాలకు యూజీసీ, ఐసీఏఆర్ గుర్తింపు
- రూ.332 కోట్లతో 40 ఎకరాల్లో నూతన భవనాలు
- తొలి దశలో రూ.100 కోట్లతో నిర్మాణాలు.. పలాస, కైకలూరు వద్ద మరో 2 కళాశాలల ఏర్పాటుకు సన్నాహాలు



ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

సాక్షి, అమరావతి: 'ఆక్వా హబ్ ఆఫ్ ఇండియా'గా ఖ్యాతి గడించిన ఆంధ్రప్రదేశ్‌లో మత్స్య యూనివర్సిటీ అందుబాటులోకి వచ్చింది. దేశంలోనే మూడోదిగా ఏర్పాటైన ఈ వర్సిటీకి ఓ వైపు నూతన భవన సముదాయం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుంటే.. మరోవైపు దీనికి అనుబంధంగా కొత్త మత్స్య కళాశాల కొలువు దీరింది. తొలి ఏడాదిలోనే కేటాయించిన 60 సీట్లు భర్తీ కావడమే కాదు..నిష్ణాతులైన అధ్యాపక బృందంతో మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. దీంతో విద్యార్థుల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది.

1200కు మించి పట్టభద్రుల్లేని పరిస్థితి

రాష్ట్రంలో 974 కి.మీ. సువిశాల తీర ప్రాంతం ..1.10 లక్షల హెక్టార్ల మంచినీటి సాగు..80 వేల హెక్టార్లలో ఉప్పునీటి సాగు విస్తీర్ణం ఉంది. 1.75 లక్షల మంది ఆక్వా రైతులు..8.50 లక్షల మంది మత్స్యకారులున్నారు. ఈ రంగంపై ఆధారపడి 16.50 లక్షల మంది జీవనోపాధి పొందుతున్నారు. 51.06 లక్షల టన్నుల చేపలు, రొయ్యల ఉత్పత్తితో రాష్ట్రం దేశంలోనే నం.1 స్థానంలో ఉంది. జాతీయ స్థాయిలో చేపల ఉత్పత్తిలో 25.60 శాతం, రొయ్యల ఉత్పత్తిలో 78 శాతం ఏపీ నుంచే జరుగుతోంది. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా రాష్ట్రానికి 11,901 డిప్లమో హోల్డర్లు, 6118 బ్యాచులర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ (బీఎఫ్ఎస్సీ), 2541 మాస్టర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ (ఎంఎఫ్ఎస్సీ) చదివిన వారు అవసరం.



తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తున్న నర్సాపురంలోని తుపాను షెల్టర్ భవనం

2030 నాటికి కనీసం 50 వేల మందికి పైగా అవసరమవుతారని అంచనా. కానీ ప్రస్తుతం కేవలం 450 మంది డిప్లమో, 700 మంది బీఎఫ్ఎస్సీ, 50–60 మంది ఎంఎఫ్ఎస్సీ పూర్తిచేసిన వారు మాత్రమే అందుబాటులో ఉన్నారు.

ప్రత్యేకంగా యూనివర్సిటీ ఏర్పాటు

ఈ పరిస్థితిని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2005 వరకు ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో, ఆ తర్వాత వెటర్నరీ యూనివర్సిటీకీ అనుబంధంగా ఉన్న మత్స్య యూనివర్సిటీని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఇందుకోసం ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ యాక్టు–2020ను తీసుకురావడమే కాదు..2022 ఫిబ్రవరి 19 నుంచి వర్సిటీని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ వర్సిటీ పరిధిలో ఉన్న నెల్లూరు జిల్లా ముతుకూరులోని కాలేజ్ ఆఫ్ ఫిషరీస్ సైన్సెస్‌తో పాటు అవనిగడ్డ మండలం బావదేవర పల్లి వద్ద ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాల, కాకినాడలో ఉప్పునీటి రొయ్యలు, బిక్కవోలు మండలం బలభద్రపురంలో మంచినీటి చేపల పరిశోధనా కేంద్రం, ఉండి వద్ద మంచి నీటి చేపలు, రొయ్యల పరిశోధన కేంద్రంతో పాటు 8 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలను మత్స్య వర్సిటీ పరిధిలోకి తీసుకొస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

శాస్త్రవేత్తను కావాలని..



మాది నెల్లూరు. మా నాన్న ఆర్టీసీ కండక్టర్. గురుకుల పాఠశాలలో చదువుకున్నాను. ఎంసెట్‌తో పాటు నీట్‌లో కూడా క్వాలిఫై అయ్యాను. చిన్నప్పటి నుంచి మత్స్యశాస్త్రవేత్త కావాలన్న సంకల్పంతో బ్యాచులర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్‌లో చేరాను. నర్సాపురంలో కొత్తగా ఏర్పాటు చేసిన కళాశాలలో సీటు వచ్చింది. ఫ్యాకల్టీ చాలా బాగుంది. నర్సాపురం సమీపంలోనే ప్రాసెసింగ్ ప్లాంట్స్, హేచరీలు, మత్స్య పరిశ్రమలుండడం మాకెంతో ఉపయోగంగా ఉంది.

–పి.హరిబాబు, బీఎఫ్ఎస్సీ విద్యార్థి

అపార అవకాశాలు



మాది గుంటూరు. నాన్న బ్యాంక్ మేనేజర్. ఎంబీబీఎస్ చేయాలని నీట్ రాశాను. క్వాలీఫై కాలేకపోయాను. అపారమైన ఉపాధి అవకాశాలున్న మత్స్య రంగంలో అడుగు పెట్టాలన్న సంకల్పంతో నర్సాపురం కళాశాలలో బీఎఫ్ఎస్సీలో సీటు సాధించా. మత్స్య శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ అవ్వాలన్నదే నా లక్ష్యం.

–ఎస్‌డీ షరీఫాతేజ్, బీఎఫ్ఎస్సీ విద్యార్థిని

త్వరలో నూతన ప్రాంగణంలోకి..



అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్న మత్స్యరంగం బలోపేతం కావాలంటే ప్రత్యేకంగా మత్స్య యూనివర్సిటీ అవసరం. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో మూడో మత్స్య వర్సిటీని ఏర్పాటు చేశారు. తొలిదశలో రూ.100 కోట్లతో వర్సిటీ భవనాలు నిర్మాణమవుతున్నాయి. వర్సిటీ భవనాలు వచ్చే ఏడాది అందుబాటులోకి వస్తాయని అంచనా వేస్తున్నాం. సాధ్యమైనంత త్వరగా నూతన ప్రాంగణంలో వర్సిటీ కార్యకలాపాలతో పాటు మరిన్ని కోర్సులు ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నాం.

–డాక్టర్ ఓగిరాల సుధాకర్, రిజిస్ట్రార్, ఏపీ మత్స్య విశ్వవిద్యాలయం

తొలి ఏడాదిలోనే గుర్తింపు

వర్సిటీకి అనుబంధంగా 60 బీఎఫ్ఎస్సీ సీట్లతో కొత్తగా నర్సాపురం మత్స్య కళాశాలను మంజూరు చేసిన ప్రభుత్వం ముత్తుకూరు మత్స్య కళాశాలలో సీట్ల సంఖ్యను 40 నుంచి 60కి పెంచింది. కొత్తగా ఏర్పాటు చేసిన నర్సాపురం కళాశాలకు నిష్ణాతులైన అధ్యాపక బృందాన్ని నియమించి 2022–23 విద్యా సంవత్సరం నుంచే నర్సాపురంలోని తుఫాన్ భవనం (తాత్కాలికంగా)లో తరగతులకు శ్రీకారం చుట్టారు. తొలి ఏడాదిలోనే కేటాయించిన 60 సీట్లు భర్తీ కావడమే కాదు యూజీసీ, ఐసీఏఆర్ గుర్తింపు కూడా లభించడం గమనార్హం. వచ్చే ఏడాది నుంచి మాస్టర్ ఆఫ్ ఫిషరీస్ సైన్సెస్, పీహెచ్‌డీ కోర్సులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా పలాస, కృష్ణా జిల్లా కైకలూరు వద్ద ఫిషరీస్ కళాశాలలతో పాటు కొత్తగా నాలుగు మత్స్య పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విజయవాడ తాడిగడపలో వర్సిటీ క్యాంప్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి అధికారికంగా కార్యకలాపాలకు శ్రీకారంచుట్టారు.

శరవేగంగా నిర్మాణ పనులు



పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం సమీపంలో లఖితపూడి– సరిపల్లి గ్రామాల మధ్య 400 ఎకరాల్లో రూ.332 కోట్ల అంచనాతో యూనివర్సిటీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే 40 ఎకరాలను గుర్తించగా, దాంట్లో రూ.100 కోట్లతో పరిపాలనా భవనంతో పాటు అకడమిక్ బ్లాక్, బాలుర, బాలికల హాస్టళ్లు, రైతుల శిక్షణ కేంద్రం, వైస్ చాన్సలర్ బంగ్లా, మల్టీపర్పస్ బిల్డింగ్ నిర్మాణ పనులు జోరందుకున్నాయి. పిల్లర్ల దశకు చేరుకున్నాయి. మరొక పక్క వర్సిటీతో పాటు కొత్తగా ఏర్పాటు చేసిన మత్స్యకళాశాల కోసం 48 టీచింగ్, 52 నాన్ టీచింగ్, 40 అవుట్‌సోర్సింగ్ కలిపి 140 పోస్టులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనామోదం కూడా ఇచ్చింది.

'ప్రభంజన'పేట

నాయుడుపేటలో మార్మోగిన సామాజిక సాధికార నినాదం



సూళ్లూరుపేట నియోజకవర్గ స్థాయిలో నాయుడుపేటలో జరిగిన సాధికార సభకు పోటెత్తిన జనం

సాక్షి తిరుపతి: నాయుడుపేట జనసంద్రమైంది. సూళ్లూరుపేట నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలతో పట్టణం కిక్కిరిసిపోయింది. సామాజిక సాధికార యాత్రకు జన నీరాజనం లభించింది. వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్ర ప్రభంజనంలా సాగింది. స్థానికులతో పాటు ఉప ముఖ్యమంత్రులు నారాయణస్వామి, అంజాద్ బాషా, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీలు మేరిగ మురళి, జిల్లా, నియోజక వర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పట్టణంలో తొలుత పాదయాత్ర జరిగింది. బైక్ ర్యాలీతో పాటు సాయంత్రం 4 గంటలకు పాదయాత్ర ప్రారంభమైంది. అనంతరం అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నాయకులు ప్రసంగించారు. అంతకు ముందు డాక్టర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ కాంగ్రెస్‌తో షర్మిల ప్రయాణాన్ని తప్పు పట్టారు. ఎవరి లబ్ధికోసం ఈ ప్రయత్నమని వారు నిలదీశారు. వైఎస్ కుటుంబానికి తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్‌ను వెనకేసుకు రావడంపై వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ మరణించాక ఆ మహానేత పేరును ఛార్జిషీట్‌లో చేర్చిన పార్టీకి కొమ్ముకాయడమేంటని ప్రశ్నించారు. ఇంకా ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే సంజీవయ్య, నెల్లూరు మేయర్ స్రవంతి మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న పాలనలో సామాజిక సాధికారత కోసం చేసిన విప్లవాత్మక మార్పులను వివరించారు.



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కుటుంబాల్ని చీల్చగల సమర్థుడు చంద్రబాబు

తాను గద్దెనెక్కడానికి ఎంతటి దారుణానికైనా ఒడిగట్టగల నాయకుడు చంద్రబాబని... కుటుంబాల్ని సైతం ఆయన విడగొట్టి సొంత అన్నపై చెల్లెల్ని ఉసిగొల్పే నీచసంస్కృతి ఆయనదని వారు పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయ సాధన కోసం నిరంతరం తపిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని గద్దె దింపడానికి కాంగ్రెస్, చంద్రబాబు కలిసి కుట్రలు చేస్తున్నారనీ... అందులో భాగస్వామి కావడం సరికాదని షర్మిలకు వారు హితవుపలికారు.

అభినవ అంబేడ్కర్ వైఎస్ జగన్


రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున సీఎం జగన్ నెలకొల్పారని, అదే చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో కేవలం హడావుడి చేసి మోసగించారని విమర్శించారు. స్వాతంత్ర్యానంతరం ఎంతో మంది ముఖ్యమంత్రులు వచ్చారని, వారెవ్వరి హయాంలో అమలు కాని సామాజిక సాధికారత జగన్ మాత్రమే చేసి చూపించారన్నారు. పేదలకు విద్య, వైద్యం అందించేందుకు రూ. 45 వేల కోట్లు, వివిధ పథకాల రూపంలో పేదల బ్యాంకు ఖాతాల్లోకి రూ. 2.34 లక్షల కోట్లు జమచేశారని తెలిపారు.

ఎమ్మెల్యే భావోద్వేగం

నాడు ఆలయాల్లోకి ప్రవేశం లేని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన తనను సీఎం వైఎస్ జగన్ ఏకంగా టీటీడీ బోర్డు సభ్యునిగా చేశారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య భావోద్వేగానికి లోనయ్యారు. చంద్రబాబు బీసీల తోకలు కత్తిరిస్తానంటే.. సీఎం జగన్ బీసీలు బ్యాక్ బోన్ క్లాస్ అని అన్నింటా ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. బీసీల తోకలు కత్తిరిస్తానన్న చంద్రబాబు ఎక్కడ? ప్రతి దాంట్లో బీసీలకు సింహభాగం ఉండాలని 50శాతం హక్కులు కల్పించిన సీఎం జగన్ ఎక్కడ అని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఈ తరానికి సీఎం వైఎస్ జగనే మహనీయుడని, ఎంతమంది ఏకమైనా వైఎస్ జగన్ కాలిగోటిని కూడా కదపలేరని హెచ్చరించారు.

ఐక్యంగా పనిచేయండి

- సూళ్లూరుపేటకు కిలివేటి సంజీవయ్యే అభ్యర్థి
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి



సాక్షి, తిరుపతి: పార్టీ అభ్యర్థుల విజయానికి అందరూ కలిసి మెలసి పనిచేయాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి కోరారు. నాయుడుపేటలో ఆదివారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ సూళ్లూరుపేట అభ్యర్థి విషయంలో రకరకాలుగా ప్రచారం సాగుతోందని, ప్రస్తుత ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యే ఇక్కడి అభ్యర్థని ఆయన స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తనకు చెప్పారన్నారు. క్రమశిక్షణారాహిత్యంతో ప్రవర్తిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సూళ్లూరుపేటకు చెందిన కట్టా సుధాకర్‌రెడ్డి, శ్రీమంతురెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, రఫీలకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని తెలిపారు. వారిచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేదన్నారు. మార్పు ఉన్న స్థానాలకే అభ్యర్థులను ప్రకటిస్తారని, అన్ని స్థానాల్లో మార్పులు ఉండవని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు.

పర్యావరణ పర్యాటక కేంద్రంగా ఏపీ

బంగ్లాదేశ్ ప్రతినిధి బృందం లీడర్ అకోండ్ మహమ్మద్ రఫీకుల్ ఇస్లాం



మాట్లాడుతున్న మహమ్మద్ రఫీకుల్ ఇస్లాం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్రంలో విస్తృత స్థాయిలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయం కారణంగా ఆంధ్రప్రదేశ్ పర్యావరణ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని బంగ్లాదేశ్ ప్రతినిధి బృందం లీడర్ పల్లి కర్మ సహాయక ఫౌండేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ అకోండ్ మహమ్మద్ రఫీకుల్ ఇస్లాం కితాబు నిచ్చారు. నేల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏపీలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను అధ్యయనం చేసేందుకు ప్రపంచ దేశాలు ఎంతో ఉత్సాహం చూపుతున్నాయన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా 3వ రోజు క్షేత్ర పర్యటన అనంతరం విజయవాడలో రైతు సాధికార సంస్థ రాష్ట్ర అధికారులతో ఈ బృందం సమావేశమైంది. మహమ్మద్ రఫీకుల్ మాట్లాడుతూ ఏపీలోని ప్రకృతి వ్యవసాయం తమను ఎంతో ఆకట్టుకుందన్నారు. వ్యవసాయంలో డిగ్రీ పొందిన గ్రాడ్యుయేట్‌లు వ్యవసాయం చేస్తూ రైతు శాస్త్రవేత్త కోర్సు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో అమల్లో ఉన్న ఏటీఎం, ఏ గ్రేడ్, మల్టీ లేయర్, పీఎండీఎస్ మోడల్స్ నిజంగా రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. ప్రత్యేకించి ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ మోడల్ బీడు భూములను సస్యశ్యామలం చేయడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. బంగ్లాదేశ్‌కు చెందిన న్యూట్రిషన్ స్పెషలిస్ట్ కపిల్ కుమార్ పాల్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, ప్రత్యేకించి గర్భిణులు, పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేకంగా చేపడుతున్న సూర్య మండలం, న్యూట్రిషన్ గార్డెన్లు ఎంతగానో ఆకట్టుకొన్నాయన్నారు. అసిస్టెంట్ మేనేజర్ శంసాద్ ఫర్జానా మాట్లాడుతూ న్యూట్రిషన్ గార్డెన్‌లో వచ్చిన కాయగూరలను పాఠశాలలకు సరఫరా చేస్తూ పిల్లల ఆరోగ్య పరిరక్షణకు బాటలు వేయడం సంతోషదాయకమన్నారు. ఏపీలోని ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను జాతీయ స్థాయిలో విస్తరించేందుకు 'నేషనల్ రిసోర్స్ ఆర్గనైజేషన్' ఏర్పాటు చేశామని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్ కుమార్ వివరించారు.సమావేశంలో రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి. రామారావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యూల్ ఆనంద్, అడ్వయిజర్–ఇంటిగ్రేషన్ జి. మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న కులగణన

సాక్షి, అమరావతి: చరిత్రాత్మక కులగణన కార్యక్రమం ఊపందుకుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తుండడంతో ఆదివారం కూడా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబ సభ్యుల సామాజిక, ఆర్థిక స్థితిగతుల వివరాలు నమోదు చేశారు. శుక్రవారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం మొదలు కాగా, ఆదివారం రాత్రి వరకు 41,63,957 కుటుంబాలకు సంబంధించి వివరాల నమోదు పూర్తయినట్టు అధికారులు వెల్లడించారు. ఆదివారం ఒక్కరోజే 20.36 లక్షల కుటుంబాల వివరాలు నమోదు చేసినట్టు తెలిపారు. మూడు రోజులుగా గ్రామీణ ప్రాంతాల్లో 11,085 గ్రామ సచివాలయాల పరిధిలో 30.95 లక్షల కుటుంబాల వివరాలు నమోదు పూర్తి కాగా, పట్టణ ప్రాంతాల్లో 3866 వార్డు సచివాలయాల పరిధిలో 10.68 లక్షల కుటుంబాల వివరాల నమోదు పూర్తయినట్టు అధికారులు వివరించారు. మొత్తంగా 3 రోజుల్లో రాష్ట్రంలో నాలుగోవంతు కుటుంబాల్లో వివరాల నమోదు పూర్తయినట్టు వెల్లడించారు.

'మేజర్ మినరల్స్' వేలంలో ఏపీకి జాతీయ అవార్డు

- రేపు భోపాల్లో అవార్డు ప్రదానం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మేజర్ మినరల్ బ్లాకులకు నిర్దిష్ట కాల పరిధిలో వేలం నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు జాతీయ స్థాయి అవార్డు లభించింది. ఏడాది కాలంలో 11 బ్లాకులకు విజయవంతంగా వేలం ప్రక్రియను పూర్తి చేసినందుకు కేంద్ర గనుల శాఖ 'అవార్డు ఆఫ్ అప్రిసియేషన్' జాతీయ అవార్డును ప్రకటించింది. 2022–23లో దేశవ్యాప్తంగా అత్యధికంగా 105 మేజర్ మినరల్ బ్లాకులకు వేలం నిర్వహించగా, వాటిలో ఏపీ ప్రభుత్వం 11 బ్లాకులకు వేలం నిర్వహించి జాతీయ స్థాయిలో మూడవ స్థానం సాధించడంతో ఈ అవార్డు దక్కింది. ఈ నెల 23వ తేదీన భోపాల్‌లో జరిగే రెండవ స్టేట్ మైనింగ్ మంత్రుల సదస్సులో ఈ అవార్డును అందచేయనున్నట్లు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ వీణా కుమారి డెర్మల్ రాష్ట్ర మైనింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదికి రాసిన అధికారిక లేఖలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గనుల శాఖలో అమలు చేస్తున్న సంస్కరణల్లో భాగంగా మైనింగ్ రంగంలో రాష్ట్రం సాధించిన ప్రగతికి ఈ అవార్డు నిదర్శనంగా నిలుస్తోందని, ఇందుకు కృషి చేసిన గోపాలకృష్ణ ద్వివేది, గనుల శాఖ డైరెక్టర్ వి.జి.వెంకటరెడ్డిని రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌కు సర్వం సిద్ధం

- ఈ నెల 24 నుంచి పరీక్ష

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ మెయిన్స్–1 పరీక్ష ఈ నెల 24 నుంచి ప్రారంభంకానుంది. ఫిబ్రవరి 1వ తేదీ వరకూ ఈ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. జేఈఈ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) అన్ని ఏర్పాట్లు చేసినట్టు ప్రకటించింది. మొదటి మూడు రోజులు ఆర్కిటెక్చర్ (పేపర్–1) ఉంటుంది. ఈ పరీక్ష రాసే విద్యార్థులకు అడ్మిట్ కార్డులు ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఉంచినట్టు ఎన్‌టీఏ తెలిపింది. జేఈఈ ఇంజనీరింగ్ విభాగానికి ఈ నెల 27 నుంచి పరీక్ష ఉంటుంది. ఈ విద్యార్థుల అడ్మిట్ కార్డులు 25లోగా ఆన్‌లైన్‌లో ఉంచే అవకాశముంది. రెండు విభాగాలకు కలిపి దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం 12 లక్షల మందికిపైగా విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి 2.4 లక్షల మంది పరీక్ష రాస్తారని సమాచారం. జేఈఈ మెయిన్స్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని, కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తామని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. మొదటి షిఫ్ట్ ఉదయం 9 నుంచి, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 3 గంటల నుంచి ఉంటుంది. ప్రతీ సెషన్ మూడు గంటల వ్యవధితో ఉంటుంది. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షకు అనుమతించబోమని ఎన్‌టీఏ ప్రకటించింది. ఈసారి భద్రత వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్‌ను అమలు చేస్తున్నారు. పరీక్షలు తెలుగు, ఇంగ్లిష్ సహా మొత్తం 10 భాషల్లో నిర్వహిస్తారు. రెండో దశ పరీక్షలు ఏప్రిల్‌లో చేపడతారు. ఈసారి పరీక్ష కోసం సిలబస్ తగ్గించారు. కోవిడ్ సమయంలో కేంద్ర విద్యా సంస్థల్లో టెస్ట్ రాసినవారు ప్రస్తుతం జేఈఈ మెయిన్స్‌కు హాజరవుతున్నారు. ఆ సమయంలో వీళ్లకు సిలబస్ కుదించారు. ఆ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని దాదాపు 25 శాతం సిలబస్‌ను మెయిన్స్ నుంచి తొలగించారు. గణితంలో సుదీర్ఘ ప్రశ్నలను తొలగించారు. ఈ కారణంగా ఈసారి మెయిన్స్ రాసే వారి సంఖ్య పెరుగుతోంది. ముందుగానే జేఈఈ అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకుని, అవసరమైన పత్రాలన్నీ (సెల్ఫ్ డిక్లరేషన్, అండర్ టేకింగ్ ఫాం) దగ్గర ఉంచుకోవాలని ఎన్‌టీఏ సూచించింది. వాటర్ బాటిల్స్, హ్యాండ్ శానిటైజర్లు, మాస్కులు, పెన్నులను అనుమతిస్తామని తెలిపింది.

క్లుప్తంగా...

బాబును మహిళలు నమ్ముతారా?: బుగ్గన



ప్యాపిలి: ప్రజలకు రాయితీలు ఇవ్వడం దండగని 'మనసులో మాట' పుస్తకంలో రాసుకున్న చంద్రబాబును మహిళలు నమ్ముతారా అని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రశ్నించారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం హుసేనాపురం గ్రామంలో రూ.18.77 కోట్లతో నూతనంగా నిర్మించిన వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల, గొర్రెల పెంపకందారుల శిక్షణ కేంద్రాలను ఆర్థిక మంత్రి ఆదివారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. రాయితీల వల్లే ఆర్టీసీ నష్టపోతోందని చంద్రబాబు 'మనసులో మాట' పుస్తకంలో రాసుకున్నారని మంత్రి తెలిపారు. ఇప్పుడు ఎన్నికల వేళ ఆయన మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అంటూ మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీని అమలు చేయని కారణంగానే గత ఎన్నికల్లో మహిళలు పసుపు-కుంకుమ తీసుకుని చంద్రబాబును ఇంటికి సాగనంపారని గుర్తు చేశారు. ఇప్పుడు మరోసారి చంద్రబాబు ఉచిత ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి ఉచిత హామీలు ఇస్తున్నారన్నారు. చంద్రబాబు చెబుతున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీ కూడా 'ఉత్తి గ్యాస్' వంటిదే అని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి టీడీపీకి గట్టి గుణపాఠం చెప్పేందుకు మహిళలు సిద్ధంగా ఉండాలని మంత్రి పిలుపునిచ్చారు. మంత్రి వెంట ఎమ్మెల్సీ ఇసాక్ అహ్మద్, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి ఉన్నారు.

గుత్తికోయలకు ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

గవర్నర్‌కు పీపుల్స్ యాక్షన్ ఫోరం, ఆదివాసీ వికాస సంఘం నాయకుల వినతి

సాక్షి, అమరావతి: గుత్తికోయలకు ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పీపుల్స్ యాక్షన్ ఫోరం, ఆదివాసీ వికాస సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల్లో అత్యంత బలహీన తెగలు (పీవీటీజీ)కు చెందిన గుత్తికోయలు సుమారు వంద గ్రామాల్లో 30వేల మంది నివసిస్తున్నారని తెలిపారు. వారిని ఎస్టీలుగా గుర్తించకపోవడంతో సామాజికంగా, ఆర్థికంగా అనేక అవస్థలు పడుతున్నారని వివరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి సిఫారసు చేసి ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గవర్నర్‌ను కలిసిన వారిలో పీపుల్స్ యాక్షన్ ఫోరం ఇండియా, ఆదివాసీ వికాస సంఘాల నాయకులు పులుగుజ్జు సురేశ్, పాడియం ధన, కొత్తపల్లి విజయ్ కుమార్, దీపక్, దేవయ్య ఉన్నారు.

జనసేనతోనే బీజేపీ పొత్తు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



నంద్యాల(వ్యవసాయం): బీజేపీ, జనసేన పొత్తు కొనసాగుతోందని.. టీడీపీతో పొత్తు విషయాన్ని తమ పార్టీ అధిష్టానం చూసుకుంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి చెప్పారు. ఆదివారం నంద్యాలలో ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రపంచమంతా భారత్‌వైపు చూసే విధంగా దేశాన్ని ప్రధాని మోదీ అభివృద్ధి చేశారని చెప్పారు. ఏపీ అభివృద్ధికి కూడా బీజేపీ కట్టుబడి ఉందన్నారు. శ్రీశైలం అభివృద్ధికి కేంద్రం రూ.43 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. బీజేపీ కృషి వల్లే ఉచిత గ్యాస్ కనెక్షన్లు, హైవేలు, విమానాశ్రయాలు, కొత్త రైల్వే మార్గాలు, సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు సాధ్యమవుతోందన్నారు. వందేమాతరం ఎక్స్‌ప్రెస్ రైళ్లను కర్నూలుకు తీసుకొచ్చిన ఘనత కేంద్రానికే దక్కుతుందన్నారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్టను అందరూ తిలకించాలని కోరారు. శ్రీశైలంలో శివయ్యను దర్శించుకొని తాను కూడా రాముని విగ్రహ ప్రతిష్టను వీక్షిస్తానని చెప్పారు. అయోధ్యలో బాలరాముడు విగ్రహ ప్రతిష్టకు ఏపీలో సెలవు ప్రకటించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో భూమా కిశోర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు నర్సింగరావు, శ్రీకాంతరెడ్డి, మేడా మురళీధర్, స్వాతి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దెబ్బ కాదు.. విషపురాతల దిబ్బ


అసాధ్యమైన అంకెలతో రామోజీ మార్కు పిచ్చి రాతలు.. దేశంలోని పోర్టులన్నీ కలిపినా ఆ స్థాయి సరకు రవాణా అసాధ్యం

- 6 లక్షల కోట్ల టన్నుల నుంచి లక్ష కోట్లకు తగ్గిందంటూ మతిలేని రాతలు
- నిజానికి కృష్ణపట్నం పోర్టులో గతేడాది 4.82 కోట్ల టన్నుల సరకు రవాణా
- అది ఈ ఏడాది ఏకంగా కోటి టన్నులు పెరిగి 5.78 కోట్లకు...
- రవాణా పెరుగుదలతో రాష్ట్ర రాయల్టీ రూ.46 నుంచి రూ.89 కోట్లకు
- డిమాండ్‌కు తగ్గట్టుగా గంగవరంలో రెండు కంటైనర్ టెర్మినళ్లను తెస్తున్న అదానీ
- ఒక్క ఉద్యోగినీ తొలగించలేదు.. ప్రతీ నెలా వ్యాపారంలో వృద్ధి
- ఈ ఏడాది దేశవ్యాప్తంగా ఎగుమతుల క్షీణత.. రాష్ట్రంలో 2.77% వృద్ధి



రాష్ట్రానికి 'జగన్' దెబ్బ!

- కృష్ణపట్నం పోర్టు నుంచి భారీగా తగ్గిన సరకు రవాణా
- గతంలో 6 లక్షల మిలియన్ టన్నులు..
- వైకాపా ప్రభుత్వ హయాంలో లక్ష మిలియన్ టన్నులకు పడిపోయిన వైనం
- ఎగుమతుల్లేక టెర్మినల్‌ను పాక్షికంగా ఉపసంహరిస్తున్న అదానీ సంస్థ
- ప్రభుత్వానికి ఏటా రూ.850 కోట్ల పన్ను, ఆదాయం నష్టం



సాక్షి, అమరావతి: ఈ రామోజీరావు పిచ్చి పతాకస్థాయికి చేరిపోయింది. దానికి తగ్గట్టే 'ఈనాడు' రాతలు కొత్త లోతులను తాకుతున్నాయి. అసలు 6 లక్షల మిలియన్ టన్నులంటే అర్థం తెలుసా రామోజీరావ్? అసలు ఇండియాలోని పోర్టులన్నీ కలిపినా ఆ స్థాయిలో సరకు రవాణా జరుగుతుందా? అసలు 6 లక్షల మిలియన్ టన్నులంటే ఎంత?... అక్షరాలా ఆరు లక్షల కోట్ల టన్నులు!!. పైపెచ్చు వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక అదేమో లక్ష మిలియన్ టన్నులకు.. అంటే లక్ష కోట్ల టన్నులకు పడిపోయిందట!!. మతిపోయిందా రామోజీరావ్? ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ద్వేషంతో అసలు నీ పత్రికలో ఏం రాస్తున్నావో తెలుస్తోందా? నీ రాతలతో పోతున్నది ఈ రాష్ట్ర ప్రతిష్ఠ కాదు... నీ పత్రిక పరువే!!.

కృష్ణపట్నం పోర్టులో ప్రస్తుతం జరుగుతున్న మొత్తం సరకు రవాణా 57.8 మిలియన్ టన్నులు. అసలు దేశంలోని మొత్తం మేజర్ పోర్టులన్నీ కలిపి గతేడాది చేసిన సరకు రవాణా 795 మిలియన్ టన్నులు. కానీ రామోజీరావు మాత్రం ఒక్క కృష్ణపట్నంలోనే సరకు రవాణా 6 లక్షల మిలియన్ టన్నుల నుంచి లక్ష మిలియన్ టన్నులకు పడిపోయిందని చేతికొచ్చిన దౌర్భాగ్యపు రాతలు రాసిపడేశారు. నిజానికి మూడేళ్ల కిందట కృష్ణపట్నం పోర్టులో 3.81 కోట్ల టన్నులుగా ఉన్న వార్షిక సరకు రవాణా ఇపుడు 5.78 కోట్ల టన్నులకు పెరిగింది. గతేడాదితో చూసినా... 4.82 కోట్ల టన్నుల నుంచి 5.78 కోట్ల టన్నులకు చేరి కొత్త రికార్డు సృష్టించింది. దేశంలో కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్‌ల నుంచి ఎగుమతులు క్షీణిస్తే... ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఈ ఏడాది తొలి ఆరునెలల్లో 2.77 శాతం వృద్ధి నమోదయింది. అదీ.. ఆంధ్రప్రదేశ్ ఘనత. ఎల్లో వైరస్‌తో కళ్లు మూసుకుపోయిన రామోజీరావుకు ఇవేమీ కనిపించవు మరి.

రాష్ట్రంలో పారిశ్రామిక రంగం తిరోగమనంలో ఉంటే కృష్ణపట్నం పోర్టును నిర్వహిస్తున్న అదానీ గ్రూపు గంగవరం పోర్టులో కొత్తగా రెండు కార్గో టెర్మినళ్లను ఎందుకు నిర్మిస్తుంది? సరకు రవాణాలో కృష్ణపట్నం పోర్టు అంతకంతకూ పురోగమిస్తోందని సాక్షాత్తూ కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ లేదా ఏపీ మారిటైమ్ బోర్డు గణాంకాలే చెబుతున్నాయి కదా? కృష్ణపట్నంలో సరకు రవాణా ఏటేటా రెండంకెల వృద్ధిని నమోదు చేస్తూ వస్తుంటే... సరకు రవాణా పడిపోయిందంటూ అబద్ధాలాడటం బహుశా... రామోజీకి మినహా ప్రపంచంలో మరెవరికీ సాధ్యం కాదేమో. నిజానికి సరుకు రవాణాపై రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు వస్తున్న రాయల్టీనైనా చూడాలి కదా? 2020-21లో రాయల్టీగా రూ.46.06 కోట్లు వస్తే 2023-24లో అది రూ.88.91 కోట్లకు చేరుతోంది. మరి ఇవన్నీ ఏం చెబుతున్నాయో దిగజారుడు రామోజీరావే అర్థం చేసుకోవాలి.

రూ.54,539 కోట్ల మేర పెరిగిన ఎగుమతులు

రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల వాతావరణం దెబ్బతింటే సులభతర వాణిజ్య ర్యాంకుల్లో ఆంధ్రప్రదేశ్ వరుసగా మూడేళ్ల నుంచి మొదటి స్థానంలో ఎలా ఉంటుంది? పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు వెళ్లిపోతే ఏపీ పోర్టుల నుంచి సరకు రవాణా నాలుగేళ్లలో రూ.54,539 కోట్లు అదనంగా ఎలా పెరుగుతుంది? 2019-20లో రూ.1,04,829.00 కోట్లుగా ఉన్న రాష్ట్ర వాణిజ్య ఎగుమతులు విలువ 2022-23 నాటికి రూ.1,59,368.02 కోట్లకు పెరగటం నిజం కాదా? ఇవన్నీ కేంద్ర వాణిజ్య శాఖ అధికారికంగా చెబుతున్న లెక్కలే కదా? ఈ ఏడాది దేశవ్యాప్తంగా ఎగుమతులు తిరోగమనంలో ఉండగా తొలి ఆర్నెల్లలో రాష్ట్ర ఎగుమతులు మాత్రమే 2.77 శాతం వృద్ధితో రూ.85,021.74 కోట్లకు చేరాయి. కర్ణాటక ఎగుమతులు -9.06 శాతం, మహారాష్ట్రలో -7.04 శాతం, గుజరాత్‌లో -7.91 శాతం మేర క్షీణించాయి.

కొత్తగా రెండు కార్గో టెర్మినళ్లు

కృష్ణపట్నం పోర్టులో మా వ్యాపారం ప్రతి నెలా పెరుగుతోంది. అక్కడ మేం కంటైనర్ టెర్మినల్‌ను తొలగిస్తున్నామనటం అబద్ధం. మార్కెట్ ట్రెండ్ ఆధారంగా సరుకు రవాణాపై భిన్న వ్యూహాలు అనుసరిస్తూ ఉంటాం. మా పోర్టు నుంచి ఒక్కరిని కూడా తొలగించలేదు. గంగవరంలో కంటైనర్ టెర్మినల్ నిర్మించటం వల్ల మా వ్యాపారం మరింత పెరుగుతోంది. ప్రభుత్వానికి మేం చెల్లిస్తున్న రాయల్టీ గణాంకాలే రాష్ట్ర ఆదాయం ఎలా పెరుగుతోందో స్పష్టం చేస్తున్నాయి. 'ఈనాడు' పత్రికలో వెలువడ్డ కథనాన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం.

– అదానీ పోర్ట్ అండ్ సెజ్

ఉద్యోగాలు పెరిగాయ్..

కృష్ణపట్నం పోర్టులో వ్యాపారం తగ్గడం వల్ల 10,000 మంది ఉపాధి కోల్పోయారనేది పచ్చి అబద్ధం. నిజానికి అక్కడ ఉద్యోగాలు పెరిగాయి. ఉత్తరాదిలో భూమి విస్తీర్ణం ఎక్కువ, తీర ప్రాంతం తక్కువ. దక్షిణాదిలో తీర ప్రాంతం అధికం. అందుకని పోర్టులు ఎక్కువ. కంటైనర్ల వ్యాపారానికి పోటీ ఎక్కువగా ఉంటుంది. గంగవరం పోర్టులో కొత్తగా రెండు కార్గో టెర్మినళ్లతో పాటు మూలపేట పోర్టులో కార్గో టెర్మినల్స్ అభివృద్ధి చేస్తున్నాం.

– రవీంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో, ఏపీ మారిటైమ్ బోర్డు

ఇదీ.. కృష్ణపట్నం పోర్టు సరుకు రవాణా పెరుగుదల

సంవత్సరం	కార్గో టన్నుల్లో	రాయల్టీ రూ.కోట్లల్లో
2020-21	3,81,82,305	46.06
2021-22	4,01,20,119	54.89
2022-23	4,82,56,939	72.22
2023-24(అంచనా)	5,78,16,997	88.91

రాష్ట్రంలోని అన్ని పోర్టుల్లో ఎగుమతుల పెరుగుదల ఇలా..

ఆర్థిక సంవత్సరం	ఎగుమతులు
2019-20	రూ.1,04,829.00 కోట్లు
2020-21	రూ.1,24,744.46 కోట్లు
2021-22	రూ.1,43,843.19 కోట్లు
2022-23	రూ.1,59,368.02 కోట్లు
2023-24 (తొలి 6 నెలల్లో..)	రూ.85,021.74 కోట్లు



వైఎస్సార్‌సీపీలోనే యాదవులకు పెద్దపీట

గుంటూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ



కొరిటెపాడు (గుంటూరు): వైఎస్సార్‌సీపీలో యాదవులకు ఎక్కడ అన్యాయం జరిగిందో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి చెప్పాలని గుంటూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ పేర్కొన్నారు. యాదవ సమ్మేళనం సమావేశంలో కృష్ణమూర్తి మాట్లాడిన తీరు బాధాకరమన్నారు. మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. 2014లో వైఎస్సార్‌సీపీ అధికారంలో లేని సమయంలో జంగా కృష్ణమూర్తికి పార్టీ రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షునిగా అవకాశం కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీకి ఒక ఎమ్మెల్సీ అవకాశం వస్తే ఆ పదవిని యాదవ కులానికి చెందిన జంగాకు కేటాయించిన ఘనత కూడా జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గురజాల సీటు గురించి మాట్లాడాలే తప్ప జిల్లాలోను, రాష్ట్రంలోను యాదవులకు పార్టీలో అన్యాయం జరిగిందని మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 1999, 2004లో పార్టీలు, కులాలకు అతీతంగా జంగా కృష్ణమూర్తి గెలుపునకు కృషి చేసిన యాదవులకు ఆయన ఏం చేశారో యాదవులకు సమాధానం చెప్పాలన్నారు. జిల్లాలోని యాదవులకు ఏదైనా ఒక మంచి పని చేశానని చెప్పి.. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీలో యాదవుల గురించి మాట్లాడాలని హితవు పలికారు.

యాదవులంటే జంగా ఒక్కరేనా..

యాదవులంటే జంగా ఒక్కరేనా.. మిగిలిన వారందరూ యాదవులు కాదా? అని రాజనారాయణ ప్రశ్నించారు. 2007లో స్థానిక సంస్థల కోటాలో తాను ఎమ్మెల్సీగా పోటీచేస్తే జంగా కృష్ణమూర్తి ఎమ్మెల్యేగా ఉండి ఓడించారని గుర్తు చేశారు. ఆ రోజు యాదవ్‌ను ఓడించిన ఘనత ఆయనది కాదా? అని ప్రశ్నించారు. 2014-19 మధ్య టీడీపీ హయాంలో ఎంతమంది యాదవులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మేయర్లు, మునిసిపల్ చైర్మన్లు, జెడ్పీటీసీలుగా ఉన్నారో.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎంతమంది ఉన్నారో జంగా కృష్ణమూర్తి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా యాదవులను రాజ్యసభకు పంపిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని స్పష్టం చేశారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద మార్కెట్ యార్డు అయిన గుంటూరు మిర్చి యార్డుకు చైర్మన్‌గా తనను నియమించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. 'నువ్వు అబద్ధాలు చెబితే నమ్మే పరిస్థితిలో యాదవులు ఉన్నారని నమ్ముతున్నావా. టీడీపీలో ఉన్న యాదవులకు ఏం న్యాయం జరిగిందో ధైర్యంగా నీవు చెప్పగలవా' అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీలో యాదవులకు ఎక్కడా అన్యాయం జరగలేదని.. గురజాల నియోజకవర్గంలో జంగాకు ఏదైనా జరిగితే అది ఆయన వ్యక్తిగతమని పేర్కొన్నారు. 1999, 2004లో ఎమ్మెల్యేగా పనిచేసిన జంగాకు 2009లో గురజాల సీటు ఇవ్వవద్దని యాదవులు ఎందుకు వ్యతిరేకించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తాను టీడీపీలో 20 సంవత్సరాలు కష్టపడ్డానని, కానీ కనీసం ఒక్క పదవి ఇవ్వలేదన్నారు. టీడీపీ మాయమాటలకు మోసపోయి జంగా కృష్ణమూర్తి ఆ పార్టీలోకి వెళితే భవిష్యత్‌లో చాలా తప్పు చేసిన వాడిగా మిగిలిపోతారని హితవు పలికారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిన్ను నమ్మి ఎంతో గుర్తింపు ఇచ్చారని పేర్కొన్నారు.

సీఎం జగన్‌కే ప్రజల ఆశీర్వాదం

వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని



ఏలూరు టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రంలో ప్రజల ఆశీర్వాద బలం, అండ ఉన్నాయని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని తెలిపారు. ఎంతమంది చంద్రబాబులు, పవన్ కళ్యాణ్‌లు వచ్చినా ఆయన్ని ఏమీ చేయలేరని తేల్చి చెప్పారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 స్థానాలు వైఎస్సార్‌సీపీ కై వశం చేసుకోవడం ఖాయమన్నారు. ఏలూరులో ఆదివారం ఆళ్ల నాని నేతృత్వంలో జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఇందులో ఇటీవల పలు నియోజకవర్గాలకు నూతనంగా నియమితులైన సమన్వయకర్తలు కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, కంభం విజయరాజు, తెల్లం రాజ్యలక్ష్మిలను పార్టీ శ్రేణులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆళ్ల నాని మాట్లాడుతూ వైఎస్ జగన్ సంక్షేమ పాలనను ప్రజలంతా చూశారని, మరోసారి జగనన్నకు మీరంతా అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కుతంత్రాలు, కుట్రలతో నీచ రాజకీయాలకు పాల్పడే చంద్రబాబు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఎప్పుడైనా ఏ ఒక్క హామీ అయినా అమలు చేసిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. మరోసారి ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారని ధ్వజమెత్తారు. ఎంతమందితో పొత్తులు పెట్టుకున్నా, చీకటి ఒప్పందాలు చేసుకున్నా.. సీఎం వైఎస్ జగన్‌ను ఏమీ చేయలేరని తేల్చిచెప్పారు. జగన్ దమ్మున్న నాయకుడని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ కొనియాడారు. సీఎం వైఎస్ జగన్ ఏ సభలకు వెళ్లినా.. తాను మంచి చేస్తేనే తనకు ఓటు వేయండని అంటున్నారని గుర్తుచేశారు. ఇలా చెప్పే దమ్ము ప్రపంచంలో ఏ నాయకుడికీ లేదన్నారు. ఈసారి ఏలూరు ఎంపీగా పోటీ చేస్తున్న కారుమూరి సునీల్‌కుమార్‌ను రెండు లక్షల మెజారిటీతో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, మేయర్ షేక్ నూర్జహాన్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్య చౌదరి, పుప్పాల వాసుబాబు, మేకా వెంకట ప్రతాప అప్పారావు, తెల్లం బాలరాజు, దూలం నాగేశ్వరరావు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతా అప్పులే..అభివృద్ధి ఎక్కడ?

ఏపీ కాంగ్రెస్ నూతన చీఫ్ షర్మిల విమర్శలు

సాక్షి, అమరావతి/పెనమలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.మూడు లక్షల కోట్లకుపైగా అప్పులు తెచ్చినా రాష్ట్రంలో అభివృద్ధి కనిపించడం లేదని ఏపీ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన షర్మిల విమర్శించారు. ఆదివారం విజయవాడలో ప్రమాణ స్వీకారం అనంతరం ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ల లోన్లతో కలిపి రాష్ట్ర అప్పులు రూ.పది లక్షల కోట్లకు చేరాయన్నారు. విభజన నాటికి రాష్ట్ర అప్పులు రూ.లక్ష కోట్లు ఉంటే చంద్రబాబు అమరావతి రాజధాని అంటూ 3 డీ గ్రాఫిక్స్ చూపించి రూ.రెండు లక్షల కోట్లు అప్పు చేశారని చెప్పారు. వైఎస్ జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రత్యేక హోదా కోసం ప్రతి రోజూ కొట్లాడి దీక్షలు చేశారని, ఎంపీలంతా మూకుమ్మడి రాజీనామా చేస్తే హోదా ఎందుకు రాదో చూస్తానన్నారని, కానీ అధికారంలోకి వచ్చాక నిజమైన ఉద్యమం చేయలేదని విమర్శలు చేశారు. 'జగన్ వచ్చాక మూడు రాజధానులని చెప్పి ఒక్కటి కూడా కట్టలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, కనీసం విజయవాడలో ఒక్క మెట్రో అయినా ఉందా? కొత్త పరిశ్రమలైనా వచ్చాయా? ఒక్కరికైనా ఉద్యోగం వచ్చిందా? రోడ్లయినా నిర్మించగలిగారా? ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వటానికి కూడా డబ్బులు లేవు' అని షర్మిల విమర్శించారు. ఎక్కడ చూసినా దోచుకోవడం, దాచుకోవడం.. ఇసుక మాఫియా, మైనింగ్ మాఫియా తప్ప ఇంకేం లేదన్నారు. మణిపూర్‌లో 2 వేల చర్చిలను ధ్వంసం చేసినా, అరవై వేల మంది క్రైస్తవులను నిర్వాసితులను చేసినా వైఎస్ జగన్ మాట్లాడలేదన్నారు. మనుషులు చనిపోతున్నా బీజేపీకి మద్దతిస్తున్న జగన్ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ చనిపోయాక పోలవరం ప్రాజెక్టు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. గంగిరెద్దుల్లా తలాడిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీ ఎంపీలు రాష్ట్రానికి ఏం చేసిందని బీజేపీకి మద్దతిస్తున్నారని నిలదీశారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా గిడుగు రుద్రరాజు బాధ్యతలు స్వీకరించగా మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. గన్నవరం విమానాశ్రయం నుంచి కానూరులోని ప్రమాణ స్వీకార వేదిక వరకూ ఉదయం ర్యాలీ నిర్వహించడంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. షర్మిల ర్యాలీని తాము అడ్డుకోలేదని విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా చెప్పారు.

ఏపీ అభివృద్ధిపై చాలెంజ్‌కు సిద్ధమా?

వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం/తగరపువలస: ఏపీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై చాలెంజ్‌కు సిద్ధమా? తమతో వస్తే.. తాము చేసిన అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపిస్తామని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి సవాల్ విసిరారు. పక్క రాష్ట్రం నుంచి వచ్చి ఇక్కడ అభివృద్ధి జరగలేదనడానికి ఆమె ఎవరు.. అంటూ మండిపడ్డారు. మొన్నటి వరకు తెలంగాణ బిడ్డనని తిరిగి.. అక్కడ ఎందుకు పోటీ చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. షర్మిల కాదు కదా.. ఎవరు వచ్చినా తమ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టలేరని, వచ్చేది మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. ఆదివారం మధురవాడ ఐటీ సెజ్‌లో గల ఆయన క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి అధికారంలో నిలిపిన వైఎస్సార్ పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చిన విషయాన్ని మరిచిపోయావా? వైఎస్సార్ దయతో కేంద్రంలో అధికారాన్ని పొంది.. ఆయన మరణం తర్వాత వైఎస్సార్ కుమారుడిని 16 నెలలు అన్యాయంగా జైల్లో పెట్టిన సోనియాగాంధీతో ఎలా కలవాలనిపించింది' అని ప్రశ్నించారు. రాజకీయ



మీడియాతో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి


స్వార్థ ప్రయోజనాల కోసం అక్రమంగా రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్‌లో ఆమె ఎందుకు చేరారో? ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌కు నిజమైన వారసులెవరో రానున్న ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరి మమ్మల్ని టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసమో సమీక్షించుకోవాలని షర్మిలకు హితవుపలికారు. ఏపీ ప్రజలపై నిజంగా ప్రేమే ఉంటే అవినీతికి పాల్పడ్డ చంద్రబాబును షర్మిల ప్రశ్నించాలని, రాష్ట్రాన్ని అదోగతి పాల్జేసిన చంద్రబాబును నిలదీయాలని సూచించారు. అంతేగానీ దేశంలో ఎక్కడా లేని విధంగా, రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా సంక్షేమాభివృద్ధి చేస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేస్తావా.. అని ప్రశ్నించారు. తామెప్పుడూ బీజేపీతో రాజీపడలేదని, రాష్ట్ర ప్రయోజనాల కోసమే కొన్ని సందర్భాల్లో బీజేపీతో సఖ్యతగా వ్యవహరించామే తప్ప ఏనాడూ వారితో పొత్తులు పెట్టుకుని ముందుకు సాగలేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సీఎం జగన్ రాష్ట్రంలో చేసిన అభివృద్ధి గురించి గర్వంగా చెప్పుకోగలమని వైవీ సుబ్బారెడ్డి చెప్పారు.

భీమిలి నుంచి ఎన్నికల శంఖారావం

ఈ నెల 27వ తేదీన భీమిలిలో ఎన్నికల శంఖారావాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పూరిస్తున్నారని వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా సంగివలస, ఆనందపురం మండలం మిందివానిపాలెం, పెద్దిపాలెంలో స్థలాలను పరిశీలించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల శంఖారావాన్ని ప్రారంభిస్తే బాగుంటుందని సీఎం జగన్ ఆలోచన చేసినట్టు తెలిపారు. జాతీయ రహదారిని ఆనుకుని సభా ప్రాంగణం ఉండేలా ఏర్పాటు చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు నిర్ణయించినట్టు తెలిపారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా పార్టీ అధ్యక్షులు కోలా గురువులు, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె రాజు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారానికి బ్రాండ్ అంబాసిడర్ బాబే

గిరిజనులు ఎప్పటికీ ఆయన్ను నమ్మరు: ఎమ్మెల్సీ కుంభా రవిబాబు



సాక్షి, అమరావతి: చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు గిరిజనులకు కొంచెం కూడా మేలు చేయలేదని.. అలాంటి వ్యక్తిని గిరిజనులు ఎప్పటికీ నమ్మరని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ కుంభా రవిబాబు అన్నారు. చంద్రబాబు అరకులో సభ పెట్టి వైఎస్సార్‌సీపీపై అనుచితమైన వ్యాఖ్యలు చేశారని ఆయన మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు గిరిజనులకు సెంటు భూమైనా ఇచ్చాడా? అసత్య ప్రచారానికి ఆయన బ్రాండ్ అంబాసిడర్. చంద్రబాబు గిరిజన ద్రోహి అయితే సీఎం జగన్ గిరిజన బంధువు. బాబు తన హయాంలో గిరిజన శాఖకు మంత్రిని కూడా పెట్టలేదు. అలాంటి బాబు అరకులో గిరిజనులపై ప్రేమ నటిస్తున్నారు. గిరిజనులకు పోడు భూములను పంచిపెట్టిన ఘనత సీఎం జగన్‌దే. చంద్రబాబూ ఎందుకు సెంటు భూమి కూడా ఇవ్వలేకపోయారో చెప్పాలి. గిరిజనులకు బుద్ధిలేదు అంటూ మాట్లాడిన వ్యక్తి చంద్రబాబు. అందుకే ఈ రాష్ట్రంలోని ఏడు గిరిజన అసెంబ్లీ, ఒక పార్లమెంటును వైఎస్సార్‌సీపీకి కట్టబెట్టారు. రాబోయే ఎన్నికల్లో కూడా టీడీపీకి ఇదే గతి పడుతుంది.

బాబుకు ఈ ఆలోచనలు ఎందుకు రాలేదు?

రాష్ట్రంలో 38 లక్షల మంది గిరిజనులు తమకు ప్రత్యేకమైన గిరిజన కమిషన్ కావాలని అడిగితే, చంద్రబాబు ఆ ఆలోచన కూడా చేయలేదు. అదే జగన్ సీఎం అయిన వెంటనే గిరిజన కమిషన్ ఏర్పాటు చేసి మా హక్కులకు భరోసా కల్పించారు. దేశ చరిత్రలో ఏ సీఎంకి రాని అద్భుతమైన ఆలోచనతో గిరిజన ప్రాంతంలో ట్రైబల్ యూనివర్సిటీ, మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణం చేపట్టారు. చంద్రబాబు 14 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఇవన్నీ ఎందుకు చేయాలనిపించలేదు? చంద్రబాబు ఇప్పుడొచ్చి ఎన్నెన్నో మాటలు మాట్లాడితే ప్రజలు నమ్ముతారు అనుకుంటే పొరపాటే. విశాఖను పరిపాలన రాజధాని చేస్తానంటే దాన్ని కూడా చంద్రబాబు విమర్శిస్తున్నారు. అలాగే, టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు గంజాయి సాగును విపరీతంగా ప్రోత్సహించారు. అదే సీఎం జగన్ ఆ సాగును అరికట్టడమే కాక వారికి ప్రత్యామ్నాయ ఉపాధిని చూపించారు. ఎమ్మెల్యేలపై చంద్రబాబు వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి.

దారితప్పిన అంగన్‌వాడీల ఆందోళన

- రాజకీయ శక్తుల చేతుల్లోకి 'ఛలో విజయవాడ'
- ఆందోళనలో అసాంఘిక శక్తుల చొరబాటు
- ఉద్రిక్తత, హింసను రెచ్చగొట్టే కుట్ర
- ఎన్నికలకు ముందు హింసకు పాల్పడి రాజకీయ లబ్ధి పొందాలనే ప్లాన్
- నిఘా వర్గాల హెచ్చరికలతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అంగన్‌వాడీల ఆందోళన దారి తప్పింది. రాజకీయ శక్తుల చేతుల్లోకి వెళ్లడంతో సోమవారం తలపెట్టిన 'చలో విజయవాడ' ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం కనిపిస్తోంది. ఆందోళనలో అసాంఘిక శక్తులు చొరబడినట్టు నిఘా వర్గాలు పసిగట్టాయి. అంగన్‌వాడీల డిమాండ్లపై సానుకూలంగా ఉన్న ప్రభుత్వం అన్నింటిని ఆమోదించింది. వాటిని అమలు చేస్తున్న ప్రభుత్వం వేతన పెంపునకు కొంత గడువు కోరింది. అంగన్‌వాడీల సమ్మెతో రాష్ట్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఇబ్బంది కలుగుతోందని, అర్థం చేసుకుని సహకరించాలని విజ్ఞప్తి చేసిన ప్రభుత్వం మూడు పర్యాయాలు చర్చలు జరిపింది. పేద వర్గాలకు అందించే అత్యవసర సేవల విషయంలో సహకరించాలని కోరుతూ వచ్చింది. తొలి నుంచి అంగన్‌వాడీల పట్ల సానుకూల దృక్పథంతో ఉన్న ప్రభుత్వం సమ్మెను కొనసాగిస్తున్న వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం సంయమనం పాటిస్తున్నా పథకం ప్రకారం కొన్ని రాజకీయ పార్టీలు వారిని రెచ్చగొడుతున్నాయి. ఎన్నికల ముందు ఉద్దేశపూర్వకంగా వాడుకుని రాజకీయ లబ్ధిని పొందాలనే కుట్రకు తెరలేచింది. రాజకీయ శక్తుల ప్లాన్‌లో భాగంగా చలో విజయవాడను హింసాత్మకంగా మార్చి రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యను సృష్టించేలా అసాంఘిక శక్తులను రంగంలోకి దించినట్లు సమాచారం. అంగన్‌వాడీల ముసుగులో హింసకు పథక రచన చేసినట్లు గుర్తించిన నిఘా వర్గాలు పోలీసులను అప్రమత్తం చేశాయి. అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఆందోళనలో అసాంఘిక శక్తులకు ఆస్కారం ఇవ్వొద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు. హింసకు దిగే వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ప్రధాన సెంటర్లలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. అసాంఘిక శక్తుల చొరబాటులో ఆందోళన ఉద్రిక్తత, హింసాత్మకంగా మారే ప్రమాదం ఉండటంతో చలో విజయవాడకు అనుమతి లేదని పోలీసులు ప్రకటించారు. ప్రజల శాంతిభద్రతలకు సమస్య రాకుండా సహకరించాలని అంగన్‌వాడీలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ

ప్రారంభమైన మెస్రం వంశీయుల మహాపాదయాత్ర

వచ్చే నెల 9న నాగోబా జాతర

ఇంద్రవెల్లి: నాగోబా జాతరలో భాగంగా గంగాజలం సేకరణ కోసం మెస్రం వంశీయుల మహా పాదయాత్ర ప్రారంభమైంది. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన మెస్రం వంశీయులు ఆదివారం నాగోబా ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. అనంతరం యాత్ర ప్రారంభించారు. తొలిరోజు ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాగూడకు చేరుకొని అక్కడే బస చేశారు. యాత్రలో భాగంగా ఈ నెల 28న మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని గోదావరి నది హస్తిన మడుగుకు చేరుకుంటారు. అక్కడ పవిత్ర గంగాజలం సేకరించనున్నట్లు మెస్రం వంశ పటేల్ వెంకట్‌రావ్ తెలిపారు. అదే రోజు తిరుగు ప్రయాణమై ఫిబ్రవరి 5న ఇంద్రవెల్లిలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుంటారు. అదేరోజు సాయంత్రం కేస్లాపూర్ సమీపంలో మర్రిచెట్టు (వడమర) వద్ద బస చేసి మూడు రోజులపాటు అక్కడే పూజలు చేస్తారు. 9న రాత్రి 10:30 గంటలకు గంగా జలంతో మహాపూజ నిర్వహించి నాగోబా జాతర ప్రారంభించనున్నట్లు పటేల్ తెలిపారు.

మేడారానికి పోటెత్తిన భక్తులు

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండల పరిధి మేడారం శ్రీసమ్మక్క- సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవురోజు కావడంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి జనం తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో క్యూలైన్ల ద్వారానే గద్దెల వద్దకు పంపించారు. సుమారు లక్ష మందికిపైగా జనం వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు.

ఎలాగైతే ఈ సమస్త బ్రహ్మాండంలో వ్యాపించివున్న ఒకే అగ్ని నానారూపాలుగా ఉంటుందో, అదే విధంగా సకల ప్రాణుల అంతరంగాల్లోనూ నెలకొనివుండే ఆ పరబ్రహ్మ ఒక్కటే అయినా నానారూపాలు గల ప్రాణులు, పదార్థాల్లో ఇమిడి వుంటుంది.
– కఠోపనిషత్తు

సాక్షి
సోమవారం, 22 జనవరి 2024

సాహిత్య ఒడంబడికలు

59 ఏళ్ల ఆ వ్యాపారవేత్తకు నయంకాని చర్మవ్యాధి వస్తుంది. కాళ్లకు ఎప్పుడూ పట్టీలు కట్టాల్సిన పరిస్థితి. భార్య ఇష్టపడదు. అతణ్ణి తాకనివ్వదు. అసహనం కమ్ముకున్న వ్యాపారవేత్త విసిగిపోయి తన గోడౌన్‌లో నివసించడం ప్రారంభిస్తాడు. ఒక్కగానొక్క కొడుక్కి తండ్రి గురించి బెంగ. అతను తండ్రి బాగోగుల కోసం ఒక మహిళను తెచ్చి పెడతాడు. ఆ మహిళ ఆ వ్యాపారవేత్త పట్ల కారుణ్యమూర్తి అవుతుందా? మానవ స్వభావాలు ఎట్టి పరిస్థితుల్లో ఏమేమిగా మారుతుంటాయి? తమిళ సాహిత్యంలో నిన్న మొన్న పూచిన కలం ముతురాస కుమార్ రాసిన ఇలాంటి కథలున్న సంకలనాన్ని 'మీ భాషలోకి అనువదిస్తారా... మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంఓయు) సైన్ చేస్తారా' అని కన్నడ, మలయాళ పబ్లిషర్లతో సూటూ బూటూ వేసుకుని చర్చిస్తున్న లిటరరీ ఏజెంట్ అక్కడ కనిపించింది.

'ఇమయం' కలం పేరుతో పాతికేళ్లుగా రాస్తున్న స్కూల్ టీచర్ వి.అన్నామలై కిడ్నీ బాధితుల జీవితాన్ని నవలగా రాయడానికి ఏకంగా సైంటిస్ట్ అంతటి పరిశోధన చేశాడు. కిడ్నీ ఎలా పని చేస్తుంది, ఎందుకు పాడవుతుంది, పాడయ్యాక ఎలా ఎదుర్కొనాలి, ఇందులో మందుల, ఆస్పత్రుల గూడుపుఠానీ ఏమిటనేవి వివరిస్తూ 'ఇప్పోదు ఉయిరోడు ఇరిక్కిరేన్' పేరుతో నవల రాస్తే వెంటనే 'ఐయామ్ ఎలైవ్.. ఫర్ నౌ' పేరుతో ఇంగ్లిష్‌లోకి అనువాదమైంది. అది సరిపోతుందా? స్పానిష్, టర్కిష్, నేపాలీ, లేదంటే తెలుగు భాషల్లోకి అనువాదమైతేనే కదా తమిళ నవల గొప్పదనం తెలిసేది! 'అనువాదం చేయించి పబ్లిష్ చేస్తారా మరి' అని మరో లిటరరీ ఏజెంట్ అక్కడ విదేశీ పబ్లిషర్ల డెస్కుల దగ్గర తిరుగాడుతూ కనిపించాడు.

'చెన్నై ఇంటర్నేషనల్ బుక్‌ఫెయిర్ 2024' పేరుతో చెన్నపట్టణంలో జనవరి 16–18 తేదీల్లో మూడురోజులు సాగిన పుస్తక ప్రదర్శన నిజానికి 'రైట్స్ హబ్'. ఇది తమిళనాడు ప్రభుత్వ పూనికతో, తమిళ సాహిత్యాన్ని ప్రపంచానికి అనువాదం చేసి అందించడానికి హక్కుల క్రయవిక్రయాలకు నియోగించిన వేదిక. మిగిలిన భారతీయ భాషల్లో రచయితలు తాము రాసిన పుస్తకాలను ఇతర భాషల్లో అనువదించుకోవడానికి పాట్లు పడాలి. కాని తమిళనాడు ప్రభుత్వం తన భాషా సాహిత్యాన్ని అనువాదం చేయించడానికి గత రెండేళ్లుగా ఈ రైట్స్ హబ్ నిర్వహించడమే కాదు అందుకు 'తమిళనాడు ట్రాన్స్‌లేషన్ గ్రాంట్' పేరుతో ఆర్థిక అండ కూడా అందిస్తోంది. అంటే మీరొక పబ్లిషరై ఒక తమిళ పుస్తకాన్ని తెలుగులోకి అనువాదం చేయించి ప్రచురిస్తానంటే ఒక్కో పుస్తకానికి పేజీల సంఖ్యను బట్టి గరిష్ఠంగా రెండున్నర లక్షలు మంజూరు చేస్తుంది! రెండున్నర లక్షలు!! దానికి బదులుగా మీరు 500 కాపీలు ప్రచురిస్తే 50 కాపీలు, 1000 కాపీలు ప్రచురిస్తే 100 కాపీలు ప్రభుత్వానికి దఖలు పరచాలి. గ్రాంటు డబ్బుల్లో అనువాద ఖర్చులు, బుక్‌మేకింగ్ ఖర్చులు, ప్రింటింగ్ ఖర్చులు బాగానే సరిపోతాయి. కాపీలు అమ్ముకోగా వచ్చిన డబ్బులు పబ్లిషర్లవే!

'తమిళంలో గత వందేళ్లలో గొప్ప సాహిత్యం వచ్చింది. ప్రపంచ సాహిత్యానికి ఇది ఏ మాత్రం తక్కువ కాదు. మేము ఇప్పటి వరకు రష్యన్, ఫ్రెంచ్, బెంగాలీ, హిందీ నుంచి అనువాదాలు బోలెడు చేసుకున్నాం. బయట దేశాల, భారతీయ భాషల సాహిత్యం తమిళ అనువాదాల ద్వారా చదివాం. ఇప్పుడు మీ వంతు. మా సాహిత్యాన్ని చదవండి. అనువాదం చేసుకోండి. మా సాహిత్యాన్ని మీకు చేరువ కానీయండి' అని బుక్ ఫెయిర్ అనుసంధానకర్త, రచయిత మనుష్యపుత్రన్ ప్రారంభ కార్యక్రమంలో అన్నారు. గత సంవత్సరం నుంచి మొదలైన ఈ గొప్ప సంకల్పం సత్ఫలితాలను ఇస్తోంది. 2023లో జరిగిన చెన్నై ఇంటర్నేషనల్ బుక్‌ఫెయిర్‌లో దేశీయంగా, విదేశీయంగా 100కు పైగా తమిళ పుస్తకాల అనువాదాలకు ఎంఓయులు జరిగితే ఇప్పటికి 52 పుస్తకాలు వెలువడ్డాయి. వీటిలో చైనీస్, అరబిక్, మలయా, కొరియన్, కన్నడ, మలయాళ భాషల్లో వెలువడ్డ తమిళ పుస్తకాలు ఉన్నాయి. ఉదాహరణకు తమిళ కథారచయిత సుజాత కథలు తమిళం ద్వారా పాఠకులకు తెలుసు. ఇప్పుడు చైనీస్ ద్వారా మొత్తం చైనాకు తెలుసు.

చెన్నై ఇంటర్నేషనల్ బుక్‌ఫెయిర్ 2024లో పాల్గొన్న 40 దేశాల పబ్లిషర్లు, భారతీయ భాషల పబ్లిషర్లు ఫెయిర్ ముగిసే సమయానికి 750 ఎంఓయులు చేసుకున్నారు. ఇవన్నీ తమిళం నుంచి ఇతర భాషలకు మాత్రమే కాదు... ఇతర భాషల నుంచి తమిళ లేదా ఏ భాషలోకైనా గానీ! అయితే తమిళనాడు ప్రభుత్వ ట్రాన్ స్లేషన్ గ్రాంట్ మాత్రం తమిళం నుంచి ఇతర భాషల్లోకి అనువాదమయ్యే పుస్తకాలకే! తమిళ ప్రభుత్వం ఈ ఒడంబడికల కోసం ఎంత శ్రద్ధ పెట్టిందంటే ఇంగ్లిష్ రాని రచయితల, పబ్లిషర్ల తరఫున చర్చలు చేయడానికి 20 మంది లిటరరీ ఏజెంట్లకు శిక్షణ ఇచ్చి మరీ రంగంలో దింపింది. ఎంత బాగుంది ఇది! ఏ ప్రభుత్వానికైనా తన సాహిత్య సంపద పట్ల ఉండవలసిన కనీస అనురక్తి ఇది!!

మరి మన సంగతి? తెలుగు సాహిత్యం నుంచి ఇలాంటి ప్రయత్నం చేయడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు అనాసక్తి లేకపోవచ్చు. తమ సాహిత్యాన్ని కాపాడుకోవాలనుకునే తపన ఆ రెండు ప్రభుత్వాలకు తప్పక ఉండి ఉండొచ్చు. కాకుంటే సాహిత్య ప్రపంచం నుంచి, శాసనాధీశుల నుంచి, పాలనా వ్యవస్థలోని చదువరులైన ఐ.ఏ.ఎస్ అధికారుల నుంచి తగిన చొరవ, ఒత్తిడి కావాలంతే!

'చలం రాసిన 'మైదానం'ను కొరియన్‌లోకి అనువదిస్తారా?' అని ఒక లిటరరీ ఏజెంట్, 'గుఱ్ఱం జాషువా 'గబ్బిలం'ను ఫ్రెంచ్‌లోకి అనువదిస్తారా?' అని మరో లిటరరీ ఏజెంట్ ఎంఓయులు సైన్ చేసే సన్నివేశం కోసం ఎదురుచూద్దాం.

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు. ద్వాదశి రా.8.48 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** మృగశిర తె.5.51 వరకు(తెల్లవారితే మంగళవారం), తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** ఉ.11.10 నుండి 12.46 వరకు, **దుర్ముహూర్తం:** 12.35 నుండి 1.23 వరకు, తదుపరి ప.2.50 నుండి 3.38 వరకు, **అమృతఘడియలు:** రా.9.03 నుండి 10.45 వరకు. **సూర్యోదయం:** 6.39 ; **సూర్యాస్తమయం:** 5.45 ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు ; **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు

సుగుణ సంపన్నుడు

సద్గుణాభిరామునికై అయోధ్యలో వెలుస్తున్న బాల రాముని ఆలయం ప్రపంచ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. మన ఇతిహాసాల్లో ఒకటయిన 'రామాయణం' మనకు అత్యంత పవిత్రమైనది. కథానాయకుడు రాముని జీవితాన్ని పరికించి చూస్తే ఒక పూర్ణ పురుషుడికి ఉండవలసిన సుగుణాలన్నీ మనకు ఆయనలో కనిపిస్తాయి.

చిన్నతనంలోనే తండ్రి మాట జవదాటకుండా విశ్వామిత్రునితో అడవులకి వెళ్లి తనలోని విద్యా కౌశలాన్ని ప్రదర్శించి యాగశాలలను రక్షించాడు రాముడు. విశ్వామిత్రుల దగ్గర శిష్యరికం చేస్తూ చేసిన పరిచర్యల ద్వారా రాముణ్ణి ఒక మంచి శిష్యుడుగా గుర్తించగలం. అదేవిధంగా జనకుడు కొలువులో శివధనుస్సును విరిచినప్పుడు సీతమ్మ వారిని చేపట్టాలని జనకుడు కోరగా తమ పెద్దల అనుమతితోనే వివాహమాడుతానని చెప్పటం ద్వారా పెద్దలను గౌరవించే శ్రీరామచంద్రుని చూస్తాం. పట్టాభిషేకం చేసుకోవలసిన తరుణంలో కైకేయికి తండ్రి ఇచ్చిన వరాల కోరికను అనుసరించి అడవులకు వెళ్లిన రామునిలో పితృ వాక్య పాలకుడిని గమనించగలం.

వనవాసంలో మాయా జింక అని లక్ష్మణుడు వారిస్తున్నప్పటికీ సీతమ్మ కోరికను తీర్చడానికి జింకను వేటాడటంలో శ్రీరామచంద్రునిలో భార్య అభిప్రాయాన్ని గౌరవించే ఒక మంచి భర్తను చూడగలం. వనవాసంలో గుహుడు, శబరి, వానరులతో రాముని స్నేహం చూస్తే ఒక సామాజిక వేత్తగాను, సాంఘిక సంస్కర్తగాను కన్పిస్తాడు. సుగ్రీవునితో స్నేహం ద్వారా రాముడిలో ఒక మంచి మిత్రుడిని చూడగలం. హనుమంతునితో ఆయన బంధం భగవంతుడికి – భక్తునికి మధ్య ఉన్న అనుబంధానికి ప్రతీక.

యుద్ధ కాండలో ఇంద్రజిత్తు వేసిన బాణంతో అచేతనావస్థలోకి జారుకున్న లక్ష్మణుడిని చూచి తల్లడిల్లిన రాముని హృదయవేదన అన్నదమ్ముల ప్రేమానుబంధాలకు నిలయమని గమనించగలం. శ్రీరాముని చేతిలో రావణాసురుడు ఓటమి అంచులలో ఉన్నప్పుడు చంపే అవకాశం ఉన్నప్పటికీ రావణుడి చేతిలో అస్త్రాలు ఏమీ లేనందువలన 'నేడు వెళ్లి రేపు రా' అని అభయం ఇవ్వటంలో ఒక దయార్ద్ర హృదయుని చూడగలం. ఒక రాజ్యాధినేతగా సొంత భార్యపై అపనిందలు తొలగించడానికి సీతమ్మ వారిని అడవులకు పంపి జీవితాంతం ఒంటరి జీవితాన్ని గడిపిన శ్రీరామచంద్రునిలో ఒక నిష్పక్షపాతీ, రాగ ద్వేషాలకు అతీతుడైన పరిపాలనా దక్షుణ్ణి మనం గమనించగలం. శ్రీరాముడు చరమాంకంలో తన బిడ్డలు ఇద్దరితో పాటు లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుని బిడ్డలకు కూడా సరిసమానంగా రాజ్యాలను పంచి ఇవ్వటంలో ఒక ఉన్నతమైన న్యాయమూర్తిని చూడగలం.

చివరి దశలో సరయూ నదిలో అవతారం చాలించేటప్పుడు భువి నుంచి దివికి తనతో పాటు వచ్చిన వారందరూ కూడా తిరిగి వస్తున్నారా లేదా అనే విషయాన్ని నిర్ధారణ చేసుకోవడం ద్వారా నమ్ముకున్న వాళ్లకు న్యాయం చేసే ఒక ఆదర్శమూర్తినీ, మంచి నాయకుడినీ చూడగలం. ఇలా రామునిలో ఎన్నో ఆదర్శాలు కనిపిస్తాయి. అందుకే ఆయన భారతీయులకు ఆదర్శప్రాయుడయ్యాడు.


– ఆచార్య వై.వి. రామిరెడ్డి
ఎస్వీ యూనివర్సిటీలో ఆచార్యులు ၊ 94404 50108

అన్ని దారులూ అయోధ్యకే!

అయోధ్య అంటే 'యుద్ధం లేనిది', 'సంఘర్షణ లేని స్థానం' అని అర్థం. సమాజంలోని ప్రతి ఒక్కరి మనస్సులలో అటువంటి అయోధ్య నిర్మాణం కావాలి. అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం జాతి గౌరవ పునర్ జాగరణకు గుర్తు. ఇది శ్రీరాముని జీవితం ఇచ్చే సందేశాన్ని ఆధునిక సమాజం కూడా స్వీకరించిందనడానికి గుర్తు. క్షమ, వినయం, అందరినీ సమాదరించే ధోరణి, కర్తవ్య పాలనలో పట్టుదల, న్యాయబుద్ధి, సద్భావం వంటి శ్రీరామచంద్రుని గుణాలను తిరిగి ఈ సమాజంలో పాదుకొల్పాలి. అలాంటి సమాజాన్ని నిర్మించడమే శ్రీరాముని నిజమైన పూజ అవుతుంది. శ్రీరామ జన్మభూమి ఆలయ స్థాపన ఒక లోతైన ఆధ్యాత్మిక వేడుకగా నిలుస్తుంది. ఇది భారతదేశ సాంస్కృతిక పునరుజ్జీవనానికి సూచిక. నేడు జరిగే ప్రాణప్రతిష్ఠ ఉత్సవంలో పాల్గొని భారత్, తద్వారా ప్రపంచపు పునర్నిర్మాణ సంకల్పం చేపడదాం.

రాముని మార్గంలో నడుద్దాం!

సందర్భం



డా॥ మోహన్ భాగవత్

మన భారతదేశపు శతాబ్దిన్నర చరిత్ర విదేశీ దురాక్రమణదారులతో సాగించిన నిరంతర సంఘర్షణలతో నిండి ఉంది. ప్రారంభంలో కొద్దిమంది అప్పుడప్పుడు ఇక్కడి సంపదను దోచుకోవడం కోసం (సికందర్ దాడి) ఈ దేశంపై దాడి చేసేవారు. కానీ ఆ తరువాత ఇస్లాం పేరున పశ్చిమం నుండి సాగిన దాడులు ఇక్కడి సమాజాన్ని తీవ్రంగా నష్టపరచడమేకాక వేర్పాటువాద ధోరణిని కూడా తీసుకువచ్చాయి. సమాజంలో నిరాశ, నిస్పృహ, పరాజయ భావాలను నింపడానికి విదేశీ దురాక్రమణదారులు ఇక్కడి ధార్మిక స్థలాలు, మందిరాలపై దాడి చేసి, వాటిని ధ్వంసం చేశారు. ఇలా ఒక్కసారి కాదు, అనేకసార్లు జరిగింది. ఈ విధంగా భారతీయ సమాజాన్ని బలహీనపరచి దీర్ఘకాలం ఇక్కడ రాజ్యం చేయాలన్నది వారి ప్రయత్నం.

అయోధ్యలో శ్రీరామ మందిరాన్ని కూడా ఇదే ఉద్దేశ్యంతో, లక్ష్యంతో ధ్వంసం చేశారు. దురాక్రమణకారుల ఈ లక్ష్యం కేవలం ఒక మందిరానికే పరిమితం కాలేదు. మొత్తం ప్రపంచాన్ని గుప్పిట్లో పెట్టుకోవాలన్నది వారి అసలు ఉద్దేశ్యం.

ఈ దేశానికి చెందిన రాజులు ఎప్పుడూ, ఏ దేశంపైనా దురాక్రమణ చేయలేదు. కానీ ప్రపంచంలోని మిగిలిన దేశాలకు చెందిన రాజులు మాత్రం అటువంటి దాడులు, దురాక్రమణలకు పాల్పడ్డారు. అయినా ఏ పాలకుడూ భారత్‌పై పూర్తి ఆధిపత్యాన్ని సాధించలేకపోయాడు. భారతీయ సమాజం ఎప్పుడూ ఈ దురాక్రమణదారుల ముందు తలవంచలేదు. వీరిని ఎదుర్కొనేందుకు నిరంతరం పోరాటం చేస్తూనే ఉంది. అయోధ్య జన్మస్థానాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని అక్కడ భవ్యమైన రామమందిరాన్ని పునర్నిర్మించడానికి నిరంతర ప్రయత్నం సాగుతూనే వచ్చింది. అనేక యుద్ధాలు, సంఘర్షణ, బలిదానాలు జరిగాయి. రామజన్మభూమిలో మందిర నిర్మాణ సంకల్పం హిందువుల మనస్సుల నుండి ఎప్పుడూ తొలగిపోలేదు.



నేడు అయోధ్య రామాలయంలో ప్రాణప్రతిష్ఠ

1857లో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా యుద్ధానికి ప్రణాళిక వేసుకున్నప్పుడు హిందువులు, ముస్లింలు కలిసే ఆ పని చేశారు. అప్పటివరకూ ఇద్దరూ ఆలోచనలు పంచుకునేవారు. అప్పుడు గోవధ నిషేధం, రామజన్మభూమి గురించి రెండు వర్గాల మధ్య ఒక అంగీకారం కుదిరే పరిస్థితి ఏర్పడి ఉంది. తన ప్రమాణపత్రంలో గోవధ నిషేధం అమలు గురించి కూడా బహదూర్ షా జాఫర్ పేర్కొన్నారు. అందువల్లనే సమాజం మొత్తం ఒకటిగా నిలచి పోరాడింది. భారతీయులందరూ వీరోచితంగా పోరాడినా దురదృష్టవశాత్తూ ఆ యుద్ధం విఫలమైంది. దానితో బ్రిటిష్ పాలన కొనసాగింది. అయితే రామ జన్మభూమి ముక్తి పోరాటం మాత్రం ఆగలేదు. బ్రిటిష్ వాళ్ళు మొదటి నుండి అనుసరిస్తూ వచ్చిన 'విభజించి పాలించు' అనే విధానాన్ని ఆ తరువాత మరింతగా అమలుచేశారు. సమాజంలోని ఐకమత్యాన్ని నాశనం చేయడం కోసం బ్రిటిష్ వాళ్ళు స్వతంత్ర వీరులను అయోధ్యలో ఉరితీశారు. అయినా అయోధ్య ముక్తి పోరాటం ఆగలేదు.

1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సోమనాథ మందిర జీర్ణోద్ధరణ జరగడంతో ఇటువంటి దేవాలయాల గురించి చర్చ మళ్ళీ ప్రారంభమయింది. రామజన్మభూమి ముక్తి గురించి అందరి ఆమోదం, అంగీకారం సాధించే అవకాశం అప్పుడు వచ్చినా రాజకీయాలు మరోదారి పట్టాయి. విచ్ఛిన్న వాదం, ప్రాంతీయవాదం వంటివి రాజకీయాల ముసుగులో పెచ్చరిల్లాయి. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ఈ విషయమై హిందువుల మనోభావాలను పట్టించు కోకపోగా వివాదాన్ని పరిష్కరించుకోవడం కోసం ప్రజలు చేసిన ప్రయత్నాలను కూడా ముందుకు సాగనివ్వలేదు. ఈ విషయమై స్వాతంత్ర్యానికి ముందు నుండి సాగుతూ వచ్చిన న్యాయపోరాటాన్ని కొనసాగించారు. రామజన్మభూమి విముక్తి కోసం ప్రజా ఉద్యమం 1980 తరువాత ఊపందుకుంది. అప్పటి నుండి మూడు దశాబ్దాల పాటు సాగింది.

1949లో జన్మభూమిలో భగవాన్ శ్రీరామచంద్రుని విగ్రహం వెలిసింది. 1986లో కోర్టు ఆదేశం మేరకు ఆలయ తాళాలు తెరిచారు. ఆ తరువాత అనేక ఉద్యమాలు, రెండుసార్లు కరసేవ వంటి కార్యక్రమాల ద్వారా హిందూ సమాజపు నిరంతర సంఘర్షణ కొనసాగింది. 2010లో అలహాబాద్ హైకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. ఆ తరువాత ఈ విషయంలో అంతిమ తీర్పు సాధ్యమైనంత త్వరగా వెలువరించాలంటూ కోర్టుకు పదేపదే అభ్యర్థనలు వెళ్ళాయి. చివరికి హిందూ సమాజపు 30 సంవత్సరాల సుదీర్ఘమైన న్యాయ పోరాటం తరువాత 2019 నవంబర్ 9న అన్ని సాక్ష్యాధారాలు క్షుణ్ణంగా పరిశీలించిన సుప్రీంకోర్టు సముచితమైన, సంతులితమైన తీర్పును ప్రకటించింది. రెండు పక్షాల మనోభావాలు, సాక్ష్యాధారాలను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. అలాగే ఈ కేసుకు సంబంధించి అన్ని పక్షాల వాదనలను కూడా పూర్తిగా విన్న తరువాత తీర్పునిచ్చింది. ఈ తీర్పును అనుసరించి మందిర నిర్మాణం కోసం ఒక ట్రస్టును ఏర్పాటు చేశారు. 2020 ఆగస్ట్ 5న మందిర భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఇప్పుడు పుష్య మాస శుక్లపక్ష ద్వాదశి, యుగాబ్ది 5125... 2024 జనవరి 22న శ్రీ రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

ధార్మిక దృష్టితో చూస్తే శ్రీరాముడు ఈ దేశంలో అధిక సంఖ్యాకులకు ఆరాధ్య దేవుడు. ఆయన జీవితం ఆదర్శప్రాయమనీ, అనుసరణీయమనీ నేటికీ సమాజంలో అందరూ భావిస్తున్నారు. అందువల్ల ఈ కార్యక్రమానికి సంబంధించి వస్తున్న చిన్నపాటి అభ్యంతరాలు, అనుమానాలను పూర్తిగా పక్కన పెట్టాలి. వివాదాలు, వాదనలు పూర్తిగా సమసిపోయేట్లు మేధావులు చూడాలి. అయోధ్య అంటే 'యుద్ధం లేనిది', 'సంఘర్షణ లేని స్థానం' అని అర్థం. సమాజంలోని ప్రతి ఒక్కరి మనస్సులలో అటువంటి అయోధ్య నిర్మాణం కావాలి. అది మనందరి కర్తవ్యం.

అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం జాతి గౌరవ పునర్ జాగరణకు గుర్తు. ఇది శ్రీరాముని జీవితం ఇచ్చే సందేశాన్ని ఆధునిక సమాజం కూడా స్వీకరించిందనడానికి గుర్తు. శ్రీరామ మందిరంలో పత్రం, ఫలం, పుష్పంతో పూజతోపాటు రామదర్శనంతో మనస్సులో ఆయనను ఉంచుకుని ఆదర్శవంతమైన ఆచరణను అలవరచుకుని శ్రీరాముని పూజ చేయాలి. ఎందుకంటే 'శివో భూత్వా శివం భజేత్, రామో భూత్వా రామం భజేత్' (శివుడే తానై శివుని పూజించు, రాముడే తానై రాముడిని పూజించు) అనేదే నిజమైన పూజ అవుతుంది.

భారతీయ సాంస్కృతిక దృష్టి ప్రకారం...
మాతృవత్ పర దారేషు పర ద్రవ్యేషు లోష్టవత్
ఆత్మవత్ సర్వభూతేషు యః పశ్యతి సః పణ్డితాః
(పర స్త్రీని మాతృభావనతో చూడాలి. పరుల సొమ్మును మట్టిగా ఎంచాలి. సర్వ జీవులలో ఆత్మను చూడాలి అని పండితులు చెబుతారు.) ఈ విధంగా మనం శ్రీరాముని మార్గంలో నడవాలి.

సత్యనిష్ఠ, బలపరాక్రమాలతోపాటు క్షమ, వినయం, అందరినీ సమాదరించే ధోరణి, కారుణ్యం, కర్తవ్య పాలనలో పట్టుదల వంటి శ్రీరామచంద్రుని గుణాలను వ్యక్తిగతంగా, కుటుంబపరంగా అలవరచుకునే ప్రయత్నం చేయాలి. వ్యక్తిగత జీవితంలో క్రమశిక్షణ తెచ్చుకోవాలి. ఇటువంటి క్రమశిక్షణ ద్వారానే రామలక్ష్మణులు 14 ఏళ్ల అరణ్యవాసాన్ని పూర్తిచేయడమేకాక శక్తిశాలి రావణునితో పోరాడి విజయం సాధించారు. శ్రీరాముని జీవితంలో కనిపించే న్యాయబుద్ధి, కరుణ, సద్భావం, నిష్పక్షపాత ధోరణి వంటి సామాజిక గుణాలను తిరిగి ఈ సమాజంలో పాదుకొల్పాలి. శోషణ లేని, సమాన న్యాయం లభించే సమాజాన్ని, శక్తితోపాటు కరుణ నిండిన ఒక సమాజాన్ని నిర్మించడమే శ్రీరాముని నిజమైన పూజ అవుతుంది.

అహంకారం, స్వార్థం, భేదభావాల మూలంగా ప్రపంచం వినాశం వైపు పరుగులు తీస్తోంది. ఎన్నో ఆపదలను కొనితెచ్చుకుంటోంది. సద్భావన, ఏకత, ప్రగతి, శాంతి వంటి మార్గాన్ని చూపిన జగదభిరాముని ఆదర్శం సర్వకల్యాణకారి, 'సర్వేషాం అవిరోధి' (ఎవరితోనూ విరోధం లేని) అయిన సమాజ నిర్మాణపు ప్రారంభానికి దారి చూపాలి. ఆ మహా ప్రయత్నానికి శ్రీ రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ నాంది కావాలి. మనమంతా ఆ ప్రయత్నంలో, ఆ ఉద్యమంలో పాలుపంచుకోవాలి. జనవరి 22న జరిగే ఉత్సవంలో పాల్గొని మందిర పునర్నిర్మాణ కార్యంతో భారత్, తద్వారా ప్రపంచపు పునర్నిర్మాణ సంకల్పం చేపడదాం. ఈ విషయాన్ని మనస్సులో ఉంచుకుని ముందుకు నడుద్దాం!

వ్యాసకర్త ఆర్.ఎస్.ఎస్. సర్ సంఘచాలక్

అయోధ్యలో నూతనోదయం

సందర్భం



యోగి ఆదిత్యనాథ్

జాసు బిరహ సోచహు దిన రాతీ! రటహు నిరంతర గున్ గన్ పాంతీ!!
రఘుకుల తిలక సుజన్ సుఖదాత! ఆయో కుసల్ దేవ ముని త్రాతా!!

శతాబ్దాల నిరీక్షణకు, తరాల పోరాటానికి, మన పూర్వీకులు చేసిన ప్రతిజ్ఞకు ముగింపు పలికే రోజు ఎట్టకేలకు వచ్చింది. సనాతన సంస్కృతికి ఆత్మ అయిన 'రఘునందన్ రాఘవ్ రామ్‌లల్లా' తన జన్మస్థలమైన అవధ్‌పురిలోని గొప్ప దైవిక ఆలయంలో ప్రతిష్ఠితమవుతున్నారు. 500 సంవత్సరాల విరామం తర్వాత జరుగుతున్న ఈ చరిత్రాత్మకమైన, పవిత్రమైన సందర్భం... భారతదేశాన్ని మాత్రమే కాకుండా యావత్ ప్రపంచాన్ని 'మోక్షదాయని' అయోధ్యపై చూపు నిలిపేలా చేసింది. నేడు ప్రతి రహదారీ శ్రీరామ జన్మభూమికి దారి తీస్తుంది. ప్రతి కన్ను ఆనందబాష్పాలతో తడిసిపోతుంది. అందరూ 'రామ్–రామ్' అని జపిస్తారు.

తరతరాలుగా విశ్వాసులు, లోకాన్ని విడిచిపెట్టిన రామభక్తులు ఈ రోజు కోసం ఎంతగానో ఎదురు చూశారు. 2024 జనవరి 22 ప్రాముఖ్యత బాలరూప రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనకు మించినది. ఇది ప్రజల విశ్వాస పునఃస్థాపనను సూచిస్తుంది. అయోధ్య ఇప్పుడు పూర్వ వైభవాన్ని సంతరించుకుంటోంది. సత్య న్యాయాల ఉమ్మడి విజయం చేదు జ్ఞాపకాలను చెరిపివేస్తుంది. కొత్త కథలను సృష్టిస్తుంది. సమాజంలో సామరస్యాన్ని పెంపొందిస్తుంది.

'శ్రీరామ జన్మభూమి ముక్తి మహాయజ్ఞం' అనేది కేవలం సనాతన విశ్వాసానికి పరీక్ష కాదు; ఇది విజయవంతంగా దేశ సామూహిక చైతన్యాన్ని మేల్కొల్పింది. భారత దేశాన్ని ఐక్యతా సూత్రంతో కలిపింది. రాముడి జన్మస్థలంలో ఆలయ నిర్మాణం కోసం జరిగిన పోరాటంలో ప్రదర్శించిన ప్రత్యేక ఐక్యత అసమానమైనది. సాధువులు, సన్యాసులు, మేధావులు, రాజకీయ నాయకులు మరియు అన్ని వర్గాల ప్రజలు విభేదాలకు అతీతంగా ఒక ఉమ్మడి లక్ష్యం కోసం ఏకమయ్యారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, విశ్వ హిందూ పరిషత్ వంటి సామాజిక సాంస్కృతిక సంస్థలు రోడ్‌మ్యాప్‌ను రూపొందించి ప్రజలను ఏకం చేశాయి. ఆ తీర్మానం ఎట్టకేలకు నెరవేరింది. భారతదేశంలో కొత్త ఉషస్సు వెల్లివిరుస్తోంది.

ఒకప్పుడు 'అవని అమరావతి' అనీ, 'భూలోక వైకుంఠం' అనీ పిలిచిన అయోధ్య శతాబ్దాల పాటు శాపగ్రస్తంగా ఉండిపోయింది. 'రామ రాజ్యం' ఒక ఆదర్శ భావనగా ఉన్న దేశంలోనే రాముడు తన ఉనికిని నిరూపించుకోవాల్సిన అగత్యం వచ్చింది. అతని జన్మస్థలానికి ఆధారాలు కావాల్సి వచ్చింది. కానీ శ్రీరాముని జీవితం మర్యాదగా ప్రవర్తించడం, స్వీయ నిగ్రహాన్ని పాటించడం నేర్పుతుంది. రాముని భక్తులు ఓర్పు, పట్టుదలను ప్రదర్శించారు. నేడు అయోధ్య తాను కోల్పోయిన వైభవాన్ని తిరిగి పొందడంతో యావత్ జాతి సంతోషిస్తోంది. ఈ సంకల్పాన్ని నెరవేర్చడానికి మార్గనిర్దేశం చేసినందుకు గౌరవనీయులైన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీజీకి హృదయపూర్వక అభినందనలు!

2024 జనవరి 22 వ్యక్తిగతంగా నాకు చాలా సంతోషకరమైన సందర్భం. నేను ఈ ప్రయాణం గురించి తలపోస్తున్నప్పుడు, రామ జన్మభూమిని విముక్తం చేయాలన్న అచంచలమైన సంకల్ప క్షణాలు నా మనస్సును ముంచెత్తుతున్నాయి. ఈ సంకల్పమే నన్ను గౌరవనీయులైన గురుదేవ్ మహంత్ వైద్యనాథ్ జీ మహారాజ్ సద్గుణ సాంగత్యంలోకి నడిపించింది. విగ్రహ ప్రతిష్ఠాపన శుభ సందర్భంలో మా తాత బ్రహ్మలీన్ మహంత్ శ్రీ దిగ్విజయ్‌నాథ్ జీ మహారాజ్, గౌరవనీయులైన గురుదేవ్ బ్రహ్మలీన్ మహంత్ శ్రీ వైద్యనాథ్ జీ మహారాజ్‌తో పాటు ఇతర గౌరవనీయులైన సాధువులు భౌతికంగా లేరని నాకు తెలుసు. కానీ వారి ఆత్మలు కచ్చితంగా అపారమైన సంతృప్తిని అనుభవిస్తాయి. గౌరవనీయులైన నా గురువులు జీవితాంతం అంకితభావంతో చేసిన తీర్మానం నెరవేరడానికి సాక్షిగా నిలవడం నా అదృష్టం.

శ్రీ రామ జన్మభూమి ఆలయంలో శ్రీరామ్‌లల్లా ప్రతిష్ఠాపన గురించి ప్రకటించినప్పటి నుండి, ప్రతి సనాతన విశ్వాసిలో నిరీక్షణ స్పష్టంగా కనిపించింది. ఇటీవలి శతాబ్దాలలోనే అసమానమైన సామూహిక ఆనంద వాతావరణం దేశమంతటా వ్యాపించింది.

శైవ, వైష్ణవ, శాక్తేయ, గాణాపత్య, సిక్కు, బౌద్ధ, జైన, దశనామీ శంకర్, రామానంద, రామానుజ, నింబార్క, మధ్వ, విష్ణునామి, రామసనేహి, ఘీసాపంథ్, గరీబ్దాసి, అకాలీ, నిరంకారీ, గౌడీయ, కబీర్ పంథ్ వంటి విభిన్న ఆధ్యాత్మిక సంప్రదాయాలకు చెందిన వారు... అనేక సంఖ్యలో ఉన్న శాఖలు, ఆరాధన పద్ధతుల వారు... 150కి పైగా సంప్రదాయాలకు చెందిన సాధువులు... అటవీ – గిరి నివాసులు, గిరిజన సమూహాలు, వివిధ రంగాలకు చెందిన ప్రము ఖులు... రాజకీయాలు, సైన్స్, పరిశ్రమలు, క్రీడలు, కళలు, సంస్కృతి, సాహిత్య రంగాలవారు అందరూ ఒకే గొడుగు కిందకు చేరడం నిజంగా అపూర్వమైనది, అరుదైనది. ఈ మహత్తరమైన సందర్భం ఎంతో గర్వకారణం. ఉత్తరప్రదేశ్‌లోని 25 కోట్ల మంది ప్రజల తరఫున పవిత్ర అయోధ్యధామంలో ఉన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

ప్రాణ ప్రతిష్ఠా కార్యక్రమం తరువాత, అయోధ్యధామం ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులకు, పర్యాటకులకు, పరిశోధకులకు, జిజ్ఞాసువులకు సాదర స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉంది. ప్రధాన మంత్రి దూరదృష్టితో కూడిన ప్రణాళికలకు అనుగుణంగా అయోధ్యాపురి కచ్చితమైన సన్నాహాలు చేస్తోంది. నగరం ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయం, విస్తరించిన రైల్వే స్టేషన్, అన్ని దిశల నుండి కలుస్తున్న 4–6 లేన్ రోడ్లతో బాగా అనుసంధానించబడిన నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. అదనంగా హెలిపోర్ట్ సేవ, సందర్శకుల విభిన్న అవసరాలను తీర్చడానికి అనుకూలమైన హోటళ్లు, అతిథి గృహాల శ్రేణి ఏర్పాటైనాయి.

కొత్త అయోధ్యలో, పురాతన సంస్కృతి, నాగరికత పరిరక్షణ జరుగుతూనే అత్యాధునిక నగర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. భవిష్యత్తు అవసరాలను తీర్చడానికి తగినట్టుగా నిర్మాణం జరుగుతోంది. ఈ చొరవలో భాగంగా అయోధ్యలోని పంచకోసి, 14 కోసి, 84 కోసి పరిక్రమ పరిధిలోని మతపరమైన, పౌరాణిక, చారిత్రక ప్రదేశాలకు వేగవంతమైన పునరుజ్జీవనం కలిగించడం జరిగింది. ఈ సమష్టి ప్రయత్నాలు సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు దోహదపడటమే కాకుండా పర్యాటకాన్ని పెంచడానికీ, ఈ ప్రాంతంలో కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించడానికీ ఉపయోగపడతాయి.

శ్రీరామ జన్మభూమి ఆలయ స్థాపన ఒక లోతైన ఆధ్యాత్మిక వేడుకగా నిలుస్తుంది. ఇది భారతదేశ సాంస్కృతిక పునరుజ్జీవనానికి సూచిక. ఇది కేవలం ఒక దేవాలయం కాదు, ఇది జాతీయ దేవాలయం. శ్రీరామ్‌లలా పవిత్రోత్సవం యావత్ జాతి జనుల హృదయాన్ని గర్వంతో ఉప్పొంగించే ఒక ముఖ్యమైన సందర్భం. రాముడి దయతో, అయోధ్య సంప్రదాయ పరిక్రమ పవిత్రత ఇప్పుడు సురక్షితంగా ఉంటుంది. ఎటువంటి ఆటంకాలూ దాని పవిత్ర మార్గాన్ని నాశనం చేయలేవు. అయోధ్య వీధులలో ఇక బుల్లెట్లు ప్రతిధ్వనించవు, సరయూ నది రక్తపు మరకను భరించదు, కర్ఫ్యూ విధ్వంసం జరగదు. బదులుగా ఆనందోత్సవ వేడుకలు జరుపుకొంటూ, రామనామ సంకీర్తనలతో ప్రతిధ్వనిస్తుంది.

అవధ్‌పురిలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ భారతదేశంలో రామరాజ్య స్థాపన తాలూకు ప్రకటనను తెలియజేస్తుంది. ఇది ఆదర్శానికి స్వరూపం. ఇక్కడ 'సబ్ నర్ కరహీ పరస్పర ప్రీతి చలహీ స్వధర్మం నిరత శ్రుతి నీతి' అవుతుంది. శ్రీ రామ జన్మభూమి ఆలయంలో ప్రతిష్ఠించనున్న బాలరూప రాముని విగ్రహం మార్గదర్శక కాంతిగా పనిచేస్తుంది. ప్రతి సనాతన విశ్వాసి తన మతపరమైన సూత్రాలను అనుసరించడానికి మార్గం సుగమం చేస్తుంది. ఈ శుభ సందర్భంగా 140 కోట్ల మంది తోటి పౌరులకు అభినందనలు! మన పూర్వీకులు నెలకొల్పుతామని గంభీరంగా ప్రమాణం చేసిన ఆలయాన్ని నిర్మించాలనే నిబద్ధత నెరవేరడం చూసి మనం ఎనలేని సంతృప్తిని పొందుదాం. భగవంతుడు శ్రీరాముని ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ చల్లగా ఉండాలి.

శ్రీ రామః శరణం మమ
జయ–జయ శ్రీసీతారామ్!

వ్యాసకర్త ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి

సోషల్ మీడియా



ఒక వేయి సంవత్సరాల తర్వాత, నా భవిష్యత్ తరాలు నేను చేసిందేమిటో గుర్తుంచుకోకపోవచ్చు, నేను రాసిందేమిటో చదవకపోవచ్చు, కానీ (అయోధ్య) ఆలయ పునర్నిర్మాణ సమయంలో నేను జీవించి ఉన్నానని మాత్రం వాళ్లు తప్పక గుర్తుంచుకుంటారు. అలా నాగరికత శాశ్వతత్వాన్ని ప్రసాదిస్తుంది. – సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త



మందిర ప్రారంభం ఎట్టకేలకు జరుగుతోంది. ఇది గొప్ప ఉత్సవ సందర్భం. అయితే... దయగా, ప్రేమగా వ్యవహరిస్తూ, కష్టపడి పనిచేస్తూ, పన్నులు చెల్లిస్తూ, అవినీతి మీద పోరాడుతూ, ద్వేషం, చెడులతో తలపడుతూ... రామ రాజ్య స్థాపన దిశగా ప్రతి భారతీయుడూ అడుగులు వేయాలని నేను కోరుతున్నాను. – రాకీ సింగ్, షెఫ్

క్లుప్తంగా...

పూనూరు వేణుగోపాలుడి సేవలో జస్టిస్ గన్నమనేని



పూనూరు రామాలయం వద్ద హైకోర్టు న్యాయమూర్తి రామకృష్ణప్రసాద్ దంపతులు

యద్దనపూడి: తన స్వగ్రామమైన బాపట్ల జిల్లా పూనూరులోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలోని పలు ఆలయాలను ఆయన సందర్శించారు. తొలుత ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారి శేషవస్త్రాలు, అక్షింతలు, ప్రసాదాలను న్యాయమూర్తికి అందజేశారు.

ఉత్తరాఖండ్ సీఎంకు శ్రీశారదాపీఠం ఆహ్వానం



ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ దామితో శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర

పెందుర్తి: ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామిని విశాఖ శ్రీశారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ ఆదివారం కలిశారు. డెహ్రాడూన్‌లోని సీఎం అధికారిక నివాసంలో కలిసి ఫిబ్రవరి 15 నుంచి 19 వరకు జరుగనున్న శ్రీశారదాపీఠం వార్షికోత్సవాలకు ఆహ్వానించారు. ఆహ్వాన పత్రికతో పాటు రాజశ్యామల అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా సీఎం పుష్కర్ సింగ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా శ్రీశారదా పీఠం చేపడుతున్న ధార్మిక సేవా కార్యాక్రమాలను ప్రశంసించారు.

ప్రజా సమస్యలపై 'విఠపు' ప్రసంగాలు భేష్


'మండలిలో మాస్టారు' పుస్తకావిష్కరణ సభలో శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు



'మండలిలో మాస్టారు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మోషేన్‌రాజు తదితరులు

గుంటూరుఎడ్యుకేషన్: శాసనమండలి సభ్యునిగా పదహారేళ్లపాటు కొనసాగిన విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రజా సమస్యలపై స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు చేశారని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ కె.మోషేన్‌రాజు అన్నారు. వి.బాలసుబ్రహ్మణ్యం శాసనమండలిలో చేసిన ప్రసంగాల సంకలనం ''మండలిలో మాస్టారు'' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం గుంటూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజు మాట్లాడుతూ ఒక ఎమ్మెల్సీగా బాలసుబ్రహ్మణ్యం సమాజంలోని వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలి వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన తీరు కొత్తగా శాసనమండలికి వచ్చే సభ్యులకు ఆదర్శనీయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ, పీడీఎఫ్ ఫ్లోర్‌లీడర్ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, పి.రఘువర్మ, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా శేఖర్‌బాబు



సాక్షి, అమరావతి: వ్యవసాయ శాఖ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబును నియమిస్తూ వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ ముస్సోరిలోని ఐఏఎస్ ట్రైనింగ్ అకాడమికి మూడు వారాల పాటు శిక్షణకు వెళ్తున్నారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ బాధ్యతలను ఏపీ సీడ్స్ ఎండీ శేఖర్‌బాబుకు అప్పగించారు.

ఏపీ పీఈసీఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా వాసిరెడ్డి




పెద్దిరెడ్డితో వాసిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల మేనేజిమెంట్ అసోసియేషన్ (ఏపీపీఈసీఎంఏ) అధ్యక్షుడిగా గుంటూరు జిల్లా నంబూరులోని వాసిరెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ) చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలోని అసోసియేషన్ కేంద్ర కార్యాలయంలో నూతన కార్యవర్గం సమావేశమైంది. వాసిరెడ్డి విద్యాసాగర్‌తో పాటు ప్రధాన కార్యదర్శిగా పెద్దిరెడ్డి మధుసూదనరావు, కోశాధికారిగా గ్రంధి సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. పలు తీర్మానాలు చేశారు.







అంబేడ్కర్ స్మృతి వనం.. పులకించిన జనం

ఎన్టీఆర్ జిల్లా, విజయవాడలోని సామాజిక న్యాయ మహా శిల్పం (అంబేడ్కర్ విగ్రహం), అంబేడ్కర్ స్మృతి వనం ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో కుటుంబ సమేతంగా వచ్చిన వారితో ఉదయం నుంచే రద్దీ నెలకొంది. సాయంత్రం మరింత పెరిగింది. విద్యుత్ దీపాల వెలుగుల్లో స్మృతి వనం, అంబేడ్కర్ బొమ్మలు, విజువల్ షో వంటివి చూసి పులకించిపోయారు.

– విశాల్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

తాడేపల్లిగూడెంలో ఏడీజే కోర్టు ప్రారంభం

- జూనియర్ న్యాయవాదులకు ఇది చక్కని అవకాశం
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. కృష్ణమోహన్



ఏడీజే కోర్టును ప్రారంభిస్తున్న జస్టిస్ కృష్ణమోహన్, చిత్రంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శేషసాయి, జస్టిస్ జైసూర్య, జస్టిస్ సుబ్బారెడ్డి, జస్టిస్ గోపాలకృష్ణారావు తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): న్యాయవాదుల చిరకాల కోరిక అయిన ఏడీజే కోర్టును పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ప్రారంభించామని, కోర్టును గౌరవప్రదంగా నిర్వహించుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. నూతనంగా మంజూరైన 11వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి (ఏడీజే) కోర్టును తాడేపల్లిగూడెం కోర్టు సముదాయం భవనాల్లోని ఒక బిల్డింగ్‌లో ఆదివారం ఉదయం జస్టిస్ కృష్ణమోహన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ నైనాల జైసూర్య, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ వి.గోపాలకృష్ణారావు, జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి సి.పురుషోత్తం కుమార్, ఏడీజే కోర్టు ఇన్‌చార్జి జడ్జి బి.సత్యవతి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం న్యాయవాదుల చిరకాల వాంఛ అయిన ఏడీజే కోర్టు కల నెరవేరిందన్నారు. జూనియర్ న్యాయవాదులకు ఇది చక్కని అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోర్టు పరిధిలోని ప్రజలకు ఏడీజే కోర్టు రావడం వల్ల వ్యయప్రయాసలు తగ్గుతాయన్నారు. బార్ అసోసియేషన్‌కు, న్యాయవాదులకు శుభాకాంక్షలు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి మాట్లాడుతూ ఇది రెండు దశాబ్దాల కల సాకారమైన రోజని అన్నారు. జస్టిస్ నైనాల జైసూర్య మాట్లాడుతూ యువ న్యాయవాదులు ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు ఏడీజే కోర్టు చక్కగా ఉపయోగపడుతుందన్నారు. జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏడీజే కోర్టు కల సాకరమైనందుకు తాడేపల్లిగూడెం వాసిగా గర్వపడుతున్నానని చెప్పారు. కార్యక్రమంలో పలువురు న్యాయాధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అయోధ్యకు లక్ష వెంకన్న లడ్డూలు

- రామ మందిర ట్రస్టుకు అందజేసిన టీటీడీ
- అక్కడి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న టీటీడీ చైర్మన్ భూమన



అయోధ్యలో భూమన కరుణాకరరెడ్డి

తిరుమల: అయోధ్యలో సోమవారం జరుగనున్న బాల రాముని విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమానికి హాజరయ్యే భక్తులకు పంపిణీ చేయడానికి తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారి ప్రసాదం అయిన లక్ష లడ్డూలను రామ మందిర ట్రస్టు ప్రతినిధులకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆదివారం అందజేశారు. తొలుత రామ మందిరానికి చేరుకున్న కరుణాకరరెడ్డికి రామ మందిర ట్రస్టు ప్రతినిధి సాధ్వి రితంబరి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన రామాలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తర్వాత ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులతో మాట్లాడారు. కలియుగంలో తిరుమలలో స్వయంభువుగా వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారే త్రేతాయుగంలో శ్రీరామచంద్ర మూర్తి అని చెప్పారు. శ్రీవారి ప్రథమ సేవకుడిగా ఉన్న తనకు రామ మందిర ప్రారంభ మహోత్సవంలో పాల్గొనే అదృష్టం దక్కడం పూర్వజన్మ సుకృతమని ఆనందం వ్యక్తం చేశారు.

రసరమ్యంగా అయోధ్యకాండ అఖండ పారాయణం

లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ఆదివారం జరిగిన 6వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తిసాగరంలో ముంచెత్తింది. ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేసింది. అయోధ్యకాండలోని 18 నుంచి 21వ సర్గ వరకు మొత్తం నాలుగు సర్గల్లో 199 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 224 శ్లోకాలను పారాయణం చేశారు. ధర్మగిరి వేద పాఠశాల పండితులు కె.రామానుజాచార్యులు, అనంత గోపాలకృష్ణ, మారుతి శ్లోక పారాయణం చేశారు.

మూడు రాజధానులపై షర్మిల మాట్లాడటం సరికాదు

- బహుజన పరిరక్షణ సమితి నాయకులు
- 1,211వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



రిలే దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: మూడు రాజధానులపై ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల మాట్లాడటం మంచి పద్ధతి కాదని, రాష్ట్ర విభజనకు, ఏపీ నాశనానికి కారణం కాంగ్రెస్ పార్టీయేనన్న విషయం తెలుసుకొని మాట్లాడటం మంచిదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హితవు పలికారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 1,211వ రోజుకు చేరాయి. రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని పలువురు ముఖ్య అతిథులు సందర్శించి, ప్రసంగించారు. ఏపీపై కనీస అవగాహన లేని షర్మిల తన పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసి, ఇప్పటికిప్పుడు ఏపీలోకి అడుగుపెట్టి మూడు రాజధానులపై చేస్తున్న వ్యాఖ్యలు ఆమె అవగాహన లేమికి నిదర్శమని మండిపడ్డారు. రెండు శాతం ఓటు బ్యాంకు ఉన్న కులవాదులకు అనుకూలంగా మాట్లాడిన షర్మిల తన వ్యాఖ్యలు ఉప సంహరించుకోవాలని, లేదంటే బహుజనుల ఆగ్రహం చవిచూడక తప్పదన్నారు. బాబును నమ్మిన పార్టీలన్నీ ఏపీలో తుడిచిపెట్టుకు పోయాయని, పవన్ కళ్యాణ్‌లా పక్క పార్టీలకు బాకాలు ఊదితే నమ్మేంత పిచ్చివాళ్లు ప్రజలు కాదని గుర్తుంచుకోవాలన్నారు. ప్రస్తుత వైసీపీ పాలనలో బహుజనులకు అన్ని రకాలుగా న్యాయం జరిగిందని, విద్య, వైద్యం, సంక్షేమంలో ప్రతి పేదవాడికి సీఎం జగనన్న పాలనలో కుల, మత, పార్టీ రహితంగా పథకాలు అందాయని, తమకు మేలు చేసిన పార్టీలనే రాబోయే ఎన్నికల్లో గెలిపిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు ఈపూరి ఆదాం, పల్లె బాబు, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రూ.3 కోట్ల నగదు పట్టివేత

- వేంపాడు టోల్‌ప్లాజా వద్ద కారులో తరలిస్తున్న రూ.2.07 కోట్లు పట్టుకున్న స్థానిక పోలీసులు
- రైలులో తరలిస్తున్న రూ.కోటి పట్టుకున్న ఆదోని స్టేషన్ రైల్వే పోలీసులు



వేంపాడు టోల్ ప్లాజా వద్ద కారులో స్వాధీనం చేసుకున్న నగదు చూపుతున్న అధికారులు



పట్టుకున్న రూ.కోటి నగదు చూపిస్తూ మాట్లాడుతున్న రైల్వే డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీర్

నక్కపల్లి(అనకాపల్లి జిల్లా)/ఆదోని సెంట్రల్: జాతీయ రహదారిపై వేంపాడు టోల్‌ప్లాజా వద్ద కారులో తరలిస్తున్న రూ.2,07,50,000 నగదును పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ విభీషణ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం రాత్రి వేంపాడు టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టామని, తుని నుంచి విశాఖ వెళ్తున్న ఒక కారును ఆపి చూడగా లోపల ఐదు బ్యాగుల్లో రెండుకోట్ల ఏడు లక్షల యాభైవేలరూపాయల నగదు లభించిందన్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన వజ్రపు వెంకటేశ్వరరావు, యాదవరాజు కారులో ఈ నగదు తీసుకెళ్తున్నట్లుతెలిపారు. తాము ధాన్యం వ్యాపారం చేస్తున్నట్లు వీరు చెప్పారని, ఈ నగదుకు సంబంధించి ఎటువంటి పత్రాలు చూపించలేదన్నారు. నగదుతోపాటు, కారును కూడా సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ. కోటి నగదు స్వాధీనం

రైల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.కోటి నగదును స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీర్ తెలిపారు. కర్నూలు జిల్లా ఆదోని రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శనివారం అర్ధరాత్రి దాటాక రైల్వే ఎస్పీ చౌడేశ్వరి ఆధ్వర్యంలో గుంతకల్ డివిజన్ పరిధిలో రైళ్లలో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ఆదోని పట్టణానికి చెందిన కోల్కర్ మహమ్మద్ అనే వ్యక్తి నిజామాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే రైల్లో ప్రయాణిస్తూ ఆదోనిలో దిగాడని, రైల్వే పోలీసులు బ్యాగులు తనిఖీ చేయగా రూ.1,00,95,450 నగదు గుర్తించినట్లు తెలిపారు. విచారణలో అతడు నగదుకు సంబంధించి ఎటువంటి రశీదు అందజేయలేదన్నారు. స్వాధీనం చేసుకున్న నగదును నిబంధనల మేరకు ఆదాయపు పన్నుశాఖకు అప్పగిస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో అక్రమంగా డబ్బులు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి ఘటనలకు సంబంధించి ప్రయాణికులు 9440627669 నంబర్‌కు సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి తగిన పారితోషికం అందిస్తామని తెలిపారు.

బాబు కోసం బలి!

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు చివరి అస్త్రంగా షర్మిల

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును సీఎంను చేయడం ఎలా? అన్నదే షర్మిల లక్ష్యంగా కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. సంక్షేమ పథకాలు, సుపరిపాలనతో ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న సీఎం జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక అన్ని అస్త్రాలు ప్రయోగించిన చంద్రబాబు చివరి ప్రయత్నంగా షర్మిలను తీసుకొచ్చారని చెప్పారు. చంద్రబాబుకు ప్రయోజనం చేకూర్చడం కోసమే షర్మిల పీసీసీ చీఫ్‌గా రాష్ట్రానికి వచ్చారన్నది ప్రజలందరికీ అర్థమవుతోందన్నారు. ఇదంతా చంద్రబాబు ఎత్తుగడేనని చెప్పారు. గతంలో షర్మిలపై వ్యక్తిత్వ హననానికి పాల్పడిన ఎల్లో మీడియా ఇప్పుడు ఆమెను భుజానికెత్తుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సజ్జల మీడియాతో మాట్లాడారు. నిన్నటిదాకా తెలంగాణలోనే తన బతుకు, చావు అంటూ వైఎస్సార్ టీపీని నడిపిన షర్మిల ఇప్పుడు హఠాత్తుగా పీసీసీ చీఫ్‌గా రాష్ట్రానికి ఎందుకొచ్చారో చెప్పాలన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి బతికి ఉంటే కాంగ్రెస్‌పై ఉమ్మేసేవారంటూ నిన్నటిదాకా తూర్పారబట్టిన షర్మిల ఇప్పుడు రాష్ట్రంలో ఆ పార్టీకి నేతృత్వం వహించడానికి కారణాలేంటో చెప్పాలని నిలదీశారు. అడ్డగోలుగా విభజించి ప్రత్యేక హోదాను చట్టంలో చేర్చకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించుకుందన్నారు. రాష్ట్రంలో గత ఎన్నికల్లో నోటాకు 1.28 శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 1.17 శాతం ఓట్లు వచ్చాయని సజ్జల గుర్తు చేశారు. టీడీపీ వెంటిలేటర్‌పై ఉండగా కనుమరుగైన కాంగ్రెస్‌కు నాయకులే లేరన్నారు. అలాంటి కాంగ్రెస్‌ను బతికించడమంటే శవానికి జీవం పోయటమేనని ఎద్దేవా చేశారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే...

భాష, యాస బాధాకరం..

పీసీసీ చీఫ్‌గా ప్రమాణ స్వీకారం సందర్భంగా షర్మిల మాట్లాడిన భాష, యాస దివంగత వైఎస్సార్ కుటుంబ సన్నిహితులకు, అభిమానులకు, ఆయన ఆశయాల సాధనకు పేటెంట్ కలిగిన వైఎస్సార్‌సీపీ నాయకులకు బాధ కలిగించింది. సీఎం జగన్ మహానేత వైఎస్ తనయుడిగానే కాకుండా రాజకీయ వారసుడిగా, వైఎస్సార్ ఆశయాల సాధనకు ప్రజలతో మమేకమవుతూ నిబద్ధతతో పని చేస్తున్నారు. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, రాష్ట్ర ప్రజలంతా సీఎం జగన్‌ను అక్కున చేర్చుకున్నారు. షర్మిల వ్యవహార శైలి చూస్తే ఒక రకంగా జాలి కలుగుతోంది. కేవీపీ, రఘువీరారెడ్డి మినహా కాంగ్రెస్‌లో షర్మిలకు పరియం ఉన్న వారెవరూ లేరు. వైఎస్ కుటుంబాన్ని కాంగ్రెస్ వేధించడం షర్మిలకు తెలుసు.

ప్రసంగాన్ని తయారు చేసి పంపించారు..

రాష్ట్రంలో ఉనికిలో లేని కాంగ్రెస్ పార్టీకి హఠాత్తుగా అధ్యక్షురాలిగా వచ్చి చంద్రబాబు డైలాగులనే షర్మిల చెబుతుంటే జాలి కలగక మరేం అనిపిస్తుంది? జగన్‌కు మద్దతుగా గతంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న షర్మిల ఇప్పుడు ఆయన నియంత అంటూ విమర్శలు చేస్తున్నారు. చంద్రబాబు తన పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకునేందుకు ఏమీ లేకపోవడంతో 56 నెలలుగా కొనసాగుతున్న సీఎం జగన్ సంక్షేమ పాలన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారు. తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పకుండా ఆమె డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి ఎందుకు వచ్చారు? రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యమైతే ఇక్కడకు వచ్చి ఆమె చేయగలిగింది ఏముంది? ఆమె లక్ష్యం.. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడం కాదు.. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం ఎలా అన్నదే. వైఎస్ అభిమానుల ఓట్లు చీల్చడానికి షర్మిల తోడ్పడతారన్నదే చంద్రబాబు చివరి ఎత్తుగడ. క్రిస్టియన్ మైనార్టీలు, దళితుల ఓట్లు చీల్చడమే లక్ష్యంగా ప్రసంగాన్ని తయారు చేసి షర్మిలకు ఇచ్చి పంపారు.

ఆ అవసరం, అవకాశం కూడా లేదు..

రాష్ట్రంలో ఉన్నది ఒకటే కాంగ్రెస్ పార్టీ.. అది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే. హస్తం గుర్తు కాంగ్రెస్ ఎప్పుడో పోయింది. వైఎస్సార్ వారసుడిగా సీఎం జగన్ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. రాష్ట్రంలో మైనార్టీలు, క్రైస్తవులు, ఎస్సీలతోపాటు అందరికీ రక్షణ కల్పించే శక్తి, నిబద్ధత తనకుందని పన్నెండేళ్లుగా సీఎం జగన్ రుజువు చేసుకుంటూనే ఉన్నారు. ఇక వేరే ప్రత్యామ్నాయం రాష్ట్రంలో అవసరం లేదు. ఆ అవకాశం కూడా లేదు. మతం ఏదైనా వ్యక్తిగతంగానే ఉండాలి కానీ రాజకీయంగా, పరిపాలనలో దాని ప్రభావం ఉండకూడదని బలంగా విశ్వసించే వ్యక్తి సీఎం జగన్. ఏ దేవుడ్ని ఎవరు కొలిచినా అన్నిటి భావం ఒకటే అని నమ్మిన వ్యక్తిగా వాటికి అతీతంగా ఉన్నారు. ఎవరికి అన్యాయం జరిగినా వారిని రక్షించి అక్కున చేర్చుకుంటున్నారు. మత ప్రాతిపదికన ఎవరికి అన్యాయం జరిగినా ఆయన సహించరు. ఐదు కోట్ల మంది ప్రజలు దీన్ని విశ్వసిస్తున్నారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు మన వ్యక్తిగత విశ్వాసాలు కాకుండా రాష్ట్రం అవసరాలు, ప్రజల ఆకాంక్షలే మన రాజకీయ విధానాలను నిర్దేశించాలని సీఎం జగన్ బలంగా నమ్ముతారు. కేంద్రంలో ఎవరున్నా వారితో సమన్వయం చేసుకుంటూ వీలైనంత వరకూ రాష్ట్రానికి మేలు చేయాలని భావిస్తారు. సీఎం జగన్ చెల్లెలుగా, మహానేత వైఎస్ కుమార్తెగా తనను ఆదరించే వారి అభిమానాన్ని సైతం పోగొట్టుకునే దిశగా షర్మిల అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

హోదాపై కాంగ్రెస్ తరఫున వివరణ ఇవ్వాలి..

కాంగ్రెస్ పార్టీ చంద్రబాబుతో కుమ్మక్కై, అడ్డగోలుగా రాష్ట్రాన్ని విభజించి తీరని అన్యాయం చేసింది. రాష్ట్ర హక్కులను రక్షించకుండా, ప్రత్యేక హోదాను చట్టంలో చేర్చకుండా ద్రోహం చేసింది కాంగ్రెస్సే. ప్రత్యేక హోదాను చట్టంలో చేర్చి ఉంటే ఇప్పుడింత పోరాడాల్సిన అవసరమే ఉండదు కదా? రాజధానికి ఆర్థిక వనరులు బడ్జెట్ కేటాయింపుల ద్వారా ఇస్తామని ఆ రోజు చట్టంలో చేర్చి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి ఉండేది కాదు కదా? తాను చేసిన తప్పులకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన కాంగ్రెస్ పార్టీ అడ్రస్ లేకుండా పోయింది. ఆ పార్టీ తరఫున వకాల్తా పుచ్చుకున్న షర్మిల వాటిపై సీఎం జగన్‌ను ప్రశ్నించడం విచిత్రం. కాంగ్రెస్ తరఫున ప్రత్యేక హోదా, రాజధానికి నిధులపై షర్మిల వివరణ ఇవ్వాలి. ప్రత్యేక హోదాపై సీఎం జగన్ ఒకే మాటకు కట్టుబడ్డారు. పోరాటం ఏ పద్ధతుల్లో చేయాలో అలా కొనసాగించడంతోపాటు కేంద్రంపై ఒత్తిడి పెంచి మనపై ఆధారపడే పరిస్థితి వచ్చే వరకూ ఆ అంశాన్ని సజీవంగా ఉంచుతున్నాం. ఎప్పటికప్పుడు హోదా అంశాన్ని ప్రస్తావిస్తూ సరైనా అవకాశం రాగానే సాధించుకునే దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం. అందులో భాగంగా ప్రధాని సమక్షంలోనే విశాఖ సభలో సీఎం జగన్ హోదా అంశాన్ని గుర్తు చేశారు. ఆదిలోనే ఇదే అంశాన్ని ఢిల్లీలో విలేకరుల సమావేశంలోనూ సీఎం జగన్ స్పష్టం చేశారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ ద్రోహం..

ఏకపక్ష విభజనతో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన కాంగ్రెస్ మహానేత వైఎస్ కుటుంబానికి తీరని ద్రోహం చేసింది. 2004, 2009లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి వైఎస్ చేసిన కృషే ప్రధాన కారణమని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పలు సందర్భాల్లో చెప్పారు. వైఎస్ మరణానంతరం అక్రమ కేసులు బనాయించి ఆయన పేరును నేరుగా ఎఫ్ఐఆర్‌లో పెట్టిన పార్టీ కాంగ్రెస్. వైఎస్సార్ తనయుడు జగన్‌ను అక్రమంగా 16 నెలలు జైల్లో నిర్బంధించిన పార్టీ కాంగ్రెస్. శంకర్రావు, ఎర్రన్నాయుడు, అశోక్ గజపతిరాజు కలిసి ఆ కేసులు వేశారు. సోనియాగాంధీ చెబితేనే కేసులు పెట్టామని శంకర్రావు పలు మార్లు మీడియాకు చెప్పారు. సోనియా చెప్పినట్టుగా జగన్ విని ఉంటే కేసులు పెట్టేవాళ్లం కాదని అప్పట్లో కాంగ్రెస్‌లో కీలక భూమిక పోషించిన కేంద్ర మాజీ మంత్రి గులాంనబీ ఆజాద్ కూడా చెప్పారు. అంటే అవన్నీ అక్రమ కేసులేనని తెలిసిపోతోంది.

శ్రీరామ రామ రామేతి!

అయోధ్యలో నేడు కొలువుదీరనున్న బాలరాముడు



ఆదివారం పుష్పాలంకరణతో మెరిసిపోతున్న అయోధ్య రామాలయం

వేదమంత్రాల నడుమ రామ్‌లల్లాకు ప్రాణప్రతిష్ఠ

- మధ్యాహ్నం అభిజిత్ ముహూర్తంలో కార్యక్రమం
- ఉత్సవానికి ప్రధాన యజమానిగా ప్రధాని నరేంద్ర మోదీ
- ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రముఖులకు బాలరాముని దర్శనం

శుభ ఘడియలు సమీపించాయి. అయోధ్య రామయ్య ప్రాణప్రతిష్ఠ వైభవోజ్వల చరిత్రాత్మక ఘట్టానికి సమయం ఆసన్నమైంది. ఐదు శతాబ్దాల వనవాసం వీడి, భవ్య మందిరానికి చేరుకున్న రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం మరికొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. ఈ కమనీయ వేడుకను కనులారా తిలకించడానికి ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. దేశ విదేశాల్లో రామనామ స్మరణతో భక్తులు ఆనంద డోలికల్లో ఊగిపోతున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా 7 వేల మందికిపైగా అతిథులు, ప్రముఖులు హాజరుకాబోతున్నారు. 150 మందికిపైగా ప్రముఖులు ఇప్పటికే అయోధ్యలో అడుగుపెట్టారు. సామాన్య భక్తజనం అయోధ్య బాటపట్టారు. కాషాయ పతాకాల రెపరెపలు, రాముడి గీతాలు, భజనలు, స్తోత్రాలు, జైశ్రీరామ్ నినాదాలతో, అందంగా తీర్చిదిద్దిన ప్రధాన భవ్య మందిరంతోపాటు ఇతర ఆలయాలతో అయోధ్య అంతటా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. నగరం ఇప్పటికే జనసంద్రంగా మారింది. భక్తుల పూజలు, వేదమంత్రాల ఘోషతో సరయూ నదీ తీరం కనువిందు చేస్తోంది. నగరంలోని చరిత్రాత్మక కట్టడాలను సైతం సుందరంగా అలంకరించారు. దేశమంతా అయోధ్య నామస్మరణతో సర్వం రామమయంగా మారిపోయింది. – సాక్షి, న్యూఢిల్లీ

అద్భుత వాయిద్యాలతో మంగళ ధ్వని

ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి సోమవారం ఉదయం 10 గంటలకు 'మంగళ ధ్వని'తో శ్రీకారం చుడతారు. ఇందుకు దాదాపు 20 రాష్ట్రాల నుంచి 50కి పైగా అద్భుతమైన వాయిద్యాలను తీసుకొచ్చారు. అయోధ్యకు చెందిన యతీంద్ర మిశ్రా సారథ్యంలో నిర్వహించే ఈ సంగీత ప్రదర్శనకు ఢిల్లీకి చెందిన సంగీత నాటక అకాడమీ సహకారం అందించనుంది.

టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం

రామమందిర ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం ఏడింటి నుంచే ప్రసారాలు మొదలవుతాయి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రధాన వేడుక జరుగుతుంది. వీటిని డీడీ న్యూస్, డీడీ జాతీయ చానళ్లతోపాటు ప్రైవేట్ చానళ్లలోనూ తిలకించవచ్చు.

84 సెకన్ల శుభ ముహూర్తం

గర్భగుడిలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠకు శుభ ముహూర్తం నిర్ణయించారు. సోమవారం మధ్యాహ్నం సరిగ్గా 12.20 గంటలకు వేడుక ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 12:29:08 గంటల నుంచి 12:30:32 గంటల వరకు మొత్తం 84 సెకన్లలో ప్రాణప్రతిష్ఠ పూర్తవుతుంది. గణేశ్వర్ శాస్త్రి ద్రవిడ్ నేతృత్వంలో కాశీకి చెందిన లక్ష్మీకాంత్ దీక్షిత్ ప్రధాన ఆచార్యులుగా 121 మంది రుత్విక్కులు వేడుక నిర్వహిస్తారు. ప్రాణ ప్రతిష్ఠలో శైవ, వైష్ణవ, శాక్త, గాణాపత్య, సిక్కు, బౌద్ధ, జైన, దశనామీ శంకర్, రామానంద, రామానుజ, నింబార్క, మధ్వ, విష్ణు నామి, వాల్మీకి, వీర శైవ మొదలైన సంప్రదాయాలు భాగం కానున్నాయి. 150 మందికిపైగా సంప్రదాయాల సాధువులు, మహామండలేశ్వర్, మహంత్, నాగాలతో సహా 50 మందికి పైగా గిరిజన, గిరివాస, ద్వీపవాస సంప్రదాయాల ప్రముఖులు పాల్గొంటారు. ఇలా పర్వతాలు, అడవులు, తీర, ద్వీప వంటి అన్ని ప్రాంతాలకు వారు ఒకే కార్యక్రమంలో పాల్గొంటుండడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి అని శ్రీరామజన్మ భూమి తీర్థక్షేత్ర ట్రస్టు తెలియజేసింది.

నగర వీధుల్లో తోరణాలు కాషాయ జెండాలు

అయోధ్య వీధులు కాషాయ రంగు పులుముకున్నాయి. నగరంలో అన్ని వీధులను కాషాయ జెండా, తోరణాలతోపాటు విద్యుత్ దీపాలు, పూలమాలలతో అలంకరించారు. నివాస భవనాలు, వ్యాపార సంస్థలు, హోటళ్లు, దుకాణాలపైనా పెద్ద సంఖ్యలో జెండాలు దర్శనమిస్తున్నాయి. దుకాణాల్లో వీటి అమ్మకాలు విరివిగా సాగుతున్నాయి. శ్రీరాముడు, హనుమంతుడు, నూతన రామాలయ చిత్రాలు, జైశ్రీరామ్ నినాదంతో కూడిన ఈ జెండాలు, తోరణాలు చూపరులకు ఆధ్యాత్మిక భావనలు పంచుతున్నాయి. కొన్ని స్వచ్ఛంద సంస్థలతోపాటు దాతలు శ్రీరాముడి జెండాలను ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. అయోధ్యలోని రామ్‌పథ్, ధర్మపథ్‌ను జెండాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



అయోధ్యలో రామచరిత మానస్, రామాయణం పుస్తకాల అమ్మకాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. వీధుల్లో శ్రీరాముడి పాటలు మార్మోగుతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా రామయ్య పండుగ

శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ వేడుక కేవలం అయోధ్యకే పరిమితం కాదు. ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఈ ఉత్సవంలో పాలుపంచుకోబోతున్నారు. సోమవారం ర్యాలీలు, ప్రదర్శనలు, పాదయాత్రలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. అమెరికాలో దాదాపు 300 ప్రాంతాల్లో ప్రాణప్రతిష్ఠను ప్రత్యక్ష ప్రసారం చేయబోతున్నారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని ప్రఖ్యాత ఈఫిల్ టవర్ వద్ద కూడా స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నారు. పారిస్‌లో హిందూ సమాజం ఆధ్వర్యంలో భారీ రథయాత్ర నిర్వహించనున్నారు. అలాగే విశ్వ కల్యాణ యజ్ఞం నిర్వహిస్తారు. ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, మారిషస్ సహా 60కిపైగా దేశాల్లో వేడుకలు జరుగుతాయి. ఆయా దేశాల్లోని హిందూ ఆలయాల్లో సాయంత్రం దీపాలు వెలిగించగబోతున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇప్పటికే విద్యుత్ దీపాలు, పూలతో ఆలయాలను అందంగా అలకరించారు. అలాగే రామాయణ పారాయణం కోసం ఏర్పాట్లు చేశారు.

నేటితో ముగియనున్న ప్రత్యేక క్రతువులు

ప్రత్యేక క్రతువుల్లో భాగంగా ఆదివారం ఔషధ జలంతో పాటు దేశవ్యాప్తంగా పుణ్యక్షేత్రాల తెచ్చిన పవిత్ర జలాలతో రామ్‌లల్లాను శుద్ధి చేశారు. రాత్రి జాగరణ అధివాస్ జరిపారు. 16న మొదలైన క్రతువులు సోమవారం ముగుస్తాయి.

మూడు నిత్య హారతులు

ప్రాణప్రతిష్ఠ అనంతరం భక్తులకు రామ్‌లల్లా దర్శనం కల్పించడానికి ఆలయాన్ని ఉదయం 7 గంటల నుండి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు తెరిచి ఉంచనున్నారు. నిత్యం మూడుసార్లు ప్రత్యేక హారతి నిర్వహిస్తారు. ఉదయం 6.30 గంటలకు జాగరణ్ హారతి, మధ్యాహ్నం 12.00 గంటలకు భోగ్ హారతి, రాత్రి 7.30 గంటలకు సంధ్యా హారతి ఇవ్వనున్నారు.



ఆదివారం రాత్రి సరయూ నదీ తీరాన హారతి ఇస్తున్న పూజారులు

10 లక్షల ప్రమిదల కాంతులు

అయోధ్య నగరం సోమవారం సాయంత్రం దేదీప్యమానంగా వెలిగిపోనుంది. రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని 10 లక్షలు ప్రమిదలను ఏకకాలంలో వెలిగించబోతున్నారు. నగరంలోని 100 ఆలయాలు, ప్రధాన ప్రాంతాల్లో ఈ దీపాలు వెలుగులు పంచబోతున్నాయి. ఈ దృశ్యాలు కనులకు పండుగే అనడంలో సందేహం లేదు. భవ్య రామమందిరంతోపాటు రామ్ కీ పైడీ, కనక్ భవన్, గుప్తార్ ఘాట్, సరయూ ఘాట్, లతా మంగేష్కర్ చౌక్, మణిరామ్ దాస్ చౌనీ తదితర ప్రాంతాల్లో ప్రమిదలు వెలిగిస్తారు. అంతేకాకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు అయోధ్య వాసులు తమ ఇళ్లల్లోనూ దీపాలు వెలిగించబోతున్నారు. దాంతో అయోధ్యాపురం కాంతిమయం కాబోతోంది.



అద్భుతంగా రామాలయం లోపలి భాగం

గర్భాలయంలో ఇలా...

- ఉదయం 10 గంటలు: మంగళ ధ్వని
- మధ్యాహ్నం 12.05 నుంచి 12.55: ప్రాణప్రతిష్ఠ జరుగుతుంది. రామ్‌లల్లా నేత్రాలు తెరిచిన తర్వాత ప్రధాని మోదీ కాటుక దిద్దుతారు. బాలరాముడికి అద్దంలో ప్రతిబింబం చూపిస్తారు.
- మధ్యాహ్నం 12.55: ప్రధాన ఆలయంపై హెలికాప్టర్‌తో పూల వర్షం కురిపిస్తారు.

గర్భగుడిలోకి ఆ ఐదుగురు

గర్భగుడిలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో తీర్థ క్షేత్ర ట్రస్టు మహంత్ నృత్యగోపాల్ దాస్ మహరాజ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్, ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాల్గొంటారు. వేడుక పూర్తయిన తర్వాత అతిథులకు రామ్‌లల్లా దర్శనం కల్పిస్తారు.

మోదీ పర్యటన ఇలా..

- ఉదయం 10.25: అయోధ్య విమానాశ్రయం నుంచి ఆలయానికి
- మధ్యాహ్నం 12: గర్భగృహం ఎదుట అతిథులకు పలకరింపు
- మధ్యాహ్నం 1 నుంచి 2 గంటలు: బహిరంగ సభలో మోదీ ప్రసంగం. ఆరెస్సెస్ చీఫ్ భాగవత్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తదితరులు కూడా ప్రసంగిస్తారు.
- మధ్యాహ్నం 2 గంటలు: శివ మందిరం, కుబేర తిల సందర్శన
- మధ్యాహ్నం 3.30: మోదీ ఢిల్లీకి పయనమవుతారు.



ఆలయ ప్రాంగణంలో సీఎం యోగి సెల్ఫీ

రామాలయ ఉపగ్రహ చిత్రాలు విడుదల

అయోధ్యలో నూతన రామాలయ ఉపగ్రహ చిత్రాలను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆదివారం విడుదల చేసింది. ఇండియన్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ శాటిలైట్ అంతరిక్షం నుంచి గత ఏడాది డిసెంబర్ 16న ఈ దృశ్యాన్ని చిత్రీకరించింది. ప్రధాన ఆలయంతోపాటు దశరథ మహల్, అయోధ్య రైల్వే స్టేషన్, సరయూ నది వంటివి ఈ చిత్రాల్లో చక్కగా కనిపిస్తున్నాయి.



ఈనెల 16న తీసిన అయోధ్య రామాలయం ఉపగ్రహ ఛాయాచిత్రం (సర్కిల్లో)

అయోధ్యలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు

అయోధ్య: బాలరాముని ప్రాణప్రతిష్ఠ మహోత్సవం కోసం అయోధ్యకు ప్రపంచం నలుమూలల నుంచి ప్రముఖులు, భక్తులు విచ్చేస్తున్నారు. రాజకీయ నాయకులు, క్రీడాకారులు, సినిమా రంగం, వ్యాపార రంగానికి చెందిన ప్రముఖులకు ఆహ్వానం పంపించారు. ఈ నేపథ్యంలో నగరమంతటా పటిష్టమైన పోలీసు పహారా ఏర్పాటు చేశారు. ప్రాణప్రతిష్ఠ వేదిక వద్ద, మందిరం చుట్టూ, మందిరానికి వంద మీటర్ల దూరంలో నలువైపులా పోలీసు అధికారులు, సిబ్బంది మఫ్టీలో మోహరించారు. ఆలయం చుట్టూ కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత సీసీ కెమెరాలు బిగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అయోధ్యకు వచ్చే అన్ని ప్రధాన రహదారులను గ్రీన్ కారిడర్‌లుగా మార్చారు. రామమందిర ప్రాణ ప్రతిష్ఠ కోసం విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేశామని ఉత్తరప్రదేశ్ లా అండ్ ఆర్డర్ స్పెషల్ డీజీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. కార్యక్రమం జరిగే ప్రదేశంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని వెల్లడించారు. ఫైజాబాద్ జిల్లావ్యాప్తంగా దాదాపు 10 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా యాంటీ డ్రోన్ టెక్నాలజీని సైతం వినియోగిస్తున్నామని చెప్పారు.

ఆ 3 రాష్ట్రాలకు ప్రధాని శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: రాష్ట్ర అవతరణ దినోత్సవాలను పురస్కరించుకుని ఈశాన్య రాష్ట్రాలైన మణిపూర్, త్రిపుర, మేఘాలయా రాష్ట్రాల ప్రజలకు ఆదివారం ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మూడు రాష్ట్రాల రాష్ట్ర అవతరణ దినోత్సవం ఒకే రోజు (జనవరి 21) ఉండటం విశేషం. ''రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మణిపూర్, త్రిపుర, మేఘాలయ ప్రజలకు నా శుభాకాంక్షలు. దేశాభివృద్ధికి రాష్ట్రం బలమైన సహకారాన్ని అందించింది. ఈ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు మనందరికీ గర్వకారణం. మణిపూర్ నిరంతర అభివృద్ధి చెందాలని ప్రార్థిస్తున్నా'' అంటూ మరో ట్వీట్ చేశారు.

ఉక్రెయిన్‌లో దాడులు.. 25 మంది దుర్మరణం

కీవ్: రష్యా ఆక్రమిత ఉక్రెయిన్ భూభాగంలో ఆదివారం ఒక మార్కెట్‌పై జరిగిన దాడిలో 25 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉక్రెయిన్ సేనలే ఈ దాడులకు తెగబడినట్లు రష్యా ఆరోపిస్తోంది. దీనిపై ఉక్రెయిన్ ఇంకా స్పందించలేదు. డోనెట్స్క్ నగరం సమీపంలోని టెక్‌స్టిల్‌చిక్ ప్రాంత మార్కెట్‌పై జరిగిన ఈ దాడిలో 20 మందికిపైగా గాయపడ్డారు. మరోవైపు ఆదివారమే రష్యాలోని కింగ్‌సెప్ జిల్లాలోని ఉస్ట్–లూగా పోర్ట్ రసాయన రవాణా టెర్మినల్ వద్ద రెండు భారీ పేలుళ్లు, తర్వాత భారీ అగ్నిప్రమాదం జరిగిన నేపథ్యంలో ఈ సంఘటనలను రష్యా, ఉక్రెయిన్‌ల పరస్పర దాడులుగా అంతర్జాతీయ మీడియా అభివర్ణిస్తోంది. నాలుగు ఉక్రెయిన్ డ్రోన్లు దాడి చేయడం వల్లే రసాయన రవాణా టెర్మినల్ వద్ద గ్యాస్ ట్యాంక్ పేలిందని రష్యా స్థానిక మీడియా ఆరోపిస్తోంది.

అఫ్గాన్‌లో కూలింది భారత విమానం కాదు

న్యూఢిల్లీ: థాయ్‌లాండ్ నుంచి మాస్కోకు వెళ్తూ అఫ్గానిస్తాన్‌లో కూలిన విమానం భారత్‌కు చెందినది కాదని కేంద్రం పేర్కొంది. ఆ విమానం గయ విమానాశ్రయంలో ఇంధనం మాత్రమే నింపుకుందని వివరించింది. 1978లో తయారై, మొరాకోలో రిజిస్టరయిన దసో ఫాల్కన్ విమానం ప్రైవేట్ ఎయిర్ అంబులెన్సుగా పని చేస్తోందని, అది ఆరుగురితో థాయ్‌ల్యాండ్‌లోని ఉటపావో ఎయిర్‌పోర్టులో బయలుదేరి మాస్కోకు వెళ్తున్నట్లు కేంద్ర పౌరవిమాన యాన శాఖ తెలిపింది. శనివారం సాయంత్రం ఉజ్బెకిస్తాన్ రాజధాని తాష్కెంట్ మీదుగా మాస్కో వెళుతూ అఫ్గానిస్తాన్‌లో ప్రమాదానికి గురైందని తెలిపింది. ఇంజిన్ లోపమే ఇందుకు కారణమని, పైలట్ సహా నలుగురు సజీవంగా ఉన్నట్లు సమాచారం ఉందని తాలిబన్ ప్రభుత్వం తెలిపింది.

భారత్‌లోనే పెళ్లాడండి: మోదీ

అహ్మదాబాద్: సంపన్న కుటుంబాలు విదేశాల్లో పెళ్లాడుతున్న ఉదంతాలను ఉటంకిస్తూ భారత్‌లోనే పెళ్లాడండి (వెడ్ ఇన్ ఇండియా) అని ప్రధాని మోదీ మరోమారు పిలుపునిచ్చారు. గుజరాత్‌లోని అమ్రేలీ సిటీలో నిర్మించనున్న ఖోదల్‌ధామ్ ట్రస్ట్ క్యాన్సర్ హాస్పిటల్ శంకుస్థాపన కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్నాక ఆ హాస్పిటల్‌ను నిర్వహించే ట్రస్ట్‌కు చెందిన లేవా పటిదార్ సభ్యులనుద్దేశించి మోదీ ప్రసంగించారు. '' భారతీయులు విదేశాల్లో పెళ్లి చేసుకోవడం సబబేనా?. సొంత దేశంలో వివాహ కార్యక్రమాలు చేసుకోలేమా? విదేశాల్లో కోట్లు ఖర్చు పెట్టి ఆడంబరంగా చేసే పెళ్లితో కోట్లాది రూపాయల భారతీయ సంపద విదేశాలకు తరలిపోతోంది'' అని మోదీ వ్యాఖ్యానించారు. '' ఇక్కడి నుంచి విదేశాలకు పెళ్లి కోసమే ప్రత్యేకంగా వెళ్లి వచ్చే పెడధోరణి రోగం మీ పటిదార్ వర్గానికి అంటకుండా జాగ్రత్తపడండి. ఇక్కడి దేవత 'మా ఖోదల్' అమ్మవారి ఆశీస్సులతో ఇక్కడే పెళ్లి చేసుకోవచ్చుకదా. 'మేడ్ ఇన్ ఇండియా' తరహాలో 'వెడ్ ఇన్ ఇండియా'ను పాటిద్దాం'' అని కోరారు. '' పర్యాటనకు వెళ్లాలనుకుంటే ముందుగా స్వదేశంలోనే పర్యటించండి. దేశవ్యాప్తంగా సుందర, రమణీయ, దర్శనీయ స్థలాలను పర్యటించండి. పర్యాటక రంగాన్నీ ప్రోత్సహించండి'' అని అన్నారు.

దక్షిణాది ఆధ్యాత్మిక పర్యటన పూర్తి
ధనుష్కోటి కోదండరామాలయ సందర్శన

రామేశ్వరం(తమిళనాడు): గత మూడు రోజులుగా తమిళనాడులో పర్యటిస్తున్న ప్రధాని మోదీ ఆదివారం అక్కడి శ్రీ కోదండరామస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. శ్రీలంకకు కూతవేటు దూరంలో ఉండే ధనుష్కోటి, అరిచల్ మునాయ్‌ల సమీపంలోనే ఈ ఆలయం ఉంది. ఆలయంలో ప్రధాని ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత సమీపంలోని అరిచల్ మునాయ్‌కు వెళ్లి అక్కడి జాతీయ చిహ్నం ఉన్న స్తంభం వద్ద నమస్కరించారు. అక్కడి సముద్రతీరంలో మోదీ కొద్దిసేపు ప్రాణాయామం చేశారు. సముద్ర జలాన్ని చేతులోకి తీసుకుని ప్రార్థనలు చేశారు. రామసేతుకు ప్రారంభ స్థానంగా పేర్కొనే అరిచల్‌మునాయ్ ప్రాంతం వద్దే మోదీ కొద్దిసేపు గడిపారు. బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంలోని గల్ఫ్ ఆఫ్ మన్నార్ సముద్రజలాలు కలిసే చోటునే తమిళంలో అరిచల్ మునాయ్ అంటారు. ఇక్కడి రామసేతుకు ఆడమ్స్ బ్రిడ్జ్ అని మరో పేరు కూడా ఉంది. అయోధ్యలో భవ్య రామాలయం ప్రాణప్రతిష్ఠ కోసం కఠిన దీక్ష చేస్తున్న ప్రధాని గత కొద్దిరోజులుగా రామాయణంతో ముడిపడి ఉన్న ఆలయాలు, ఆధ్యాత్మిక ప్రాంతాలను దర్శిస్తున్న విషయం తెల్సిందే. ఆదివారంతో దక్షిణ భారత పర్యటనను పూర్తిచేశారు. అరిచల్‌మునాయ్ నుంచి తమిళనాడుకు చెందిన పవిత్ర నదీజలాలతో నిండిన కలశాలను వెంట తీసుకుని మోదీ ఢిల్లీ చేరుకున్నారు.



ఆదివారం ధనుష్కోటిలో రామసేతు వద్ద సముద్రతీరంలో ధ్యానముద్రలో ప్రధాని మోదీ

మేం 4 రోజుల్లో ఆపేవాళ్లం
మణిపూర్ హింసాకాండపై రాహుల్



కలియబోర్: ప్రధానమంత్రి పదవిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నేత ఉండి ఉంటే మణిపూర్‌లో హింసకు నాలుగు రోజుల్లోనే పుల్‌స్టాప్ పడి ఉండేదని ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఆదివారం అస్సాంలోని నగావ్ జిల్లాలో జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ తలుచుకుంటే మణిపూర్ హింసను సైన్యం సాయంతో మూడు రోజుల్లో ఆపగలిగేవారని అన్నారు. కానీ, అలా చేయడం బీజేపీకి ఇష్టం లేదని రాహుల్ వ్యాఖ్యానించారు. 'మణిపూర్ నాలుగు నెలలుగా మండుతున్నా, మన ప్రధాని ఇప్పటివరకు అక్కడికి వెళ్లలేదు. అదే కాంగ్రెస్ ప్రధానే ఉంటే మూడు రోజుల్లోనే అక్కడికి వెళ్లి ఉండేవారు. నాలుగో రోజుకల్లా అక్కడ హింస ఆగిపోయి ఉండేది'అని ఆయన చెప్పారు. 'నేతలు వస్తుంటారు, పోతుంటారు. కానీ, మనసు నిండా విద్వేషాన్ని, అహంకారాన్ని నింపుకున్న వారు త్వరలోనే కనుమరుగవుతారు'అని రాహుల్ పేర్కొన్నారు.

జై శ్రీ రాం, మోదీ నినాదాలు, రాహుల్ ఫ్లయింగ్ కిస్‌లు...

నగావ్ జిల్లాలో న్యాయ్ యాత్ర సందర్భంగా రాహుల్‌కు నిరసన సెగ తగిలింది. ఒక చోట బీజేపీ కార్యకర్తలు జై శ్రీ రాం, మోదీ, మోదీ.. అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. రాహుల్ గాంధీ ఫ్లయింగ్ కిస్‌లు విసురుతూ వారిని కలుసుకునేందుకు వెళ్లారు. సంబంధిత వీడియోను 'ఎక్స్'లో షేర్ చేశారు. తర్వాత ర్యాలీలో మాట్లాడుతూ.. 'సుమారు 3 కిలోమీటర్ల దూరంలో 20 నుంచి 25 మంది వరకు బీజేపీ కార్యకర్తలు కర్రలు పట్టుకుని మా బస్సు ముందుకు వచ్చారు. నేను బస్సు దిగి వచ్చే సరికి వారంతా పారిపోయారు. ప్రధాని మోదీ, సీఎం హిమంత బిశ్వశర్మ ఎవరొచ్చినా మేం భయపడేది లేదు'అని రాహుల్ తెలిపారు.

'భరతవర్ష' పునర్నిర్మాణానికి నాంది
రామాలయ ప్రారంభంపై ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ భాగవత్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: అయోధ్యలోని జన్మస్థలానికి శ్రీరాముడి ప్రవేశం, ఆలయ ప్రాణప్రతిష్ఠ ఉత్సవం 'భరతవర్ష'పునర్నిర్మాణానికి నాంది అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. 'భరతవర్ష'లో సమాజంలోని ప్రతి ఒక్కరి సంక్షేమం, శాంతి, అభివృద్ధి, ఐక్యత, సామరస్య సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ వెబ్‌సైట్‌లో ఆదివారం ఆయన రాసిన వ్యాసం పోస్ట్ అయ్యింది. అయోధ్యలో రామాలయ నిర్మాణం కోసం హిందూ సమాజం పోరాటం, సంక్షోభాలు ఇక ముగిసి పోవాలని ఆయన ఆకాంక్షించారు. అయోధ్య పునర్నిర్మాణం ఇక మనందరి బాధ్యతని పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యధికులు పూజించే దైవం శ్రీరాముడేనని ఆయన తెలిపారు. మందిర నిర్మాణం 'జాతి గౌరవానికి పునరుజ్జీవనం'గా ఆయన అభివర్ణించారు. ''రామజన్మభూమిలో రామ్ లల్లా ప్రవేశం, ప్రాణప్రతిష్ఠ భరతవర్ష పునర్నిర్మాణానికి నాంది. ఇది అందరి శ్రేయస్సు కోసం, భేదభావం లేకుండా అందరినీ అంగీకరించడం, సామరస్యం, ఐక్యత, పురోగతి, శాంతి మార్గాన్ని చూపుతుంది. యావత్ ప్రపంచ పునర్నిర్మాణానికి బాటలు వేస్తుంది'' అని భాగవత్ అన్నారు.

25,000 దాటిన గాజా మృతులు

రఫా(గాజా స్ట్రిప్): తమతమ మతసంబంధ పవిత్ర ప్రాంతాలపై పట్టు కోసం ఘర్షణలతో మొదలై మెరుపు దాడులతో తీవ్రతరమై మహోగ్రరూపం దాల్చిన హమాస్– ఇజ్రాయెల్ పోరు పాతికవేల ప్రాణాలను పొట్టనబెట్టుకుంది. మరోవైపు వంద మందికిపైగా బందీలను విడిపించుకున్నాసరే అందర్నీ విడిపిస్తామని, హమాస్ సభ్యులందర్నీ హతమారుస్తామని ఇజ్రాయెల్ సేనల ప్రతినబూనడం చూస్తుంటే యుద్ధ బాధితులు, మరణాల సంఖ్య ఇక్కడితో ఆగేలా లేదు. యుద్ధం ఇంకొన్ని నెలలపాటు కొనసాగుతుందని ఇజ్రాయెల్ సైన్యాధికారులు తాజాగా ప్రకటించారు. ఇన్ని నెలలు గడుస్తున్నా ఇంకా బందీలను విడిపించలేకపోవడంతో ఇజ్రాయెల్ ప్రభుత్వంపై స్థానికంగా పెద్ద ఎత్తున విమర్శలు, నిరసనలు ప్రదర్శలు పెరిగాయి.

నేడు సగం రోజు సెలవుపై వెనక్కి తగ్గిన ఢిల్లీ ఎయిమ్స్

న్యూఢిల్లీ: అయోధ్యలో రామాలయం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం అవుట్ పేషెంట్ విభాగాన్ని మధ్యాహ్నం 2.30 గంటల వరకు మూసి ఉంచాలంటూ శనివారం జారీ చేసిన మెమోరాండంను ఢిల్లీ ఎయిమ్స్ వెనక్కి తీసుకుంది. అవుట్ పేషెంట్ సేవలు(ఓపీడీ)సహా అన్ని విభాగాలు యథావిధిగా తెరిచి ఉంచాలంటూ ఆదివారం తాజాగా మెమోరాండం జారీ చేసింది. అన్ని కేంద్రాల, విభాగాల అధిపతులు, యూనిట్లు, బ్రాంచ్ ఆఫీసర్లు తమ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు ఈ సమాచారం అందజేయాలని కోరింది. రోగులకు అసౌకర్యం కలగరాదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఓపీడీ సహా అన్ని సేవలు సోమవారం రోజంతా యథావిధిగా కొనసాగుతాయని లేడీ హార్డింజ్ మెడికల్ కాలేజీ కూడా తెలిపింది.

జేఎన్.1 కేసులు 1,513

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్–19 సబ్ వేరియంట్ జేఎన్.1 కేసుల సంఖ్య 1,513కు చేరుకున్నట్లు కేంద్ర ప్రభుత్వ విభాగం ఇన్సాకాగ్ పేర్కొంది. ఈ వేరియంట్ కేసులు అత్యధికంగా మహారాష్ట్రలో 382, కర్ణాటకలో 249 నమోదైనట్లు ఆదివారం తెలిపింది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్‌లో 189, కేరళలో 156, గుజరాత్‌లో 126, బెంగాల్‌లో 96, గోవాలో 90, తమిళనాడులో 89 జేఎన్.1 వేరియంట్ కేసులు బయటపడ్డాయని ఇన్సాకాగ్ వివరించింది. కేసుల సంఖ్యలో పెరుగుదల నమోదవుతున్నప్పటికీ, ఈ వేరియంట్ అంత ప్రమాదకారి కాదని స్పష్టం చేసింది.

ట్రంప్ మానసిక స్థితిపై అనుమానాలు: నిక్కీ హేలీ

కొలంబియా: అమెరికా మాజీ అధ్యక్షుడు, మళ్లీ అధ్యక్ష రేసులో ఉన్న డొనాల్డ్ ట్రంప్ మానసిక ఆరోగ్యంపై భారత సంతతికి చెందిన రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి నిక్కీ హేలీ అనుమానం వ్యక్తం చేశారు. అమెరికా హౌస్ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ పేరుకు బదులుగా తన పేరును ప్రస్తావించడంపై ఆమె ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆమె న్యూహ్యాంప్‌షైర్‌లోని కీనీలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మాట్లాడారు. 2021 జనవరి 6వ తేదీన క్యాపిటల్ హిల్ సెక్యూరిటీ ఇన్‌చార్జిగా అప్పటి అమెరికా హౌస్ స్పీకర్ నాన్సీ పెలోసీ పేరుకు బదులుగా హేలీ పేరును ట్రంప్ పేర్కొనడంపై ఆమె స్పందించారు. మానసికంగా సరిగా లేని ట్రంప్ అధ్యక్ష పదవిలో ఒత్తిళ్లను ఎదుర్కొనగలరా అనేది అనుమానమేనని పేర్కొన్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం : 22 : జనవరి : 2024

రామనామాలతో రఘురాముడి రూపం

రాయచూరు రూరల్: అయోధ్యలో శ్రీరాముని విగ్రహం ప్రతిష్ఠకు ఏర్పాట్లు సాగుతుండగా భక్తులు వివిధ రకాలుగా ఆయనపై భక్తిభావాన్ని చాటుకుంటున్నారు. అనూషా అనే చిన్నారి 21,500 రామ నామాలతో శ్రీరాముడి చిత్రాన్ని రూపొందించింది. రామనామ జపంతో మూడు రోజుల్లో చిత్రాన్ని గీసినట్లు చెప్పింది.


రాముని చిత్రంతో చిన్నారి అనూషా

న్యూస్‌రీల్

రామయ్యకు గీతాంజలి


పాటల ఆల్బంలో అనిత

మైసూరు: అయోధ్య వేడుక సందర్భంగా సాంస్కృతిక నగరం మైసూరులో భక్తిరసం పొంగి పొర్లుతోంది. కెఆర్ నగరకు చెందిన జేడీఎస్ మాజీ ఎమ్మెల్యే సా.రా. మహేష్ భార్య అనిత అయోధ్యపై భక్తిగీతాల ఆల్బంను తానే ఆలపించి రూపొందించారు. ఈ ఆల్బం చిత్రీకరణలో ఆమెతో పాటు పెద్దసంఖ్యలో కళాకారులు పాల్గొన్నారు. కొన్ని గీతాలను మేలుకోటెలో చిత్రీకరించారు. ఆల్బంను యూట్యూబ్‌లో పోస్ట్ చేయగా వేలాది మంది వీక్షించారు. తన భర్త రాముని భక్తుడని, అందుకే రామునిపై పాటలను ఆవిష్కరించానని ఆమె చెప్పారు.

చిరుధాన్యాలే ఆధారం


ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న మహిళలు

హొసపేటె: వాతావరణ మార్పులు రైతులను కలవరపెడుతున్నాయని, దీనిని ఎదుర్కొనే సత్తా ఉన్న చిరుధాన్యాల సాగును చేపట్టాలని నిపుణులు సూచించారు. వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఇక్కడి రోటరీ భవన్‌లో రెండు రోజుల సేంద్రియ, తృణధాన్యాల మేళా ఆదివారం ఆరంభమైంది. డెబ్బైల నాటి హరిత విప్లవం కారణంగా ఛిన్నాభిన్నమైన చిరుధాన్యాలు సాగు మళ్లీ ఇప్పుడే ఊపందుకుందని వ్యవసాయ శాస్త్రవేత్త డా. బద్రీప్రసాద్ అన్నారు. వివిధ చిరుధాన్యాల ఉత్పత్తులను ప్రజలు కొనుగోలు చేశారు.

అంజనాద్రి బెట్టలో కేంద్రమంత్రి పూజలు



గంగావతి: అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని తాలూకాలోని అంజనాద్రి బెట్టపై బాలాంజనేయ స్వామి సన్నిధిలో ఆదివారం కేంద్ర మంత్రి శోభా కారంద్లాజె హోమ పూజలు చేశారు.

నేడు సెలవు ఇవ్వాలి: అశోక్

శివాజీనగర: అయోధ్య రామమందిరంలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో సోమవారం అన్ని ఆఫీసులు, విద్యాలయాలకు సెలవును ప్రకటించాలని బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్, సీఎం సిద్దరామయ్యకు లేఖ రాశారు. ఈ వేడుకను ప్రజలు సంబరంగా ఆచరించేందుకు అవకాశమివ్వాలన్నారు. 500 సంవత్సరాల పోరాటం, త్యాగఫలంగా ఆయోధ్యలో రామ మందిర నిర్మాణమైందని అన్నారు. రాష్ట్రంలో కూడా పెద్దఎత్తున సంబరాలు జరుగుతున్నాయని, కాబట్టి సెలవు ఇవ్వాలన్నారు.

సహకార బ్యాంకుల్లో రైతులకు వడ్డీ మాఫీ

బనశంకరి: సహకార బ్యాంకుల్లో రైతులు తీసుకున్న పంట రుణం అసలు చెల్లిస్తే వడ్డీని పూర్తిగా మాఫీ చేస్తామని సీఎం సిద్దరామయ్య కొద్దిరోజులు క్రితం ప్రకటించారు. ఈ నేపథ్యంలో వడ్డీ మాఫీ ఆదేశాలను సర్కారు జారీచేసింది. రాష్ట్రంలో 223 తాలూకాలను కరువు పీడిత ప్రాంతాలుగా గతంలోనే ప్రకటించింది. దుర్భిక్షం నేపథ్యంలో సహకార బ్యాంకుల రుణగ్రహీతలకు ఈ వెసులుబాటును కల్పించింది.

రామ.. రమణీయ ఘట్టం

- నేడు రాష్ట్రమంతటా అయోధ్య విగ్రహ ప్రతిష్ఠాపన సంరంభం
- ఆలయాల్లో విశేష పూజలు
- ఊరూరా కటౌట్లు, తోరణాలతో సందడి

బనశంకరి: జగదభిరాముని జన్మస్థలమైన అయోధ్యలో నేడు సోమవారం రామ మందిరంలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల సంరంభం కన్నడనాడులో విస్తరించింది. రాజధాని బెంగళూరు సహా నగరాలు, పట్టణాలలో కూడళ్లలో, దేవస్థానాల్లో విశేష వేడుకలకు సర్వం సిద్ధమైంది. అంతటా శ్రీరాముని బృహత్ కటౌట్లు, ఫ్లెక్సీలు, కాషాయ తోరణాల అలంకారం ఆధ్యాత్మిక శోభనిస్తోంది. నగరంలో వీధుల్లో రామ కటౌట్లు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. నగరవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది.

తెల్లవారుజాము నుంచి

సోమవారం ఉదయం 5 గంటల నుంచే శ్రీరామ దేవస్థానాలు, ఆలయాలలో దేవతా మూర్తులకు పంచామృత అభిషేకం, మహామంగళహారతి నిర్వహిస్తారు. పురవీధుల్లో రామ విగ్రహాల ఊరేగింపులు చేపట్టనున్నారు. అయోధ్య వేడుక ప్రత్యక్ష ప్రసారాలను ప్రజలు వీక్షించడానికి ఆలయాలు, కూడళ్లలో పెద్దఎత్తున ఎల్ఇడీ తెరలను అమర్చుతున్నారు. ఇంకా కొన్ని సినిమా థియేటర్లలో ప్రాణ ప్రతిష్ఠ వేడుకను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. భజమండళ్ల ద్వారా భజనలు, ర్యాలీలతో ముమ్మరంగా కార్యక్రమాలు, అన్నదానాలు జరగనున్నాయి. హంపీనగరలో రామభక్తులు ఆదివారం జాతీయ బసవతత్వ పరిషత్ నేత డీటీ అరుణ్ నేతృత్వంలో రామభజన చేసి భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. బెంగళూరు దక్షిణ పరిధిలోని 100 దేవస్థానాల్లో ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. పద్మనాభ నగర కార్మెల్ స్కూల్ మైదానంలో బాలరామోత్సవం పేరుతో సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటలు వరకు సంగీత గాన కచేరీ జరగనుంది.

భద్రత కట్టుదిట్టం

ఈ నేపథ్యంలో అంతటా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. వేడుకల్లో టపాసులు కాల్చడం, బైకు ర్యాలీలు చేయరాదని పోలీసులు సూచించారు. కార్యక్రమాలు పూర్తైన వెంటనే ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగిస్తామని హిందూ సంఘనేతలు తెలిపారు. మంగళూరు, బెళగావి తదితర నగరాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు.

భళా రామలక్ష్మణ

బెంగళూరు విల్సన్‌గార్డెన్‌లో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ వేషధారులు ఆకట్టుకున్నారు. ప్రజలు వారిని ఆసక్తిగా వీక్షిస్తూ ఫోటోలు, సెల్ఫీలు దిగారు.


ఆదివారం బెంగళూరు ఎస్‌బీఎం కూడలిలో శ్రీరాముని విగ్రహానికి బాలల మొక్కులు


దావణగెరెలో ప్రతిష్ఠాపన వేడుకల్లో పంచడానికి లడ్డూలు రెడీ


దావణగెరెలో ఓ ఆలయం ముందు బృహత్ ఫ్లెక్సీ


బెంగళూరు విల్సన్ గార్డెన్‌లో రామలక్ష్మణ వేషధారుల సందడి


బెంగళూరు హంపీనగరలో రామాలయంలో అయోధ్య యాగం

విశ్వగురు ఉంటే ఎలా వెళతాం: బీకే

శివాజీనగర: కాంగ్రెస్ పార్టీలో రెబెల్‌గా మారిన సీనియర్ నేత, ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్ అయోధ్యకు వెళ్లనని, తాము అణ్ణమ్మ, మారెమ్మ వంటి భూత పూజలు చేసేవారమని అన్నారు. ఆయన బెంగళూరులో మాట్లాడుతూ అయోధ్యలో జగద్గురువు లేరు, అక్కడున్నది విశ్వగురు. విశ్వగురు ఎవరనేది అందరికీ తెలుసని పరోక్షంగా ప్రధాని మోదీని విమర్శించారు. అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ శంకరాచార్యులు వంటి జగద్గురువుల చేత జరిగితే వెళ్లేవాడినని, కానీ అక్కడ విశ్వగురు ఉన్నారని ఎద్దేవా చేశారు. ఆ వేడుకకు ఫలానా వారికే ఆహ్వానం పలకటానికి వీరెవరు? రాముడు ఫోన్ చేసి చెప్పాడా పిలవమని అని ధ్వజమెత్తారు. దేశంలో 33 కోట్ల దేవుళ్లున్నారు. ఎక్కడికైనా వెళతాం. మేము మారెమ్మ, అణ్ణమ్మ, భూత పూజ చేసేవారు. భూతం వద్దకు వెళతామని అన్నారు.

ఎన్నికలపై వ్యంగ్యచిత్ర జాగృతి



వాజీనగర: రానున్న లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఎన్నికల సంఘం కార్యక్రమాలను చేపట్టింది. ఆదివారం విధానసౌధ ముందు ఎన్నికల గురించి వ్యంగ్య చిత్రకారుల వర్క్‌షాప్‌ను సీఈఓ మనోజ్‌కుమార్ మీనా ప్రారంభించారు. ఓటర్లలో ఓటింగ్ గురించి జాగృతి కల్పించేలా వ్యంగ్య చిత్రాలను పంపాలని ఈసీ కోరింది. ఆ మేరకు కార్టూనిస్టులు, చిత్రకారులు పాల్గొని చిత్రాలను గీశారు. పలు చిత్రాలను ఎంపిక చేసి ప్రదర్శించారు. అత్యుత్తమ 25 చిత్రాలను ఎన్నికల్లో ఓటర్ల జాగృతికి ఉపయోగిస్తామని అధికారులు తెలిపారు.

సూక్ష్మంలో మోక్షం

- చాక్‌పీస్‌పై జగదభిరాముడు




చాక్‌పీస్‌లో చెక్కిన రాముడు

గౌరిబిదనూరు: అయోధ్య రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సూక్ష్మకళాకారులను ఎక్కడలేని ఉత్సాహాన్ని తెచ్చింది. కళాకారులు పెన్సిల్ ముల్లు, చాక్‌పీస్ ఇత్యాది వస్తువులపై సూక్ష్మంగా రామున్ని చిత్రీకరించారు. గౌరిబిదనూరు తాలూకా ముదుగెరె గ్రామానికి చెందిన ఐటీ ఇంజనీర్ సచిన్ సంఘే సూక్ష్మకళలో ప్రసిద్ధి చెందారు. పదులసంఖ్యలో సూక్ష్మ కళాఖండాలను గతంలో రూపొందించి ప్రధానులచే ప్రశంసలు అందుకున్నారు. ఈ నేపథ్యంలో వేలెడంత చాక్‌పీస్‌పై జగదభిరామున్ని చెక్కారు. ఒక కళాఖండాన్ని చెక్కడానికి కొన్నిరోజులు పట్టిందని సంఘే తెలిపారు. అయోధ్య ఆలయ ట్రస్టుకు కొన్ని ఈ చిత్రాలను పంపినట్లు చెప్పారు.

హోయ్సళ శైలిలో రామ్‌లల్లా

- విల్లు, బాణం ఇంకా చేర్చాలి • శిల్పి సోదరుని వెల్లడి

మైసూరు: అయోధ్యలోని రామ మందిరంలో ఈ నెల 22వ తేదీన బాలరాముడు రామ్‌లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరగనుండగా, ఆ విగ్రహాన్ని మైసూరులోని శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కాడన్న సంగతి మార్మోగుతోంది. విగ్రహం ఫోటోలు అప్పుడే బయటకు రావడంతో విగ్రహం గుణగణాలపై చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో అరుణ్ సోదరుడు సూర్యప్రకాశ్ విగ్రహ విశేషాలను వివరించారు. రాముడు సూర్యవంశానికి చెందినవారు కాబట్టి తల భాగంలో సూర్యుడు ఉన్నాడని, చుట్టూ ఉన్న వృత్తాకారాన్ని మైసూరు శిల్పకళ శైలిలో చెక్కారని తెలిపారు. తోరణంలో దశావతారాలు కూడా ఉన్నాయన్నారు. విగ్రహాలలో హోయ్సళ శైలి ప్రస్ఫుటమవుతుందన్నారు. బేలూరు, హళేబీడు సహా దక్షిణాది జిల్లాల్లోని ప్రఖ్యాత ప్రాచీన ఆలయాలు హొయ్సళ శైలి శిల్పసంపదతో ఉట్టిపడతాయన్నది తెలిసిందే.

పసిబాలుని స్పర్శ

సీతా రామ లక్ష్మణులకు ఉన్న ఆభరణాలు ఎంతో స్పష్టంగా నిజమైనవా అనేలా కనిపిస్తాయని, అదే శిల్పి ప్రత్యేకత అని అన్నారు. రాముని విగ్రహ పాదాలు ఐదేళ్ల బాలుని పాదాల మాదిరిగా ఉంటాయని, ముట్టుకుంటే ఆ సున్నితత్వపు స్పర్శ తెలుస్తుందని చెప్పారు. ప్రాణ ప్రతిష్ఠాపణ రోజున శిల్పి అయిన తన సోదరుడు కఠోర ఉపవాసం ఉంటారన్నారు. విగ్రహం ఇంకా పూర్తి కాలేదని, కుడిచేతిలో మూడు వేళ్ళు అభయహస్తం కలిగి, రెండు వేళ్లతో బాణాన్ని పట్టుకుని ఉంటుందన్నారు. అలాగే ఎడమ చేతిలో నిలువెత్తు విల్లును పట్టుకుని ఉంటారని, ఆ రెండింటిని కూడా అమర్చినప్పుడే విగ్రహం పూర్తి అవుతుందన్నారు.


హొయ్సళ శిల్పశైలి ఉట్టిపడేలా బాల రాముని విగ్రహం

త్రివిధ దాసోహికి ఘన నీరాజనం


తుమకూరు సిద్ధగంగ మఠంలో కలశాలతో ఊరేగింపు


భోజనాలు ఆరగిస్తున్న భక్తులు

- సిద్ధగంగ మఠంలో శివకుమారస్వామి 5వ వర్ధంతి
- హాజరైన సీఎం, మాజీ సీఎంలు

తుమకూరు: లోక కళ్యాణం కోసం తన జీవితాన్ని అంకితం చేసి సిద్ధగంగ మఠం ద్వారా ఆధ్యాత్మిక, విద్య, అన్నదాన సేవల్ని నిర్వర్తించిన శివకుమారస్వామి 5వ వర్ధంతి కార్యక్రమాన్ని మఠంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప, మంత్రులు పరమేశ్వర్, రాజన్న, ఎంబీ. పాటిల్, ఈశ్వర్‌కండ్రె, ఎంపి జి.ఎస్. బసవరాజుతో పాటు అనేకమంది ప్రముఖులు, వివిధ మఠాధిపతులు, వేలాదిగా భక్తజనం తరలివచ్చారు. శివయోగి మందిరంలో శివకుమారస్వామి సమాధి వద్ద తెల్లవారుజాము నుంచే వివిధ పూజలను శిష్యులు, స్వామీజీలు చేపట్టారు. వివిధ పండ్లు, ఫలహారాల నైవేద్యాన్ని సమర్పించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు స్వామీజీకి ఇష్టమైన ఇష్ట లింగ పూజను నిర్వహించారు. మహారుద్రాభిషేకం, బిల్వార్చన గావించారు. మఠం ఆవరణలో 108 కలశాలతో స్వామీజీ చిత్రపటంతో వేలాదిగా ఊరేగింపు నిర్వహించారు. మఠాధ్యక్షుడు సిద్ధలింగ స్వామీజీ పాల్గొన్నారు.

భారత రత్న ఇవ్వాలి: సీఎం

శివకుమార స్వామి శరణుల ఆశయాలను ఆచరించడానికి జీవితాన్ని త్యాగం చేసిన మహాయోగి అని సీఎం సిద్దరామయ్య కొనియాడారు. స్వామీజీ లింగైక్య సభలో ప్రసంగిస్తూ ఆయన మహాశివయోగి అని, స్వామికి భారతరత్న పురస్కారాన్ని ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని చెప్పారు. స్వామీజీ బృహత్ విగ్రహ నిర్మాణం జరుగుతుందని హామీ ఇచ్చారు. మరోవైపు వేలాది మంది భక్తజనం పలు జిల్లాల నుంచి కుటుంబాలతో సహా తరలివచ్చి స్వామీజీ సమాధిని దర్శించుకున్నారు. అందరికీ ప్రసాదాల పంపిణీ, అన్నదానం జరిగింది.


స్వామీజీ బృహత్ విగ్రహం ముందు సీఎం తదితరులు


శివకుమారస్వామి సమాధికి పూజలు

క్లుప్తంగా

వైభవంగా యరగేర ఉరుసు



దర్గాలో పూజలు చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: యరగేర బడేసాబ్ దర్గా ఉరుసు వైభవంగా జరిగింది. శనివారం రాత్రి దర్గా నిర్వాహకులు భక్తి శ్రద్ధలతో విశేష పూజలు చేశారు. ఎంపీ రాజా అమరేశ్వర నాయక్, నిజాముద్దీన్, హఫీజుల్లా తదితరులు పాల్గొన్నారు.

వారు హిందూ వ్యతిరేకులనే భావన కలుగుతోంది



మాట్లాడుతున్న స్వామీజీ

రాయచూరు రూరల్: అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠాపనలో భాగంగా రాష్ట్ర సర్కార్ సెలవు ప్రకటించకపోవడంతో హిందూ వ్యతిరేకులనే భావన అనే రావడం సహజమని రంబాపుర పీఠాధిపతి జగద్గురువు వీర సోమేశ్వర శివాచార్య అన్నారు. ఆదివారం నగరంలో తనను కలిసిన విలేకర్లతో మాట్లాడారు. దేశంలోని పలు రాష్ట్రాలలో సెలవులు ప్రకటించారని అన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ వెంటనే నిర్ణయం తీసుకోవాలన్నారు.

అయోధ్యకు రైళ్లు

హొసపేటె: అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠాపన అనంతరం కర్ణాటక భక్తులు శ్రీరాముని దర్శించుకునేందుకు వీలుగా జనవరి 31 నుంచి నెల రోజుల పాటు ప్రత్యేక రైళ్లను ప్రారంభించాలని నైరుతి రైల్వే జోన్ నిర్ణయించింది. కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ బెంగళూరు, మైసూరు, తుమకూరు, చిత్రదుర్గ, బెల్గాం నుంచి బయలుదేరే అన్ని రైళ్లు హోస్పేట్ మార్గం గుండా ప్రయాణిస్తాయని విజయనగర రైల్వే డెవలప్‌మెంట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వై.యమునేష్, కార్యదర్శి కే.మహేష్ తెలిపారు. సర్ ఎం.విశ్వేశ్వరయ్య బెంగళూరు స్టేషన్ నుంచి జనవరి 31, ఫిబ్రవరి 14, 28 తేదీల్లో అరసీకెరె, రాయదుర్గం మీదుగా మధ్యాహ్నం 3 గంటలకు హోస్పేట్ చేరుకుని 45 గంటల ప్రయాణం తర్వాత అయోధ్యధామ్ చేరుకుంటుంది. మైసూర్– అయోధ్య ఫిబ్రవరి 4,17,18 తేదీల్లో బెంగళూరు, అరసీకెరె, హోస్పేట్ మీదుగా అదే సమయంలో అదే మార్గంలో అయోధ్య ధామ్‌కు చేరుకుంటుంది. తుమకూరు– అయోధ్య రైలు ఫిబ్రవరి 7, 21 తేదీలలో, చిత్రదుర్గ–అయోధ్య ఫిబ్రవరి 11, 21 తేదీలలో హోస్పేట్ మార్గంలో ఒకే సమయంలో నడుస్తుంది. బెల్గాం– అయోధ్య రైలు ఫిబ్రవరి 17న హుబ్లీ మీదుగా సాయంత్రం 4.40 గంటలకు హోస్పేట్‌కు చేరుకుని బళ్లారి, రాయచూరు, మీదుగా అయోధ్య స్టేషన్ చేరుకుంటుంది. కర్ణాటక నుంచి అయోధ్యకు, తిరిగి అయోధ్య నుంచి ఆయా స్టేషన్లకు మొత్తం 11 రైళ్లు నడుస్తాయి.

ఘనంగా విందు వేడుక

బళ్లారిఅర్బన్: బళ్లారి జిల్లా కమ్మ సమాజ బాంధవులు ఐకమత్యంతో విందు కార్యక్రమం ఏర్పాటు చేయడం హర్షణీయమని సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కొళగల్లు రోడ్డులోని ధర్మరెడ్డి కళ్యాణమంటపంలో కమ్మసమాజ బాంధవులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బళ్లారిలోని కోనంకిరామప్ప సర్కిల్ నామకరణం చేసేందుకు కూడా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కంప్లి ఎమ్మెల్యే గణేష్, మేయర్ శ్వేత, ఉపమేయర్ జానకమ్మ, కమ్మ కార్పొరేటర్లు 7 మంది, వెంకటేష్ ప్రసాద్, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, విజయవాడ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

అల్లీపూర్ శ్రీ మహాదేవ తాత రథోత్సవం



అలంకరణలో తాత

బళ్లారి అర్బన్: నగరంలోని హోస్పేట్ రోడ్డు అల్లీపూర్ శ్రీ సద్గురు మహాదేవ తాత రథోత్సవం ఘనంగా జరిగింది. రథోత్సవంలో స్థానిక భక్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రతి అమావాస్యకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లిస్తారు.

సిబ్బంది కొరత.. పాలికె వెత

- మహానగర పాలికెలో ఉద్యోగులు సతమతం
- ఉన్న వారిపై పెరిగిన పని భారం
- అధ్వానంగా నగర పారిశుధ్యం

సాక్షి బళ్లారి: బళ్లారి మహా నగర పాలికెలో సిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది. కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయినా పాలకులు ఆ దిశగా అన్ని సదుపాయాలు కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. 2004లో సిటీ మున్సిపాలిటీ నుంచి మహానగర పాలికెగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి 20 ఏళ్లుగా పాలికెలో సిబ్బందిని భర్తీ చేయకపోవడంతో నగరాభివృద్ధి అస్తవ్యస్తంగా మారింది. ఈ 20 ఏళ్ల వ్యవధిలో 14 మంది మేయర్లు మారినా సిటీ కార్పొరేషన్ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారు. కార్పొరేషన్ పరిధిలో సిబ్బంది కొరత సగానికి సగం ఉన్నట్లు అధికార గణంకాలే చెబుతున్నాయి. నగర జనాభా రోజు రోజుకు పెరుగుతోంది. ఇక వార్డులను 35 నుంచి 39 వరకు పెంచారు. అయితే సిబ్బందిని మాత్రం పెంచడంపై పాలకులు దృష్టి పెట్టడంలేదు.



బళ్లారి పాలికె కార్యాలయం



పూడికతో నిండిన మురుగు కాలువ

అప్‌గ్రేడ్ అయినా ఫలితం శూన్యం

మహా నగరపాలికె పరిధిలో ఏ, బీ, సీ, డీ గ్రూపులకు సంబంధించి దాదాపు 1300 ఖాళీలున్నాయి. ఏ గ్రూప్ పరిధిలో 15, బీ గ్రూప్ పరిధిలో 18, సీ గ్రూప్ పరిధిలో 450, మంది, డీ గ్రూప్ పరిధిలో 850 సిబ్బంది కొరత ఉంది. ఇందులో కాంట్రాక్ట్ పద్ధతిలో 650 మందిని నియమించుకొని పనులను చేయించుకుంటున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం మహానగర పాలికె పరిధిలో 1800 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం 420 మందిని మాత్రమే భర్తీ చేశారు. కొత్తగా వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు సిబ్బంది కొరతను అదిగో, ఇదిగో భర్తీ చేస్తాం అని హామీలు ఇస్తూనే ఉన్నారు. ముఖ్యంగా డీ –గ్రూప్ సిబ్బంది కొరత తీవ్రం కావడంతో వారిపై పని ఒత్తిడితో పాటు పాలికె పరిధిలో స్వచ్ఛత పనులు, నగర సుందరీకరణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. డీ గ్రూప్ కార్మికులపై అధిక భారం మోపుతున్నట్లు నగర ప్రజలు పాలకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు నగరంలో సిబ్బంది కొరతను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఘనంగా తిరుమల దేవుడి స్థిరబింబ ప్రతిష్ఠాపన



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మండ్య : తాలూకాలోని మారగౌడనహళ్లిలో శ్రీ తిరుమల దేవుడి స్థిరబింబం ప్రతిష్ఠాపన మహోత్సవం వేలాది మంది భక్తుల సమక్షంలో ఘనంగా జరిగింది. మహిళలు కలశాలతో నీటిని తీసుకొని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని గంగపూజ నిర్వహించారు. అనంతరం వాస్తు హోమం, లఘు పూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ఠాపణ తదితర ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

రోడ్డు భద్రతపై జాగృతి



విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర దగ్గర బీడిగానహళ్లిలో ఇంజినీరింగ్ కాలేజీలో జాతీయ రోడ్డు సురక్షత జాగృతి నిర్వహించారు. విద్యార్థులు, పోలీసులు సురక్షితా నినాదాల ఫ్లకార్డులు పట్టుకొని పాల్గొన్నారు. వాహనాలను నడిపేటప్పుడు జాగ్రత్తలను పాటించాలని కోరారు.

గంజాయి విక్రేత అరెస్ట్

హుబ్లీ: నగరంలోని మంటూరు రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రెండు కేజీలకు పైగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దాడి విషయం తెలుసుకున్న మరో వ్యక్తి పారిపోయినట్లు బెణ్ణిగేరి సీఐ జయపాల్ పాటిల్ తెలిపారు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.



ఐదు దశాబ్దాలనాటి కార్లను ఆసక్తిగా తిలకిస్తున్న నగరవాసులు



సామూహిక వివాహాలు

గంగావతి: గవిసిద్దేశ్వర మహాస్వామి యాత్ర నిర్వహణలో భాగంగా ఆదివారం 22 మంది దివ్యాంగ వధూవరులకు వివాహాలు జరిపించారు. స్వామీజీ మాట్లాడుతూ... ఏటా విశేష కార్యక్రమాలను చేపట్టేవారమని ఈ ఏడాది దివ్యాంగులకు వివాహాలు జరిపించడం సంతోషంగా ఉందన్నారు. వధూవరులకు దుస్తులు, మంగళసూత్రం, వివాహ సామగ్రి అందించారు. దివ్యాంగ దంపతుల ఉపాధికి జిరాక్స్ మిషన్ అందజేయనున్నారు.



కారు వద్ద యజమానురాలు

వింటేజ్ కార్లు రయ్ రయ్

బనశంకరి: వింటేజ్ కార్లు బెంగళూరులో సందడి చేశాయి. భారత చారిత్రక వాహనాల ఫెడరేషన్(ఎఫ్‌హెచ్‌వీఐ), ఐటీసీ ఐషారామి హోటల్స్ బెంగళూరు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హిస్టారిక్ వెహికల్స్ డ్రైవల్ 2024 పాతవాహనాల ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. తీవిగా రోడ్లపైకి వచ్చిన ఏన్నోఏళ్లనాటి కార్లను నగరవాసులు ఆసక్తిగా తిలకించి ఫొటోలు తీసుకున్నారు.



ర్యాలీగా వెళ్తున్న కార్లు

మండ్యలో కోలాహలం

మండ్య: అయోధ్య రామాలయం వేడుక నేపథ్యంలో మండ్య నగరంతో పాటు జిల్లాలో ఉన్న అన్ని తాలూకాలలో, ఆలయాల వద్ద ఉత్సవ వాతావరణం నెలకొంది. సోమవారం ఉదయం నుంచే ఆలయాలలో విశేష వేడుకలను నిర్వహిస్తారు. మండ్య తాలూకాలోని మారెగౌడనహళ్ళి గ్రామంలో ఉన్న తిరుమల ఆలయం, మండ్య నగరం లేబర్ కాలనీలోని రాముని మందిరంతో పాటు అనేక దేవాలయాల్లో ఆదివారం నుంచి సంబరాలకు ఏర్పాట్లు చేశారు. మండ్య నగరం ఎక్కడ చూసినా కేసరిమయంగా మారింది.



విద్యుత్ దీపాలతో ముస్తాబైన రామమందిరం



అయోధ్య అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

వర్లకొండలో విశేష పూజలు



ఆలయం వద్ద అన్నదానం

చిక్కబళ్లాపురం: అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠాపన చేస్తున్న సందర్భంలో జిల్లాలోని వర్లకొండపై ఉన్న పురాతన శ్రీరామదేవుని ఆలయంలో భక్తులు విశేష పూజలను నిర్వహించారు. గ్రామ పంచాయతీ అధ్యక్షుడు భీమప్ప మాట్లాడుతూ కొన్నిరోజులుగా భక్తుల రాక పెరిగిందని చెప్పారు. భక్తులకు స్థానిక దాతలు అన్న సంతర్పణ గావించారు.

కన్నడ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలి

మండ్య : కన్నడనాడులో ఉన్న ప్రతి ఒక్కరూ కన్నడ భాష నేర్చుకోవాలని మైసురు వి.వి. సిండికేట్ మాజీ సభ్యుడు ఈ.సి. నింగరాజుగౌడ పిలుపు ఇచ్చారు. డాక్టర్ జీశంప సాహిత్య వేదిక, రాజర్షి నాల్వడి కృష్ణరాజ ఒడియార్ ఫిలిమ్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన 32వ రాష్ట్ర స్థాయి కవికావ్య, వివిధ ఆవార్డుల ప్రదానం , ఓగుణవంత మినీ సినిమా విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొనిమాట్లాడారు. రాష్ట్ర కవి కువెంపు సాహిత్యం ద్వారా కన్నడ భాషను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అయోధ్యలో సోమవారం జరిగే రామమందిరం ప్రారంభోత్సవం, బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. జీవితంలో ఒకసారి అయినా అయోధ్యకు వెళ్లి రావాలన్నారు.



తాటాకుతో శిల్పశోభ...ఇకబన ప్రదర్శన

మురిపించే పుష్ప ప్రదర్శన

బనశంకరి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా నగరంలో లాల్‌బాగ్ ఉద్యానవనంలో జరుగుతున్న 215వ ఫల పుష్ప ప్రదర్శన సందర్శకులను అబ్బురపరుస్తోంది. ఆదివారం సెలవురోజు కావడంతో కాలేజీ విద్యార్థులు, యువతీ యువకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పుష్ప సౌందర్యాన్ని వీక్షిస్తూ సెల్ఫీలతో జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. వర్టికల్ గార్డెన్, ఇష్టలింగ ఆకృతి, పుష్ప నెమలి తదితర రూపాలు చూపరులను అబ్బురపరిచాయి. ఇకెబన పుష్ప ప్రదర్శనలోని పూల రూపాలు అలరించాయి. ఫ్లవర్ షోకు శనివారం 29 వేల మందికి పైగా సందర్శకులు రాగా, టికెట్ల విక్రయం ద్వారా రూ.18 లక్షలు ఆదాయం వచ్చిందని ఉద్యానవనశాఖ జేడీ ఎం.జగదీశ్ తెలిపారు.



సెల్ఫీ తీసుకుంటున్న సందర్శకులు

కోలారు వార్తలు...

ఫిబ్రవరిలో ఉద్యోగుల సంఘం రాష్ట్రస్థాయి సమావేశం

కోలారు: ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభిస్తారని జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి సురేష్‌బాబు తెలిపారు. ఆదివారం నగరంలోని వ్యవసాయ శాఖ సభాంగణంలో నిర్వహించిన ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి షెడ్యూల్ మేరకు తేదీని ఖరారు చేస్తామన్నారు. తమ డిమాండ్లు పాత పెన్షన్, వేతన కమిషన్ అమలు, నగదు రహిత చికిత్స, ఆరోగ్య సంజీవిని తదితర వాటిపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువస్తామన్నారు. ఈ నెల 27న నగరంలోని రంగమందిరంలో సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల ప్రతిభావంత విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు, నివృత్త ప్రభుత్వ ఉద్యోగులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర పరిషత్ సభ్యుడు గౌతమ్, కోశాధికారి విజయ్, మాజీ అధ్యక్షుడు కె ఎన్ మంజునాథ్, కెబి అశోక్ కెజీఎఫ్ తాలూకా అధ్యక్షుడు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్‌బాబు

ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక వేతన శ్రేణి ప్రకటించాలి

కోలారు: విద్యార్థుల ప్రగతి కోసం శ్రమిస్తున్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక వేతన శ్రేణిని ప్రకటించాలని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రైవేటు హోటల్ సభాంగణంలో జిల్లా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మాలూరు తాలూకా సంఘం నూతన అధ్యక్షుడు మునినారాయణ సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులను విద్యా సంయోజకులుగా పదోన్నతులు ఇవ్వాలని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆర్జిత సెలవులను పెంచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎంవి జనార్ధన్, బిఎం నారాయణస్వామి, ఎకె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతుడు కుమార్ ఆచారి (ఫైల్)

మాలూరు: చెరువులో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన తాలూకాలోని లక్కూరు ఫిర్కా వప్పచ్చహళ్లి గ్రామ చెరువులో చోటు చేసుకుంది. మృతుడిని గ్రామానికి చెందిన కుమార్ ఆచారి (39)గా గుర్తించారు. ఇతను ఫెన్సింగ్ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. గత ఆదివారం పనికి వెళ్లి వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదు. వారం రోజుల అనంతరం చెరువులో శవమై తేలుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్నారు.

అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఏకగ్రీవం



అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానించిన దృశ్యం

మాలూరు: తాలూకాలోని కాడదేనహళ్లి గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా కెఎం ఈశ్వరగౌడ, ఉపాధ్యక్షురాలిగా మంజుల ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. సహకార సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికలో అధ్యక్ష స్థానానికి ఈశ్వర గౌడ, అధ్యక్ష స్థానానికి మంజుల మాత్రమే నామినేషన్ వేశారు. దీంతో వీరిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను డైరెక్టర్లు అభినందించారు. అధ్యక్షుడు ఈశ్వరగౌడ మాట్లాడుతూ... సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

పౌర కార్మికులను గౌరవించాలి



పౌర కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: పట్టణంలో స్వచ్ఛత పనుల్లో పౌర కార్మికుల పాత్ర ఎంతో గొప్పదని, వారిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎంపీ ఎస్ మునిస్వామి తెలిపారు. ఆదివారం పట్టణంలోని పురసభ కార్యాలయం వద్ద స్వచ్ఛ భారత్ మిషన్ పథకంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సోమవారం అయోధ్యలో రాముడి విగ్రహం ప్రతిష్ఠాపన కార్యక్రమం నేపథ్యంలో పట్టణంలోని అన్ని ఆలయాల్లో స్వచ్ఛత పనులు చేపట్టామన్నారు. ఇదే సమయంలో పౌర కార్మికులకు పాదపూజ చేశారు. పురసభ ముఖ్యాధికారి వైఎస్ సత్యనారాయణ, జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు రాజణ్ణ, రోణూరు చంద్రశేఖర్, రామాంజి పాల్గొన్నారు.

సహకార రంగాన్ని దుర్వినియోగం చేయకూడదు

కోలారు : సహకార రంగం రాజకీయాలకు అతీతంగా ఉండాలని, ఆ రంగాన్ని దుర్వినియోగం చేయకూడదని డీసీసీ బ్యాంకు మాజీ అధ్యక్షుడు, అపెక్స్ బ్యాంకు డైరెక్టర్ బ్యాలహళ్లి గోవిందగౌడ తెలిపారు. ఆదివారం నగరంలోని జిల్లా సహకార సమాఖ్య సభాంగణంలో రాష్ట్ర సహకార మహామండలి, జిల్లా సహకార సమాఖ్య ఆధ్వర్యంలో పాత్రికేయుల సంఘం సభ్యులకు నిర్వహించిన ఒకరోజు కార్యాగారంలో పాల్గొని మాట్లాడారు. ఎంపిసిఎస్, ఎస్ఎఫ్‌సిఎస్‌ల పాలక మండలిని రాజకీయాలకు ఉపయోగించుకోవడం సహకార రంగానికి విఘాతమన్నారు. ఎన్నికల అనంతరం కూడా అధికారంలోకి వచ్చిన వారు తమ బాధ్యతలను మరచి వ్యవహరించడం దురదృష్టకర విషయమన్నారు. జిల్లా పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు బివి గోపినాథ్ మాట్లాడుతూ... కోలారు జిల్లా అభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర ఎంతో ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పాత్రికేయుల సంఘం మాజీ అధ్యక్షుడు కెఎస్ గణేష్, ఆము లక్ష్మీనారాయణ, మూరాండహళ్లి గోపాలప్ప, ఎ శంకరనారాయణగౌడ, పీఎం వెంకటేష్, పి పాపణ్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ఫ్లోరోసిస్‌పై వీధినాటకం



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

గౌరిబిదనూరు: ఫ్లోరోసిస్‌తో మనిషి ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని, జాగ్రత్తలు అవసరమని ఉపాధ్యాయుడు జనార్దన్ సూచించారు. ఫ్లోరైడ్ నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు జెడ్పీ, ఆరోగ్య శాఖల ద్వారా గ్రామీణ యువ కళా సంఘం ఆధ్వర్యంలో మంచేనహళ్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం వీధినాటకాలు ఏర్పాటు చేశారు. 1.50 శాతం అధికంగా ఫ్లోరైడ్ ఉన్న నీటిని తాగితే అనారోగ్య సమస్యలతోపాటు ఎముకలు డొల్లగా మారుతాయని, నడిచేందుకు కూడా వీలు కాదన్నారు. సంఘం కళాకారుడు గోట్లకుంటి వెంకటరమణప్ప ప్రసంగిస్తూ ఫ్లోరోసిస్ నుంచి దూరంగా ఉండాలంటే పాలు, బెల్లం, ఆకుకూరలు, సి విటమిన్ విరివిగా లభించే జామ, నిమ్మ, టమోటా, క్యారెట్, చీనాపండ్లు, అల్లం వాటిని ఆహారంలో తీసుకోవాలన్నారు.

ఘనంగా గంగమ్మ దేవి మహా కుంభాభిషేకం



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రామలింగారెడ్డి, ఎమ్మెల్యే శరత్‌బచ్చెగౌడ

కృష్ణరాజపురం : బెంగళూరు గ్రామీణ జిల్లా హోసకోటె నియోజకవర్గం సోలిబెలె హోబ్లిలో సిద్దేనహళ్లిలో శ్రీ గంగమ్మ దేవి ఆలయ గోపురం స్థిరబింబ ప్రతిష్ఠాపన, మహాకుంభాభిషేక వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర రవాణ, దేవదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి, హోసకోటె ఎమ్మెల్యే శరత్ బచ్చెగౌడ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి గంగమ్మ దేవిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రోడ్డు విస్తరణకు సహకరించండి



స్థానికులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మంజుల

కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపుర నియోజకవర్గంలో ఎమ్మెల్యే మంజులా, మాజీ మంత్రి అరవిందలింబావలి ఆదివారం కేఆర్‌డీసీఎల్, బెస్కాం, జల మండలి అధికారులతో కలిసి స్థానికులతో సమావేశమయ్యారు. రోడ్ల విస్తరణపై చర్చించారు. గుంజూరు నుంచి తిరుమెనహళ్లి వరకు, ఈస్ట్ విమానాశ్రయం అప్రోచ్ రోడ్డు నుంచి జాతీయ రహదారి 35 వరకు రొడ్డు అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.రోడ్డు విస్తరణకు ఇళ్లు, దుకాణాల యజమానులు సహకరించాలని కోరారు.

పరిషత్ ఎన్నికలపై జేడీఎస్, బీజేపీ సమాలోచన

శివాజీనగర: రానున్న విధానపరిషత్ ఎన్నికల్లో పొత్తు, సీట్ల సర్దుపాటుపై మిత్ర పక్షాలైన బీజేపీ, జేడీఎస్ నాయకులు ఆదివారం సమావేశమయ్యారు. మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప నేతృత్వంలో డాలర్స్ కాలనీలోని ఆయన నివాసంలో సమావేశం జరిగింది. ఫిబ్రవరిలో జరుగనున్న విధానపరిషత్ బెంగళూరు ఉపాధ్యాయ నియోజకవర్గ ఉప ఎన్నికలు, మే–జూన్‌లో జరుగనున్న విధానపరిషత్ 6 నియోజకవర్గాల ఎన్నికలపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఏ నియోజకవర్గాల్లో ఎవరు పోటీ చేయాలి, ఎవరిని అభ్యర్థులుగా ఎంపిక చేయాలనేపై చర్చ సాగినట్లు తెలిసింది.

దివ్యాంగులకు సదుపాయాలు కల్పించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: మంచేనహళ్లి తాలూకాలో నివాసం ఉంటున్న దివ్యాంగులకు సదుపాయాలు కల్పించాలని కర్ణాటక వికల చేతనుల సంఘం జిల్లా సంచాలకుడు సుబ్రమణి తెలిపారు. ఈమేరకు తహసీల్దార్ వెంకటేశప్పకు వినతిపత్రం అందించారు. సుబ్రమణి మాట్లాడుతూ తాలూకాలో 2వేల మంది దివ్యాంగులు ఉన్నారన్నారు. బ్యాంకులు, కార్యాలయాల్లోకి దివ్యాంగులు వెళ్లేందుకు వీలుగా ర్యాంపులు ఏర్పాటు చేయాలని, , శౌచాలయాల్లో కమోడ్‌ల నిర్మాణం చేపట్టాలని, దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కృష్ణప్ప, శివప్పలు పాల్గొన్నారు.

ఏ వీధిలో చూసినా శ్రీరామనామ జపమే



పూజలకు ఏర్పాట్లు చేసిన దృశ్యం



ముస్తాబైన ఆలయం

- మైసూరు నగరం కేసరి జెండాల మయం
- నేడు ఆలయాల్లో పూజలు, హోమాలు

మైసూరు: రాచనగరి మైసూరుకు చెందిన శిల్పి యోగిరాజ్ అరుణ్ చెక్కిన బాలరాముడి విగ్రహం అయోధ్యలోని రామమందిరంలోని గర్భగుడిలో ఈనెల 22న ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా మైసూరు నగరం మొత్తం జై శ్రీరామ్ నినాదాలతో నగరం మార్మోగుతోంది. ఏ రోడ్డులో చూసినా ఏ ఆలయం వద్ద చూసినా జై శ్రీరామ్ నినాదాలతో కూడిన జెండాలు కనిపిస్తున్నాయి. ప్రముఖ రోడ్లను మొత్తం అందంగా ముస్తాబు చేశారు. ఆటోలు, బైకులు, గుడ్స్ వాహనదారులు, బైకిస్టులు తమ వాహనాలకు జై శ్రీరామ్ అని రాసిన కేసరి జెండాలను కట్టుకోని సంచరిస్తున్నారు. మరో వైపు నగరంలోని అన్ని ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయాల్లో పూజలు, ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నారు.

సప్త నదుల నీటితో జలాభిషేకం

కావేరి కపిలా, నర్మదా, సింధూ, గంగా, సరయూ, యమునా నుంచి పవిత్ర జలాలను సేకరించి వాసవీ ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని ఆలయాల్లో శ్రీరామమూర్తికి జలాభిషేకం నిర్వహించనున్నారు. అదేవిధంగా పంచామృతాలతో ఆభిషేకం, 1,08,000 తులసి దళలాలతో తిసిన రసంతో ప్రత్యేక అబిషేకం నిర్వహించనున్నారు. అయోధ్య, వారణాసి నంచి తెచ్చిన 102 రకాల హారతులతో సోమవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆలమ్మ చౌటరిలో శ్రీరామమూర్తికి పూజలు నిర్వహించనున్నారు.

111 అడుగుల పొడవైన అగరబత్తీ

యోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా రంగరావు అండ్ సన్స్ ఆధ్వర్యంలో మైసూరులోని కొటె ఆంజనేయ స్వామి ఆలయం ముందు పరంపరా పేరుతో 111 అడుగుల పొడవైన అగరుబత్తిని వెలిగించనున్నారు. ఇది 24 రోజుల పాటు వెలుగుతుంది. జిగటు, వెదురు, శ్రీగంధం, పొడి తేనె, సాంబ్రాణి, తెలుపు రంగు సాస్‌వే, బెల్లంతో ఈ అగరు బత్తిని రూపొందించారు. 18 మంది నిపుణులు 23 రొజుల పాటు పని చేసి ఈ అగరు బత్తిని తయారు చేశారు.





జై శ్రీరాం జెండాలతో ఆటో డ్రైవర్



శ్రీరామ చిత్రపటాలతో అలంకరణ

అయోధ్యకు దేవెగౌడ కుటుంబం

యశవంతపుర: జేడీఎస్ అధినేత, మాజీ ప్రధాని దేవేగౌడ దంపతులు ఆదివారం ప్రత్యేక విమానంలో అయోధ్యకు వెళ్లారు. నగరంలోని హెచ్‌ఎఎల్ విమానాశ్రయం నుంచి తనయుడు హెచ్‌డీ కుమారస్వామి, కొడుకు నిఖిల్ కూడా వెళ్లారు. అంతకు ముందు దేవేగౌడ విలేకరులతో మాట్లాడుతూ అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం దేశ ప్రజలకు చరిత్రాత్మకమన్నారు. ప్రధాని మోదీ ఈ కార్యక్రమాన్ని చేయడం పూర్వజన్మ పుణ్యమని అన్నారు. వాజపేయి ఆరేళ్లు ప్రధానిగా ఉన్నా రామ మందిరాన్ని నిర్మించలేదు. ఆయనకు అనేక కష్టాలు ఎదురయ్యాయి. మోదీకే ఇదీ సాధ్యం అయిందని చెప్పారు.

57 మంది పీడీఓల బదిలీ

యశవంతపుర: రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్‌శాఖ 57 మంది పీడీఓలను బదిలీ చేసింది.ఈ మేరకు ఆర్‌డీపీఆర్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో వీరిని ఇతర జిల్లాలకు బదిలీ చేసినట్లు తెలిసింది.

సంప్రదాయాలు పాటించడం మాకు తెలుసు

శివాజీనగర: పూజ, పునస్కారం చేసుకొని సంస్కృతిని పాటించుకుంటూ వస్తున్నామని, మతం, భక్తి గురించి వేరేవారి నుంచి నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదని డీసీఎం డీ.కే.శివకుమార్ తెలిపారు. ఆదివారం సదాశివనగరలో తన ఇంటి వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. మతాన్ని ప్రచారానికి ఉపయోగించటం లేదన్నారు. ప్రార్థనలతో ప్రతిఫలం లభిస్తుందనేది తమ నమ్మకమని, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయాలని సూచనలు ఇచ్చామన్నారు. సిద్ధరామయ్య పేరులో రాముడు ఉన్నాడని, తన పేరులో శివుడు ఉన్నాడని, మతం, సంస్కృతి పాటించే విషయమై ఎవరి నుంచి చెప్పించుకోవాల్సిన అవసరం లేదన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డి

బొమ్మనహళ్లి : క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం. సతీష్ రెడ్డి సూచించారు.చిక్కబేగురులోని క్రీడా మైదానంలో భగత్‌సింగ్ స్పోర్ట్స్' క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దారుఢ్యం లభిస్తుందన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. సమాజ సేవకుడు ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

మైసూరు ఫెస్ట్–2024కు ఏర్పాట్లు



ఏర్పాట్లపై ఆరా తీస్తున్న కలెక్టర్ తదితరులు

మైసూరు : పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 28వ తేది వరకు మైసూరు నగరంలో ఏర్పాటు చేయున్న మైసూరు ఫెస్ట్–2024 ఏర్పాట్లకు కలెక్టర్ డాక్టర్ కే.వి.రాజేంద్ర, నగర పోలీస్ కమిషనర్ రమేష్ బి ఆదివారం నగరంలో పర్యటించారు. వి.వి. బయలు రంగమందిరం, క్లాక్ టవర్ వద్ద స్థల పరిశీలన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మైసూరు పెస్ట్–2024 కర్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చిత్రసంతె, చిత్ర కళా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రామీణ క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి తరలివచ్చే ప్రజలు, పర్యాటకులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మంచినీరు, మరుగుదొడ్ల సదుపాయం, పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

అంబిగర చౌడయ్య విగ్రహం ఏర్పాటు చేస్తాం

శివాజీనగర: అంబిగర చౌడయ్య విగ్రహాన్ని బెంగళూరు నగరంలో ఏర్పాటు చేస్తామని వెనుకబడిన వర్గాల సంక్షేమ, కన్నడ సంస్కృతి శాఖ మంత్రి శివరాజ తంగడగి తెలిపారు. ఆదివారం బెంగళూరులోని రవీంద్ర కళాక్షేత్రలో కన్నడ, సంస్కృతి శాఖ ఏర్పాటు చేసిన నిజశరణ అంబిగర చౌడయ్య జయంతిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అంబిగర చౌడయ్య విగ్రహ స్థాపనకు ఇప్పటికే పలు స్థలాల పరిశీలించినట్లు తెలిపారు. ఎస్టీ జాబితాలోకి చేర్చాలనే ఈ సామాజిక వర్గ డిమాండ్‌ను కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన తెలిపారు.మహనీయుల చరిత్రను యువత తెలుసుకోవాలన్నారు. వారి జీవితం, ఆదర్శాలను పాటించాలన్నారు.

శివకుమారస్వామీజీ సేవలు అనన్యం



గౌరిబిదనూరు: శివకుమారస్వామీజీకి నివాళులు



విజయపుర పట్టణంలో అన్నదానం



బొమ్మనహళ్లిలో స్వామీజీ విగ్రహానికి పూజలు

గౌరిబిదనూరు: సిద్ధగంగ మఠం శివకుమార స్వామీజీ సమాజానికి చేసిన సేవలు అనన్యమని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ అన్నారు. స్వామీజీ 5వ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఎంజీ సర్కిల్‌లో శివకుమారస్వామీజీ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాసోహాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శివకుమారస్వామి లక్షలాది మంది విద్యార్థులకు ఆశ్రయం కల్పించి విద్యాదానం చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శివశంకరరెడ్డి, మునిసిపల్ మాజీ అధ్యక్షుడు కలీంవుల్లా, సభ్యుడు మార్కెట్ మోహన్, బాలాజీ, బీజేపీ రవినారాయణరెడ్డి, జయణ్ణ పాల్గొన్నారు.

బొమ్మనహళ్లి : బొమ్మనహళ్లిలోని హోసరోడ్డులో ని చెన్నకేశవ నగర సర్కిల్‌లో ఆదివారం శివకుమార స్వామీజీ వర్ధంతిని నిర్వహించారు. శివకుమార స్వామీజీ విగ్రహానికి బీబీఎంపీ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి నివాళులర్పించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విజయపుర(బెంగళూరు గ్రామీణ) : విజయపుర పట్టణంలో శివకుమార స్వామిజీ చిత్రపటానికి పుర సభమాజీ అధ్యక్షుడు ఎం. సతీష్ నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు.

కాళ్లు, చేతులు నరికి కడతేర్చాడు

- శివమొగ్గ జిల్లాలో ఓ భర్త కిరాతకం

యశవంతపుర: కాళ్లు, చేతులు నరికి భార్యను కడతేర్చిన కిరాతక భర్త ఉదంతం శివమొగ్గ జిల్లా సాగర తాలూకా తుమరి కుదరూరు గ్రామం కుణబికేరిలో జరిగింది. గ్రామంలో లోకేశ్, నీలావతి(29) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి 14 సంవత్సరాల క్రితం వివాహమైంది. ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మద్యానికి బానిసైన లోకేశ్ రోజు మద్యం తాగి ఇంట్లో గొడవ పడేవాడు. శనివారం మద్యం మత్తులో ఇంటికి వెళ్లిన భర్తను నీలావతి నిలదీసింది. మద్యానికి బానిసైతే ఇల్లు ఎలా గడుస్తుందని దండించింది. దీంతో ఇద్దరి మధ్య గోడవ జరిగింది. విచక్షణ కల్పోయిన లోకేశ్ కొడవలి తీసుకొని భార్య చేతులు, కాళ్లను కత్తరించాడు. తీవ్ర గాయాల పాలైన ఆమెను గ్రామస్తులు సాగర ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి నిందితుడు లోకేశ్ కోసం గాలింపు చేపట్టారు.

శివకుమారస్వామీజీ స్మృతివనం ప్రారంభం

తుమకూరు: త్రివిధ దాసోహం ద్వారా విశ్వఖ్యాతి పొందిన సిద్దగంగ మఠం శివకుమారస్వామీజీ జ్ఞాపకార్థం ప్రాదేశిక ఆటవీ శాఖ తుమకూరులోని మఠంలో ఏర్పాటు చేసిన స్మృతివనాన్ని రాష్ట అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రెతో కలిసి సీఎం సిద్ధరామయ్య ఆదివారం ప్రారంభించారు. రూ.2 కోట్లతో ఈ స్మృతి వనం రూపొందించారు. శివకుమారస్వామీజీ జీవితానికి సంబంధించిన అనేక అంశాలతోపాటు లక్షలాది మంది విద్యార్థులకు విద్యాదానం చేసి వారి జీవితాలకు బంగారు బాటలు వేసిన విధానాన్ని ప్రజలకు తెలియజేసేలా ఈ స్మృతివనంలో నమూనాలు ఏర్పాటు చేశారు.



ప్రారంభిస్తున్న సీఎం సిద్ధరామయ్య తదితరులు

హోసూరు వార్తలు..

మహిళ ఆత్మహత్య

క్రిష్ణగిరి: అనారోగ్యంతో బాధపడుతూ మహిళ ఆత్మహత్య చేసుకొన్న ఘటన సూళగిరి వద్ద జరిగింది. వివరాల మేరకు సూళగిరి తాలూకా ఆలమరతు గుట్ట గ్రామానికి చెందిన ప్రభాకర్ భార్య ప్రియ, గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ వచ్చింది. స్వస్థత కలగక పోవడంతో శనివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. సూళగిరి పోలీసులు వచ్చి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

అక్రమ సంబంధం.. ఒకరి హత్య

హోసూరు: వివాహేతర సంబంధంతో ఒక వ్యక్తిని హత్య చేశారు. వివరాలు.. జిల్లాలోని పోచ్చంపల్లి సమీపంలోని సెట్టియూరుకి చెందిన పెరుమాళ్ (30)కు పుళియంబట్టి గ్రామానికి చెందిన మురళి భార్యతో అక్రమ సంబంధం ఉండేది. విషయం తెలుసుకొన్న మురళి వారిద్దరినీ దండించినా మార్పు రాలేదు. దీంతో మిత్రులైన తంగరాజ్ (23), నవీన్ (23)లతో కలిసి గత 15వ తేదీన పెరుమాళ్‌ను కిడ్నాప్ చేసి బర్గూరు సమీపంలోని నాగమంగలం వద్దకు తీసుకెళ్లి హత్య చేసి ఓ మామిడితోటలో పాతిపెట్టారు. భర్త కనిపించకపోవడంతో పెరుమాళ్ భార్య మోనిక (25) పోచ్చంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరిపి హత్యకు గురైనట్లు గుర్తించారు. మురళి, తంగరాజ్, నవీన్‌లను అరెస్టు చేశారు. తోటలో పాతిపెట్టిన శవాన్ని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు.

ఆలయాల్లో శుద్ధి

హోసూరు: అయోధ్య శ్రీరామాలయంలో రాముని విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయాల్లో శుద్ధీకరణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. హోసూరు కార్పొరేషన్ పరిధిలోని ఆలయాల్లో బీజేపీ కార్యకర్తలు శుద్ధీకరణలో పాల్గొన్నారు. హోసూరు–బెంగళూరు జాతీయ రహదారి దర్గా సమీపంలోని ముత్తుమారియమ్మ గుడిలో బీజేపీ నాయకుడు శ్రీధర్ నేతృత్వంలో నీళ్లతో శుభ్రం చేశారు.

బైకిస్టు దుర్మరణం

హోసూరు: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి మృతి చెందిన ఘటన పట్టణ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు పట్టణంలోని నంజుండేశ్వరనగర్‌కు చెందిన శంకర్ (40) ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి. శనివారం సాయంత్రం బైక్‌మీదో ముల్లైనగర్ వైపు వెళుతుండగా ఒక కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన శంకర్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు శవాన్ని ఆస్పత్రికి తరలించారు.

ఇంటి ముందు బైక్ చోరీ

హోసూరు: ఇంటి ముందు నిలిపిన ద్విచక్రవాహనాన్ని దొంగిలించుకెళ్లిన దుండగుల కోసం హడ్కో పోలీసులు గాలిస్తున్నారు. వివరాల మేరకు హోసూరు కార్పొరేషన్ పరిధిలోని లక్ష్మీదేవినగర్ ప్రాంతానికి చెందిన లోకేష్, రెండు రోజుల క్రితం ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు నిలిపి నిద్రించాడు. శనివారం ఉదయం లేచి చూడగా బైక్ కనిపించకపోవడంతో హడ్కో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కొనసాగిన బనశంకరీ దేవి మహోత్సవాలు



ప్రత్యేకపూల అలంకరణలో బనశంకరీదేవి మూలవిరాట్



శ్రీలక్ష్మీనారాయణ ఆకృతితో రంగోలి

బనశంకరి: బనశంకరీదేవి జాతరమహోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు ఏ.చంద్రమోహన్ ఆధ్వర్యంలో బనశంకరీదేవి మూలవిరాట్‌కు ఆదివారం ప్రత్యేక అభిషేకం, అర్చనలు చేపట్టి వివిధ పుష్పాలతో విశేష అలంకరణచేసి పూజలు నిర్వహించారు. యాగశాలలో శ్రీలక్ష్మీనారాయణహృదయ హోమం, శ్రీధన్వంతరి హోమాలు చేపట్టి మధ్యాహ్నం మహాపూర్ణాహుతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణచేశారు. ఆదివారం సెలవురోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేసి నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం

యశవంతపుర: హాసన్ పట్టణంలోని శంకరమఠం రోడ్డులో ఉన్న మంజునాథ ఆస్పత్రిలో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. ఎక్స్‌రే గదిలో మంటలు చెలరేగి భారీ పొగ కమ్ముకుంది. అప్రమత్తమైన సిబ్బంది కిటికీ అద్దాలను ధ్వసం చేసి బయట పడి ప్రాణాలు దక్కించుకున్నారు. రోగులను బయటకు తరలించి ప్రమాదం నుంచి తప్పించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై స్థానిక పోలీసులు ఆరా తీస్తున్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

బనశంకరి: ప్రైవేటు కంపెనీ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. నగర శివార్లలో ఆనేకల్ రోడ్డులో ఈ ఘటన వెలుగు చూసింది. మృతుడిని సర్జాపుర సమీపంలోని ప్రైవేటు కంపెనీలో పనిచేసే వినయ్‌కుమార్(24)గా పోలీసుల గుర్తించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. చెట్టుకు ఉరివేసుకున్న స్థితిలో ఉన్న అతని చేతులు, గొంతు భాగంలో కత్తితో కోసిన ఆనవాళ్లు ఉన్నట్లు గుర్తించారు. ఘటన స్థలంలో మొబైల్ సిమ్‌కార్డు లభించింది. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం ఆనేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తులో ఉంది.

నిందితుడిపై పోలీసు కాల్పులు

బనశంకరి: రెండు హత్యకేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తి మారణాయుధాలతో సంచరిస్తుండగా పోలీసులు కాల్పులు జరిపి అదుపులోకి తీసుకున్నారు. వివరాలు..పుట్టేనహళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుట్టేనహళ్లి చెరువు వద్ద ఓ వ్యక్తి మారణాయుధాలతో సంచరిస్తున్నట్లు సమాచారంతో సీసీబీ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లారు. అతన్ని అదుపులోకి తీసుకునేందుకు యత్నించగా దాడికి తెగబడ్డాడు. దీంతో పోలీసులు కాల్పులు జరిపి అతన్ని అదుపులోకి తీసుకుని డ్రాగర్‌ను స్వాధీనం చేసుకున్నారు. హుళిమావు, బన్నేరుఘట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో జరిగి రెండు హత్యకేసుల్లో ఇతను నిందితుడిగా గుర్తించారు. కిరాయి తీసుకొని హత్యకు పాల్పడుతున్నట్లు కేసులు నమోదైయ్యాయని పోలీసులు తెలిపారు.

ఒంటి ఏనుగు హల్‌చల్

కెలమంగలం: డెంకణీకోట అటవీ ప్రాంతంలో మదమెక్కి ప్రజలపై దాడులు చేసి చంపుతున్న ఏనుగును చూసి ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురౌతున్నారు. డెంకణీకోట తాలూకా కెలమంగలం సమీపంలోని సినిగిరిపల్లి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఒంటి ఏనుగు దాడిలో గత వారం రోజుల క్రితం హనుమంతపురం గ్రామానికి చెందిన మహిళ మమతను చంపివేసింది. అటవీ అధికారులు ఆ ఏనుగును డెంకణీకోట సమీపంలోని మరగట్ట అటవీ ప్రాంతానికి మళ్లించారు. శనివారం రాత్రి ఆ ఏనుగు లక్కసంద్రం గ్రామానికి చొరబడడంతో గ్రామప్రజలు ఏం చేస్తుందోనని వణికిపోయారు. దానిని అటవీ ప్రాంతానికి మళ్లించి ముప్పు తప్పించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా...

ఏయూకు రూ.1.30 కోట్ల విలువైన పరికరాలు

- అందజేయనున్న వయాట్రిస్
- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన డాక్టర్ దేవ పురాణం

ఏయూ క్యాంపస్: ఆంధ్రా విశ్వవిద్యాలయానికి ఉపయుక్తంగా నిలిచే రూ.1.30 కోట్ల విలువైన ప్రయోగశాల ఉపకరణాలను వయాట్రిస్ ఫార్మసీ సంస్థ తరపున అందజేయనున్నట్లు ఆ సంస్థ క్వాలిటీ ఇన్వెస్టిగేషన్-రెగ్యులేటరీ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ దేవ పురాణం తెలిపారు. ఈ మేరకు తమ సంసిద్ధతను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డికి తెలియజేశారు. వర్సిటీకి ఉపయుక్తంగా నిలిచే హెచ్‌పీఎల్‌సీ, స్పెక్ట్రోఫాటోమీటర్స్, హ్యూమిడిటీ అండ్ కూలింగ్ చాంబర్స్, ఎలక్ట్రానిక్స్ అనలిటికల్ బ్యాలెన్సెస్ వంటివి ఏయూకు అందజేయనున్నారు. త్వరలో వీటిని అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు దేవ పురాణం తెలిపారు. ఏయూకు ఉపకులపతిగా ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డిని రెండో పర్యాయం నియమించిన సీఎం జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాథమిక వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాజేశ్



ప్రాథమిక వైద్యుల సంఘం కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన వైద్యులు

సాక్షి, అమరావతి:ఏపీ ప్రాథమిక వైద్య కేంద్రాల డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ రాజేశ్ ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం ఎన్నికల అధికారి డాక్టర్ శ్రవణ్ పర్యవేక్షణలో కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కిశోర్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ రవీంద్రనాయక్, డాక్టర్ యూనిక మెర్సీ, డాక్టర్ టి.ఎస్.ప్రతాప్‌లను సభ్యులు ఎన్నుకున్నారు.

తెలంగాణ

ఏప్రిల్ మొదటివారంలో లోక్‌సభ ఎన్నికలు

బీజేపీ శ్రేణులు సంసిద్ధం కావాలన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ఏప్రిల్ మొదటివారంలో లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున పార్టీ శ్రేణులు సంసిద్ధం కావాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. మూడోసారి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి కాబోతున్నారని, భారీ మెజార్టీతో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు నేతలు చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అయోధ్యలో రామమందిర పునర్నిర్మాణం కోసం వేలాదిమంది సాధుసంతులు, హిందువులు, ప్రజలు ఉద్యమించారని తెలిపారు. కోట్లాదిమంది భారతీయులు ఎదురుచూస్తున్న అయోధ్యలో రామమందిర నిర్మాణం ఐదు వందల ఏళ్ల తర్వాత మోదీ నేతృత్వంలో సాకారమవుతోందన్నారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత, హిందువుల ఆత్మగౌరవానికి అయోధ్య రామమందిరం ప్రతీక అని కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం అయోధ్యలోని భవ్య రామమందిరంలో జరిగే బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవాన్ని 150 దేశాల్లోని హిందువులందరూ వర్చువల్‌గా వీక్షించనున్నారని తెలిపారు. ఇది భారతీయులందరికీ గర్వకారణమని అన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన బాంబు బెదిరింపు కాల్ కలకలం సృష్టించింది. ఇద్దరు వ్యక్తులు బాంబులతో కూడిన రెండు బ్యాగులతో ఎయిర్‌పోర్టులోకి ప్రవేశించి విమానాశ్రయాన్ని పేల్చివేయనున్నారని ఓ వ్యక్తి శనివారం రాత్రి కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి చెప్పాడు. తన పేరు ప్రశాంత్ అని, హైదరాబాద్‌లోని కాచిగూడ నుంచి ఫోన్ చేస్తున్నానని, ఇద్దరు వ్యక్తులు టీ స్టాల్ వద్ద మాట్లాడుకుంటుడగా తాను ఈ విషయం విన్నట్లుగా అతను చెప్పాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు వెంటనే ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, బాంబు స్క్వాడ్‌లతో అర్ధరాత్రి వరకు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి బాంబు లేదని నిర్ధారించుకున్నారు. పోలీసుల దర్యాప్తులో కాల్ చేసిన వ్యక్తి ముంబై నుంచి చేసినట్లు తెలిసింది. గత నెల 25న కూడా శంషాబాద్ విమానాశ్రయంతో పాటు మరికొన్ని విమానాశ్రయాలకు బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో అధికారులు ఉరుకులు పరుగులు తీశారు.

విషమంగానే విశ్వనాథ్‌రాజు ఆరోగ్య పరిస్థితి

అబ్దుల్లాపూర్‌మెట్(హైదరాబాద్): రామోజీ ఫిల్మ్‌సిటీలో గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో గాయాలకు గురైన విస్టెక్స్ ఏషియా పసిఫిక్ లిమిటెడ్ ప్రెసిడెంట్ దాట్ల విశ్వనాథరాజు అలియాస్ రాజు దాట్ల ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. రామోజీ ఫిలింసిటీ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా జరిగిన ఈ దుర్ఘటనలో సంస్థ సీఈఓ సంజయ్ షా ప్రాణాలు కోల్పోగా, తీవ్ర గాయాలతో విశ్వనాథ రాజు మలక్‌పేటలోని యశోదా ఆస్పత్రిలో ఐసీయూ చికిత్స పొందుతున్నారు.

అచ్చెన్నా.. అసలున్నావా?

పేరుకే అధ్యక్ష పదవి .. బీసీ నేతకు ఘోర అవమానాలు

చంద్రబాబుదో చిత్రమైన రాజకీయం. నేరుగా పోట్లాడడం ఆయన నిఘంటువులో ఉండదు. మిత్రపక్షంతోనైనా.. స్వపక్షంతోనైనా ఆయన తీరదే. వాడుకుని ముఖం మీద వేడినీళ్లు పోసే రకం. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు పరిస్థితి దీనికి అద్దం పడుతోంది.

పార్టీలో ప్రాధాన్యత లేకుండా చేసిన చంద్రబాబు, లోకేశ్

- అధ్యక్షుడి పనులన్నీ వర్ల రామయ్య ఇతర నేతలతో చేయిస్తున్న వైనం
- మీడియా సమావేశాలు పెట్టడానికీ అనుమతి లేదు
- అడపాదడపా ఒకటి, రెండు సమావేశాలకే పరిమితం
- బాబాయ్‌ని తొక్కిపెట్టి, అబ్బాయి రామ్మోహన్‌ని పైకి లేపుతున్న లోకేశ్
- లోలోన రగిలిపోతున్న అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్సవ విగ్రహంలా మారారనే చర్చ నడుస్తోంది. పేరుకు అధ్యక్షుడైనా ఆయనకు ఏమాత్రం ప్రాధాన్యం లభించడంలేదు.. సరికదా అవమానాలూ తప్పడంలేదు. ఇటీవల చంద్రబాబు తన నివాసంలో పవన్ కళ్యాణ్‌తో విందు సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి మాట వరసకైనా అచ్చెన్నాయుడిని పిలవలేదు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లేకుండానే చంద్రబాబు, లోకేశ్ ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అచ్చెన్నకు తెలియకుండానే ఆయన పేరుతో పార్టీ కార్యాలయం నుంచి పత్రికా ప్రకటనలు విడుదల అవుతున్నాయి. తనకు కనీస విలువ కూడా ఇవ్వడంలేదని అచ్చెన్న సన్నిహితుల వద్ద వాపోతున్నారు.



ఆది నుంచి ఉత్సవ విగ్రహమే

అచ్చెన్నాయుడు అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టే కార్యక్రమాన్ని బహిరంగంగా పెట్టి, భారీగా నిర్వహించాలని భావించారు. కానీ చంద్రబాబు అందుకు అంగీకరించలేదు. వెళ్లి కేటాయించిన సీట్లో కూర్చోవాలని చెప్పడంతో చాలా నిరుత్సాహంగా ఆయన అధ్యక్ష పదవిని చేపట్టారు. అప్పటి నుంచి ఆయనది ఉత్సవ విగ్రహ పాత్రే. కనీసం మీడియా సమావేశాలు కూడా ఇష్ట ప్రకారం నిర్వహించేందుకు అనుమతి లేదు. పార్టీ కార్యకలాపాల్లో పాల్గొంటున్నా ఆయన కళ్లెదుటే ఇతర నేతలకు అన్ని పనులు అప్పగిస్తున్నారు. అచ్చెన్నాయుడి కంటే వర్ల రామయ్యకు అత్యధిక ప్రాధాన్యత లభిస్తోందని టీడీపీ నేతలు చెబుతున్నారు. వివిధ అంశాలపై మీడియా ప్రకటనలు వర్ల రామయ్య పేరుతోనే విడుదల చేస్తున్నారు. పలు అంశాలపై వర్ల రామయ్యనే పార్టీ ప్రతినిధిగా పంపుతున్నారు. గవర్నర్, ఎన్నికల కమిషన్ అధికారులను కలిసేందుకు వర్ల రామయ్య, బొండా ఉమా వంటి నేతలను పంపుతున్నారు తప్ప రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడిని పట్టించుకోవడంలేదు. పలు సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులకు రాసే లేఖలు సైతం వర్ల రామయ్య, లోకేశ్ తదితరుల పేర్లతో వెళుతున్నాయి.

వ్యతిరేకులకు ప్రోత్సాహం

తనను కావాలని పక్కన పెడుతున్నారని, అవమానిస్తున్నారని తెలిసినా అచ్చెన్నాయుడు అన్ని సమావేశాలకు హాజరవుతున్నారు. ఆ సమావేశాల్లో కింది స్థాయి నాయకుడిలా ఒక పక్కన కూర్చోవడం, నాలుగైదు సార్లు అడిగిన తర్వాత అవకాశం ఇస్తే మాట్లాడడం తప్ప ఆయన ఏమీ చేయలేకపోతున్నారు. నారా లోకేశ్ అచ్చెన్నను అసలు పట్టించుకోవడంలేదు. అచ్చెన్నాయుడు పేరు చెబితేనే మండిపడుతున్నట్లు సమాచారం. అసలు అధ్యక్ష పదవి కూడా అచ్చెన్నకు తీసివేసి తాను సూచించిన మరొకరికి ఇవ్వాలని లోకేశ్ చాలాకాలం పట్టుబట్టినట్లు తెలిసింది. కానీ సామాజిక సమీకరణలతో ఆయన్ను ఉంచాలని చంద్రబాబు చెప్పడంతో పేరుకే ఆయన్ను కొనసాగిస్తున్నారు. అచ్చెన్నాయుడికి వ్యతిరేకంగా లోకేశ్ తనకు అనుకూలమైన కళా వెంకట్రావును ఎక్కువగా ప్రోత్సహిస్తున్నారు. అచ్చెన్న స్థానంలో ఆయన సోదరుడి కుమారుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ వరుసగా జరుగుతున్న సమావేశాల్లోనూ ఆయన్ను పట్టించుకోకుండా పక్కన పెట్టారనే చర్చ నడుస్తోంది. ఇదంతా చంద్రబాబుకు తెలియకుండా జరుగుతుందని అనుకోవడం లేదని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఈ పరిణామాలతో అచ్చెన్నాయుడు లోలోన తీవ్ర ఆవేదనతో రగిలిపోతున్నారు.

చంద్రబాబు ద'మనీ'యం

బాలయోగి వారసుడు హరీష్‌కు ఝలక్

- డబ్బు లేదని పక్కన పెట్టేస్తున్న వైనం
- అమలాపురం పార్లమెంట్ బరి నుంచి తప్పించే యత్నం
- పి.గన్నవరం లేదా అమలాపురం అసెంబ్లీకి పంపే యోచన
- అలిగిన హరీష్.. లెక్కచేయని అధిష్టానం
- బాలయోగి అభిమానుల్లో ఆగ్రహం
- అమలాపురంలో ఆనందరావుకు చెక్ పెట్టాలని చినరాజప్ప ఎత్తుగడ



సాక్షి అమలాపురం: లోక్ సభ మాజీ స్పీకర్, దివంగత జీఎంసీ బాలయోగి వారసుడు గంటి హరీష్ టీడీపీ అధినేత చంద్రబాబు రాజకీయ దమన నీతికి బలైపోతున్నారు. అమలాపురం నుంచి ఎంపీ టికెట్ రేసులో ఉన్న హరీష్‌కు డబ్బు లేదనే ఉద్దేశంతో మొండిచేయి చూపేందుకు టీడీపీ అధిష్టానం యత్నిస్తోంది. ఈ విషయంపై అలిగిన హరీష్ కొన్ని రోజులు అజ్ఞాతంలోకి వెళ్లినా పార్టీ పెద్దలు పట్టించుకోలేదు. దీంతో బాలయోగి అభిమానుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. హరీష్ ప్రస్తుతం టీడీపీ అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. పీ గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ త్రిమెన్ కమిటీలోనూ సభ్యునిగా కొనసాగుతున్నారు. అమలాపురం ఎంపీగా పోటీ చేయాలని తొలి నుంచీ ఆసక్తిగా ఉన్నారు. గత ఎన్నికల్లో టీడీపీకి బలమైన అభ్యర్థి లేకపోవడంతో హరీష్‌ను ఎంపీగా బరిలోకి దింపారు. 39,996 ఓట్ల తేడాతో హరీష్ ఓడిపోయారు. పార్లమెంట్ పరిధిలోని కొన్ని నియోజకవర్గాలలో టీడీపీ అసెంబ్లీ అభ్యర్థుల కన్నా హరీష్‌కు ఎక్కువ ఓట్లు వచ్చాయి. అప్పటి నుంచి పార్లమెంటు స్థానంలో పోటీ చేసే లక్ష్యంతో పనిచేస్తున్నారు. అయితే టీడీపీ అధిష్టానం డబ్బు లేదనే ఉద్దేశంతో హరీష్‌ను పక్కన పెట్టేందుకు యత్నిస్తోంది. హరీష్‌కు క్యాడర్‌లో పట్టు లేదని సాకుగా చూపుతోంది. హరీష్ మరీ పట్టుబడితే పీ గన్నవరం, లేదా అమలాపురం అసెంబ్లీకి పంపించాలని పార్టీ అధినేత చంద్రబాబు ఒక నిర్ణయానికి వచ్చారని సమాచారం. ఈ విషయాన్ని హరీష్‌కు చెప్పేశారని పార్టీవర్గాలు చెబుతున్నాయి. దీంతో అలిగిన హరీష్ వారం పాటు అజ్ఞాతంలోకి వెళ్లారు. అయినా అధిష్టానం చలించలేదు. డబ్బు లేనందున హరీష్‌కు ఎంపీ సీటు ఇవ్వలేమని తేల్చిచెప్పినట్టు తెలుస్తోంది.

పాము'కొనేనా'!

హరీష్ స్థానంలో ఇటీవల పార్టీలో చేరిన మాజీ ఎంపీ ఏజేవీబీ మహేశ్వరరావు కుమార్తె, పాము సత్యశ్రీని పార్లమెంట్‌కు పంపితే ఎలా ఉంటుంది అనేదానిపై టీడీపీ ఆలోచన చేస్తోంది. ఆమె పార్టీలో కొత్తగా చేరినా.. ఆర్థికంగా స్థితిమంతురాలు కావడంతో అధినేత మొగ్గు చూపుతున్నారని తెలిసింది. గుంటూరుకు చెందిన ఒక పారిశ్రామికవేత్త కూడా అమలాపురం ఎంపీ టికెట్‌పై ఆశతో త్వరలో టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నట్టు సమాచారం. ఆయన అభ్యర్థిత్వాన్నీ బాబు పరిశీలిస్తున్నారని తెలుస్తోంది. దీంతో బాలయోగి అభిమానులు ఆవేదన చెందుతున్నారు.

'ఆనంద'రావుకు దుఃఖమేనా!





హరీష్ అసెంబ్లీకి వెళ్లేందుకు అంగీకరిస్తే అమలాపురం, పీ గన్నవరంలో ఒక దానిని ఎంపిక చేసుకోవాలని పార్టీ అధిష్టానం సూచించిందని తెలిసింది. ఆయనను అమలాపురం నుంచి అసెంబ్లీ బరిలో నిలపాలని మాజీ హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప తీవ్రంగా యత్నిస్తున్నట్టు సమాచారం. రాజప్పతోపాటు ఆయన వర్గం హరీష్‌ను ఒప్పించే యత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. హరీష్‌ను అమలాపురం అసెంబ్లీ బరిలో నిలపడం ద్వారా ఈ సీటు ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు చెక్ పెట్టాలని రాజప్ప యోచిస్తున్నారు. ఒకప్పుడు తన శిష్యుడైన ఆనందరావు ఎదురు తిరగడంతో గత ఎన్నికల్లో ఆయనకు టికెట్ రాకుండా రాజప్ప చివరి వరకు విఫలయత్నం చేశారు. ఈసారి ఆనందరావుకు ఎలాగైనా సీటు రాకుండా చేయాలని పావులు కదుపుతున్నారు.

అప్పులపై అబద్ధాల డప్పు..

పదే పదే అనధికార అప్పులు అంటూ తప్పుడు ప్రచారం

- దీన్ని వక్రీకరిస్తూ ఒక్క ఏపీనే అప్పు చేస్తోందంటూ ఈనాడు దుష్ప్రచారం
- బాబు హయాంలో కూడా ఆర్‌బీఐ నిర్ధారించిన తేదీలు, వారాల్లోనే అప్పులు చేశారు
- కాగ్ గణాంకాలు స్పష్టంగా ఉన్నా అంచనాలు, అనధికారిక లెక్కలంటూ రామోజీ పదే పదే అబద్ధాలు
- బాబు దిగిపోయే నాటికి చేసిన అప్పుల్లో రూ.1,03,550 కోట్లు ఏడేళ్లలో చెల్లించాలని కాగ్ చెప్పింది
- ఇది రామోజీకి ఎప్పటికీ కనిపించదు.. ఎందుకంటే బాబు పాలన అంటే ఇష్టం
- జగన్ అంటే అసూయి, ద్వేషం, కక్ష.. అందుకే అప్పులపై విషప్రచారం
- 2021-22 నుంచి 2030-31 వరకు అసలు, వడ్డీ కలిపి చెల్లించాల్సిన అప్పులు రూ.3.36 లక్షల కోట్లు
- మరి రామోజీకి పది లక్షల కోట్లు ఎక్కడ నుంచి వచ్చాయి?
- బాబు హయాంలో అప్పులపై సగటు వడ్డీ 6.52 శాతం.. అదే ఇప్పుడు 6.15 శాతమే
- అమరావతి పేరుతో బాబు తీసుకున్న రుణాలకు వడ్డీ 10.45 శాతం
- ఇదీ ఈనాడు రామోజీకి కనిపించదు
- జగన్ సర్కారుపై తప్పుడు ప్రచారమే రామోజీ లక్ష్యం

టీడీపీ అప్పులకు ఈ ఏడాది కట్టాల్సిన వడ్డీ రూ.17వేల కోట్లు..

2023–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో వడ్డీల చెల్లింపులకు కేటాయించిన రూ.28,6ෞ73.71 కోట్లలో టీడీపీ హయాంలో చేసిన అప్పులకే రూ.17,142.71 కోట్లు కట్టాల్సి వస్తోంది. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న అప్పులకు వడ్డీ చెల్లింపులు రూ.11,531 కోట్లే. వాస్తవాలిలా ఉంటే.. మొత్తం రూ.28,673.71 కోట్ల వడ్డీ ఈ ప్రభుత్వం తీసుకున్న అప్పులపైనే చెల్లిస్తున్నట్లు ఈనాడు వక్రీకరిస్తూ ప్రజలకు తప్పుడు సమాచారం అందించింది. నిజానికి.. అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వమైన గత ప్రభుత్వాలు చేసిన అప్పులకు అసలు, వడ్డీలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ వాస్తవాలేమీ చెప్పకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అప్పులకే అసలు, వడ్డీలు రూ.10 లక్షల కోట్లు చెల్లించాలంటూ రామోజీ ఇష్టమొచ్చినట్లు రాసిపారేశారు.

కాగ్ నివేదిక ప్రకారం రాబోయే పదేళ్లలో అసలు, వడ్డీల చెల్లింపు భారం ఇలా.. (రూ.కోట్లలో)

సంవత్సరం	అసలు	వడ్డీ	మొత్తం
2021-22	12,513.60	20,504.12	33,017.72
2022-23	13,985.53	21,219.33	35,204.86
2023-24	15,613.56	20,026.97	35,640.53
2024-25	23,854.57	18,393.58	42,248.15
2025-26...	22,416.73	16,744.76	39,161.49
2026-27..	20,010.99	15,085.82	35,096.81
2027-28..	15,336.32	13,728.62	29,064.94
2028-29..	17,642.44	12,467.94	30,110.38
2029-30	14,806.81	11,299.20	26,106.01
2030-31	20,470.55	10,226.94	30,697.49
మొత్తం	1,76,651.10	1,59,697.28	3,36,348.38

జీఎస్‌డీపీలో అప్పుల శాతం.. (రూ.కోట్లలో)

వివరం	విలువ
టీడీపీ ప్రభుత్వ హయాంలో..	
జూన్ 2014 నాటికి పీఎస్‌యూలతో కలిపి రాష్ట్ర అప్పులు	1,53,346.80
మే 2019 నాటికి పీఎస్‌యూలతో కలిపి రాష్ట్ర అప్పులు	4,12,288.00
టీడీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో పెరిగిన అప్పులు	2,58,941.20
టీడీపీ ఐదేళ్ల కాలానికి మొత్తం రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ	34,73,475.00
టీడీపీ హయాంలో జీఎస్‌డీపీలో అప్పుల వాటా	7.45 శాతం
వైఎస్సార్‌సీపీ హయాంలో..	
మే 2019 నాటికి పీఎస్‌యూలతో కలిపి రాష్ట్ర అప్పులు	4,12,288.00
సెప్టెంబరు 2023 నాటికి పీఎస్‌యూలతో కలిపి రాష్ట్ర అప్పులు	7,00,100.58
4.4 ఏళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అప్పులు	2,87,812.58
4.4 ఏళ్ల కాలానికి రాష్ట్ర జీఎస్‌డీపీ విలువ	50,72,119.00
4.4 ఏళ్ల కాలానికి రాష్ట్ర జీఎస్‌డీపీలో అప్పుల వాటా	5.67 శాతం

సాక్షి, అమరావతి : చెప్పిందే చెప్పరా పాచిపళ్ల దాసరా.. అన్నట్లుగా ఉంది ఈనాడు రామోజీ తీరు. తన ఆత్మబంధువు చంద్రబాబు మీద ఎక్కడలేని పిచ్చి ప్రేమ.. సీఎం జగన్‌పై అర్థంపర్థంలేని అక్కసు, అసూయ, ద్వేషంతో ఆయన నిత్యం అసత్యాల వ్రతం చేస్తూ తన విషపుత్రిక ఈనాడులో అశుద్ధ కథనాలు వండివార్చడమే పనిగా పెట్టుకున్నారు. చెప్పిందే చెప్పి.. రాసిందే రాస్తూ జగన్‌పై తన కడుపుమంటను చాటుకుంటున్నారు. ఇందులో భాగమే తాజాగా ఆదివారం ఈనాడులో రామోజీ తన విలువల వలువలన్నీ విడిచేసి సిగ్గూఎగ్గూ లేకుండా రాష్ట్ర అప్పులపై పచ్చి అబద్ధాలతో 'వారం వారం రుణ పురాణం'.. పేరుతో జగన్ సర్కారుపై మళ్లీమళ్లీ పిచ్చి ప్రేలాపనలు పేలారు.



అనధికార అప్పులుండవని తెలిసినా..

నిజానికి.. ప్రభుత్వాలకు అనధికార అప్పులుండవని తెలిసినా సరే అనధికార అప్పులంటూ తన పాఠకులను రామోజీ ఉద్దేశపూర్వకంగా మోసం చేస్తున్నారు. ఒక అబద్ధాన్ని పదేపదే చెబితే ప్రజలు నమ్ముతారనుకునే చంద్రబాబు సిద్ధాంతాన్ని రామోజీ తూచా తప్పకుండా పాటిస్తూ అబద్ధాలను అచ్చేస్తున్నారు. చట్టాలు, నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి పేరుతో అనధికారికంగా డిపాజిట్లు సేకరించడం ఈనాడు రామోజీకి చెల్లుతుంది తప్ప ఈ దేశంలో కేంద్ర ప్రభుత్వానికి గానీ ఏ రాష్ట్ర ప్రభుత్వానికి గానీ అనధికార అప్పులనేవి ఉండనే ఉండవు. ఈ విషయం తెలిసినా సరే రామోజీ పదేపదే జగన్ సర్కారుపై విషప్రచారానికి తెగబడుతూనే ఉన్నారు. ఆయన తాజా కథనంలో అక్కసు, కక్ష, అసూయ తప్ప ఒక్క వాస్తవం కూడా లేదు. గత చంద్రబాబు హయాం నుంచి రాష్ట్రాల అప్పులకు ఏ నెలలో ఏ తేదీన సెక్యూరిటీల విక్రయం చేయాలనేది ఆర్‌బీఐ నిర్ణయిస్తోంది. అందుకనుగుణంగా గత చంద్రబాబు ప్రభుత్వంతో పాటు మిగతా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీనెలా ఆయా తేదీల్లో సెక్యూరిటీల విక్రయం ద్వారా అప్పులు చేస్తూ వస్తున్నాయి. ఇప్పుడు కొత్తగా వారం వారం జగన్ సర్కారు ఒక్కటే అప్పులు చేయడంలేదు. ఇక మంగళవారం ఏపీతో సహా మొత్తం 13 రాష్ట్రాలు రూ.24,280 కోట్ల మేర అప్పులు చేయనున్నాయి. దాన్ని వక్రీకరిస్తూ ఆంధ్రప్రదేశ్ ఒక్కటే మంగళవారం రూ.1,100 కోట్లు అప్పు చేస్తోందంటూ ఈనాడు రామోజీ చేతికొచ్చింది ఇష్టా రాజ్యంగా రాసిపారేశారు.

తప్పుడు రాతలు.. దొంగ లెక్కలు..

నిజానికి.. చంద్రబాబు గత ఎన్నికల ముందు ఏప్రిల్ 5న, ఏప్రిల్ 30న ఏకంగా రూ.5,500 కోట్లు అప్పుచేశారు. ఆ అప్పు కూడా 16 నుంచి 20 ఏళ్లలో తీర్చేలా చేశారు. ఇది ఈనాడు రామోజీకి తప్పుగా కనిపించలేదు. ఎందుకంటే చంద్రబాబు అంటే రామోజీకి ఎక్కడలేని ప్రేమ. ఇప్పుడు జగన్ అంటే నచ్చదు కాబట్టి నిబంధనల మేరకు అప్పులు చేస్తున్నా తప్పుగా కనిపిస్తాయి. రాష్ట్ర రుణాల మొత్తం, వడ్డీలు కలిపి చెల్లింపు భారం రూ.10 లక్షల కోట్లకు చేరిందంటూ పచ్చి అబద్ధాలను రామోజీ గుడ్డిగా అచ్చేశారు. దానికి కార్పొరేషన్ అప్పులను కూడా కలిపితే ఇలా ఉండవచ్చు అంటూ సొంత పైత్యాన్ని జోడించారు. రాష్ట్ర అప్పులకు సంబంధించి భవిష్యత్తు చెల్లింపుల భారం గురించి కాగ్ నివేదికలో వాస్తవాలున్నా సరే అనధికారం, అంచనాల పేరుతో రామోజీ ఊహాగాన అంకెలతో నిస్సిగ్గుగా అచ్చేశారు. గత చంద్రబాబు ప్రభుత్వం చేసిన అప్పులను కూడా ఇప్పుడు వైఎస్ జగన్ ప్రభుత్వ తీరుస్తోంది. ఇదే విషయాన్ని కాగ్ చెప్పినా ఆయనకు కనిపించదు. ఎందుకంటే అది చంద్రబాబుకు ఇబ్బంది కాబట్టి. 2019 మార్చి 31 నాటికి చేసిన అప్పుల్లో వచ్చే ఏడేళ్లలో రూ.1,03,550 కోట్లు అంటే 53.51 శాతం చెల్లించాల్సి వస్తుందని కాగ్ నివేదిక స్పష్టంగా పేర్కొంది. ఇంత మొత్తంలో చెల్లింపుల భారం ఉన్నందున అందుకు తగిన ప్రణాళికతో అదనపు రెవెన్యూ వనరులను సమీకరించుకోవాల్సి ఉందని, లేదంటే అభివృద్ధికి నిధులుండవని కాగ్ పేర్కొంది. వాస్తవాలిలా ఉంటే.. ఈనాడు రామోజీ జగన్ సర్కారుపై ఈర్ష్యతో అవాస్తవ గణాంకాలతో విషప్రచారానికి తెగబడుతున్నారు. 2022 మార్చి వరకు కాగ్ ఇచ్చిన నివేదికలో కూడా వచ్చే పదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన అసలు అప్పులు, వడ్డీ కలిపి రూ.3.36 లక్షల కోట్లు మాత్రమే ఉందని కాగ్ స్పష్టంచేసినా, చెల్లింపుల భారం రూ.పది లక్షల కోట్లకు పెరిగిదంటూ రామోజీ పచ్చి అబద్ధాలతో పేట్రేగిపోయారు.

ఇవేవీ రామోజీకి కనిపించవా?

రాష్ట్రంలో అభివృద్ధి లేదంటూ గగ్గోలు పెడుతున్న రామోజీకి వైఎస్ జగన్ సర్కారు కొత్తగా నిర్మిస్తున్న 17 మెడికల్ కాలేజీలు, నాలుగు పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్లు, రెండు విమానాశ్రయాలు, అలాగే.. గ్రామాల్లో 15 వేల సచివాలయాలు, 10,778 రైతుభరోసా కేంద్రాలు, 10,032 విలేజ్ హెల్త్ క్లినిక్స్, 542 అర్బన్ హెల్త్ క్లినిక్స్ కనిపించడంలేదా. వైద్య రంగంలో నాడు–నేడు పేరుతో 16 వేల కోట్లతో ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పన, మనబడి నాడు–నేడు పేరుతో ప్రభుత్వ స్కూళ్లలో 16 వేల కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన కనిపించడంలేదా? చంద్రబాబు హయాంలో ఒక్క మెడికల్ కాలేజీగానీ, ఒక్క ప్రభుత్వ ఆస్పత్రిగానీ కట్టకపోయినా రామోజీ కళ్లకు అప్పుడంతా లేని అభివృద్ధి కలర్‌ఫుల్‌గా కనిపించింది. ఎందుకంటే బాబు అంటే ఇష్టం.. జగన్ అంటే కోపం.

వడ్డీ శాతంపైనా వంకర రాతలు..

ఇక 2017–18 చంద్రబాబు హయాంలో రాష్ట్ర అప్పులపై సగటు వడ్డీ 6.52 శాతం ఉందని, అదే 2021–22లో అప్పులపై సగటు వడ్డీ 6.15 శాతమేనని కాగ్ నివేదిక స్పష్టంచేసింది. అయినా సరే.. రామోజీ ఈ వాస్తవాలను పట్టించుకోకుండా సొంత గణాంకాలతో జగన్ సర్కారుపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారు. మూలధన వ్యయం కూడా గత చంద్రబాబు ఐదేళ్లలో కన్నా ఇప్పటి జగన్ సర్కారులో ఎక్కువగా ఉన్నప్పటికీ తప్పుడు గణాంకాలను ఈనాడు రాసింది. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో సగటు మూలధన వ్యయం రూ.15,227.80 కోట్లు ఉండగా.. వైఎస్ జగన్ సర్కారులో అది రూ.17,991.21 కోట్లుగా ఉంది. ఇక రెవెన్యూ రాబడులు కూడా పెరగడం లేదంటూ రామోజీ మరో అబద్ధాన్ని రంగరించారు. చంద్రబాబు హయాంలో 2014 నుంచి 2019 వరకు రెవెన్యూ రాబడి కేవలం 6 శాతమే పెరిగింది. అదే వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలనలో రెవెన్యూ రాబడి 16.7 శాతం పెరిగింది. కోవిడ్ సంక్షోభం లేకున్నా బాబు హయాంలో రాబడి పెరగకపోయినా పెన్నెత్తని రామోజీ.. ఇప్పుడు కోవిడ్ సంక్షోభంలోనూ రాబడి పెరిగినా సన్నాయినొక్కులు నొక్కుతున్నారు. మరోవైపు.. అమరావతి రాజధాని పేరుతో చంద్రబాబు ప్రభుత్వం బాండ్లు, బ్యాంకులు నుంచి 10.32 నుంచి 10.45 శాతం వరకు అధిక వడ్డీలతో అప్పులుచేసి రాష్ట్రంపై భారం మోపినా రామోజీ కిమ్మనలేదు. ఇప్పుడు జగన్ సర్కారు తక్కువ వడ్డీలకే అప్పులు పుడుతున్నా ఆయనకు తప్పుగా కనిపిస్తోంది.

ఆ సీటు.. శ్రీధర్‌కు డౌటు

లోకేశ్ ఆశీస్సులతో పోటీ చేస్తానంటున్న కొమ్మాలపాటి శ్రీధర్

- ఆయన అభ్యర్థిత్వంపై సానుకూలంగా లేని చంద్రబాబు
- శ్రీధర్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్న టీడీపీలోని ఓ వర్గం
- పొత్తుల్లో తెనాలి సీటు జనసేనకు కేటాయించే చాన్స్

సాక్షి, నరసరావుపేట: పెదకూరపాడు అసెంబ్లీ స్థానం నుంచి రానున్న ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసేందుకు సరైన అభ్యర్థి లేక ఆ పార్టీ అయోమయంలో పడింది. ప్రస్తుతం ఆ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న కొమ్మాలపాటి శ్రీధర్ పట్ల చంద్రబాబు ఏమాత్రం సానుకూలంగా లేరు. నియోజకవర్గంలో పార్టీ క్యాడర్ లో ఆయన పట్ల సదభిప్రాయం లేకపోవడమే దీనికి కారణంగా తెలుస్తోంది. మరోవైపు 2019లో కొమ్మాలపాటిపై 14 వేలకు పైగా మెజార్టీతో విజయం సాధించిన నంబూరు శంకరరావు పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలతో నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియోజకవర్గంలో చరిత్రలో ఎప్పుడూ లేనంతగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసింది. దీంతో మరోసారి ఇక్కడ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని సర్వేలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా మంచి అభ్యర్థి కోసం టీడీపీ వెతుకులాట ప్రారంభించింది. అయితే నారా లోకేశ్ ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయని, తానే మరోసారి పోటీ చేస్తానంటూ శ్రీధర్ తన వర్గానికి ధైర్యం చెబుతున్నారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలో జరిగిన ఇసుక, మట్టి దోపిడీల్లో లోకేశ్ బాబుకు భారీగా వాటాలు వెళ్లాయని అందుకే శ్రీధర్ పట్ల చినబాబు సానుకూలంగా ఉన్నట్లు ఆయన వ్యతిరేక వర్గం ప్రచారం చేస్తోంది.

ఆలపాటి రాజాకు చాన్స్

టీడీపీ-జనసేన పొత్తులో భాగంగా తెనాలి స్థానాన్ని జనసేన ముఖ్యనేత నాదెండ్ల మనోహర్‌కు ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో అక్కడ ఉన్న మాజీ మంత్రి, సీనియర్ నేత ఆలపాటి రాజాకు టీడీపీ ప్రత్యామ్నాయం చూపాల్సి ఉంటుంది. ఆయన గుంటూరు వెస్ట్ కావాలని అడుగుతుండగా, పార్టీ మాత్రం గుంటూరు పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయమని సూచిస్తున్నట్టు సమాచారం. ఎంపీగా పోటీ చేసేందుకు రాజా సుముఖత చూపడం లేదని తెలిసింది. ఈ నేపథ్యంలో ఆలపాటిని పెదకూరపాడు పంపుతారనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. ఇక్కడ ఆయన సామాజిక వర్గంలో పెద్ద, చిన్న అని రెండు వర్గాలు ఉండగా అధిక మొత్తంలో ఉన్న చిన్న వర్గానికి చెందిన వారు ఆలపాటికే సీటు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల టీడీపీలోకి చేరిన కొంతమంది నియోజకవర్గ స్థాయి నేతలు సైతం రాజాకే టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. కాగా ఎమ్మెల్యే సీటు ఆశించి పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఓ ఎన్ఆర్ఐ సైతం శ్రీధర్‌కు టికెట్ రాకుండా ఉండేందుకు తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో కొమ్మాలపాటి సీట్‌కు రాజా రూపంలో ప్రమాదం ముంచుకొస్తోంది. అయితే తన వియ్యంకుడు శ్రీధర్‌కే టికెట్ ఇవ్వాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు పట్టుబడుతున్నట్టు సమాచారం. శ్రీధర్ విజయానికి తాను సైతం కృషి చేస్తానని పార్టీ అధినేతకు వివరించినట్లు తెలిసింది. ఆలపాటి రాజాకు గుంటూరులోనే ఏదో ఒక చోట సీటు కేటాయించాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేసినట్లు తెలుగు తమ్ముళ్లు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొమ్మాలపాటి శ్రీధర్‌కు సీటు గల్లంతవ్వడం ఖాయమన్న సంకేతాలు వస్తున్నాయి.



తండ్రి మాటను జవదాటని తనయుడు, సోదరులను అభిమానించిన అన్న, అలిని అనునిత్యం మనుసులో నిలుపుకున్న భర్త, స్నేహధర్మాన్ని పాటించిన మిత్రోత్తముడు. ఈ బంధాలు ఎన్ని ఉన్నా... ధర్మం తప్పకుండా ప్రజల కోసమే నిరంతరం పాటుపడిన ప్రభువు. మొత్తంగా మనిషి అనేవాడు ఇలా జీవించాలని చూపించినవాడు మర్యాదా పురుషోత్తముడు శ్రీరాముడు.

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం సాక్షాత్తూ శ్రీమహావిష్ణువే త్రేతాయుగంలో రాముడిగా అవతరించాడని రామాయణ మహాకావ్యం చెబుతోంది. మహావిష్ణువు అవతారమే అయినప్పటికీ ఎక్కడా మహిమలు చూపలేదు. మాయలు చేయలేదు. ముమ్మూర్తులా మానవుడిలాగే వ్యవహరించాడు. మానవుల లాగే కష్టాలననుభవించాడు. నిందలు మోశాడు. బాధలు పడ్డాడు. చిన్న చిన్న సంతోషాలనూ, సరదాలనూ కూడా

జగదానంద కారకునికి జేజేలు

మామూలు మనుషులలాగే అనుభవించాడు. అయితే ఎక్కడా ఎప్పుడూ ధర్మాన్ని తప్పలేదు. ఆపత్సమయంలోనూ ధర్మాన్నే అనుసరించాడు. ధర్మాన్నే ఆచరించాడు. ఒక విధంగా చెప్పాలంటే ధర్మమంటే ఇదే అన్నట్టుగా ప్రవర్తించాడు. రాముడు అనుసరించిన మార్గం కనుకనే ఆయన చరితామృతానికి రామాయణమనే పేరు వచ్చింది.

షోడశ మహాగుణ సంపన్నుడు

వాల్మీకి మహర్షి రామాయణంలో రాముడి లక్షణాల గురించి వర్ణిస్తూ షోడశ మహా గుణాలు ఆయనలో ఉన్నట్లు తెలిపాడు. పితృవాక్పాలకుడిగా పేరు పొందాడు. తండ్రి దశరథుడి మాటను ఎన్నడూ జవదాటలేదు. కన్నతల్లి కౌసల్యతో సమానంగా సవతి తల్లులైన సుమిత్ర తోనూ, తనను అడవులకు పంపిన కైకతోనూ కూడా ప్రియంగానే మెలిగాడు.

సోదర ప్రేమకు పెట్టింది పేరు

సోదర ప్రేమ రాముని చూసి నేర్చుకోవలసిందే. తమ్ముడు లక్ష్మణుని ఎంతగానో ప్రేమించాడు. కొద్దిపాటి దుడుకు స్వభావి అయినప్పటికీ అతడిని ఏనాడూ పల్లెత్తు మాటనలేదు. ఇంద్రజిత్తు ప్రయోగించిన బాణానికి లక్ష్మణుడు మూర్ఛిల్లితే ఒక అతి సాధారణమైన అన్నయ్యలాగే తల్లడిల్లాడు. తమ్ముణ్ణి తిరిగి మామూలుగా చూసేంత వరకు స్థిమిత పడలేకపోయాడు. భరతునితో కూడా ఎంతో వాత్సల్యంతో మెలిగాడు. తాను వనవాసం పూర్తి చేసుకుని వచ్చేటప్పుడు తాను వస్తున్న వార్తను భరతుడికి చేరవేసి, అతడి ముఖ కవళికలలో ఏమైనా మార్పు వచ్చిందేమో జాగ్రత్తగా గమనించి తనకు చెప్పమంటూ నమ్మిన బంటు హనుమను అందుకు నియోగించాడు. ఒకవేళ భరతుడు గనక రాజుగా ఉండేందుకు ఇష్టపడితే అందుకు తానేమీ అడ్డుపడదలచుకోలేదు. అంతే కాదు, శత్రుఘ్నుని కూడా అమితంగా ప్రేమించాడు. లవణాసురుడనే రాక్షసుని వధకు శత్రుఘ్నునే నియోగించాడు. అతడు జయించిన రాజ్యాన్ని అతడికే అప్పగించాడు. అందుకే ఆదర్శవంతులైన అన్నదమ్ములను రామలక్ష్మణుల్లా ఉన్నారంటారు.

మర్యాదా పురుషోత్తముడు

శ్రీరాముడు అందరికీ ఆదర్శప్రాయుడు. తన పంచేంద్రియాలపై పూర్తి నియంత్రణను కలిగి ఉన్నవాడు. ఆలోచనాపరుడు. అహంకారం లేని వాడు. అందువలనే పురుషోత్తముడిగా గుర్తింపు పొందాడు. శ్రీరాముడి పాద స్పర్శతో అయోధ్యా నగరం పావనమైంది. అడవులు ధన్యమైనాయి.

ఆత్మశత్రువుని అధిగమించాడు

కామం, కోపం, అత్యాశ, అసూయ వంటి అవలక్షణాలు కలిగిన రావణుడిని ఆత్మ శత్రువుగా పేర్కొంటారు. రావణుడి వధతో శ్రీరాముడు ఈ లక్షణాలను కూడా వధించాడని రామాయణం రుజువు చేస్తుంది.

ఏక పత్నీవ్రతుడు

నేటి సమాజంలో ఒక భార్యను కలిగి ఉండటం అనేది ఒక కట్టుబాటుగా మారింది. శ్రీరాముడి కాలంలో రాజులకు ఎందరో భార్యలు కలిగి ఉండేవారు. అటువంటి సమయంలో కూడా శ్రీరాముడు ఏకపత్నీవ్రతుడిగా పేరొందాడు. మనసా వాచా కర్మణా ప్రేమించిన సీతాదేవిని తప్ప మరొక మహిళ వంక కన్నెత్తి చూడలేదు. ఏకపత్నీవ్రతుడిగా పేరొందాడు.

స్మిత పూర్వభాషిగా శ్రీరాముడికి పేరు. అంటే అవతలి వారు తనను పలకరించేవరకు వేచి చూడాలని అనుకోడు. ముందుగా తానే వారిని మాట్లాడించేవాడు. అంతటి మర్యాదా పురుషోత్తముడు. అటువంటి ఆదర్శమూర్తి, ధర్మప్రభువు... ఆయన నడయాడిన పుణ్యపుడమిగా పేర్కొంటున్న అయోధ్యలో బాల రాముడిగా నేడు విగ్రహ రూపంలో కొలువుతీరనున్నాడు. ఈ శుభ సందర్భంలో ఆ జగదానంద కారకుడికి జేజేలు చెబుదాం...

– డి.వి.ఆర్.

వాగ్గేయకార వైభవం

చదువులో కాదు.. అనుభవంలో ...

త్యాగరాజ స్వామి ఒక కీర్తనలో...'' గురులేక ఎటువంటి గుణికి తెలియగబోదు... కఱుకైన హృద్రోగ గహనమును గొట్ట....'' అంటారు. ఎటువంటి గుణాలయినా ఉండొచ్చు. ఎంత తెలివిగలవాడయినా కావొచ్చు. ఏది తెలియాలో అది తెలియాలంటే మాత్రం గురువు ఉండి తీరాలి. ఏది తెలియాలి... అంటే.. కరుకైన హృద్రోగమును గహనమును కొట్ట... హృద్రోగం చాలా కరుకైనదే.. ఊపిరి అందని వాడికి అది పరీక్షాకాలం... ఇంత మందిని విడిచిపెట్టి పోతున్నానన్న భావన.. అది కరుకైనది... దానిని గహనమున కొట్ట... అంటే అరణ్యంలా.. ఎలా చేస్తున్నాడో తెలియకుండా దానిని కొట్టగలిగినవాడు గురువు... అన్నాడు. తెలియని విషయాలు తెలియకుండా పోవడం... తెలియవు అన్నంత వరకు పనికొస్తాయేమో గానీ.. ఆత్మ అనుభవంలోకి రావడం... అద్వైతానుభూతిని పొందడం... అన్న దగ్గరకు వస్తే అది గురువు గారి వీక్షణములచేత మాత్రమే సాధ్యమవుతుంది.. అంటాడు త్యాగయ్య.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అమ్మవారిని మూడు రకాలుగా – కామాక్షి, మీనాక్షి, విశాలాక్షి అని... అక్షి సంబంధంగా పిలుస్తారు. ఆమె గురు మండల రూపిణి. గురువులు కూడా మూడు రకాలుగా అనుగ్రహిస్తారు. కామాక్షి–కుక్కుట న్యాయం.. అలాగే గురువు హస్త మస్తక సంయోగంలో శిష్యుడి బ్రహ్మస్థానం లో తన చేతిని ఉంచి అనుగ్రహిస్తాడు. అది పక్షి గుడ్డును పొదిగి దాని నుంచి పిల్ల వచ్చేటట్లుగా చేయడంలాగా ఉంటుంది. అలా పొదుగుతాడు శిష్యుడిని. అదే స్పర్శ దీక్ష.



రెండవది మీనాక్షి. విజ్ఞాన శాస్త్రంలో ఎలా ఉందనే విషయం పక్కనబెడితే యోగశాస్త్రంలో చెప్పిన ప్రకారం చేపగుడ్లు పెట్టి, వాటిని ప్రేమగా చూసిన మాత్రం చేత అవి పిల్లలవుతాయి.. అంటుంది. అలా గురువు కేవలం తన చూపులతో శిష్యుణ్ణి అనుగ్రహిస్తాడు. అలా భగవాన్ రమణులు ఒకసారి అనుగ్రహించారు. అది మీనాక్షి.

మూడవది విశాలాక్షి. బ్రహ్మాండం ఎంతవరకు ఉంటుందో అంతవరకు పరదేవత చూస్తుంటుంది. అందరూ తన బిడ్డలే అన్న స్మరణతో అనుగ్రహిస్తుంటుంది. 'వాడు వృద్ధిలోకి రావాలి' అని గురువు గారు సంకల్పించినంత మాత్రం చేత శిష్యుడు ఆ స్థితిని పొందుతాడు. అది విశాలాక్షీ తత్త్వం.

నిజానికి కామాక్షి, మీనాక్షి, విశాలాక్షి... ఈ మూడూ కూడా శిష్యుడి వైపునుంచి గురువుకు, గురువు వైపునుంచి శిష్యుడికి ఉంటాయి. అదొక విచిత్రం. తెలిసినా తెలియక పోయినా నన్ను గురువుగారు ఒకసారి ముట్టుకుంటే చాలు, చూస్తే చాలు, స్మరిస్తే చాలు.. అన్న నమ్మకం ఉంటే... వాడు గురి కలవాడు. ఎవరి మీద అది ఉందో వారు గురువయిపోతారు. వాడి కరుకైన హృద్రోగమును గహనమును కొట్ట... అంటే అలా కొట్టగలిగిన వాడు గురువు.. అంటున్నాడు త్యాగరాజు. అజ్ఞాన గ్రంథులను తొలగించి జ్ఞానాన్ని కలుగ చేయాలి అంటే... ఒక సద్గురువు ఉండాలి.

అప్పుడు భగవంతుని దర్శనం.. ఆత్మ అనుభవంలోకి వచ్చి... శాశ్వతమైనది, సత్యమైనది, నిత్యమైనది, నిరంజనమైనది, నిష్కళంకమైనది... అయిన ఆత్మ నేను తప్ప శరీరం కాదు... అని శ్లోకాల్లో చెప్పినవి, నోటితో చెప్పినవి కాక.. అనుభవంలో తెలుసుకుంటాడు శిష్యుడు.


బౌద్ధవాణి

దిటవు గల భిక్షువు!

అది మధ్యాహ్న సమయం. ఎండ కాంతి మంతంగా ప్రసరిస్తోంది. కానీ, ఆ తోటలో చల్లగా ఉంది. తోట మధ్యలో ఉన్న చెట్టు కింద అరుగు మీద కూర్చొని ఉన్నాడు బుద్ధుడు. ఆయన ముందు కూర్చొని, చెప్పే ధర్మప్రవచనాన్ని శ్రద్ధగా వింటున్నారు భిక్షువులు. బుద్ధుడు ఒకసారి అందర్నీ కలియ చూశాడు. అందరి ముఖాలూ ప్రశాంతంగా ఉన్నాయి. కానీ వారిలో భద్దాలి భిక్షువు కనిపించలేదు. బుద్ధుడు అది గమనించాడు. భద్దాలిని పిలిపించాడు. భద్దాలి వచ్చి కూర్చొన్నాడు. ఆరోజు భిక్షువులు తీసుకునే ఆహార నియమాల గురించి మాట్లాడుతున్నాడు బుద్ధుడు. భిక్షువులు రోజుకి ఒక్కసారి మాత్రమే భుజించాలి. వారికి ఒక భిక్షాపాత్ర ఉంటుంది. ఆ పాత్ర నిండుగా, తలకట్టు వరకూ ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. ఉదయం సాయంత్రం ద్రవ పదార్థాలు తీసుకోవచ్చు. రాత్రికి భోజనం ఉండదు.

ఈ నియమం భద్దాలికి చాలా ఇబ్బందిగా ఉంది. ఆకలి బాధ పెడుతుంటే... ఆగలేక పోతున్నాడు. రాత్రికి కూడా కొంత భోజనాన్ని సంపాదించుకుని తింటున్నాడు. ఆ విషయం బుద్ధునికి తెలుసు..! అందుకే...

''భిక్షువులారా! ఏకాసన భోజనం (ఒకసారి భోజనం) చాలా మంచిది. శారీరక రోగాలూ, బాధలు లేకుండా చేస్తుంది. తేలికగా కూడా ఉంటుంది. శక్తినిస్తుంది. బలాన్ని ఇస్తుంది. ఆరోగ్యాన్నీ ఇస్తుంది.'' అని చెప్పాడు. వెంటనే భద్దాలి భిక్షువు లేచి నమస్కరించి–



''భగవాన్! నేను మాత్రం ఏకాసన భోజనం చేయాలనుకోవడం లేదు. ఎందుకంటే ఆకలికి తాళలేకపోతున్నాను. అయ్యో తక్కువ తింటున్నానే అనే భావన కలుగుతుంది. దానివల్ల ఆతురత కలుగుతుంది. చింత పెరిగిపోతుంది.'' అన్నాడు.

అప్పుడు బుద్ధుడు– ''భద్దాలీ! నీవు ఈ ఆహారాన్ని మరోవిధంగా స్వీకరింపవచ్చు. ఆ భిక్షనే ఒక్కపూట కాకుండా దాన్ని రెండు భాగాలుగా చేసుకుని ఒక భాగం మధ్యాహ్నం, మరో భాగం రాత్రికి తినవచ్చు. అలా తినడం వల్ల నీవు భిక్ష నియమావళిని అతిక్రమించిన వాడవు కావు. నీవు ఒకే భోజనంతోనే గడిపినట్లు అవుతుంది. నీవు రేపటి నుండి అలా తినవచ్చు'' అన్నాడు.

భద్దాలి అప్పటికి 'సరే' నన్నాడు. కానీ, అలాగ ఉండలేక పోయాడు. దాంతో.. అందరు భిక్షువులతో కలిసి బుద్ధుని దగ్గరకు రావడం మానాడు. నిజానికి భిక్షువులకు ఈ వర్షాకాలం మూడునెలలూ ఎంతో ధార్మిక ప్రబోధం చేస్తాడు బుద్ధుడు. వారికి గొప్ప శిక్షణ కాలం. ఆ శిక్షణకు దూరమయ్యాడు భద్దాలి. మూడు నెలలు గడిచాయి. భిక్షువులు నూతన చీవరాలు (భిక్షువులు ధరించే దుస్తులు) ధరించి ధర్మోపదేశం చేయడానికి వివిధ ప్రాంతాలకు బయలుదేరి వెళ్ళే సమయం వచ్చింది. తన తోటి మిత్రులు చెప్పగా, భద్దాలి బుద్ధుని దగ్గరకు వెళ్ళాడు. ఆయనకు నమస్కరించి... ''భగవాన్! నేను చాలా తప్పు చేశాను. పిల్లవాడిలా ప్రవర్తించాను. మూర్ఖునిలా నడుచుకున్నాను. నూతన శిక్షణ పొందలేక, వెనుకబడిపోయాను'' అని బాధపడ్డాడు.

అప్పుడు బుద్ధుడు...

''భద్దాలీ... తప్పుని తప్పుగా గ్రహించి,కోర్కెల్ని అదుపు చేసుకుని, నిగ్రహంతో ఉండేవారు ఎప్పుడూ వృద్ధి పొందుతారు'' అని అతని ముఖంలోకి దయా దృక్కులు సారించాడు బుద్ధుడు.

''ఇక నేను అందరి భిక్షువుల్లా నడుచుకుంటాను భగవాన్'' అని మోకాళ్ళపై నిలబడి నమస్కరించాడు భద్దాలి! ఆ తర్వాత దిటవు గల భిక్షువుగా నడుచుకున్నాడు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

నా పెళ్లి వార్తలు అవాస్తవం

– విజయ్ దేవరకొండ



టాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ లిస్ట్‌లో విజయ్ దేవరకొండ ఒకరు. అప్పుడప్పుడు విజయ్ దేవరకొండ పెళ్లి గురించిన వార్తలు ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతూ ఉంటాయి. తాజాగా ఈ ఏడాది ఫిబ్రవరిలో విజయ్ దేవరకొండ, రష్మికా మందన్నాల నిశ్చితార్థం జరగనుందని, వీరి వివాహ తేదీని కూడా త్వరలోనే ప్రకటిస్తారనే వార్తలు తెరపైకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఓ ఆంగ్ల మ్యాగజీన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో విజయ్ దేవరకొండ ఈ విషయంపై స్పందించారు. ''ఈ ఫిబ్రవరిలో ఎవరితోనూ నా నిశ్చితార్థం జరగదు.. పెళ్లి లేదు. నా పెళ్లి గురించిన పుకార్లు తరచూ వస్తూనే.. వినిపిస్తూనే ఉన్నాయి. రెండేళ్లకో సారి నాకు పెళ్లి చేస్తూనే ఉన్నారు'' అని చెప్పుకొచ్చారు విజయ్ దేవరకొండ. ఇక ప్రస్తుతం 'ఫ్యామిలీ స్టార్' చిత్రంతో బిజీగా ఉన్నారు విజయ్ దేవరకొండ. పరశురామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈ వేసవిలో విడుదల కానుంది.

అలా చేయడం తప్పు

– రష్మికా మందన్నా



హీరోయిన్ రష్మికా మందన్నా అంటూ మార్ఫింగ్ చేసిన ఓ డీప్ ఫేక్ వీడియో ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ విషయంపై సోషల్ మీడియా వేదికగా రష్మికా మందన్నా స్పందించారు. ''ఢిల్లీ పోలీసులకు ధన్యవాదాలు. నన్ను అభిమానిస్తూ, నాకు అండగా నిలిచేవారు నా చుట్టూ ఉన్నందుకు సంతోషిస్తున్నాను. అలాగే ఇలాంటి ఘటనలకు (మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలను ఉద్దేశించి) పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారని చెప్పడానికి ఇదొక ఉదాహరణ. అమ్మాయిలు... అబ్బాయిలు... ఎవరైనా కావొచ్చు. మీ అనుమతి లేకుండా మీ ఫొటోలను మార్ఫింగ్ చేయడం, దుర్వినియోగం చేయడం అనేవి తప్పు'' అంటూ 'ఎక్స్'లో షేర్ చేశారు రష్మికా మందన్నా. ప్రస్తుతం అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న 'పుష్ప: ది రూల్' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారామె. అలాగే 'ది గాళ్ ఫ్రెండ్', 'రెయిన్ బో' అనే ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్ కూడా చేస్తున్నారీ బ్యూటీ. వీటితో పాటు కొన్ని బాలీవుడ్ ప్రాజెక్ట్స్ కూడా ఉన్నాయి.

ఇటు హీరోగా... అటు నిర్మాతగా...



● ఆమిర్ ఖాన్

నటుడిగా ఆమిర్ ఖాన్ మేకప్ వేసుకుని దాదాపు రెండేళ్లవుతోంది. 'లాల్ సింగ్ చద్దా' (2022)లో చేసిన టైటిల్ రోల్, 'సలామ్ వెంకీ' (2022)లో చేసిన అతిథి పాత్ర తర్వాత ఆమిర్ ఖాన్ నటుడిగా మేకప్ వేసుకోలేదు. ఫైనల్‌గా ఫిబ్రవరిలో కెమెరా ముందుకు రానున్నారు. హీరోగా 'సితారే జమీన్ పర్' అంగీకరించారు ఆమిర్. ఫిబ్రవరి 2న ఈ చిత్రం షూటింగ్‌ని ఆరంభించాలనుకుంటున్నారు. కొన్ని నెలలుగా ఈ చిత్రంలోని పాత్ర కోసం ప్రిపేర్ అవుతున్నారు ఆమిర్ ఖాన్. పలు లుక్స్ ట్రై చేసి, చివరికి ఒకటి ఖరారు చేశారు. అలాగే పలుమార్లు స్క్రిప్ట్‌ని చదివారు. అన్నీ సంతృప్తికరంగా అనిపించడంతో ఫిబ్రవరిలో చిత్రీకరణ ప్లాన్ చేశారు. ఆర్.ఎస్. ప్రసన్న దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రానికి 70 నుంచి 80 రోజులు డేట్స్ ఇచ్చారు ఆమిర్. ఈ చిత్రాన్ని క్రిస్మస్‌కి విడుదల చేయాలనుకుంటున్నారు.

సన్నీ డియోల్ హీరోగా..

నిర్మాతగా 'లాహోర్: 1947' చిత్రాన్ని నిర్మించనున్నారు ఆమిర్ ఖాన్. రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలో సన్నీ డియోల్ హీరోగా ఈ చిత్రం రూపొందనుంది. ఇందులో ఆమిర్ ఖాన్ అతిథి పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఈ సినిమా మాత్రమే కాదు.. ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్‌లో (ఏకేపీ) మరో రెండు సినిమాలు ఉన్నాయి. ఒకటి ఆమిర్ భార్య కిరణ్ రావ్ దర్శకత్వంలో రూపొందిన 'లాపతా లేడీస్'. ఈ ఏడాది ప్రథమార్ధంలో ఈ చిత్రం విడుదల కానుంది. మరోటి 'ప్రీతమ్ ప్యారే'. సంజయ్ శ్రీవాస్తవ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఆమిర్ బుక్ న్యారేటర్‌గా అతిథి పాత్ర చేశారు. ఈ చిత్రం కూడా ప్రథమార్ధంలోనే విడుదల కానుంది. ఈ చిత్రం నిర్మాణ బాధ్యతలను ఆమిర్ తనయుడు జునైద్ ఖాన్ చేపట్టడం విశేషం. ఇలా హీరోగా, ఏకేపీ నిర్మించే చిత్రాలతో ఆమిర్ బిజీ.


చిన్నారులకు గుంటూరు కారం



● సితార

మహేశ్‌బాబు కుమార్తె సితార ఘట్టమనేని చీర్స్ ఫౌండేషన్‌లోని అనాథ పిల్లల కోసం తన తండ్రి నటించిన 'గుంటూరు కారం' చిత్రం ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేసింది. మహేశ్‌బాబు ఫౌండేషన్ సహకారంతో ఏఎంబీ సినిమాస్‌లో ఈ ప్రదర్శన జరిగింది. సితార ఈ స్పెషల్ స్క్రీనింగ్‌ని నిర్వహించడంతో పాటు పిల్లలతో కలిసి 'గుంటూరు కారం' చిత్రాన్ని వీక్షించింది. పిల్లలతో కలిసి సెల్ఫీ దిగింది. తమ ఫౌండేషన్ ద్వారా జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు పొందిన ఆనందం పట్ల మహేశ్ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇక త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేశ్‌బాబు, శ్రీలీల జంటగా సూర్యదేవర రాధాకృష్ణ నిర్మించిన 'గుంటూరు కారం' సంక్రాంతికి విడుదలైన సంగతి తెలిసిందే.

రామ మందిరానికి హను-మాన్ విరాళం



● తేజ సజ్జా

తేజ సజ్జా టైటిల్ రోల్‌లో ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో నిరంజన్ రెడ్డి నిర్మించిన 'హను–మాన్' ఈ సంక్రాంతికి విడుదలైన విషయం తెలిసిందే. కాగా అయోధ్యలోని రామ మందిరానికి ప్రతి టిక్కెట్ నుండి రూ. 5 విరాళంగా ఇస్తామని ప్రీ–రిలీజ్ ఈవెంట్‌లో ఈ చిత్రం యూనిట్ పేర్కొంది. ఆ మేరకు రామ మందిరానికి విరాళం అందజేశారు. ఈ సినిమా ప్రీమియర్ షోల నుండి విక్రయించిన 2,97,162 టిక్కెట్లలో రూ. 14,85,810 చెక్కును ఇప్పటికే అందించగా, ఇప్పటివరకు విక్రయించిన 53,28,211 టిక్కెట్ల నుంచి రూ. 2,66,41,055 అందిస్తున్నట్లు ప్రకటించారు. ''ప్రపంచవ్యాప్తంగా రూ. 150 కోట్ల మార్కును ఈ చిత్రం దాటింది'' అని యూనిట్ పేర్కొంది.

ఏం జరుగుతుందో ఊహించలేరు

– దర్శకుడు రాజు దుస్సా



''పాటలు, ఫైట్స్, కామెడీ... ఇవేం లేకుండా ఓ కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న సినిమా '105 మినిట్స్'. స్క్రీన్‌ప్లేను బేస్ చేసుకుని తీసిన ఈ చిత్రం ఆడియన్స్‌ను మెప్పిస్తుంది'' అన్నారు దర్శకుడు రాజు దుస్సా. హన్సిక లీడ్ రోల్‌లో రాజు దుస్సా దర్శకత్వంలో బొమ్మక్ శివ నిర్మించిన ప్రయోగాత్మక చిత్రం '105 మినిట్స్'. ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం విలేకర్ల సమావేశంలో రాజు దుస్సా మాట్లాడుతూ– ''ముందు బాలీవుడ్‌లో రైటర్‌గా చేశాను. సొంతంగా కథలు రాసుకుని, దర్శకత్వ ప్రయత్నాల్లో ఉన్నప్పుడు '105' మినిట్స్ సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ వచ్చింది. సింగిల్ క్యారెక్టర్ ఫిల్మ్ ఇది. ఓ నీడ మాత్రం కనిపిస్తుంది. కనిపించని మనిషి ఒకరు పంచభూతాలను కంట్రోల్ చేస్తూ, ఓ అమ్మాయిని ఏడిపించే ఆటే ఈ సినిమా థీమ్. సాధారణంగా కొన్ని సినిమాల్లో నెక్ట్స్ ఏం జరుగుతుంది? అని ప్రేక్షకులు ఊహిస్తుంటారు. చాలెంజ్ చేసి చెబుతున్నాను.. మా సినిమాలో నెక్ట్స్ ఏం జరుగుతుందో కూడా ఊహించలేరు'' అని చెప్పుకొచ్చారు.


క్రైమ్ కామెడీ



● 'నటరత్నాలు' పోస్టర్

ఇనయా సుల్తానా, సుదర్శన్ రెడ్డి, 'రంగస్థలం' మహేశ్, 'తాగుబోతు' రమేశ్, అర్చన ప్రధాన పాత్రల్లో నటించిన క్రైమ్ కామెడీ ఫిల్మ్ 'నటరత్నాలు'. శివ నాగు దర్శకత్వంలో చంటి యలమాటి, డా. దివ్య నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా యూనిట్ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో శివనాగు మాట్లాడుతూ– ''సినిమా ఇండస్ట్రీకి వచ్చి, సినిమా తీయాలనుకునేవాళ్లు ఎలా సఫలమవుతున్నారు? ఎలా విఫలమవుతున్నారు? ఏం చేస్తున్నారు? అనే అంశాలతో ఈ సినిమా తీశాం'' అన్నారు. ''2002లో ఓ సినిమా తీయాలని ఇండస్ట్రీకి వచ్చి, లాస్ అయ్యాను. 'నటరత్నాలు' కథ సినిమాలో సినిమాలాంటిది. ప్లాన్ చేసిన బడ్జెట్‌లోనే సినిమాను పూర్తి చేశాం'' అన్నారు చంటి యలమాటి.

చార్ జోర్



● అజయ్ దేవగన్

ఈ ఏడాది అజయ్ దేవగన్ ఫుల్ రైజింగ్‌లో ఉన్నారు. ప్రస్తుతం 'సింగమ్ ఎగైన్', 'రైడ్ 2', 'సైతాన్' సినిమాల్లో నటిస్తున్నారు. 'సైతాన్' మార్చి 8న, 'సింగమ్ ఎగైన్' ఆగస్టు 15న, 'రైడ్ 2' నవంబరు 15న రిలీజ్ కానున్నాయి. అలాగే ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన అజయ్ దేవగన్ 'మైదాన్' కూడా ఈ ఏడాదే రిలీజ్ కానుంది. ఇండియన్ మాజీ ఫుట్‌బాల్ కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ జీవితం ఆధారంగా రూపొందిన 'మైదాన్' సినిమాకు అమిత్ శర్మ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్, బోనీ కపూర్ నిర్మించిన ఈ సినిమాను 2022లోనే విడుదల చేయాలనుకున్నారు. కానీ వాయిదా పడుతూ వస్తోంది. తాజాగా 'మైదాన్'ను ఈ ఏడాది రంజాన్ సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ వెల్లడించింది. అన్నీ సవ్యంగా జరిగితే ఈ ఏడాది అజయ్ దేవగన్ చిత్రాలు 4 వెండితెరకు వస్తాయి. అంటే.. చార్ (నాలుగు) సినిమాలతో అజయ్ దేవగన్ ఈ ఏడాది ఫుల్ జోర్ అన్నమాట.

బంపర్ ఆఫర్



● అన్నా బెన్

మలయాళంలో 'హెలెన్' (2019), 'కప్పేలా' (2020) వంటి సినిమాల్లో నటించిన అన్నా బెన్‌ను ఓ బంపర్ ఆఫర్ వరించినట్లుగా తెలుస్తోంది. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'కల్కి 2898 ఏడీ' సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో దీపికా పదుకోన్ హీరోయిన్. కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్, దిశా పటానీ ముఖ్య పాత్రధారులు. రాజమౌళి, విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా మలయాళ బ్యూటీ అన్నా బెన్ పేరు తెరపైకి వచ్చింది. 'కల్కి 2898 ఏడీ' వంటి పాన్ వరల్డ్ మూవీలో చాన్స్ అంటే.. అది బంపర్ ఆఫర్ అనొచ్చు. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న రిలీజ్ కానుంది.



ఆఖరి టి20లో పాకిస్తాన్‌కు ఊరట విజయం

న్యూజిలాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌లో క్లీన్‌స్వీప్ కాకుండా పాకిస్తాన్ తప్పించుకుంది. శనివారం జరిగిన ఐదో టి20లో పాక్ 42 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. ముందుగా పాక్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. మొహమ్మద్ రిజ్వాన్ (38), ఫఖర్ జమాన్ (33) రాణించారు. కివీస్ బౌలర్లలో సౌతీ, ఇష్ సోధి, ఫెర్గూసన్, హెన్రీ తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం న్యూజిలాండ్ 17.2 ఓవర్లలో 92 పరుగులకే కుప్పకూలింది. సొంతగడ్డపై కివీస్‌కు టి20ల్లో ఇది రెండో అత్యల్ప స్కోరు. ఫిలిప్స్ (26), అలెన్ (22) మాత్రమే ఫర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇఫ్తికార్ అహ్మద్ (3/24) ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. 275 పరుగులు సాధించిన అలెన్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. తొలి నాలుగు మ్యాచ్‌లు గెలిచిన న్యూజిలాండ్ 4–1తో సిరీస్ గెలుచుకుంది.



'కొన్ని నెలల క్రితమే విడాకులు'

సానియా మీర్జా కుటుంబస్పందన

సాక్షి, హైదరాబాద్: పాక్ క్రికెటర్ షోయబ్ మలిక్‌తో విడాకులకు సంబంధించి భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా కుటుంబం స్పందించింది. షోయబ్‌తో విడిపోయిన విషయాన్ని నిర్ధారించింది. ఆదివారం తమ వైపునుంచి సానియా కుటుంబం ఒక ప్రకటన జారీ చేసింది. 'సానియా మొదటి నుంచి కూడా తన వ్యక్తిగత జీవితం గురించి గోప్యత పాటిస్తూనే వచ్చింది. అయితే ఇప్పుడు బహిరంగంగా కొంత స్పష్టతనివ్వాల్సిన అవసరం వచ్చింది. సానియా, షోయబ్ కొన్ని నెలల క్రితమే విడాకులు తీసుకున్నారు. షోయబ్ కొత్త ప్రయాణంలో అతనికి మంచి జరగాలని కోరుకుంటోంది. ఆమె జీవితంలో ఇది సున్నితమైన పరిస్థితి. కాబట్టి ఎలాంటి ఊహాగానాలను ప్రచారం చేయరాదని, ఆమె ఏకాంతానికి భంగం కలిగించరాదని అభిమానులు, శ్రేయోభిలాషులకు మా విజ్ఞప్తి' అని ఈ ప్రకటనలో ఆమె కుటుంబం పేర్కొంది. సానియా మీర్జా ప్రస్తుతం ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీకి 'సోనీ' నెట్‌వర్క్ తరఫున వ్యాఖ్యాతగా వ్యవహరిస్తోంది.

టెస్టు సిరీస్‌కు బ్రూక్ దూరం



లండన్: భారత్‌తో గురువారం నుంచి మొదలయ్యే ఐదు టెస్టుల సిరీస్‌కు ముందు ఇంగ్లండ్‌కు పెద్ద దెబ్బ తగిలింది. జట్టులో కీలకమైన మిడిలార్డర్ బ్యాటర్, అద్భుతమైన ఫామ్‌లో ఉన్న హ్యారీ బ్రూక్ ఈ సిరీస్ నుంచి తప్పుకున్నాడు. వ్యక్తిగత కారణాలతో అతను జట్టును వదిలి వెళ్లాడని, సిరీస్ మొత్తానికి అతను అందుబాటులో ఉండడని ఇంగ్లండ్ బోర్డు (ఈసీబీ) ప్రకటించింది. తొలి టెస్టు కోసం ఆదివారమే ఇంగ్లండ్ జట్టు హైదరాబాద్‌కు చేరుకుంది. బ్రూక్ స్థానంలో డాన్ లారెన్స్‌ను ఇంగ్లండ్ సెలక్టర్లు ఎంపిక చేశారు. ఇంగ్లండ్ తరఫున 11 టెస్టులు ఆడిన లారెన్స్ 551 పరుగులు చేశాడు.

జొకోవిచ్ జోరుగా...



జొకోవిచ్

- సులువైన విజయంతో క్వార్టర్స్‌లోకి
- సబలెంక, గాఫ్ కూడా
- ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో సీడెడ్ ప్లేయర్లు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా), నాలుగో సీడ్ సిన్నెర్ (ఇటలీ), మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సబలెంక (బెలారస్), నాలుగో సీడ్ కొకొ గాఫ్ (అమెరికా) క్వార్టర్స్ చేరారు. పురుషుల సింగిల్స్‌లో ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో టాప్‌సీడ్ నొవాక్ జొకోవిచ్ అతి సులువైన విజయంతో ముందంజ వేశాడు. పది సార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత అయిన జొకో 6–0, 6–0, 6–3తో అడ్రియన్ మనారినొ (ఫ్రాన్స్)ను చిత్తు చేశాడు. ఏకంగా 17 ఏస్‌లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసిన సెర్బియన్ దిగ్గజం 31 విన్నర్లతో అలవోకగా మ్యాచ్‌ని చేతుల్లోకి తెచ్చుకున్నాడు. తొలి రెండు సెట్లలో అయితే ఫ్రాన్స్ ఆటగాడిని ఖాతా తెరువకుండా చేశాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేశాడు. కేవలం గంటా 44 నిమిషాల్లోనే వరుస సెట్లలో ప్రత్యర్థి ఆట కట్టించాడు. తాజా ఫలితంతో గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో 58 సార్లు క్వార్టర్స్ ఫైనల్ చేరిన ఆటగాడిగా స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్ సరసన సెర్బియన్ సూపర్‌స్టార్ నిలిచాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనే 14 సార్లు క్వార్టర్స్ చేరిన జొకోవిచ్ 10 సార్లు ముందంజ వేసి టైటిల్ గెలువగలిగాడు.

సిట్సిపాస్ అవుట్

నిరుటి రన్నరప్, ఏడో సీడ్ స్టెఫనొస్ సిట్సిపాస్ (గ్రీస్)కు ప్రిక్వార్టర్స్‌లోనే చుక్కెదురైంది. గత మూడేళ్లలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అతనికి ఇదే నిరాశాజనక ప్రదర్శన. ఆదివారం జరిగిన పోరులో ప్రపంచ ఏడో ర్యాంకర్ సిట్సిపాస్ 6–7 (3/7), 7–5, 3–6, 3–6తో అమెరికాకు చెందిన 12వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ చేతిలో కంగుతిన్నాడు. ఈ విజయంతో అమెరికా ఆటగాడు తొలిసారి ఆస్ట్రేలియా ఓపెన్‌లో నాలుగో రౌండ్ అడ్డంకిని దాటి క్వార్టర్ ఫైనల్ చేరాడు. మిగతా మ్యాచ్‌ల్లో ఐదో సీడ్ ఆంద్రీ రుబ్లెవ్ (రష్యా)కు స్థానిక ప్లేయర్ నుంచి అసాధారణ పోటీ ఎదురైంది. సుదీర్ఘంగా 4 గంటల 14 నిమిషాల పాటు జరిగిన ఈ ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో రుబ్లెవ్ 6–4, 6–7 (5/7), 6–7 (4/7), 6–3, 6–0తో పదో సీడ్ అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా)పై చెమటోడ్చి నెగ్గాడు. దీంతో స్థానిక ఆటగాడు వరుసగా మూడో ఏడాదీ ప్రిక్వార్టర్స్‌లోనే ఇంటిబాట పట్టాడు. నాలుగో సీడ్ జానిక్ సిన్నెర్ (ఇటలీ) 6–4, 7–5, 6–3తో గత సీజన్ సెమీఫైనలిస్ట్, 15వ సీడ్ కరెన్ కచనొవ్ (రష్యా)కు షాకిచ్చాడు.

కొకొ గాఫ్ తొలిసారి...

మహిళల సింగిల్స్‌లో యూఎస్ ఓపెన్ చాంపియన్, నాలుగో సీడ్ అమెరికన్ స్టార్ కొకొ గాఫ్ తొలిసారి ఈ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సంపాదించింది. నాలుగేళ్లుగా బరిలోకి దిగుతున్న ఆమెకు రెండు సార్లు ప్రిక్వార్టర్స్‌లోనే చుక్కెదురైంది. కానీ ఈ సారి ఆమె 6–1, 6–2తో మగ్దలెన ఫ్రెచ్ (పోలాండ్)పై సునాయాస విజయంతో ముందంజ వేసింది. కేవలం గంట 3 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించడం విశేషం. రెండో సీడ్ అరినా సబలెంక (బెలారస్) 6–3, 6–2తో అమండ అనిసిమొవ (అమెరికా)పై గెలుపొందగా, 9వ సీడ్ క్రెజిసికొవా (చెక్ రిపబ్లిక్) 4–6, 6–3, 6–2తో మిర అంద్రీవా (రష్యా)పై విజయం సాధించింది.



గాఫ్

సాత్విక్ - చిరాగ్ జోడీకి నిరాశ

ఇండియా ఓపెన్‌లో రన్నరప్‌గా ముగింపు ● ఫైనల్లో ఓడిన భారత ద్వయం



న్యూఢిల్లీ: సొంతగడ్డపై జరిగిన ప్రతిష్టాత్మక టోర్నీలో భారత బ్యాడ్మింటన్ డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్‌శెట్టిలకు చుక్కెదురైంది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ - సూపర్ 750 టోర్నీ ఇండియా ఓపెన్‌లో భారత జోడి రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో కొరియాకు చెందిన వరల్డ్ చాంపియన్ జంట కాంగ్ మిన్ హ్యూక్ - సియో సంగ్ జె 15–21, 21–11, 21–18 స్కోరుతో సాత్విక్ - చిరాగ్‌పై విజయం సాధించింది. 65 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో తొలి గేమ్‌ను సునాయాసంగానే గెలుచుకున్న భారత జోడి ఆ తర్వాత తడబడింది. ముఖాముఖీ పోరులో కొరియా ఆటగాళ్లతో ఈ మ్యాచ్‌కు ముందు 4–1తో సాత్విక్-చిరాగ్‌లదే పైచేయిగా ఉంది. అదే తరహాలో చక్కటి ర్యాలీలతో దూసుకుపోయిన వీరిద్దరు తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నారు. రెండో గేమ్‌లో 1–5తో ఆరంభంలో వెనుకబడిన మన ఆటగాళ్లు ఆ తర్వాత కోలుకోలేకపోయారు. ఒక దశలో వరుసగా తొమ్మిది పాయింట్లు సాధించిన కొరియా టీమ్ 15–5తో ముందంజలో నిలిచి ఆపై గేమ్‌ను గెలుచుకుంది. మూడో గేమ్ పోటాపోటీగా సాగింది. గేమ్ తొలి అర్ధభాగాన్ని కొరియా ఆటగాళ్లు 11–6తో ముగించారు. అయితే ఆ తర్వాత భారత ద్వయం కోలుకొని మళ్లీ నిలిచారు. 15–16కు, ఆపై 18–19 వరకు స్కోరు వెళ్లింది. అయితే సాత్విక్ బయటకు కొట్టిన షాట్‌తో, అనంతరం చిరాగ్ నెట్‌కు కొట్టిన షాట్‌తో కొరియా విజయం ఖాయమైంది.

తైజుకు మహిళల టైటిల్



వరల్డ్ నంబర్ 3 ప్లేయర్ తై జు యింగ్ (చైనీస్ తైపీ) మహిళల సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఫైనల్లో నాలుగో సీడ్ తై జు 21–16, 21–12తో రెండో సీడ్ చెన్ యు ఫిపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ టైటిల్‌ను షి యు కి (చైనా) సొంతం చేసుకున్నాడు.

తలైవాస్ గెలుపు

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో తమిళ్ తలైవాస్ 45–28 స్కోరుతో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఈ పోరులో తమిళ్ రెయిడర్లు నరేందర్ (14), అజింక్యా పవార్ (11) క్రమం తప్పకుండా పాయింట్లు తెచ్చి పెట్టారు. డిఫెండర్లలో సాగర్ (5), సాహిల్ గులియా (4) రాణించారు. బెంగళూరు తరఫున రెయిడర్ అక్షిత్ (12) ఒంటరి పోరాటం చేశాడు. సుశీల్ 6 పాయింట్లు సాధించాడు. మరో మ్యాచ్‌లో పుణేరీ పల్టన్ 32–24 పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై గెలుపొందింది. పుణేరీ తరఫున మొహమ్మద్ రెజా 9 పాయింట్లు మోహిత్ గోయత్ 7 పాయింట్లు సాధించారు. గుజరాత్ ఆటగాళ్లలో మొహమ్మద్ నబీబక్ష్ 7, ప్రతీక్ దహియా 5 పాయింట్లు నమోదు చేశారు.

పాయింట్ల పట్టిక PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
జైపూర్ పింక్ పాంథర్స్	14	10	2	2	58
పుణేరి పల్టన్	13	11	2	0	57
దబంగ్ ఢిల్లీ	14	8	4	2	49
గుజరాత్ జెయింట్స్	14	8	6	0	44
హరియాణా స్టీలర్స్	13	7	5	1	39
బెంగాల్ వారియర్స్	13	6	5	2	38
యు ముంబా	13	6	6	1	37
పట్నా పైరేట్స్	14	6	7	1	37
బెంగళూరు బుల్స్	15	6	9	0	37
తమిళ్ తలైవాస్	14	5	9	0	30
యూపీ యోధాస్	15	3	11	1	23
తెలుగు టైటాన్స్	14	2	12	0	15

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

గెలుపు దిశగా ఆంధ్ర

అస్సాంతో రంజీ ట్రోఫీ మ్యాచ్

డిబ్రూఘర్: రంజీ ట్రోఫీ సీజన్‌లో ఆంధ్ర మొదటి విజయం దిశగా సాగుతోంది. ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా ఆంధ్రతో జరుగుతున్న మ్యాచ్‌లో అస్సాం ఓటమికి చేరువైంది. 363 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అస్సాం మూడో రోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి 5 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. కెప్టెన్ రియాన్ పరాగ్ (48 నాటౌట్) పోరాడుతుండగా...చేతిలో ఉన్న ఐదు వికెట్లతో అస్సాం మరో 282 పరుగులు చేయాల్సి ఉంది. ఆంధ్ర బౌలర్లలో గిరినాథ్ రెడ్డి 3, లలిత్ మోహన్ 2 వికెట్లు పడగొట్టారు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 147/1తో ఆట కొనసాగించిన ఆంధ్ర తమ రెండో ఇన్నింగ్స్‌లో 334 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రికీ భుయ్ (187 బంతుల్లో 125; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) శతకం పూర్తి చేసుకోగా, హనుమ విహారి (63) అర్ధసెంచరీ సాధించాడు. షేక్ రషీద్ (40 నాటౌట్) కూడా రాణించగా... అస్సాం బౌలర్లలో సిద్ధార్థ్ వాసుదేవ్ 5 వికెట్లు తీశాడు.

భవిత

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

బీమా సంస్థలో 274 ఉద్యోగాలు

» రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక
» ఎంపికైతే నెలకు రూ.85వేల వరకూ వేతనం

జాబ్స్ ఇన్ఫో

ప్రభుత్వ రంగ సంస్థ.. నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఎన్ఐసీ) పలు ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా 274 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ (జనరలిస్ట్స్,స్పెషలిస్ట్స్) స్కేల్-1 పోస్టులను భర్తీ చేయనుంది. రాత పరీక్ష, సర్టిఫికేషన్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

» మొత్తం పోస్టుల సంఖ్య: 274

పోస్టుల వివరాలు

» డాక్టర్స్: ఈ విభాగంలో 28 ఉద్యోగాలున్నాయి. ఎంబీబీఎస్/ఎండీ/ఎంఎస్ /పీజీ-మెడికల్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. లేదా నేషనల్ మెడికల్ కమిషన్ గుర్తించిన మెడికల్ డిగ్రీ పూర్తిచేయాలి. నేషనల్ మెడికల్ కమిషన్‌లో రిజిస్టరై ఉండాలి.

» లీగల్: ఈ విభాగంలో 20 పోస్టులు ఉన్నాయి. ఇందులో లా గ్రాడ్యుయేషన్/పోస్ట్ గ్రాడ్యుయేషన్‌ను 60శాతం మార్కులతో పూర్తిచేయాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం ఉండాలి.

» ఫైనాన్స్: ఈ విభాగంలో 30 ఖాళీలున్నాయి. ఛార్టెడ్ అకౌంటెంట్(ఐసీఏఐ/కాస్ట్ అకౌంటెంట్(ఐసీడబ్ల్యూఏ) పూర్తిచేయాలి. లేదా బీకాం/ఎంకామ్‌లో 60శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 55శాతం సరిపోతుంది.

» యాక్చూరియల్: ఇందులో 2 పోస్టులున్నాయి. స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్ /యాక్చూరియల్ సైన్స్ డిగ్రీ 60 శాతం మార్కులతో పాసవ్వాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం ఉండాలి.

» ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ: ఇందులో 20 ఖాళీలున్నాయి. కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్ 60శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 55శాతం ఉండాలి.

» ఆటోమొబైల్ ఇంజనీర్స్: ఈ విభాగంలో 20 పోస్టులున్నాయి. ఆటోమొబైల్ ఇంజనీరింగ్ బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్ 60శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ/ఎస్టీలకు 55 శాతం.

» జనరలిస్ట్ ఆఫీసర్స్: ఇందులో 130 పోస్టులున్నాయి. ఏదైనా డిగ్రీ/పీజీ 60శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్సీ/ఎస్టీలకు 55శాతం సరిపోతుంది.

» హిందీ(రాజ్‌భాష) ఆఫీసర్స్: ఈ విభాగంలో 24 పోస్టులున్నాయి. హిందీ పీజీ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ/ఎస్టీలకు 55 శాతం. ఇంగ్లిష్‌ను ఒక సబ్జెక్టుగా చదివుండాలి. లేదా హిందీ ఒక సబ్జెక్టుగా ఇంగ్లిష్‌లో పీజీ చేయాలి.

వయసు

01.12.2023 నాటికి అభ్యర్థుల వయసు 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. గరిష్ట వయసులో ఎస్సీ/ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు మూడేళ్లు,పీడబ్ల్యూబీడీలకు 10ఏళ్లు,ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు 5ఏళ్ల వరకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ఇలా

హిందీ ఆఫీసర్స్ పోస్టులకు తప్ప..మిగతా అన్ని పోస్టులకూ ఎంపిక విధానం ఒకే విధంగా ఉంటుంది. ఎంపికలో భాగంగా రెండు దశల్లో రాతపరీక్షను నిర్వహిస్తారు. మొదటి దశ (ఫేజ్-1)లో ఆన్‌లైన్ ప్రిలిమినరీ, రెండో దశ (ఫేజ్-2)లో ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష ఉంటాయి.

ఫేజ్-1 ప్రిలిమినరీ

ప్రిలిమ్స్ ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు ఉంటుంది. ఇందులో మూడు విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్-30 మార్కులు,రీజనింగ్ ఎబిలిటీ-35 మార్కులు,క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్-35 మార్కులకు ప్రశ్నలుంటాయి. పరీక్ష సమయం 60 నిమిషాలు. ప్రతి సెక్షన్‌నూ నిర్దేశించిన వ్యవధిలోనే పూర్తిచేయాలి. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులను 1:5 నిష్పత్తిలో ఫేజ్-2లోని మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

250 మార్కులకు మెయిన్ పరీక్ష

» మెయిన్ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో 250 మార్కులకు, డిస్క్రిప్టివ్ టెస్ట్ 30 మార్కులకు ఉంటాయి. ఆబ్జెక్టివ్ అనంతరం డిస్క్రిప్టివ్ రాయాలి. మెయిన్ పరీక్ష జనరలిస్ట్, స్పెషలిస్టు పోస్టులకు వేర్వేరుగా ఉంటుంది.

» జనరలిస్ట్ పోస్టులకు: ఇందులో 5 విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రతి విభాగం నుంచి 50 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది. అవి... రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ అవేర్‌నెస్, కంప్యూటర్ నాలెడ్జ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్. ప్రశ్నపత్రం ఇంగ్లిష్/హిందీ భాషల్లో ఉంటుంది.

» స్పెషలిస్టు పోస్టులకు: ఇందులో 6 విభాగాలుంటాయి. మొదటి 5 విభాగాలు రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ అవేర్‌నెస్, కంప్యూటర్ నాలెడ్జ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్. ప్రతి విభాగం నుంచి 40 ప్రశ్నలకు, 40 మార్కులుంటాయి. చివరి విభాగం టెక్నికల్ అండ్ ప్రొఫెషనల్ నాలెడ్జ్ నుంచి 50 ప్రశ్నలకు 50 మార్కుల ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి పావు వంతు మార్కును తగ్గిస్తారు.

» ఇంగ్లిష్ లాంగ్వేజ్ డిస్క్రిప్టివ్ టెస్ట్‌కు 30 మార్కులు (ఎస్సే-10, కాంప్రహెన్షన్-10).

ముఖ్యసమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా .
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:22.01.2024
» వెబ్‌సైట్: https://nationalinsurance.nic.co.in

ఇలా చేస్తే.. సర్కారీ కొలువు సులువు

» తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి చర్యలు
» ఇప్పటికే ఏపీపీఎస్సీ నుంచి వరుస నోటిఫికేషన్లు
» తెలంగాణలోనూ మరికొద్ది రోజుల్లో నోటిఫికేషన్లకు అవకాశం
» ముందస్తు వ్యూహం, ప్రణాళికతో విజయానికి బాటలు

సర్కారీ కొలువులో చేరడం.. సుస్థిర భవితను సొంతం చేసుకోవడం.. నేడు ప్రతి ఒక్క ఉద్యోగార్థి కల! బీటెక్ వంటి టెక్నికల్ కోర్సులు మొదలు సంప్రదాయ బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ అభ్యర్థుల వరకూ.. అధికశాతం మంది ప్రభుత్వ ఉద్యోగం కావాలని కోరుకుంటున్నారు!! ఇందుకోసం ఆయా రిక్రూట్‌మెంట్ సంస్థల నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటారు. కొత్త సంవత్సరంలో తెలుగు రాష్ట్రాల్లో సర్కారీ కొలువుల భర్తీ ప్రక్రియకు ప్రభుత్వాలు చర్యలు ప్రారంభించాయి. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో ఏపీపీఎస్సీ వరుస నోటిఫికేషన్లు విడుదల చేస్తోంది. మరోవైపు తెలంగాణలోనూ గ్రూప్స్ మొదలు డీఎస్సీ వరకు ఉద్యోగ నోటిఫికేషన్ల దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో.. కొత్త సంవత్సరంలో.. ఉద్యోగార్థులు తమ సర్కారీ కొలువు కలను నిజం చేసుకునే మార్గాలపై విశ్లేషణాత్మక కథనం..



లక్ష్యం నిర్దేశించుకోవడం ఒక ఎత్తయితే.. దాన్ని చేరుకునే దిశగా అడుగులు వేయడం అంతకంటే ఎంతో ముఖ్యం. ప్రధానంగా లక్షల్లో పోటీ ఉండే ప్రభుత్వ ఉద్యోగం సొంతం చేసుకోవాలనుకుంటే.. అందుకు తగ్గ పటిష్ట ప్రిపరేషన్ ప్రణాళికతో ముందుకు సాగాలి అంటున్నారు నిపుణులు.

వ్యూహంతోనే విజయం

బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో అనేక ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు పోటీ పడే అవకాశం ఉంది. అదే విధంగా పలు నియామక పరీక్షల్లో ఒకే విధమైన సిలబస్ అంశాలు ఉంటున్నాయి. కాబట్టి అభ్యర్థులు ఉమ్మడి ప్రిపరేషన్ ప్రణాళిక రూపొందించుకోవాలి. ఫలితంగా ఒకే సమయంలో పలు పరీక్షలకు సన్నద్ధత పొందొచ్చు.

ఉమ్మడి అంశాలపై పట్టు

ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు.. ముందుగా సిలబస్‌ను సమగ్రంగా అవగాహన చేసుకోవాలి. ఇందులో కామన్ టాపిక్స్‌ను గుర్తించాలి. ప్రస్తుతం ఆయా పరీక్షలను గమనిస్తే.. అన్నింటిలోనూ జనరల్ నాలెడ్జ్/జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ మెంటల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ సబ్జెక్టులు కామన్‌గా కనిపిస్తున్నాయి. పరీక్షల్లో వీటికి ఎక్కువ వెయిటేజీ ఉంటోంది. వీటితోపాటు జనరల్ స్టడీస్, హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎకాలజీ, అంతర్జాతీయ, జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశాలతో సిలబస్ ఉంటోంది. వీటిపై పట్టు సాధించే ప్రయత్నం చేయాలి. ఉమ్మడి టాపిక్స్ సిలబస్‌కు, ప్రత్యేక టాపిక్స్ సిలబస్‌కు సమయం కేటాయించునేలా పటిష్ట ప్రణాళిక రూపొందించుకోవాలి.

పరీక్ష తేదీలను గుర్తిస్తూ

ఉమ్మడి సిలబస్‌తో పలు పరీక్షలకు పోటీ పడే అభ్యర్థులు..ఆయా పరీక్షల తేదీలకు అనుగుణంగా ముందుకుసాగాలి. తొలుత పరీక్ష జరిగే పోస్ట్‌లకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. పరీక్ష తేదీకి కనీసం నెల రోజుల ముందు నుంచీ ఆ పరీక్ష ప్రిపరేషన్‌కే సమయం కేటాయించాలి.

జనరల్ అవేర్‌నెస్

జనరల్ అవేర్‌నెస్/జనరల్ స్టడీస్.. అన్ని నియామక పరీక్షల్లో కనిపించే విభాగం ఇది. సివిల్స్ వంటి అత్యున్నత పరీక్షల అభ్యర్థులు హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ అంశాలపై పట్టు సాధించాలి. దీంతోపాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అమలవుతున్న పథకాలు, ఆయా రాష్ట్రాల ఆర్థిక విధానాలు, పథకాలు -లబ్ధిదారులు; లక్షిత వర్గాలు, సామాజిక అంశాలు, సంస్కృతి తదితర అంశాలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి.

ఈ టాపిక్స్‌పై ఫోకస్

అభ్యర్థులు జనరల్ అవేర్‌నెస్ తర్వాత.. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, మెంటల్ ఎబిలిటీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి.. మ్యాథమెటిక్స్‌లోని ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలి. అర్థమెటిక్‌కు సంబంధించి పర్సంటేజెస్, యావరేజేస్, రేషియో-ప్రపోర్షన్, ప్రాఫిట్-లాస్, సింపుల్- కాంపౌండ్ ఇంట్రెస్ట్, టైమ్-వర్క్, టైమ్-డిస్టెన్స్, పర్ముటేషన్స్ -కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, మిక్చర్ అండ్ అలిగేషన్స్, పార్టనర్ షిప్‌పై దృష్టిపెట్టాలి. భాగహారాలు, కూడికలు, తీసివేతలు వంటి ప్రాథమిక అంశాలను నోటితో గణించే విధంగా ప్రాక్టీస్ చేయాలి. సింప్లిఫికేషన్స్‌కు బోడ్‌మాస్ రూల్స్‌ను అనుసరించాలి. సంఖ్యల వర్గాలు, ఘనాలు గుర్తించుకోవాలి. డేటా ఇంటర్‌ప్రెటేషన్, మెంటల్ ఎబిలిటీలో.. టేబుల్స్, చార్ట్‌లు, గ్రాఫ్‌ల ద్వారా సమాచారమిస్తూ ప్రశ్నలు అడుగుతారు. వీటిని సాధించాలంటే.. పర్సంటేజెస్, యావరేజెస్, రేషియోలతో ఉండే భిన్నమైన ప్రశ్నలు సాధన చేయాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

గ్రూప్-1 నుంచి సబార్డినేట్ సర్వీసుల పరీక్షల వరకు.. ప్రతి పరీక్షలోనూ కచ్చితంగా ఉండే సబ్జెక్ట్ ఇంగ్లిష్. దీనికోసం అభ్యర్థులు బేసిక్ గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు ఫిల్ ఇన్ ది బ్లాంక్స్, రీడింగ్ కాంప్రహెన్షన్, యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్‌పైనా దృష్టిపెట్టాలి. అదేవిధంగా స్పెల్లింగ్స్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, టెన్సెస్, ప్రిపోజిషన్స్, యాక్టివ్ అండ్ ప్యాసివ్ వాయిస్, వొకాబ్యులరీ, రీ రైటింగ్ ద సెంటెన్స్, సెంటెన్స్ రీ-అరేంజ్‌మెంట్, ఆల్ఫాబెటికల్ ఆర్డర్, ప్రెసిస్ రైటింగ్, బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. టెన్సెస్, సెంటెన్స్ ఫార్మేషన్, యాక్టివ్-ప్యాసివ్ వాయిస్, కాంప్లెక్స్ సెంటెన్సెస్ వంటి ముఖ్యాంశాలపై దృష్టి సారించాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, వొకాబ్యులరీల్లో పూర్తి స్థాయిలో నైపుణ్యం పొందాలి.

లక్ష్యం ఉన్నతం

ఉమ్మడి సిలబస్ అవకాశాన్ని అనుకూలంగా చేసుకుంటూ..పోటీ పరీక్షలకు హాజరవ్వాలనుకునే అభ్యర్థులు ఉన్నత స్థాయి పరీక్షను తమ తొలి గమ్యంగా నిర్దేశించుకోవాలి. దానికి అనుగుణంగా ఆ స్థాయి ప్రిపరేషన్ సాగించాలి. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్వహించే గ్రూప్-1 లక్ష్యంగా ప్రిపరేషన్ సాగిస్తే.. ఆ తర్వాత స్థాయిలోని గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4లను సులభంగా సాధించే వీలుంది. అదే విధంగా జాతీయ స్థాయిలోని అత్యున్నత పరీక్ష సివిల్ సర్వీసెస్‌ను లక్ష్యంగా ప్రిపరేషన్ కొనసాగిస్తే.. యూపీఎస్సీ నిర్వహించే ఇతర పోటీ పరీక్షల్లో, రాష్ట్రస్థాయి గ్రూప్స్ పరీక్షల్లో విజయావకాశాలు మెరుగుపరచుకోవచ్చు.

డిస్క్రిప్టివ్‌గానే అడుగులు

పరీక్ష ఏదైనా.. డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో ప్రిపరేషన్ సాగించడం మేలు చేస్తుంది. ముఖ్యంగా గ్రూప్-1 వంటి ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానంలోని పరీక్షలు; అదే విధంగా పూర్తిగా ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉండే గ్రూప్-2, 3, 4, ఇతర పోటీ పరీక్షలకు ఈ విధానాన్ని అనుసరించాలి. పరీక్ష ఏదైనా.. డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో ముందుకు సాగితే.. ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు సులభంగా సమాధానాలు ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది. ఇది రెండు రకాల పరీక్షల్లోనూ విజయానికి దోహదపడుతుంది.

సొంత నోట్స్

ఆయా పోటీ పరీక్షలకు ప్రిపరేషన్ సాగించే అభ్యర్థులు.. ఎప్పటికప్పుడు తాము చదివిన టాపిక్స్ నుంచి ముఖ్యమైన అంశాలతో షార్ట్ నోట్స్ రాసుకోవాలి. సొంత నోట్సు రివిజన్ సమయంలో చాలా కీలకంగా మారుతుంది. వేగంగా పునశ్చరణ చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

నమూనా పరీక్షలు

అభ్యర్థులు నమూనా పరీక్షలకు హాజరై.. తమ బలాలు, బలహీనతలను గుర్తించాలి. దీని ఆధారంగా తక్కువ మార్కులు వస్తున్న టాపిక్స్, అందుకు కారణాలను గుర్తించి.. వాటి ప్రాధాన్యతకు అనుగుణంగా ప్రిపరేషన్ సాగించాలి. ఆయా సిలబస్ అంశాలకు పరీక్షలో వెయిటేజీ ఎక్కువగా ఉంటే.. వాటి ప్రిపరేషన్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.

అనుసంధాన దృక్పథం

ఒకే సమయంలో పలు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు.. అనుసంధాన వ్యూహాన్ని అనుసరించాలి. అన్ని పరీక్షలలోనూ కామన్ టాపిక్స్‌ను గుర్తించి.. వాటిని ఏకకాలంలో పూర్తి చేసే విధంగా వ్యవహరించాలి. ప్రతి పరీక్షలోనూ ఆయా సబ్జెక్ట్‌ల మధ్య ఉన్న పోలికలను గుర్తిస్తూ.. వాటిని కూడా అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగిస్తే విజయం సాధించొచ్చు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
260	51
71,424	21,572

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	15,294	▲	238
డోజోన్స్	37,847	▲	378
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,462	▲	3
డాక్స్	16,555	▽	12
షాంఘై	2,833	▽	14
నికాయ్	35,963	▲	467

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.75	83.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.56	107.12
€	యూరో	ఎస్‌బీఐ	89.46	91.83
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.54	56.80
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.85	55.78
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.21	62.67
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.69	23.51
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.39	12.49

2024లో పెట్టుబడులకు దారేది..?

ఈక్విటీలతోనే మెరుగైన రాబడి • బంగారానికి తప్పక చోటుండాలి
అనిశ్చితి, ద్రవ్యోల్బణం నుంచి రక్షణ • దీర్ఘకాలంలో ఆకర్షణీయ ఆదాయం
డెట్‌లో పెట్టుబడులకు అనుకూలతలు • సరైన కేటాయింపులతో మెరుగైన లాభాలు




ఇన్వెస్టర్లు ఏడాదికోసారి తమ పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోను తప్పకుండా సమీక్షించుకోవాలి. అప్పుడే ఏ విభాగానికి ఏ మేరకు కేటాయింపులు చేయాలన్న స్పష్టత వస్తుంది. ఈక్విటీలు ఆల్‌టైమ్ గరిష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. వడ్డీ రేట్లు సైతం గరిష్టాలకు చేరాయి. ఈ ఏడాది ప్రథమార్థంలో కీలకమైన సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. క్యాపిటల్ మార్కెట్లపై ఈ ప్రభావం తప్పకుండా కనిపిస్తుంది. ఈక్విటీ, డెట్, బంగారం, రియల్ ఎస్టేట్.. వీటిల్లో ఏ విభాగం పనితీరు ఎలా ఉంటుంది..? ఇది తెలిస్తే.. తమ పెట్టుబడుల్లో వేటికి ఎంత మేర ప్రాధాన్యం ఇవ్వాలన్నది నిర్ణయించుకోవచ్చు. తద్వారా అధిక రాబడులను ఒడిసి పట్టుకోవచ్చు. అంతేకాదు, మార్కెట్ అస్థిరతలను తట్టుకునే విధంగా తమ పోర్ట్‌ఫోలియోను నిర్మించుకోవచ్చు. దీనిపై మార్కెట్ నిపుణుల అభిప్రాయాల సమాహారమే ఈ వారం ప్రాఫిట్ ప్లస్ కథనం.



దీర్ఘకాలంలో ఇతర సాధనాలతో పోలిస్తే ఈక్విటీలు అధిక రాబడులు ఇస్తాయని తెలిసిందే. 2024 సైతం ఇందుకు భిన్నంగా ఏమీ ఉండకపోవచ్చు. ''2024 పట్ల ఆశావహ దృక్పథంతో ఉన్నాం. అంతర్జాతీయ, దేశీయ ముఖచిత్రం మెరుగ్గా కనిపిస్తోంది. ద్రవ్యోల్బణం నియంత్రణ పరిధిలో ఉండడం, మానిటరీ పాలసీ రేట్ల విషయంలో సర్దుబాట్లు, ముడి చమురు ధరలు తగ్గడం ఇందుకు మద్దతునిస్తున్నాయి''అని ఫండ్స్ ఇండియా సీఈవో గిరిరాజన్ మురుగన్ పేర్కొన్నారు. కరోనా మహమ్మారి, ఆ తర్వాత పలు దేశాల మధ్య యుద్ధాలతో అంతర్జాతీయంగా ఏర్పడిన అవరోధాల నడుమ మన దేశ ఆర్థిక వ్యవస్థ బలమైన పనితీరు ప్రదర్శించడాన్ని గమనించొచ్చు. ''అంతర్జాతీయంగా వాణిజ్యం విషయంలో మారిన ప్రాధాన్యతలు భారత్‌కు అనుకూలించనున్నాయి. పలు రంగాల్లో భారత్ అంతర్జాతీయంగా మార్కెట్ వాటాను పెంచుకోనుంది. ఒకవైపు సేవల ఎగుమతుల్లో బలంగా ఉన్నాం. మరోవైపు తయారీలోనూ బలమైన స్థానం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది''అని ఓల్డ్ బ్రిడ్జ్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ వ్యవస్థాపకుడు

ఈక్విటీ అవకాశాలు



కెన్నెత్ ఆండ్రడే పేర్కొన్నారు. ఈక్విటీ ఇన్వెస్టర్లకు భారత్ ప్రాధాన్య ఎంపికగా ఉంటుందన్న విశ్లేషణ వినిపిస్తోంది. ''భారత్ ఆర్థిక అంచనాలు బలంగా ఉన్నాయి. అంతర్జాతీయ వృద్ధి అంచనా 2.7 శాతాన్ని భారత్ వృద్ధి అంచనాలు 6.5–7 అధిగమిస్తున్నాయి. భారత ప్రభుత్వం వైపు నుంచి పారదర్శక, స్థిరమైన, స్నేహపూర్వక పెట్టుబడుల విధానాలు ఈ వృద్ధికి బలాన్నిస్తున్నాయి. ఇవన్నీ ప్రపంచవేదికపై భారత్‌ను పెట్టుబడులకు ఆకర్షణీయమైన స్వర్గధామంగా మారుస్తున్నాయి''అని వైజ్ఎక్స్ సీఈవో ఆర్యమన్ వీర్ తెలిపారు.

• ● •


ఈక్విటీల్లోనూ మెరుగైన రాబడుల అవకాశాలు ఎక్కడ ఉన్నాయి? అన్న సందేహం వస్తుంది. కేంద్ర సర్కారు దేశీ తయారీ బలోపేతంపై విరామం లేకుండా కృషి చేస్తోంది. కనుక తయారీ రంగం 2024లోనూ బలమైన పనితీరు చూపించనుంది. 2024 సంవత్సరం మధ్య నుంచి వడ్డీ రేట్ల కోత మొదలవుతుందని ఎక్కువ మంది విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వడ్డీ రేట్ల కోత భారత మార్కెట్లకు మరింత బూస్ట్‌నిస్తుందన్న విశ్లేషణలు ఉన్నాయి. ''వడ్డీ రేట్ల కోతతో విదేశీ ఇనిస్టిట్యూషన్ ఇన్వెస్టర్ల పెట్టుబడులు మరింతగా భారత్‌కు తరలివస్తాయి. దీంతో తయారీ, ఐటీ, బ్యాంకింగ్, ఆటోమొబైల్స్, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్, డిఫెన్స్, రైల్వే ఇన్‌ఫ్రా, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ కంపెనీలు లాభపడనున్నాయి''అని మురుగన్ వివరించారు. దేశీయ ఇన్వెస్టర్లు చిన్న కంపెనీలకు ప్రాధాన్యం ఇస్తుంటే.. అంతర్జాతీయ ఇన్వెస్టర్లు పెద్ద కంపెనీలు, సూచీల్లో ఎక్కువ వెయిటేజీ ఉన్న వాటికి ప్రాధాన్యం ఇస్తున్నారని ఆండ్రడే తెలిపారు. ''ఈ ఏడాది డిఫెన్స్, రియాలిటీ, ఆటో, ప్రభుత్వరంగ, ఫార్మా కంపెనీలు మంచి పనితీరు చూపిస్తాయి. నూతనతరం (న్యూఏజ్) వ్యాపార కంపెనీలు అయితే డార్క్‌హార్స్‌గా నిలుస్తాయి. ఫైనాన్షియల్స్, ఐటీ, తయారీ, ప్రభుత్వరంగ సంస్థలు, హెల్త్‌కేర్ థీమ్‌లు సైతం ఇన్వెస్టర్లకు లాభాలను పంచుతాయి'' అని రీసెర్చ్ అండ్ ర్యాంకింగ్ సీఐవో జస్ప్రీత్ సింగ్ అరోరా అభిప్రాయపడ్డారు. 2022 ఈక్విటీలకు అనుకూలంగా లేని విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. 2022, 2023 రెండు సంవత్సరాలకు కలిపి చూస్తే సెన్సెక్స్ ఇచ్చిన నికర వార్షిక రాబడి 11.5 శాతమే. మార్కెట్ల వ్యాల్యుయేషన్లు కొంచెం గరిష్ట స్థాయికి చేరినందున ఇన్వెస్టర్లు వైవిధ్యంతో అడుగులు వేయాలని నిపుణులు సూచిస్తున్నారు. మిడ్, లార్జ్‌క్యాప్ కంపెనీలకు ప్రాధాన్యం ఇవ్వొచ్చని, అధిక రుణభారంతో నడిచే కంపెనీలకు దూరంగా ఉండాలని మురుగన్ సూచించారు.

రియల్ ఎస్టేట్



దశాబ్ద కాలం పాటు రియల్ ఎస్టేట్‌లో డిమాండ్ పెద్దగా పెరగలేదు. కరోనా మహమ్మారి తర్వాత నుంచి డిమాండ్ పరిస్థితుల్లో స్పష్టమైన మార్పు కనిపించింది. వచ్చే ఐదు, పదేళ్ల పాటు రియల్ ఎస్టేట్ మెరుగైన పనితీరు చూపిస్తుందనే అంచనాలు ఉన్నాయి. 2030 నాటికి భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని నిపుణులు, విశ్లేషకుల అంచనా వేస్తున్నారు. ఆర్థిక వ్యవస్థ మెరుగైన పనితీరుకు అనుగుణంగా ఈ రంగంలోకి పెట్టుబడులు వస్తాయన్న అభిప్రాయాలు ఉన్నాయి.

కానీ, భౌతిక రియల్ ఎస్టేట్ అన్నది భారీ పెట్టుబడికి సంబంధించిన అంశం. అధిక ఆర్జన కలిగిన వర్గానికి ఇది అనుకూలంగా ఉంటుంది. ''పెట్టుబడి పరంగా రియల్ ఎస్టేట్ అన్నది క్లిష్టమైన, లిక్విడిటీ పెద్దగా లేని సాధనం. వైవిధ్యం కోసం రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టాలని అనుకున్నా.. రిస్క్‌లు కూడా లేకపోలేదు. రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టే ముందు ఇన్వెస్టర్లు ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి''అని హర్ష గెహ్లోట్ సూచించారు. వాణిజ్య రియల్ ఎస్టేట్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటే, అందుకు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ అయిన రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్)లను పరిశీలించొచ్చు.





దీర్ఘకాలంలో (10–15 ఏళ్లు అంతకంటే ఎక్కువ) బంగారం ద్రవ్యోల్బణానికి మించి రాబడులను ఇస్తున్నట్టు ఫండ్స్ ఇండియా రిపోర్ట్ చెబుతోంది. చారిత్రక గణాంకాలను పరిశీలించినా ఇదే విషయం తెలుస్తుంది. దీర్ఘకాలంలో బంగారంపై రాబడి ద్రవ్యోల్బణం కంటే 2–4 శాతం అధికంగా ఉంటోంది. స్వల్పకాలానికి ఇది అనుకూలమైన సాధనం కాదు. అదే పనిగా స్థిరమైన రాబడులను అన్ని కాలాల్లోనూ బంగారం నుంచి ఆశించరాదు. మధ్య మధ్యలో బంగారం కొన్నేళ్లపాటు ఎలాంటి రాబడులు లేకుండా కొనసాగుతుందని చెప్పడానికి గత ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. దీర్ఘకాలం కోసం ఇందులో ఇన్వెస్ట్ చేయడం వల్ల పెట్టుబడుల్లో వైవిధ్యానికి తోడు, అనిశ్చిత సమయాల్లో, ద్రవ్యోల్బణానికి హెడ్జింగ్ సాధనంగా ఉపకరిస్తుంది. ''భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కరెన్సీ యుద్ధాలు, ప్రపంచవ్యాప్తంగా అధిక ద్రవ్యోల్బణం ఇవన్నీ బంగారంలో పెట్టుబడికి బలమైన నేపథ్యాలుగా చూడొచ్చు. రాబడులు అధిక స్థాయిలో లేకపోయినా, మరే ఇతర సాధనంలో లేనంతగా పెట్టుబడుల భద్రతకు బంగారం భరోసానిస్తుంది. రిస్క్‌లను ఎదుర్కొనేందుకు వీలుగా పోర్ట్‌ఫోలియోలో కొంత మొత్తాన్ని బంగారానికి కేటాయించుకోవడం మంచి నిర్ణయం అవుతుంది''అని ఫిన్ఎడ్జ్ సీఈవో హర్ష గెహ్లోట్ సూచించారు.

బంగారానికి అనుకూలించే ఇతర అంశాలు ఎన్నో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంక్‌లు సైతం బంగారాన్ని పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నాయి. డాలర్ నుంచి


బంగారం



వైవిధ్యం కోరుకోవడం కూడా బంగారానికి మద్దతునిచ్చే అంశం. సెంట్రల్ బ్యాంక్‌ల నుంచి బంగారానికి డిమాండ్ ఉండడం 2023లో ధరలకు మద్దతునిచ్చిందని, 2024లోనూ ఇదే ధోరణి కొనసాగుతుందని అంచనా. భారత్, చైనా బంగారం కొనుగోళ్లలో రెండు అతిపెద్ద దేశాలు కాగా, వీటి నుంచి ఈ ఏడాదీ కొనుగోళ్లకు డిమాండ్ ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. పైగా మన దేశం బలమైన ఆర్థిక వృద్ధి నమోదు చేస్తున్న క్రమంలో బంగారానికి డిమాండ్ పెరుగుతుందన్న అంచనా కూడా ఉంది. అయితే బంగారానికి ఎంత శాతం పెట్టుబడి కేటాయించుకోవాలన్న సందేహం ఏర్పడొచ్చు. ''పెట్టుబడులకు బంగారాన్ని వైవిధ్య సాధనంగా చూడొచ్చు. అదే సమయంలో బంగారంపై పరిమితికి మించి చేసే పెట్టుబడులతో ప్రతికూల ఉత్పాదకత కూడా ఎదురుకావచ్చు. కనుక ఇన్వెస్టర్లు తమ సౌకర్యానికి అనుగుణంగా మొత్తం పెట్టుబడుల్లో 5–10 శాతానికి మించకుండా బంగారానికి కేటాయించుకోవచ్చు''అని నిపుణుల సూచన.

వేటికి ఏ మేరకు..

వివిధ సాధనాల మధ్య పెట్టుబడులను వైవిధ్యం చేసుకోవడం ఎంత ముఖ్యమో.. అదే విధంగా ఒక్కో సాధనానికి ఎంత మేరకు కేటాయింపులు చేయాలన్నదీ కీలకమే. ఇన్వెస్టర్ వయసు, రిస్క్ తీసుకునే సామర్థ్యం, పెట్టుబడుల కాల వ్యవధి, పెట్టుబడుల వెనుక ఉన్న లక్ష్యం ఇవన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. సాధారణ నియమం ప్రకారం.. ఐదేళ్లు అంతకుమించి ఎక్కువ కాలం పాటు తన పెట్టుబడులు కొనసాగించే వెసులుబాటు ఉండి, అధికంగా వృద్ధి కోరుకునే ఇన్వెస్టర్లకు ఈక్విటీ ఫండ్స్ మొదటి ఆప్షన్ అవుతుంది. ఫండ్స్ బలమైన నియంత్రణల మధ్య, తక్కువ వ్యయాలు, చక్కని వైవిధ్యంతో, తగినంత లిక్విడిటీతో, నిపుణుల ఆధ్వర్యంలో పనిచేస్తుంటాయని, ఇన్వెస్టర్లు తమ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఎంపిక చేసుకోవచ్చని గెహ్లోట్ సూచించారు. రిస్క్ నివారణకు ఈక్విటీల్లో దీర్ఘకాలానికి సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవడం మెరుగైన నిర్ణయం అవుతుంది. ఐదేళ్లకు మించిన కాలానికి ఇన్వెస్ట్ చేసే వారు ఈక్విటీలకు మొత్తం పెట్టుబడుల్లో 70–80% వరకు, డెట్‌కు 15–20% వరకు, బంగారానికి 5–10% మధ్య కేటాయింపులు చేసుకోవచ్చు. ఒకవేళ పదేళ్లు అంతకుమించి అయితే ఈక్విటీలకు 80–90%, డెట్‌కు 5–10%, బంగారానికి 5–10% వరకు కేటాయించుకోవచ్చు. పదేళ్లకు రియల్ ఎస్టేట్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలని అనుకుంటే 20% వరకు కేటాయింపులు చేసుకోవచ్చన్నది సూచన. అప్పుడు డెట్ కేటాయింపులను రియల్ ఎస్టేట్‌కు మళ్లించుకోవచ్చు.



డెట్ సాధనాలు..




డెట్ (స్థిరాదాయ) విభాగంలో పెట్టుబడులకు ఈ ఏడాది అనుకూలమేనని విశ్లేషకుల అభిప్రాయం. ''2023–24 వృద్ధి అంచనాలను ఆర్‌బీఐ అర శాతం పెంచి 7 శాతం చేసింది. 2024లో కనీసం మూడు పర్యాయాలు రేట్ల కోత ఉంటుందని యూఎస్ ఫెడ్ సంకేతాలు ఇచ్చింది. వడ్డీ రేట్ల కోతతో బాండ్ ధరలు పెరుగుతాయి. ఇది బాండ్లలో ఇన్వెస్ట్ చేసిన వారికి అనుకూలం''అని రీసెర్చ్ అండ్ ర్యాంకింగ్ సీఐవో జస్ప్రీత్ సింగ్ అరోరా పేర్కొన్నారు. ''2024–25లో జీడీపీ 6 శాతం లేదా అంతకంటే ఎక్కువ వృద్ధి నమోదు చేస్తుంది. అదే కాలంలో సగటు ద్రవ్యోల్బణం 5 శాతంగా ఉండొచ్చు. గడిచిన రెండేళ్లలో ద్రవ్యోల్బణం 6 శాతంతో పోలిస్తే ఇది తక్కువ. కనుక 2024–25 ద్వితీయ ఆరు నెలల్లో ఆర్‌బీఐ రేట్ల కోత చేపట్టొచ్చు. ఆ నిర్ణయం పదేళ్ల భారత ప్రభుత్వ బాండ్ల (ఐజీబీ)కు అనుకూలిస్తుంది. భారత ప్రభుత్వ దీర్ఘకాలిక బాండ్లలో ఉన్న వారు రేట్ల కోత ప్రయోజనాలు పొందుతారు'' అని ఎడెల్‌వీజ్ అస్సెట్ మేనేజ్‌మెంట్ ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సీఐవో దావల్ దలాల్ తెలిపారు. 10 ఏళ్ల ఐజీబీ ప్రస్తుతమున్న 7.17 స్థాయి నుంచి 2025 మార్చి నాటికి 6.75 శాతానికి దిగొస్తుందని దలాల్ అంచనా వేస్తున్నారు. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ పోర్ట్‌ఫోలియోలో ఇన్వెస్టర్లు క్రమంగా వ్యవధి పెంచుకోవాలని, ఐజీబీలను జోడించుకోవాలని సూచించారు. స్వల్పకాలానికి కార్పొరేట్ సంస్థలు షార్ట్‌డ్యురేషన్ బాండ్ల జారీకి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల వాటిపై ఈల్డ్స్ పెరగొచ్చని.. ఇన్వెస్టర్లు దీర్ఘకాల బాండ్లలో ప్రస్తుతమున్న అధిక రేట్లపై పెట్టుబడులకు ప్రాధాన్యం ఇస్తారని దలాల్ అంచనా వేశారు. ఆదాయపన్ను చట్టంలోని నిబంధనల ప్రకారం అన్ని రకాల డెట్ సాధనాలపై ఇప్పుడు కాల వ్యవధితో సంబంధం లేకుండా ఒకటే పన్ను విధానం ఉండడాన్ని మర్చిపోకూడదు. డెట్ సాధనాలపై వచ్చే ఆదాయం వ్యక్తుల వార్షిక ఆదాయానికి కలుస్తుంది. వారి ఆదాయ శ్లాబు రేటు ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కనుక మెరుగైన రాబడులు ఇచ్చే డెట్ సాధనాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నది నిపుణుల సూచన. మీడియం డ్యురేషన్‌తో కూడిన డెట్ మ్యూచువల్ ఫండ్స్ ఇందులో ఒకటి. వడ్డీ రేట్లు గరిష్టాల్లో ఉన్నందున ఈ సమయంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లను కూడా పరిశీలించొచ్చు. ఎఫ్‌డీలు, డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో రిస్క్ సహజంగా తక్కువ.

మ్యాక్స్‌లైఫ్ మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఫండ్




మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ యులిప్ పాలసీదారుల కోసం 'మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ ఫండ్'ను ప్రారంభించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 మూమెంటమ్ 50 ఇండెక్స్‌ను అనుసరించి ఇది పెట్టుబడులు పెడుతుంటుంది. అంటే ఇండెక్స్‌లోని స్టాక్స్‌లోనే వెయిటేజీ ఆధారంగా పెట్టుబడులు పెడుతుంది. కనుక దీన్ని ఇండెక్స్ ఫండ్‌గా పరిగణించొచ్చు. ఈ ఇండెక్స్ రాబడులు ఐదేళ్లలో ఏటా 28.7 శాతం, పదేళ్లలో ఏటా 26.7 శాతంగా ఉన్నట్టు మ్యాక్స్‌లైఫ్ ప్రకటించింది. ఈ నెల 29వ తేదీ వరకు ఈ నూతన ఫండ్‌లో పాల్గొనవచ్చని పేర్కొంది. ఇండెక్స్‌లోని స్టాక్స్‌లోనే పెట్టుబడులు పెడుతుంది కనుక రాబడులు కూడా దానినే ప్రతిఫలించే మాదిరిగా ఉంటాయని ఆశించొచ్చు. ఒక యూనిట్ ఎన్‌ఏవీ రూ.10. మిడ్‌క్యాప్ విభాగంలో వ్యూహాత్మక పెట్టుబడుల అవకాశాలను సొంతం చేసుకోవచ్చని మ్యాక్స్‌లైఫ్ పేర్కొంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)



22-1-2024	
విశాఖ	560–00
చిత్తూరు	548–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550–00
విజయవాడ	550–00
రిటైల్ ధర (డజను)	72.00
21-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	531–00
వరంగల్	533–00
రిటైల్ ధర	5.90

కార్పొరేట్ల జై శ్రీరామ్



న్యూఢిల్లీ: అయోధ్యలో రామ మందిర ప్రారంభ వేడుకల్లో కార్పొరేట్ సంస్థలు కూడా సందడిగా పాల్గొంటున్నాయి. కార్యక్రమాన్ని మల్టీప్లెక్సుల్లో లైవ్ టెలికాస్ట్ చేయడం మొదలుకుని లాభాల్లో కొంత వాటాను అయోధ్యలో ప్రసాద వితరణ కోసం విరాళాలు ఇవ్వడం వరకు వివిధ రకాలుగా పాలుపంచుకుంటున్నాయి. వినియోగ ఉత్పత్తులను తయారు చేసే పలు కంపెనీలు పెద్ద సంఖ్యలో హోర్డింగ్‌లు, గేట్ బ్రాండింగ్, షాప్ బోర్డులు, కియోస్క్‌లు మొదలైనవి ఏర్పాటు చేసి, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. నేడు (జనవరి 22న) రామ మందిర ప్రారంభ వేడుకలను 70 నగరాల్లోని 160 స్క్రీన్స్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు మల్టీప్లెక్స్ ఆపరేటర్ పీవీఆర్ ఐనాక్స్ ప్రకటించింది. జనవరి 17 నుంచి జనవరి 31 వరకు తమ ఉత్పత్తుల విక్రయాలపై వచ్చే లాభాల్లో కొంత భాగాన్ని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు విరాళంగా ఇవ్వనున్నట్లు డాబర్ ఇండియా సీఈవో మోహిత్ మల్హోత్రా తెలిపారు. భక్తుల రాకతో అయోధ్యలో నిత్యావసరాలకు డిమాండ్ భారీగా పెరిగే అవకాశం ఉండటంతో తమ ఉత్పత్తుల సరఫరాను డాబర్ మరింతగా పెంచింది.

వెయ్యేళ్లైనా చెక్కుచెదరని నిర్మాణం: ఎల్‌అండ్‌టీ

శ్రీ రామ మందిరాన్ని వెయ్యేళ్లైనా చెక్కు చెదరనంత పటిష్టంగా నిర్మించామని దిగ్గజ నిర్మాణ సంస్థ లార్సన్ అండ్ టూబ్రో సీఎండీ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ తెలిపారు. ఈ విషయంలో కేంద్రం, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు తదితర వర్గాలు అందించిన తోడ్పాటుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదొక ఆలయంగా మాత్రమే కాకుండా ఇంజినీరింగ్ అద్భుతంగా కూడా నిల్చిపోతుందని కంపెనీ హోల్ టైమ్ డైరెక్టర్ ఎంవీ సతీష్ పేర్కొన్నారు.

మరిన్ని విశేషాలు..

- ఐటీసీలో భాగమైన మంగళదీప్ అగరబత్తీ బ్రాండ్ ఆరు నెలల పాటు ధూపాన్ని విరాళంగా అందించింది. అలాగే 'రామ్ కీ పేడీ' వద్ద రెండు అగరబత్తీ స్టాండ్లను ఏర్పాటు చేసింది. నదీ ఘాట్‌లలో పూజా కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి పూజారులకు వేదికలను, మార్కెట్లో నీడకు గొడుగులు మొదలైనవి నెలకొల్పింది. భారీ భక్త సందోహాన్ని క్రమబద్ధీకరించేందుకు ప్రధాన ఆలయం దగ్గర 300 బ్యారికేడ్లు, ఆలయ ముఖ ద్వారం దగ్గర 100 పైచిలుకు బాకేడ్లను కూడా ఐటీసీ అందిస్తోంది.
- అయోధ్యలో ఎలక్ట్రిక్ ఆటోల సర్వీసులను ప్రవేశపెట్టినట్లు ట్యాక్సీ సేవల సంస్థ ఉబెర్ తెలిపింది. త్వరలో ఉబెర్‌గో, ఇంటర్‌సిటీ ఉబెర్ సేవలను కూడా అందుబాటులోకి తేనున్నట్లు వివరించింది.
- రామ మందిరంలో లైటింగ్ ఉత్పత్తుల సరఫరా, ఇన్‌స్టాలేషన్ పనులను నిర్వహించడం తమకు గర్వకారణమని హ్యావెల్స్ తెలిపింది.
- తాము భారత్‌లో ఎన్నో ప్రాజెక్టులు చేసినప్పటికీ రామ మందిరం వాటన్నింటిలోకెల్లా విశిష్టమైనదని యూఏఈకి చెందిన ఆర్ఏకే సెరామిక్స్ అభివర్ణించింది.

కొత్త ఆభరణాల కలెక్షన్లు..

సెన్కో గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ 'సియారామ్' పేరిట, కల్యాణ్ జ్యుయలర్స్ 'నిమహ్' పేరిట హెరిటేజ్ జ్యుయలరీ కలెక్షన్‌ను ఆవిష్కరించాయి. మందిర వైభవాన్ని, సీతారాముల పట్టాభిషేక ఘట్టాన్ని అవిష్కృతం చేసేలా డిజైన్లను తీర్చిదిద్దినట్లు సెన్కో గోల్డ్ ఎండీ సేన్ తెలిపారు. సుసంపన్న వారసత్వాన్ని ప్రతిబింబించేలా డిజైన్స్‌తో నిమహ్ కలెక్షన్‌ను రూపొందించినట్లు కల్యాణ్ జ్యుయలర్స్ ఈడీ రమేష్ కల్యాణరామన్ పేర్కొన్నారు.

ఐజీ పెట్రోకెమికల్స్	కీనోట్ క్యాపిటల్స్	కొనొచ్చు

స్టాక్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 503 టార్గెట్: రూ. 819

ఎందుకంటే: దనుకా గ్రూప్‌లో ఐజీ పెట్రోకెమికల్స్ లిమిటెడ్(ఐజీపీఎల్) ప్రధాన కంపెనీగా కార్యకలాపాలు కొనసాగిస్తోంది. దేశీయంగా పెథాలిక్ ఎన్‌హైడ్రైడ్(పాన్) తయారీలో అతిపెద్ద కంపెనీగా నిలుస్తోంది. అంతర్జాతీయస్థాయిలో అత్యంత చౌకగా పాన్‌ను తయారు చేస్తోంది. ఫండమెంటల్ పెట్రోకెమికల్.. ఆర్థోగ్జిలీన్(ఓఎక్స్) నుంచి డౌన్‌స్ట్రీమ్ ప్రొడక్ట్‌గా పాన్‌ను ఉత్పత్తి చేస్తారు. ఆర్గానిక్ కెమిస్ట్రీలో మార్పులకు అనుగుణమైన(వెర్సటైల్) ఇంటర్మీడియెట్‌గా పాన్‌ను వినియోగిస్తారు. ప్రధానంగా ప్లాస్టిసైజర్స్, అన్‌శాచ్యురేటెడ్ పాలియస్టర్ రెజిన్స్, ఆల్కిల్ రెజిన్స్, పాలియోల్స్ తయారీలో పాన్ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రస్తుతం పాన్, ఓఎక్స్ మధ్య ధరల వ్యత్యాసం తగ్గుతోంది. దశాబ్దకాలపు సగటును పరిగణిస్తే ఒక్కో ఎంటీకి ధరల వ్యత్యాసం 150-200 డాలర్ల నుంచి 90 డాలర్లకు దిగివచ్చింది. ఈ వ్యత్యాసం సాధారణ స్థితికి చేరుకునే అవకాశమున్నట్లు భావిస్తున్నాం. దీంతో స్థూల లాభాల్లో భారీ వృద్ధి పటిష్టం కానుంది. కంపెనీ అమ్మకాలు మరింత పెంచుకునే బాటలో కంపెనీ పాన్ తయారీ సామర్థ్యాలను 24 శాతంమేర విస్తరిస్తోంది. వార్షికంగా 222, 110 మిలియన్ టన్నుల(ఎంటీపీఏ) నుంచి 275, 110 ఎంటీపీఏకు పెంచుకుంటోంది. ప్రస్తుతం కంపెనీ సామర్థ్యాన్ని 90% మేర వినియోగించుకుంటోంది.



దాల్మియా భారత్	మోతీలాల్ ఓస్వాల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 2,205 టార్గెట్: రూ. 2,800

ఎందుకంటే: ప్రయివేట్ రంగ సిమెంట్ కంపెనీ దాల్మియా భారత్ లిమిటెడ్ మార్కెట్ల ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్(బీఎస్ఈ)తో పోలిస్తే అంత గొప్ప పనితీరును ప్రదర్శించలేకపోయింది. కొన్ని కారణాలవల్ల గత ఆరు నెలల్లో మేము పలు సిమెంట్ రంగ స్టాక్స్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. 2022 డిసెంబర్‌లో ప్రకటించినప్పటికీ జైప్రకాశ్ అసోసియేట్స్(జేపీఏ) సిమెంట్ ఆస్తుల కొనుగోలులో ఆలస్యం, దేశీయంగా తూర్పు ప్రాంతంలో సిమెంటుకు డిమాండ్ మందగించడం వంటి అంశాలు ఇందుకు ప్రభావం చూపాయి. అయితే కంపెనీ దీర్ఘకాలిక ఔట్‌లుక్(భవిష్యత్)పై ఆశావహంగా ఉన్నాం. వార్షిక ప్రాతిపదికన 2031కల్లా సిమెంట్ తయారీ సామర్థ్యాన్ని సగటున 14–17 శాతం చొప్పున పెంచుకునే ప్రణాళికల్లో ఉంది. వెరసి వార్షికంగా 110–130 మిలియన్ టన్నుల(ఎంటీపీఏ) సామర్థ్యాన్ని అందుకునేందుకు అడుగులు వేయనుంది. నిలకడైన వృద్ధిని కొనసాగించేందుకు వివిధ వ్యూహాలు అమలు చేస్తోంది. అధిక బ్లెండెడ్ సిమెంట్ తయారీ, హరిత ఇంధనాలకు ప్రాధాన్యత, పటిష్ట బ్యాలన్స్‌షీట్‌తోపాటు.. నికర రుణాలు-నిర్వహణ లాభం(ఇబిటా) నిష్పత్తిని 2 కంటే దిగువనే కొనసాగించే లక్ష్యాలు కంపెనీకి ప్రోత్సాహాన్నివ్వనున్నాయి. మూడేళ్ల కాలం(2023–26)లో వార్షికంగా కన్సాలిడేటెడ్ ఆదాయం 11 శాతం, ఇబిటా 24%, నికర లాభం 34% వృద్ధి చెందొచ్చు.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

క్లుప్తంగా...

నేడు ఎస్వీబీసీలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారం

తిరుమల: అయోధ్య శ్రీరామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్టాపన కార్యక్రమం సోమవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగనుంది. ఈ సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర భక్తి చానల్ తమిళం, కన్నడ, హిందీ చానళ్లలో, అదేవిధంగా ఎస్వీబీసీ తెలుగు యూట్యూబ్ చానల్ ద్వారా అయోధ్యలో జరిగే వైదిక, ఆధ్యాత్మిక క్రతువులను నిరంతరాయంగా ప్రత్యక్షప్రసారం చేయనుంది.

ముగిసిన ఇంజినీరింగ్ పోస్టుల భర్తీ రాత పరీక్ష

సాక్షి, అమరావతి దేవదాయ శాఖ పరిధిలో వివిధ ఆలయాల పునః నిర్మాణం, పెద్ద సంఖ్యలో నూతన ఆలయాల నిర్మాణాలు చేపడుతున్న నేపథ్యంలో కొత్తగా 70 ఇంజినీరింగ్ పోస్టుల భర్తీకి సంబంధించిన రాతపరీక్ష ఆదివారం ముగిసింది. 35 ఏఈఈ (సివిల్), ఐదు ఏఈఈ (ఎలక్ట్రికల్), మరో 30 టెక్నికల్ అసిస్టెంట్ (సివిల్) పోస్టులు కాంట్రాక్ట్ విధానంలో భర్తీ చేసేందుకు దేవదాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. నియామక ప్రక్రియను ప్రముఖ ప్రభుత్వ సంస్థ 'ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజి ఆఫ్ ఇండియా'కు అప్పగించింది. ఆయా పోస్టుల భర్తీకి సంబంధించిన రాతపరీక్షను విజయవాడ వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించారు. 35 ఏఈఈ (సివిల్) పోస్టుల కోసం 1,093 మంది దరఖాస్తు చేసుకోగా 767 మంది రాతపరీక్షకు హాజరయ్యారు. ఐదు ఏఈఈ (ఎలక్ట్రికల్) పోస్టుల కోసం 231 మంది దరఖాస్తు చేసుకోగా, 139 మంది హాజరయ్యారు. 30 టెక్నికల్ అసిస్టెంట్ (సివిల్) పోస్టులకు 355 మంది దరఖాస్తు చేసుకోగా, 234 మంది హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.

గవర్నర్‌తో ఎన్నికల అధికారి మీనా భేటీ



సాక్షి, అమరావతి: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అహ్మద్‌తో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనా ఆదివారం విజయవాడ రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈనెల 25న నిర్వహించే జాతీయ ఓటరు దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని గవర్నర్‌ను మీనా ఆహ్వానించారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న పలు అంశాలను, కార్యకలాపాలను ఆయన గవర్నర్‌కు వివరించారు. ఓటర్ల తుది జాబితా విడుదలకు సంబంధించి ప్రణాళిక తదితర అంశాల గురించి కూడా చర్చించారు. ఈ సమావేశంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ ఉన్నారు.

ఏపీఎస్పీఎఫ్ స్పోర్ట్స్ మీట్‌లో క్రీడాకారుల సత్తా

- ఘనంగా ముగిసిన వేడుకలు



బహుమతులు అందజేస్తున్న ఏపీఎస్పీఎఫ్ ఉన్నతాధికారులు

సాక్షి, అమరావతి: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా ఏపీఎస్పీఎఫ్ (ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్–2024లో క్రీడాకారులు సత్తా చాటారు. ఆచార్య నాగార్జున వర్సిటీలో రెండు రోజుల పాటు బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో సుమారు 100 మందికిపైగా క్రీడాకారులు పోటీపడ్డారు. ఆదివారం ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వచ్చిన ఏపీఎస్పీఎఫ్ ఐజీ బీవీ రామిరెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన తొలి మూడు స్థానాల విజేతలకు బహుమతులు అందజేశారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ డైరెక్టర్ బీవీ రవి ప్రకాశ్ రెడ్డి, ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, ఏపీఎస్పీఎఫ్ జోనల్ కమాండెంట్ ఎం.శంకర రావు పాల్గొన్నారు. క్రీడాకారులందరికీ అసిస్టెంట్ కమాండెంట్లు కె.కృష్ణమూర్తి, బి.శ్రీనివాసరావు, ఎం.గుప్తా, ఎస్.శ్రీనివాస రావు, పి.మల్లికార్జున రావు, టి.కృష్ణమాచారి ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు.

జూడోలో సౌమ్యకు రజతం



పతకంతో సౌమ్యరాణి

సాక్షి, అమరావతి: ఖేలో ఇండియా పతకాల పట్టికలో ఆంధ్రప్రదేశ్ బోణీ కొట్టింది. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 6వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ జరుగుతున్నాయి. ఆదివారం జూడో అండర్ 40 కేజీల విభాగంలో శ్రీకాకుళానికి చెందిన కె.సౌమ్యరాణి రజత పతకం సాధించింది. ఫైనల్ ఫైట్‌లో చత్తీస్‌గఢ్‌కు చెందిన స్వప్నపై పోరాడి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఖేలో ఇండియా పోటీల్లో రాష్ట్రం తరపున 14 క్రీడాంశాల్లో సుమారు 90 మందికిపైగా క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ పోటీలు ఈనెల 31వ తేదీ వరకు జరుగనున్నాయి.

'తాళపత్ర' నేలమేఘ శ్యాముడు



అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని వెలగదుర్రు గ్రామానికి చెందిన తాళపత్ర చిత్రకారుడు భూపతిరాజు గోపరాజు తాటి మొవ్వ ఆకులతో రూపొందించిన శ్రీరాముడు చిత్రం అందర్నీ ఆకట్టుకుంటోంది. ఈ చిత్రాన్ని ఎనిమిది గంటల పాటు శ్రమించి తయారు చేశారు. తమ గ్రామంలోని రాయాలయానికి ఈ చిత్రాన్ని బహూకరిస్తున్నట్లు గోపరాజు చెప్పారు.

–ఉండ్రాజవరం

సుందర 'సైకత' రాముడు



అయోధ్యలో జరుగనున్న బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లా రంగంపేట గ్రామానికి చెందిన ప్రముఖ సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ ఆదివారం శ్రీరాముని సైకత శిల్పాన్ని రూపొందించారు. అయోధ్య రాముని ఆగమనం...అవనికే ఆనందం అంటూ అక్షరాలను తీర్చిదిద్దారు. సుందర రూపంలో 'సైకత' రాముడు అందర్నీ ఆకట్టుకుంటున్నాడు.

–రంగంపేట

'ప్రభుత్వ డిగ్రీ'తో

ఉద్యోగాల వెల్లువ

గతేడాది 539 జాబ్ డ్రైవ్‌లలో 18 వేల మందికిపైగా ఇంటర్వ్యూల్లో ఎంపిక

17 రకాల నైపుణ్యాలను పెంచేలా వివిధ సంస్థలతో ఒప్పందం

సాక్షి, అమరావతి : ప్రభుత్వ కళాశాలల్లో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు 'ప్లేస్‌మెంట్ల'లో గణనీయమైన ప్రగతి సాధిస్తున్నారు. డిగ్రీతో పాటు జవహర్ నాలెడ్జ్ సెంటర్లు(జేకేసీ), నైపుణ్యాభివృద్ధి సంస్థల ద్వారా పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్య శిక్షణను పొందుతుండటంతో డిగ్రీ చివరి ఏడాదిలోనే ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఏకంగా 539 జాబ్ డ్రైవ్‌ల ద్వారా చరిత్రలో తొలిసారిగా 18 వేల మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు పొందడం విశేషం. గతంలో విద్యార్థులకు తరగతి గది పాఠ్యాంశాలు మాత్రమే అందేవి. బయట ఉద్యోగాలకు వెళితే నైపుణ్యాలు లేవన్న కారణంతో పరిశ్రమలు తిరస్కరించేవి. కానీ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఉన్నత విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. బీటెక్ వంటి ప్రొఫెషనల్ విద్యలోనే కాకుండా నాన్–ప్రొఫెషనల్ డిగ్రీల్లోనూ 10 నెలల ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేశారు. ఫలితంగా డిగ్రీ చదువుతున్న సమయంలోనే విద్యార్థులు తమకు నచ్చిన రంగంలో నైపుణ్యాలను అందిపుచ్చుకుంటున్నారు.



మార్కెట్ ఓరియెంటెడ్ నైపుణ్యం

దేశంలోనే నాలెడ్జ్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా ప్రతి విద్యార్థినిని 'జాబ్ రెడీనెస్' ఓరియెంటేషన్‌తోనే సన్నద్ధం చేస్తోంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్లేస్‌మెంట్ సెల్ ద్వారా 17 రంగాల్లో నైపుణ్యాలు అందించేలా వివిధ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది. రబ్బర్ అండ్ పెట్రోలియం కెమికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, టూరిజం–హాస్పిటాలిటీ, క్యాపిటల్ గూడ్స్, మేనేజ్‌మెంట్ ఎంట్రప్రెన్యూర్‌షిప్, గ్రీన్‌జాబ్స్, రిటైల్ సెక్టార్ వంటి రంగాల్లో మార్కెట్ ఓరియెంటెడ్ స్కిల్స్‌ను పెంపొందిస్తూనే ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. సుమారు 500 కంపెనీలను సమన్వయం చేస్తూ ఒకేసారి దాదాపు 30 వేల ఉద్యోగాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తోంది. కళాశాల విద్యాశాఖ ప్రత్యేక జాబ్ పోర్టల్‌ను, యాప్‌ను తయారు చేసింది. 165 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను 21 క్లస్టర్లుగా విభజించి ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు కొనసాగిస్తోంది. ఎంపిక చేసిన కళాశాలల్లో నోడల్ రిసోర్స్ సెంటర్ల పేరుతో ప్లేస్‌మెంట్ సెల్‌లను ఏర్పాటు చేసింది. దీని ద్వారా మొదటి రెండేళ్లు విద్యార్థులకు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఇస్తోంది. మార్కెట్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని 'నైపుణ్యాల పెంపు' సర్టిఫికేషన్ కోర్సులు అందిస్తోంది. గడిచిన రెండేళ్లలో 2,000 మంది విద్యార్థులకు అంతర్జాతీయ సంస్థ మైక్రోసాఫ్ట్ అప్‌స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లను పూర్తి చేశారు. మరో 2,500 మంది అధ్యాపకులు, విద్యార్థులు సిస్కో ఎడ్యుస్కిల్ కోర్సులు, 7,700 మంది ఐఐటీ ముంబయి సహకారంతో స్పోకెన్ ట్యూటోరియల్స్ కోర్సుల ద్వారా నైపుణ్యాలను పెంచుకున్నారు.

పలు ప్రతిష్టాత్మక సంస్థల్లో..

విద్యార్థులు చదువులు పూర్తి చేసుకుని ఎక్కడికో వెళ్లి పనిచేయాల్సిన అవసరం లేకుండానే స్థానికంగా జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో ఉపాధి కల్పిస్తోంది. ఇందులో భాగంగానే గతేడాది కెమికల్ ఇండస్ట్రీలో డాక్టర్ రెడ్డీస్, హెటిరో, అరబిందో, డెక్కన్‌గ్రూప్, రిటైల్ విభాగంలో ఫ్లిప్‌కార్ట్, డీమార్ట్, ఈ–కామ్ ఎక్స్‌ప్రెస్, అమెజాన్, జాయలుక్కాస్, ఇన్సూరెన్స్ సెక్టార్‌లో ఎల్ఐసీ, ఎస్‌బీఐ లైఫ్, స్టార్టెక్ హెల్త్‌తో పాటు ఫార్మాలో అపోలో, మెడ్‌ప్లస్, బ్యాంకింగ్‌లో ఐసీఐసీఐ, యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐటీలో ఎఫ్‌ట్రానిక్స్, టెక్బీయం, హెచ్1హెచ్ఆర్‌తో పాటు ట్రాన్స్‌పోర్టు, మీడియా, ఎడ్యుటెక్, ఫైనాన్స్ రంగాల్లో అనేక కంపెనీలు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్నాయి. ఇవి కాకుండా హెచ్‌సీఎల్, టీసీఎస్, డెలాయిట్, స్టేట్‌స్ట్రీట్ వంటి సంస్థల్లోనూ ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఉద్యోగాలు పొందుతున్నారు.

విద్యతో పాటే ఉద్యోగం..



విద్యార్థులకు చదువుతో పాటు ఉపాధిని కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం కరిక్యులమ్‌లో మార్పులు తెచ్చింది. తరగతి బోధనతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్, ఎనలిటికల్ థింకింగ్ పెంపొందించేలా చర్యలు చేపట్టాం. కళాశాలల్లో ప్లేస్‌మెంట్ సెల్స్ ఏర్పాటు చేసి ఏటా వీలైనంత ఎక్కువ మంది విద్యార్థులకు ఉపాధిని చూపుతున్నాం. గతేడాది ఆగస్టు వరకు వివిధ ప్రదేశాల్లో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహించాం. సుమారు 18 వేల మందికి పైగా వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

– పోలా భాస్కర్, కమిషనర్, కళాశాల విద్య

ఏపీలో తొలిసారి పోలీస్ కమాండో పోటీలు

- నేటి నుంచి విశాఖలో మొదలు
- దేశంలోని పోలీసు బలగాల కఠినతరమైన పోటీ
- ఐదు దశల్లో 9 రోజుల పాటు నిర్వహణ

విశాఖ స్పోర్ట్స్: కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, రాష్ట్ర పోలీసు బలగాలకు చెందిన 23 టాప్ కమాండో బృందాలు పాల్గొనే ఆల్ ఇండియా పోలీస్ కమాండో కాంపిటీషన్స్ (ఏఐపీసీసీ) సోమవారం నుంచి విశాఖలో ప్రారంభం కానున్నాయి. ఆంధ్రప్రదేశ్ తొలిసారిగా ఆతిథ్యమివ్వనున్న ఈ పోటీలకు విశాఖలోని ఏపీ గ్రేహౌండ్స్ గ్రౌండ్స్ వేదిక కానున్నది. 14వ ఏఐపీసీసీ పేరిట 9 రోజుల పాటు ఏపీ గ్రేహౌండ్స్ ఆధ్వర్యంలో ఏఐపీఎస్‌సీబీ పర్యవేక్షణలో జరిగే ఈ పోటీలను రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ప్రారంభించనున్నారు. పోటీల ముగింపు రోజున విజేతలకు ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ట్రోఫీలు అందజేయనున్నారు. బెస్ట్ కాన్ఫిడెన్స్ కోర్స్ పోలీస్ కమాండ్ జట్టు, ఛీతా రన్ ట్రోఫీ, రణనీతి ట్రోఫీ, స్టాండ్ ఎలోన్ స్నయిపర్ ఫైరింగ్, బ్లాక్ హాక్, చక్రవ్యూహ, బెస్ట్ స్టేట్ పోలీస్ కమాండో జట్టును ఎంపిక చేయనున్నారు. కమాండో కేటగిరిలో నిర్వహించే ఈ పోటీల్లో వ్యక్తిగత, టీమ్ పోటీలు ఐదు దశలుగా జరగనున్నాయి. ఆయా దశల్లో సాధించిన పాయింట్ల ఆధారితంగా బెస్ట్‌లను ఎంపిక చేయనున్నారు. ఐటీబీపీ జట్టు డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగనుండగా, ఏపీ పోలీస్ జట్టుతో సహా మరో పదిహేను పోలీసు జట్లు, ఏడు కేంద్ర పోలీసు బలగాల జట్లు పోటీపడనున్నాయి. దేశంలో 2009 నుంచి ఈ పోటీలు జరుగుతున్నాయి. ఉత్తమ పోలీస్ కమాండో బృందం వారి శారీరక దృఢత్వం, వ్యూహాత్మక నైపుణ్యాలు, మానసిక దృఢత్వం, షూటింగ్ పరాక్రమం, నాయకత్వ లక్షణాలు ఏఐపీ కమాండ్ కాప్స్‌పై అంచనా వేసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నారు.

'బ్రో'.. బాబెప్పుడూ ఇంతే!

సీట్లపై ఆఖరి నిమిషం దాకా నాన్చే ధోరణిలో చంద్రబాబు

చివర్లో అతి కొద్ది సీట్లతో పవన్‌కు చెక్ పెట్టే యోచన

సాక్షి, అమరావతి: చంద్రబాబు విషకౌగిలిలో చిక్కుకుంటే ఇక తప్పించుకోవడం కష్టం.. పవన్ కళ్యాణ్‌కు ఇప్పుడిప్పుడే ఆ తత్వం మెల్లగా బోధపడుతోంది. జనసేనకు సీట్ల కేటాయింపును ఆఖరి నిమిషం దాకా నాన్చి... చివర్లో అతి కొద్ది సీట్లతో పవన్‌ను కట్టడి చేసేలా చంద్రబాబు పెద్ద ప్రణాళికతో ఉన్నారని ఇప్పటికే జనసేన నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. మరో రెండు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొస్తుండగా.. జనసేన పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుంది, ఏ ఏ స్థానాల్లో పోటీ చేయాలన్న దానిపై ఇప్పటికీ ఆ పార్టీ నేతల్లో స్పష్టత లేదు. దీంతో జనసేన కార్యకర్తలు సందిగ్ధంలో పడిపోయారు. పార్టీ అధినేత పవన్ రెండు మూడు వారాలుగా మౌనంగా ఉండడంతో అసలు పార్టీలో ఏం జరుగుతుందో.. ఈ పొత్తు ఎటు పోయి ఎటు వస్తుందోనని జనసైనికులు తలలు పట్టుకుంటున్నారు. యుద్ధానికి సన్నద్ధమవ్వాల్సిన సమయంలో పార్టీ అధినేత మొదలు.. పార్టీలో ఏ ఒక్క నాయకుడు తాము ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తామని చెప్పుకోలేని పరిస్థితి నెలకొంది.

ఇలాగైతే అసలుకే మోసం

తమకు ఇన్ని స్థానాలు కావాలని.. ఈ స్థానాలు కేటాయించాల్సిందేనని పవన్ కళ్యాణ్ ఇప్పటి దాకా టీడీపీని స్పష్టంగా కోరలేదు. జనసేనలోను కొందరు కీలక నేతలకు కూడా ఎలాంటి స్పష్టత లేదు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేది గత ఎన్నికల్లోనూ చివరి వరకూ తేల్చలేదు. దీంతో అసలుకే మోసం వచ్చింది. పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ పవన్ ఘోరంగా ఓడిపోయారు. ఇప్పుడు కూడా ఎక్కడి నుంచి పోటీ అనేది ఆఖరి నిమిషం వరకూ గోప్యంగా ఉంచడం ఈ ఎన్నికల్లో ఒక ఎత్తుగడగా భావిస్తున్నారు.



వాడుకుని వదిలేస్తారేమో?

రెండేళ్లుగా పవన్ కళ్యాణ్ అప్పుడప్పుడూ రాష్ట్ర పర్యటనకు వచ్చి మరో రెండు మూడు నెలల్లో ఎన్నికలు జరుగుతాయా? అన్నంత హడావుడి చేసేవారు. సరిగ్గా ఎన్నికల సమయంలో మాత్రం ఆయన మౌనంగా ఉండిపోవడం వెనుక చంద్రబాబు జిమ్మిక్కులు ఉన్నాయని జనసైనికులు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. మూడున్నర నెలలుగా వారాహి యాత్రను సైతం పక్కనపెట్టేశారు. ప్రతి పొత్తు సమయంలోనూ చంద్రబాబు తమతో పొత్తు పెట్టుకున్న పార్టీని రాజకీయంగా వాడుకుని ఆ తర్వాత ఆ పార్టీని అణగదొక్కే నైజం అందరికీ తెలిసిందే. ఆ వ్యూహాన్ని ఇప్పుడు జనసేనపైనా మొదలుపెట్టి ఉండొచ్చని పార్టీలో చర్చ సాగుతోంది.

మొదటి నుంచి చంద్రబాబు వెంట పవన్ కళ్యాణ్ వెంపర్లాడడంతో దాన్ని అలుసుగా తీసుకుని తమ అధినేతను కూరలో కరివేపాకులా వాడుకుని వదిలేసే ఎత్తుగడలో బాబు ఉన్నాడని ఇప్పటికే జనసేన నేతలు మెల్లగా అర్థం చేసుకుంటున్నారు. తెలుగుదేశం–జనసేనలు కచ్చితంగా కలిసి పోటీ చేస్తాయని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఖరాఖండీగా ఆ పార్టీ నేతలకు స్పష్టం చేశారు. నచ్చేవారు ఉంటే ఉండండి.. లేదంటే వెళ్లిపోండి అని కేడర్‌ను అయోమయంలో పడేశారు. తమ అధినేత ఇంత చేస్తే పొత్తులో భాగంగా జనసేనకు ఎన్ని స్థానాలు కేటాయించేదీ చంద్రబాబు తేల్చకపోవడంపై ఆ పార్టీలో పెద్ద ఎత్తున మేధోమథనం సాగుతోంది. తమను చంద్రబాబు చివరిలో ముంచేస్తే పరిస్థితి ఏంటని చర్చించుకుంటున్నారు.

పవన్‌కు అవమానం : జనసైనికుల ఆవేదన

నెలాఖరు నుంచి పర్యటనలు: నాదెండ్ల

నెలాఖరు నుంచి పవన్ కళ్యాణ్ క్షేత్రస్థాయి పర్యటనలు ఉంటాయని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. అన్ని అసెంబ్లీ స్థానాలు కవర్ చేసేలా, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలతోపాటు బహిరంగ సభలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు.

పొత్తులు కాదు కత్తులే

పార్టీలో కీలక నాయకుడిగా ఉన్న నాదెండ్ల మనోహర్ కోరుకుంటున్న గుంటూరు జిల్లా తెనాలి అసెంబ్లీ స్థానం మొదలు ఉభయ గోదావరి జిల్లాల్లో జనసేన పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్న నియోజకవర్గాలన్నింటిలోనూ స్థానిక టీడీపీ నాయకులు వ్యూహాత్మకంగా గత వారం పది రోజులుగా అక్కడి జనసేన నాయకులకు వ్యతిరేకంగా పోటీ కార్యక్రమాలు మొదలుపెట్టారు. జనసేనలో కీలక నేతగా కొనసాగుతున్న నాదెండ్ల మనోహర్ ఆశిస్తున్న గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలో టీడీపీ మాజీ మంత్రి ఆలపాటి రాజా టికెట్ ఆశిస్తున్నారు. నియోజకవర్గంలో జనసేనకు పోటీగా పాదయాత్ర చేస్తుండగా... రాజా అనుచరులు నియోజకవర్గంలో ప్రత్యేక సమావేశాలు పెట్టి నాదెండ్ల మనోహర్‌పై బహిరంగంగానే విమర్శలకు దిగారు. పొత్తులో సీట్ల కేటాయింపు కొలిక్కి రాకమునుపే చంద్రబాబు మాత్రం తెలుగుదేశం పార్టీ పోటీ చేసే స్థానాల గురించి బహిరంగ సభలో ప్రకటిస్తున్నారని జనసేన నాయకులు భగ్గుమంటున్నారు. మండపేట నియోజకవర్గంలో జరిగిన బహిరంగసభలో చంద్రబాబు ఆ స్థానంలో టీడీపీ పోటీ చేసే అంశాన్ని పేర్కొనడం స్థానికంగా రెండు పార్టీల మధ్య వివాదంగా మారింది. అక్కడ జనసేన నుంచి టికెట్ ఆశిస్తున్న తూర్పు గోదావరి జిల్లాలోని జనసేన కీలక నాయకుడు మనస్తాపం చెంది.. సీట్ల కేటాయింపు తేలేవరకు మండపేట నియోజకవర్గంలో టీడీపీ నిర్వహించే కార్యక్రమాలకు దూరంగా ఉండాలని జనసేన నాయకులకు సందేశాలు పంపినట్టు ప్రచారం జరుగుతోంది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోనూ ఇదే తరహా వాతావరణం ఉండగా, ఉమ్మడి ఉభయగోదావరి, ఉమ్మడి విశాఖ జిల్లాలోనూ ఇదే తరహా పరిస్థితి నెలకొంది.

ఫొటోలోనే పవన్.. పక్కన అక్కర్లేదా: జనసైనికులు

జనసేనలో టికెట్లపై గందరగోళం నెలకొనగా... చంద్రబాబు మాత్రం పవన్ ఫొటోలు పెట్టుకుని వరుసగా తమ పార్టీ రాజకీయ కార్యక్రమాలకు వాడేసుకుంటున్నారు. వెళ్లిన ప్రతిచోట తమ అభ్యర్థులకు మద్దతుగా పెద్ద ఎత్తున ప్రచారం చేసేసుకుంటున్నారు. మరోవైపు జనసేనలో మాత్రం సీట్ల కేటాయింపు తేలక ఎన్నికల హడావుడి లేకుండా పార్టీ పూర్తి స్తబ్ధుగా తయారైంది. చంద్రబాబు తన ఫొటో పక్కనే పవన్ కళ్యాణ్ ఫొటోలు పెట్టుకొని జనసేనకు ఏమాత్రం సంబంధం లేకుండానే రోజుకు రెండు బహిరంగ సభలు నిర్వహించడం జనసైనికులకు మింగుడు పడడం లేదు.

శిఖరాలూ.. సలాం కొట్టాయ్!



బోణం గణేష్, సాక్షి ప్రతినిధి

సముద్రమట్టానికి వేల మీటర్ల ఎత్తు.. సహకరించని వాతావరణం.. అడుగడుగునా పొంచి ఉన్న ప్రమాదాలు.. గజగజలాడించే మంచు.. కానీ అతని సంకల్పానికి ఆ మహామహా శిఖరాలే తలవంచాయి. మార్షల్ ఆర్ట్స్‌లో అతని పట్టుదలకు అంతర్జాతీయ పతకాలు వరించాయి. ప్రపంచంలోని ఏడు అతిపెద్ద శిఖరాలను అధిరోహించిన అతని పేరు.. భూపతిరాజు అన్మీష్ వర్మ. విశాఖపట్నానికి చెందిన అన్మీష్ వర్మ తాను అధిరోహించిన ప్రతి పర్వతంపైనా జాతీయ జెండాతో పాటు వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాల జెండాను ఎగురవేస్తూ అభిమానాన్ని చాటుకుంటున్నారు. అన్మీష్ గురించి విశేషాలు ఆయన మాటల్లోనే..

సరదాగా మొదలై.. శిఖరాల అంచులకు ఎగసి

చిన్నప్పుడు విశాఖపట్నంలోని కొండలను సరదాగా ఎక్కేవాడిని. ఆ ఆసక్తే ఎవరెస్ట్ గురించి తెలుసుకునేలా చేసింది. దానిపైకి ఎక్కడం కష్టమని.. అధిరోహించడానికి వెళ్లిన వారు చనిపోతే శవాన్ని తేవడం కూడా కష్టమేనని తెలుసుకున్నాక దానిపైకి ఎలాగైనా ఎక్కాలని నిర్ణయించుకున్నాను. ఎవరెస్ట్‌ను అధిరోహించేందుకు విజయవాడలో ప్రభుత్వం సెలక్షన్స్ నిర్వహిస్తోందని తెలుసుకుని.. నేనూ వెళ్లాను. అప్పుడు వందల మంది వచ్చారు. కానీ నాతో పాటు ఐదుగురే ఎంపికయ్యారు. లేహ్, లడఖ్‌లో ప్రాక్టికల్ టెస్ట్ పూర్తి చేసి.. ఎవరెస్ట్‌ను అధిరోహించడానికి అర్హత సాధించాను. మన దేశంలోనే అత్యంత వేగవంతమైన పర్వతారోహకుడిగా గుర్తింపు సంపాదించాను. ప్రపంచంలోనే ఎత్తయిన ఏడు పర్వతాలను అధిరోహించిన ఏకైన వ్యక్తిగా గుర్తింపు లభించింది.

నవరత్నాలతో పేదలకెంతో లబ్ధి..

అలాగే తొమ్మిదేళ్లకే మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నాను. ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో మెడల్స్ సాధించాను. వరుసగా మూడు మెడల్స్ సాధించి రికార్డ్ సృష్టించాను. మా నాన్న వేణుగోపాలరాజు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో కొన్నాళ్లు విధులు నిర్వర్తించి.. ఆ తర్వాత లారీ డ్రైవర్‌గా పనిచేశారు. 2014లో రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. నాన్న పోయిన 18 రోజులకు ఇంగ్లండ్‌లో కరాటే ప్రపంచ చాంపియన్‌షిప్‌కు వెళ్లి పతకం సాధించాను. ఇప్పుడు నేనే మన దేశ కరాటే టీమ్‌కు కోచ్‌గా ఉన్నాను. రాష్ట్రంలో వైఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలు నాకెంతో నచ్చాయి. ఎంతోమంది పేదలకు వాటి ద్వారా లబ్ధి చేకూరుతోంది. అందుకే ఆ పథకాల లోగో ఉన్న జెండాను మన దేశ జెండాతో పాటు ప్రపంచ శిఖరాలపై ఎగురవేస్తుంటాను. 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో గ్రామీణ యువత, విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నం అభినందనీయం.

బతికిరావడమూ కష్టమే..

అడ్వెంచర్ గ్రాండ్ స్లామ్.. అత్యంత ప్రతిష్టాత్మకమైనది. ఏడు ఖండాల్లోని ఏడు ఎత్తయిన పర్వతాలను అధిరోహించిన వారికి ఆ గ్రాండ్ స్లామ్ టైటిల్ లభిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకు ఈ టైటిల్ దక్కించుకున్న వారి సంఖ్య 30లోపే ఉంటుంది. అంత గొప్ప టైటిల్ నాకు లభించింది. ఎవరెస్టు, ఎల్బ్రస్, కిలీమంజారో, దెనాలి, అకాంగువా, మౌంట్ విన్సన్, కోస్కియోస్కోను అధిరోహించాను. అలాగే మైనస్ డిగ్రీల సెల్సియస్‌లలో.. భూమి నార్త్, సౌత్ పోల్ 90 డిగ్రీల అక్షాంశానికి చేరుకున్నాను. అదో పెద్ద సాహసం. తేడా వస్తే బతికిరావడం కష్టం. ఆ చలికి రక్తం గడ్డకడుతుంది. ఒకసారి ఎవరెస్ట్‌ను అధిరోహిస్తున్నప్పుడు నా సహ పర్వతారోహకుడికి బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టింది. ఆ పరిస్థితిలో అతన్ని వదిలేసి వెళ్లలేకపోయాను. అతన్ని కాపాడటం కోసం వెనక్కి తిరిగొచ్చేశాను. ఆ తర్వాత ఏడాది మళ్లీ ప్రయత్నించాను. ప్రాణాలకు తెగించి లక్ష్యాన్ని చేరుకున్నాను.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenahalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

వైభవంగా యరగేర ఉరుసు



దర్గాలో పూజలు చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: యరగేర బడేసాబ్ దర్గా ఉరుసు వైభవంగా జరిగింది. శనివారం రాత్రి దర్గా నిర్వాహకులు భక్తి శ్రద్ధలతో విశేష పూజలు చేశారు. ఎంపీ రాజా అమరేశ్వర నాయక్, నిజాముద్దీన్, హఫీజుల్లా తదిత రులు పాల్గొన్నారు.

వారు హిందూ వ్యతిరేకులనే భావన కలుగుతోంది

రాయచూరు రూరల్: అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్టాపనలో భాగంగా రాష్ట్ర సర్కార్ సెలవు ప్రకటించకపోవడంతో హిందూ వ్యతిరేకులనే భావన అనే రావడం సహ జమని రంబాపుర పీఠాధిపతి జగుద్గురువు వీర సోమేశ్వర శివాచార్య అన్నారు. ఆది వారం నగరంలో తనను కలిసిన విలేకర్లతో మాట్లాడారు. దేశంలోని పలు రాష్ట్రాలలో సెలవులు ప్రకటించారని అన్నారు. ఈ విష యంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివ కుమార్ వెంటనే నిర్ణయం తీసుకోవాలన్నారు.

అంబిగర చౌడయ్య జయంతి

కంప్లి: కంప్లి తాలూకా కార్యాలయంలో నిజశ రణ అంబిగర చౌడయ్య జయంతి నిర్వహిం చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివరాజ్ మాట్లాడుతూ... అంబిగర చౌడయ్య జయంతి జరుపుకోవడం ఎంతో సంతోషకరమని, నేటి యువత ఆయన అడుగుజాడల్లో నడవాల న్నారు. కార్యక్రమంలో ప్రముఖులు బీ.సిద్దప్ప కారేకల్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు అంబిగర చౌడయ్య చిత్రప టానికి పూజలు చేశారు.

సామూహిక వివాహాలు



వధూవరులను ఆశీర్వదిస్తున్న స్వామీజీ

గంగావతి: గవిసిద్దేశ్వర మహాస్వామి యాత్ర నిర్వహణలో భాగంగా ఆదివారం 22 మంది దివ్యాంగ వధూవరులకు వివాహాలు జరిపిం చారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడు తూ... ప్రతి ఏడాది విశేష కార్యక్రమాలను చేపట్టేవారమని ఈ ఏడాది దివ్యాంగులకు వివాహాలు జరిపించడం సంతోషంగా ఉంద న్నారు. వధూవరులకు దుస్తులు, మంగళ సూత్రం, వివాహ సామగ్రి అందించారు. స్వామీజీ వారిని ఆశీర్వదించారు. వీరి ఉపా ధికి జిరాక్స్ మిషన్, దీని ఏర్పాటుకు ఓ బం క్‌ను కల్పిస్తారు.

ఘనంగా విందు వేడుక

బళ్లారిఅర్బన్: బళ్లారి జిల్లా కమ్మ సమాజ బాంధవులు ఐకమత్యంతో విందు కార్య క్రమం ఏర్పాటు చేయడం హర్షణీయమని సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కౌళగల్లు రోడ్డులోని ధర్మ రెడ్డి కళ్యాణమంటపంలో కమ్మసమాజ బాం ధవులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బళ్లారిలోని కోనంకి రామప్ప సర్కిల్ నామకరణం చేసేందుకు కూడా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కంప్లి ఎమ్మెల్యే గణేష్, మేయర్ శ్వేత, ఉపమే యర్ జానకమ్మ, కమ్మ కార్పొరేటర్లు 7 మం ది, వెంకటేష్ ప్రసాద్, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, విజయవాడ ఎమ్మెల్యే గద్దె రామమో హన్ రావు తదితరులు పాల్గొన్నారు.

అల్లీపూర్ శ్రీ మహాదేవ తాత రథోత్సవం



అలంకరణలో తాత

బళ్లారి అర్బన్: నగరంలోని హొస్పేట్ రోడ్డు అల్లీపూర్ శ్రీ సద్గురు మహాదేవ తాత రథో త్సవం ఘనంగా జరిగింది. రథోత్సవంలో స్థానిక భక్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొ న్నారు. ప్రతి అమావాస్యకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లిస్తారు.

గంజాయి విక్రేత అరెస్ట్

హుబ్లీ: నగరంలోని మంటూరు రోడ్డులో గం జాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రెండు కేజీలకు పైగా గం జాయి స్వాధీనం చేసుకున్నారు. దాడి విషయం తెలుసుకున్న మరో వ్యక్తి పారిపోయినట్లు బెండిగేరి సీఐ జయపాల్ పాటిల్ తెలిపారు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సిబ్బంది కొరత.. పాలికె వెత

- మహానగర పాలికెలో ఉద్యోగులు సతమతం
- ఉన్న వారిపై పెరిగిన పని భారం
- అధ్వానంగా నగర పారిశుధ్యం



పేరుకే మహానగర పాలికె



నగరంలో ఓ డ్రైనేజీలో నిలిచిపోయిన మురుగునీరు, పక్కన చెత్త

సాక్షి బళ్లారి: బళ్లారి మహా నగర పాలికెను సిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది. కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయినా పాలకులు ఆ దిశగా అన్ని సదుపాయాలు కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారనే ఆరో పణలు ఉన్నాయి. 2004లో సిటీ మున్సిపాలిటీ నుం చి మహానగర పాలికెగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి 20 ఏళ్లుగా పాలికెలో సిబ్బందిని భర్తీ చేయకపోవడంతో నగరాభివృద్ధి అస్తవ్యస్తంగా మారింది. ఈ 20 ఏళ్ల వ్యవధిలో 14 మంది మేయర్లు మారినా సిటీ కార్పొరేషన్ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారు. కార్పొరేషన్ పరిధిలో సిబ్బంది కొరత సగానికి సగం ఉన్నట్లు అధికార గణంకాలే చెబుతున్నాయి. నగర జనాభా రోజు రోజుకు పెరుగుతోంది. ఇక వార్డు లను 35 నుంచి 39 వరకు పెంచారు. అయితే సిబ్బందిని మాత్రం పెంచడంపై పాలకులు దృష్టి పెట్టడంలేదు.

అప్‌గ్రేడ్ అయినా ఫలితం శూన్యం

కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయినా పాలికె పరిధిలో ఏ, బీ, సీ, డీ గ్రూపులకు సంబంధించి దాదాపు 1300 ఖాళీలున్నాయి. ఏ గ్రూప్ పరిధిలో 15, బీ గ్రూప్ పరి ధిలో 18, సీ గ్రూప్ పరిధిలో 450, మంది, డీ గ్రూప్ పరిధిలో 850 సిబ్బంది కొరత ఉంది. ఇందులో కాం ట్రాక్ట్ పద్ధతిలో 650 మందిని నియమించుకొని పనులను చేయించుకుంటున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం మహానగర పాలికె పరిధిలో 1800 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం 420 మందిని మాత్రమే భర్తీ చేశారు. కొత్తగా వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు సిబ్బంది కొరతను అదిగో, ఇదిగో భర్తీ చేస్తాం అని హామీలు ఇస్తూనే ఉన్నారు. ముఖ్యంగా డీ -గ్రూప్ సిబ్బంది కొరత తీవ్రం కావడంతో వారిపై పని ఒత్తిడితో పాటు పాలికె పరిధిలో స్వచ్ఛత పనులు, నగర సుందరీకరణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. డీ గ్రూప్ కార్మికులపై అధిక భారం మోపుతున్నట్లు నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా రు. ఇకనైనా సంబం ధిత అధికారులు నగరంలో సిబ్బంది కొరతను నివా రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మారుమోగుతున్న రామనామం



శ్రీరామ్ అక్షరాకృతి

కంప్లి: అయోధ్యలో సోమవారం రాముడి విగ్రహ ప్రతిష్టాపన నేపథ్యంలో పట్టణంలో ఆనందోత్స హాలు నెలకొన్నాయి. వీధి వీధుల్లో శ్రీరాముడి నామం మారుమోగుతోంది. మరోవైపు కాషాయ వర్ణం అలుముకుంది. మరియమ్మనహళ్లిలో విద్యా ర్థుల నిర్వహించిన శ్రీరామ్ అక్షరాకృతి ఆకట్టుకుంది.

అయోధ్యకు రేగుపండ్లు



రేగిపండ్లను చూపుతున్న మాజీ ఎమ్మెల్సీ

గంగావతి: అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం నేపథ్యంలో రఘురాముడికి ఇష్టమైన రేగు పండ్లను అయోధ్యకు పంపిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ హెచ్‌ఆర్ శ్రీనాథ్ తెలిపారు. రామచంద్రుడు సీతను వెతుకుతూ ఆనెగుంది ప్రాంతానికి చేరుకున్న సంద ర్భంగా పంపా సరోవర్‌లో ఆయనకు ఇష్టమైన రేగు పండ్లను అందించగా తృప్తిగా ఆరగించారని, ఇది చరిత్ర చెబుతున్న సత్యమని తెలిపారు. దీంతో ఈ పండ్లను కేంద్రమంత్రి శోభ కారందాజ్లెకి అందజేసి వీటిని రాముడు సమర్పించాలని కోరామన్నారు.

నగరంలో రామనామ స్మరణ



మోతీ సర్కిల్‌లో శ్రీరాముడి ఫ్లెక్సీ, జెండాలు

బళ్లారిఅర్బన్: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతి ష్టాపన నేపథ్యంలో బళ్లారి నగరంలో వివిధ ఆల యాల్లో భారీ ఏర్పాట్లను చేపట్టారు. స్థానిక అనంత పురం రోడ్డు అభయ వరదాంజనేయ స్వామి ఆల యంలో భజన, భక్తి గీతాల కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు ధనుంజయ తెలిపారు. చిన్న దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు భక్తులు ఎల్‌ఈడీ ద్వారా అయోధ్యలో జరిగే పూజలు నేరుగా వీక్షించేందుకు అవకాశం కల్పిం చారు. అదే విధంగా నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు.

న్యాయవాద వృత్తిలో మహిళలు రాణించాలి



జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: న్యాయవాద వృత్తిని మహి ళలు ఎంచుకోవడం సంతోషకర విషయమని, వారు ఆ వృత్తిలో రాణించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉమా పేర్కొన్నారు. ఆదివారం వ్యవ సాయ విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మహిళా న్యాయవాదుల సంఘం ప్రథమ సమ్మేళన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పురుషులతో సమానంగా మహిళలు ముందుకు రావాలని, న్యాయవాది వృత్తిలో మహిళల పాత్రను తక్కువ అంచనా వేయరాద న్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మారుతి, అఖిల భారత న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు హరిశ్చంద్ర, ఉపాధ్యక్షుడు చమకిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో భక్తిభావాలు ముఖ్యం



ఊరేగింపులో స్వామీజీ



కలశాలతో మహిళలు

రాయచూరు రూరల్: ప్రతి ఒక్కరూ భక్తి భావాలను అలవరచుకోవాలని రంబాపుర పీఠాధిపతి జగుద్గు రువు వీర సోమేశ్వర శివాచార్య మహా భగవత్పాద కులు పిలుపునిచ్చారు. నగరంలోని పంచలింగేశ్వర దేవాలయం వద్ద నూతనంగా నిర్మించిన రాచోటి వీర శివాచార్యుల కల్యాణ మంటపాన్ని లోకార్పణ చేసి భక్తులనుద్దేశించి మాట్లాడారు. నేడు ప్రతి ఒక్కరు ఒత్తిడిలో జీవిస్తున్నారని, అలాంటి వాకె కొంత సమయం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటా యించాలన్నారు. కార్యక్రమంలో సోమవారి పేట మఠాధిపతి అభినవ రాచోటి శివాచార్య, శాంత మల్ల శివాచార్యులు, బృహన్మఠ బూది బసవేశ్వర శివాచార్య మహా స్వామీజీ, శాసనసభ్యుడు శివ రాజ్ పాటిల్, అంతర గంగి వీరభద్రప్ప, రాచయ్య, ఉదయ్ కుమార్, మల్లికార్జున తదిత రులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



జాతాను ప్రారంభిస్తున్న దృశ్యం

కంప్లి: బాల్య వివాహాలను లేని సమాజం వైపు అడుగులు వేయాలని చైల్డ్ రైట్స్ తాలూకా అధికారి సరస్వతి అన్నారు. కురుగోడు తాలూకా బాదనహట్టి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, చైల్డ్ రైట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై జాగృతి జాతాను ప్రారంభించి మాట్లాడారు. పిల్లల హక్కులను హరించకూడదని, బాల్య వివాహాలు జరిపిస్తే తల్లిదండ్రులు శిక్షార్హుల న్నారు. చిన్న వయసులోనే గర్భం దాలిస్తే తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారన్నారు. హెచ్‌ఎం వీ.గంగాధర్ మాట్లాడుతూ... పిల్లలను బాగా చదివించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. జాతాలో ఉపాధ్యాయులు శివకు మార్, మంజుల, రేణుక, ఆరోగ్య శాఖ సిబ్బంది శివకుమార్, సవిత ఖాశిం సాబ్ కుబేర స్వామి తదితరులు పాల్గొన్నారు.

అంబిగ సమాజం అభివృద్ధికి విద్య ప్రధానం



చౌడయ్య విగ్రహం ఊరేగింపు దృశ్యం

రాయచూరు రూరల్ : అంబిగర చౌడయ్య జయం తి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆది వారం నగరంలోని పండిత సిద్ద రామ జంబల దిన్ని రంగ మందిరంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి బోసురాజ్ మాట్లాడారు. గురువుల మార్గదర్శనంలో సమాజం అభివృద్ధి చెందాలం టే విద్య ప్రధానమన్నారు. సమాజం ఐకమత్యం తో ముందుకు సాగాలన్నారు. అంతకు ముందు చౌడయ్య వృత్తం వద్ద అంబిగర చౌడయ్య విగ్ర హానికి ప్రత్యేక పూజలు చేశారు. శాంతమల్ల శివా చార్య, అభినవ రాచోటి శివాచార్యులు, ఎంపీ రాజ అమరేశ్వర నాయక్, శాసన సభ్యుడు శివ రాజ్ పాటిల్, నారాయణ పేట మాజీ శాసన సభ్యుడు రాజేంద్ర రెడ్డి, సమాజం అధ్యక్షులు శాంతప్ప, ఎస్పీ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

గాలి మర పైనుంచి పడి ఇంజినీర్ మృతి



ఇంజనీర్ కిరణ్

వజ్రకరూరు: ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలంలోని గడేహోతూరు పరిసర ప్రాంతంలో గాలి మర పై భాగంగా మరమ్మతులు చేస్తూ పై నుంచి కిందకు పడి ఇంజినీర్ కిరణ్ (37) మరణిం చాడు. వివరాలు.. హొసపేటె పట్టణానికి ఎస్.కిరణ్ అనే వ్యక్తి సుజలాన్ గాలి మరల కంపెనీలో 11 నెల లుగా ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. శనివారం ఓ గాలి మరలో సమస్య రావడంతో ఆయన రిపేరీ చేయడానికి స్తంభం పైకి ఎక్కారు. అయితే అనుకోకుండా అంత పై నుంచి జారి కిందకు పడడంతో తీవ్ర గాయాలతో అక్క డికక్కడే చనిపోయాడు. మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆదివారం శవపరీ క్షలు నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య స్వాతితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కంపెనీ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా తన భర్తతో పనిచేయించిందని, కంపెనీ అధికారులు, యాజమాన్యంపై తగిన చర్యలు భార్య స్వాతి వజ్రక రూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అదనపు బస్సులు కల్పించాలి

కంప్లి: బస్సు పాసులు ఉన్నా ఆర్టీసీ బస్సులో సీట్లు లభించక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని మున్సిపల్ ముఖ్యాధికారి దురుగణ్ణ అన్నారు. శనివారం పట్టణంలో కేడీపీ సమావేశం జరిగింది. సమావేశంలో దురుగణ్ణ మాట్లాడుతూ... , ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల వారికి సీట్లు లభించక నిలబడే ప్రయాణం చేస్తున్నారని అన్నారు. తహసీల్దార్ శివరాజ్ మాట్లాడుతూ... విద్యార్థుల కోసం ఆర్టీసీ అధికారులు అదనపు బస్సుల సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యత స్వీకరణలో అనిల్, బీజేపీ నేతలు

బళ్లారి అర్బన్: భారతీయ జనతా పార్టీ నూతన జిల్లాధ్యక్షుడు అనిల్‌కుమార్ ఆదివారం మోకా రోడ్డులోని వాజపేయి లేఅవుట్‌లోని బీజేపీ కార్యా లయంలో పార్టీ ప్రముఖుల సమక్షంలో బాధ్యత లను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, తనకు బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సన్నఫక్కీరప్ప, మాజీ జిల్లాధ్యక్షులు గుత్తిగనూరు విరుపాక్షిగౌడ, రామలింగారెడ్డి, పార్వతి హిందు శేఖర్, హనుమంతప్ప, ఎర్రంగళ్లి తిమ్మరెడ్డి, ఓబుశేసు, నూర్‌బాష, వీరశేఖర్‌రెడ్డి, పార్టీ పదాధికారులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పఠనం



హొసపేటె: అయోధ్యలో రామమందిర ప్రారంభో త్సవ నేపథ్యంలో ఆదివారం నగరంలో హనుమాన్ చాలీసాను భక్తులు 30 గంటల పాటు పఠించారు. అదే విధంగా నగరంలోని వెంకటేశ్వర కళ్యాణ మం డపంలో సంకీర్తనలతో మారు మోగింది. అయోధ్య రామమందిరం నమూనా ఆలయాన్ని నిర్మించి నిరంతర జపం చేశారు. సద్గురు శ్రీ బ్రహ్మ చైతన్య మహారాజా ఆరాధన మండలి కర్ణాటక బ్రాహ్మణ సమాజ్ ఆధ్వర్యంలో కీర్తనలను ఆలపించారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

రాయచూరు రూరల్ : మహనీయులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సుల్తాన్‌పుర బ్రహన్మఠాధిపతి శంభు సోమనాథ శివాచార్యులు అన్నారు. ఆదివారం తాలుకాలోని నెలహాల్‌లో తుమకూరు సిద్దగంగ లింగైక్య శ్రీశివకుమారస్వామి పుణ్య స్మరణోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన శరణుల తత్వాల ద్వార జీవన శైలిని గూర్చి వివరించారు. కార్యక్రమంలో మిట్టి మల్కాపూర్ నిజానంద స్వామి, గోనాళ్ సిద్దయ్య తాత, శరణయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు రైళ్లు

హొసపేటె: అయోధ్యలో రామమందిర ప్రతిష్టా పన అనంతరం కర్ణాటక భక్తులు శ్రీరాముని దర్శించుకునేందుకు వీలుగా జనవరి 31 నుంచి నెల రోజుల పాటు ప్రత్యేక రైళ్లను ప్రారంభిం చాలని నైరుతి రైల్వే జోన్ నిర్ణయించింది. కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ బెంగళూరు, మైసూరు, తుమకూరు, చిత్రదుర్గ, బెల్గాం నుంచి బయ లుదేరే అన్ని రైళ్లు హొస్పేట్ మార్గం గుండా ప్రయాణిస్తాయని విజయనగర రైల్వే డెవలప్ మెంట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వై.యమునేష్, కార్యదర్శి కే.మహేష్ తెలిపారు. సర్ ఎం.విశ్వేశ్వ రయ్య బెంగళూరు స్టేషన్ నుంచి జనవరి 31, ఫిబ్రవరి 14, 28 తేదీల్లో అరసీకెరె, రాయదుర్గం మీదుగా మధ్యాహ్నం 3 గంటలకు హొస్పేట్ చేరుకుని 45 గంటల ప్రయాణం తర్వాత అయోధ్యధామ్ చేరుకుంటుంది. మైసూర్-అయోధ్య ఫిబ్రవరి 4,17,18 తేదీల్లో బెంగళూరు, అరసీకెరె, హొస్పేట్ మీదుగా అదే సమయంలో అదే మార్గంలో అయోధ్య ధామ్‌కు చేరుకుంటుం ది. తమకూరు- అయోధ్య రైలు ఫిబ్రవరి 7, 21 తేదీలలో, చిత్రదుర్గ-అయోధ్య ఫిబ్రవరి 11, 21 తేదీలలో హొస్పేట్ మార్గంలో ఒకే సమయంలో నడుస్తుంది. బెల్గాం- అయోధ్య రైలు ఫిబ్రవరి 17న హుబ్లీ మీదుగా సాయంత్రం 4.40 గంట లకు హొస్పేట్‌కు చేరుకుని బళ్లారి, రాయచూరు, మీదుగా అయోధ్య స్టేషన్ చేరుకుంటుంది. కర్ణాటక నుంచి అయోధ్యకు, తిరిగి అయోధ్య నుంచి ఆయా స్టేషన్లకు మొత్తం 11 రైళ్లు నడు స్తాయి.

ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక వేతన శ్రేణి ప్రకటించాలి

కోలారు: విద్యార్థుల ప్రగతి కోసం శ్రమిస్తున్న ప్రాథ మిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక వేతన శ్రేణిని ప్రకటించాలని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రైవేటు హోటల్ సభాంగణంలో జిల్లా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మాలూరు తాలూకా సంఘం నూతన అధ్యక్షుడు మునినారాయణ సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులను విద్యా సంయోజకులుగా పదోన్నతులు ఇవ్వాలని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆర్జిత సెలవులను పెంచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎంవి జనార్ధన్, బిఎం నారాయణస్వామి, ఎకె వెంక టేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతుడు కుమార్ ఆచారి (ఫైల్)

మాలూరు: చెరువులో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన తాలూకాలోని లక్కూరు ఫిర్కా వప్పచ్చ హళ్లి గ్రామ చెరువులో చోటు చేసుకుంది. మృ తుడిని గ్రామానికి చెం దిన కుమార్ ఆచారి (39)గా గుర్తించారు. ఇతను ఫెన్సింగ్ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. గత ఆది వారం పనికి వెళ్లి వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదు. వారం రోజుల అనంతరం చెరువులో శవమై తేలుతూ కనిపించాడు. సమాచారం అం దుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలిం చారు. కేసు నమోదు చేసుకున్నారు.

అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఏకగ్రీవం



నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందించిన దృశ్యం

మాలూరు: తాలూకాలోని కాడదేనహళ్లి గ్రామ పాల ఉత్ప త్తిదారుల సహకార సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా కెఎం ఈశ్వరగౌడ, ఉపాధ్యక్షు రాలిగా మంజుల ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. సహకార సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికలో అధ్యక్ష స్థానానికి ఈశ్వర గౌడ, అధ్యక్ష స్థానానికి మంజుల మాత్రమే నామినేషన్ వేశారు. దీంతో వీరిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను డైరెక్టర్లు అభినందించారు. అధ్యక్షుడు ఈశ్వరగౌడ మాట్లాడుతూ... సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

చెరువులో శవమై తేలిన వ్యక్తి

హుబ్లీ: కొన్ని రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి ధార్వాడ కెలగెరి చెరువులో శవమై తేలిన ఘటన వెలుగు చూసింది. మృతుడిని తాలూకా మంగళగట్టి నివాసి ప్రజ్వల్ హనుమంతగౌడ (25)గా గుర్తిం చారు. ఇతను ఈ నెల 9న హొస్పేల్ టవర్ ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లి కనిపించలేదు. ఆదివారం చెరువులో శవమై కనిపించాడు. ధార్వాడ ఉపనగర పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

గురువులను మరిచిపోకూడదు

- ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి



స్కూల్ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

బళ్లారిఅర్బన్: దివంగత మాజీ ఎంపీ బసవరాజేశ్వరి మారుమూల గ్రామంలో జన్మించి బళ్లారిలో ఎందరి కో విద్యాదానం చేశారని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అనంతపురం రోడ్డులోని బీపీఎస్‌సీ పాఠశాల వార్షికోత్సవం సంద ర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. అయోధ్యను ఎలా మలిచారో విద్యార్థులను కూడా ఉపాధ్యాయుల అలా తీర్చిది ద్దాలన్నారు. భూపాల్ కుటుంబం బళ్లారిలోని ఎం దరో విద్యార్థులకు విద్యను అందించి ఉన్నత శిఖరా లకు చేర్చారన్నారు. తాను కూడా విద్యార్థి దశ నుంచి వచ్చిన వాడినేని, ఉపాధ్యాయులు తీర్చిదిద్దడంతోనే ఈ రోజు ఎమ్మెల్యేగా మీ ముందుకు వచ్చానన్నారు. విద్య నేర్పించిన గురువులను ఎప్పటికి మరిచిపోకూ డదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహిం చిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరిం చాయి. ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురు విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందించారు. కార్యక్రమంలో బీపీఎస్‌సీ స్కూల్ చెర్మన్ మహిపాల్, యశ్వంత్ భూపాల్, అశోక్ భూపాల్, పృద్వీరాజ్ భూపాల్, విజయ్ భరత్, అమరనాథ్ భూపాల్, మేయర్ శ్వేత, కార్పొరేటర్ కవితా హొన్నప్ప, ప్రిన్సి పాల్ అనిల్‌కుమార్, మాధురి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పౌర కార్మికులను గౌరవించాలి



పౌర కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీనివాసపు రం: పట్టణం లో స్వచ్ఛత పనుల్లో పౌర కార్మికుల పాత్ర ఎంతో గొప్పదని, వారిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎంపీ ఎస్ ముని స్వామి తెలిపారు. ఆదివారం పట్టణంలోని పురసభ కార్యాలయం వద్ద స్వచ్ఛ భారత్ మిషన్ పథకంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లా డారు. సోమవారం అయోధ్యలో రాముడి విగ్రహం ప్రతిష్టాపన కార్యక్రమం నేపథ్యంలో పట్టణంలోని అన్ని ఆలయాల్లో స్వచ్ఛత పనులు చేపట్టామన్నారు. ఇదే సమయంలో పౌర కార్మికులకు పాదపూజ చేశారు. పురసభ ముఖ్యాధికారి వైఎన్ సత్యనారాయణ, జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు రాజణ్ణ, రోణూరు చంద్ర శేఖర్, రామాంజి పాల్గొన్నారు.

సహకార రంగాన్ని దుర్వినియోగం చేయకూడదు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు : సహకార రంగం రాజకీయాలకు అతీతంగా ఉండాలని, ఆ రంగాన్ని దుర్విని యోగం చేయకూడదని డీసీసీ బ్యాంకు మాజీ అధ్యక్షుడు, అపెక్స్ బ్యాంకు డైరెక్టర్ బ్యాలహళ్లి గోవిందగౌడ తెలిపారు. ఆదివారం నగరంలోని జిల్లా సహకార సమాఖ్య సభాంగణంలో రాష్ట్ర సహకార మహామండలి, జిల్లా సహకార సమా ఖ్య ఆధ్వర్యంలో పాత్రికేయుల సంఘం సభ్యు లకు నిర్వహించిన ఒకరోజు కార్యాగారంలో పాల్గొని మాట్లాడారు. ఎంపిసిఎస్, ఎస్ఎఫ్‌సిఎ స్‌ల పాలక మండలిని రాజకీయాలకు ఉపయో గించుకోవడం సహకార రంగానికి విఘాతమ న్నారు. ఎన్నికల అనంతరం కూడా అధికారం లోకి వచ్చిన వారు తమ బాధ్యతలను మరచి వ్యవహరించడం దురదృష్టకర విషయమన్నారు. జిల్లా పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు బివి గోపినాథ్ మాట్లాడుతూ... కోలారు జిల్లా అభివృ ద్ధిలో సహకార సంఘాల పాత్ర ఎంతో ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పాత్రికేయుల సం ఘం మాజీ అధ్యక్షుడు కెఎస్ గణేష్, ఆము లక్ష్మీ నారాయణ, మూరాండహళ్లి గోపాలప్ప, ఎ శంక రనారాయణగౌడ, పీఎం వెంకటేష్, పి పాపణ్ణ తదితరులు పాల్గొన్నారు.